www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 24-3-2024 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 339 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి ఉ. 9.57 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పుబ్బ ఉ. 7.35 తదుపరి ఉత్తర; వర్జ్యం: మ. 3.42-5.30; దుర్ముహూర్తం: సా. 4.47-5.36; అమృతఘడియలు: రా. 2.31-4.20; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.20; సూర్యాస్తమయం: 6.24 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నా అరెస్టు చట్ట విరుద్ధం

- వెంటనే విడుదలకు ఆదేశించండి
- ఢిల్లీ హైకోర్టులో కేజ్రీవాల్ పిటిషన్
- సత్వర విచారణకు కోర్టు నిరాకరణ
- అప్రూవర్‌గా మారి కేజ్రీ విషయాలు బయటపెడతా: సుఖేశ్ చంద్రశేఖర్



ఢిల్లీలో ఆందోళన చేస్తున్న పంజాబ్ సీఎం మాన్, కేజ్రీవాల్ మద్దతుదారులు

12

17 వేల ఎకరాలు సమర్పయామి!



కోడ్‌కు ముందురోజే ఇండోసోల్‌కు భారీ పందేరం

రాష్ట్ర ప్రజల మేలు, పారిశ్రామికరంగం బాగోగులు ఏపీ సీఎం జగన్‌కు పట్టవు. గత ఐదేళ్లలో ఇండోసోల్ కోసమే ఆయన మనసు పెట్టి పనిచేస్తున్నారు. జగన్ అధికారంలోకి వచ్చాకే పుట్టుకొచ్చిన ఈ కంపెనీ....రూ. లక్ష మూలధనంతో వ్యాపారం మొదలుపెట్టి, ఐదేళ్లు తిరిగేటప్పటికి ఏకంగా 25వేల ఎకరాలను గుప్పెట పట్టేసింది. గత ఏడాది నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో తొలుత 5418 ఎకరాలు, ఆ తర్వాత మరో 3,200 ఎకరాలు సోలార్ ప్రాజెక్టుల స్థాపన కోసమంటూ ఇండోసోల్‌కు కేటాయించారు. తాజాగా మరో 17,633 ఎకరాలను కోడ్‌కు ఒక్కరోజు ముందే కట్టబెట్టారు. ఇంతకీ ఇన్ని వేల ఎకరాలు కట్టబెట్టడానికి ఈ కంపెనీకి ఉన్న అర్హత ఏంటని చూస్తే.. అది కడపకు చెందిన షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ అనుబంధ సంస్థ. షిర్డీసాయి యజమాని విశ్వేశ్వరరెడ్డి జగన్‌కు అత్యంత సన్నిహితుడు!

- సోలార్ ప్రాజెక్టుల పేరిట 17,633 ఎకరాలు ధారాదత్తం
- రూ.31,000 చొప్పున లీజుకు 12,918 ఎకరాలు
- షార్ట్ సర్క్యులేషన్ ద్వారా కేబినెట్ ఆమోదం..
- జగన్‌కు ల్యాండ్ బ్యాంక్‌గా మారిన ఇండోసోల్
- గతేడాదే రామాయపట్నం వద్ద 8,348 ఎకరాలు
- గత ఐదేళ్లలో 25,981 ఎకరాలు ఆ కంపెనీకే..
- వచ్చే 15 ఏళ్లలో 47,809 కోట్ల విద్యుత్ రాయితీ



మరో 4714 ఎకరాలు ఉచితంగానే వాడుకోవచ్చు

ఎక్కడెక్కడ.. ఎంతెంత?

- నంద్యాల జిల్లాలో 10,225 ఎకరాలు
- అనంతపురం జిల్లాలో 2692 ఎకరాలు
- కడప జిల్లాలో 3373 ఎకరాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల వేళ సీఎం జగన్ మరింత బరితెగించారు. షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌కు అనుబంధ సంస్థ అయిన ఇండోసోల్‌కు సోలార్ పవర్ ప్రాజెక్టుల పేరుతో అడ్డగోలుగా భూములు దోచిపెట్టారు. అదీ కోడ్‌కు ఒక్కరోజు ముందే హడావుడిగా ధారాదత్తం చేసేశారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 17,633.73 ఎకరాలు ఇండోసోల్‌కు అప్పనంగా ఇస్తూ ఈ నెల 15వ తేదీన నాలుగు జీవోలు ఇచ్చారు. ఆ మరునాడే కోడ్ అమల్లోకి వచ్చింది. ఇండోసోల్ కంపెనీకి నంద్యాల, అనంతపురం, కడపలో రెండు చోట్ల సోలార్ పవర్ ప్రాజెక్టులు నిర్మించడం కోసం ఈ భూమిని

మిగతా 12వ పేజీలో...

కుట్రపూరితమే..

కేవలం ఒకే ఒక్క కంపెనీకి హడావుడిగా 17,633 ఎకరాలను షార్ట్ సర్క్యులేషన్ ద్వారా ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది? ఇండోసోల్ కోసం నిర్ణయించిన లీజు ధరను ఎలా లెక్కించారు? ఇన్ని వేల ఎకరాలు ఆ కంపెనీకి కట్టబెట్టడం ద్వారా ఎన్ని ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి ? ఎంతమందికి ఉపాధి దొరుకుతుంది? అసలు ఆ ప్రాజెక్టులన్నీ ఎప్పటికి పూర్తవుతాయి? అన్నీ ప్రశ్నలే. వీటిపై ఎలాంటి స్పష్టతా లేకుండా కోడ్‌కు ఒక్కరోజు ముందు భూములు దోచిపెట్టడం కచ్చితంగా కుట్రపూరితమే.

మోదీ.. మోనార్క్!



నరేంద్ర మోదీ ఎంతటి ప్రమాదకర రాజకీయ నాయకుడో గుర్తించగలిగిన వారు ఆయన పట్ల విధేయత ప్రదర్శిస్తూ రాజకీయం చేసుకోగలుగుతున్నారు. ధిక్కరించిన వారు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి.

'మాయాబజార్' సినిమాలో ఘటోత్కచుడి సైన్యం 'కోర్ కోర్ శరణు కోర్' అని ప్రత్యర్థులను వేటాడింది. ఇప్పుడు ప్రధానమంత్రి మోదీ కూడా రాజకీయ ప్రత్యర్థుల నుంచి ఇదే ఆశిస్తున్నారు. శరణు కోరిన వారు మాత్రమే రాజకీయాల్లో మనగలుగుతున్నారు.

2011లో అన్నా హజారేతో కలసి కేజ్రీవాల్ చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమం ఫలితంగా 2014లో యూపీఏ ప్రభుత్వం అధికారం కోల్పోయింది. అప్పటి వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి అవినీతి వ్యతిరేక ఉద్యమ ఫలితాలను తనకు అనుకూలంగా మలచుకొని ప్రధానమంత్రి అయ్యారు. అప్పట్లో తాము ఒక రాజకీయ పెను భూతానికి ప్రాణ ప్రతిష్ఠ చేసిన విషయం కేజ్రీవాల్‌కు గానీ, కాంగ్రెస్ పార్టీతో విభేదించిన ఇతర ప్రాంతీయ పార్టీల నాయకులకుగానీ తెలియదు.

అవినీతి వ్యతిరేక ఉద్యమం నడిపిన కేజ్రీవాల్... ఇప్పుడు అవే అవినీతి ఆరోపణలపై అరెస్టవడం మోదీ మహిమే అని చెప్పవచ్చు. ఆమ్ ఆద్మీ పార్టీని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలనుకున్న తర్వాతే ఆయనకు కష్టాలు మొదలయ్యాయి.

2019కి ముందు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కాంగ్రెస్‌తో చేతులు కలిపి... ప్రతిపక్షాలను ఏకం చేసే ప్రయత్నం చేసి, ఆ ఎన్నికల్లో దెబ్బతిన్నారు. ఫలితంగా రాష్ట్రం జగన్మోహన్ రెడ్డి చేతుల్లోకి వెళ్లి విలవిల్లాడుతోంది.

బెయిలు కోసం అప్పుడు అధికారంలో ఉన్న సోనియా గాంధీ వద్దకు కుటుంబ సభ్యులను పంపి కాళ్ల బేరానికి దిగిన చరిత్ర జగన్‌ది. దాని ఫలితమే అవినీతి కేసులలో జగన్‌పై విచారణ కూడా జరగని పరిస్థితి. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడైన అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయలేని పరిస్థితిలో సీబీఐ ఉందంటే, పైవాడి ఆశీస్సులు లేకుండా సాధ్యమా?

ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీని కను సైగలతో శాసించిన ఇందిరాగాంధీ... రాష్ట్రాలలో బలమైన నాయకులను అణచివేశారు. బలమైన నాయకులను దూరం చేసుకోవడం వల్లనే కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుత దుస్థితి దాపురించింది. నాటి ఇందిరా గాంధీ బాటలోనే ప్రస్తుత ప్రధాని మోదీ కూడా నడుస్తున్నారు.

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో..



పాల సుబ్బారావు, పద్మావతి, వినయ (ఫైల్ ఫొటోలు)

వైసీపీ నేత భూదాహానికి కుటుంబం బలి

భర్త, భార్య, కుమార్తె ఆత్మహత్య

- వారి 3 ఎకరాలను బంధువు పేరిట ఆన్‌లైన్ చేయించుకున్న వైసీపీ నేత
- సహకరించిన రెవెన్యూ అధికారులు
- మార్చాలని కోరినా స్పందన కరువు
- అప్పులు, మనస్తాపంతో నేతన్న కుటుంబం బలవన్మరణం
- కడప జిల్లాలో విషాదకర సంఘటన
- నిందితులను కఠినంగా శిక్షించాలని చంద్రబాబు, లోకేశ్ డిమాండ్

అమరావతి(ఆంధ్రజ్యోతి)/ఒంటిమిట్ట, మార్చి 23: భార్యాభర్తలు ఇద్దరూ కష్టపడితే కానీ గడవని నిరుపేద చేనేత కుటుంబం. మరోవైపు కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు భారమయ్యాయి. తండ్రి పేరిట ఉన్న మూడెకరాల పొలం అమ్మి అప్పులు తీర్చేద్దామని ప్రయత్నిస్తే.. ఆ భూమిని అధికార పార్టీ నేత ఒకరు రెవెన్యూ అధికారుల సాయంతో తన బంధువు పేరిట ఆన్‌లైన్ చేయించుకున్నారు. భూమిని తమ పేరిట మార్చాలని వేడుకున్నా అధికారులు స్పందించలేదు. వైసీపీ నేత భూదాహానికి,

మిగతా 2వ పేజీలో...

160 సీట్లు కూటమివే!

కడపా మాదే.. 24 ఎంపీ స్థానాలూ మావే

"కడపలో ఏ మొహం పెట్టుకుని వైసీపీ ఓట్లు అడుగుతుంది? బాబాయి మాదిరిగా అందరినీ లేపేస్తామని ఓట్లు అడుగుతారా? రాష్ట్రంలో అవినీతి, అరాచక, విధ్వంసక పాలన రెండు నెలల్లో ముగిసిపోనుంది. ప్రజలు గెలవాలి. రాష్ట్రం నిలవాలి" - చంద్రబాబు

- అవినీతి, అరాచక, విధ్వంసకర పాలనకు రెండు నెలల్లో ముగింపు
- జగన్‌కు ముకుతాడు వేస్తాం
- 500.. 200 నోట్లు కూడా రద్దు చేస్తే జగన్ కథ ముగిసిపోతుంది
- రాష్ట్రాన్ని నలుగురు రెడ్ల చేతిలో పెట్టి వైసీపీ సామాజిక న్యాయం కబుర్లు
- విశాఖకు వచ్చిన డ్రగ్స్ వెనుక అధికార పార్టీ నేతలదే కీలక పాత్ర
- రాష్ట్రం కోసమే మూడు పార్టీల పొత్తు
- టీడీపీ వర్క్‌షాప్‌లో చంద్రబాబు



అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో 160 సీట్లు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమివే. అంతకుమించి కూడా విజయ ఢంకా మోగించడం ఖాయం" అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. టీడీపీ తరపున ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేయనున్న నేతలకు శనివారం విజయవాడలోని ఎ.కన్వెన్షన్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి టీడీపీ

మిగతా 11వ పేజీలో...

తొడగొట్టి దూకండి

"ఇప్పుడు మనం చేస్తోంది యుద్ధం. పోరాడితేనే రాజ్యం వస్తుంది. తొడగొట్టి దూకండి. బేలతనం వద్దు. అధికారంలో ఉన్నవారి హడావుడి చూసి భయపడవద్దు. ప్రజలు మనతో ఉన్నారు. దేనికీ వెనకాడవద్దు. యుద్ధంలో అన్నింటినీ తట్టుకోవడానికి సిద్ధమై పోరాడాలి. అధికార పార్టీ ప్రజల్లో పరపతి పోగొట్టుకుంది. అందుకే అధికార దుర్వినియోగంతో అయినా బయటపడాలని చూస్తోంది. ఎన్ని కేసులు పెట్టినా.. ఎన్ని దాడులు చేసినా ధైర్యంగా ఎదుర్కోండి. వలంటీర్ వ్యవస్థకు మనం వ్యతిరేకం కాదు. కానీ వాళ్లు ఒక పార్టీకి కొమ్ముకాసి పనిచేస్తే ఊరుకునేది లేదు. అలాంటి వారిపై నిఘా పెట్టి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయండి. నామినేషన్లకు ఇంకా పాతిక రోజుల సమయం ఉంది. ఈ వ్యవధిలో మీ పనితీరు అంచనా వేస్తా. బాగా పనిచేస్తే ఓకే. లేకపోతే నా నిర్ణయం నాకుంటుంది"

-అభ్యర్థులతో చంద్రబాబు



కన్నీటి మాస్కో

- 150కి పెరిగిన మృతుల సంఖ్య
- దాడులు తమ పనేనని ఐఎస్ ప్రకటన
- క్రైస్తవుల సమావేశమే లక్ష్యంగా దాడి చేశామని వెల్లడి
- సిరియాలో రష్యా జోక్యానికి ప్రతీకారంగానే దాడి?
- దాడి వెనుక ఉక్రెయిన్ హస్తం: పుతిన్

మాస్కో, మార్చి 23: రష్యా రాజధాని మాస్కోలో శుక్రవారం రాత్రి జరిగిన ఉగ్రదాడిలో మృతుల సంఖ్య 150కి పెరిగింది. ఈ మారణహోమం తమ పనేనని ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ అఫ్ఘానిస్థాన్ శాఖ ప్రకటించింది. అయితే, ఉగ్రవాదులకు ఉక్రెయిన్‌తో సంబంధాలున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు. దీనిని ఉక్రెయిన్ తీవ్రంగా ఖండించింది. తమతో యుద్ధాన్ని మరింతకాలంపాటు పొడిగించటానికే పుతిన్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించింది. ఉగ్రదాడి నేపథ్యంలో

మిగతా 12వ పేజీలో...

కోడ్ కూయకనే కోట్లు హుష్!



ప్రకాశంలో కీలక నేత లబోదిబో

- ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో ఓటర్లకు పంచేందుకు భారీగా డంప్
- వైసీపీ నేత కళాశాలలో దాచిన 5 కోట్ల నగదు మాయం
- ఎస్పీకి నోటిమాటగా ఫిర్యాదు!
- కేసు నమోదు చేయకుండా గుట్టుచప్పుడు కాకుండా విచారణ
- ఆ పార్టీ నేతలపైనే అనుమానం


చేతిలో డబ్బులు పాయెనే!

సింగరాయకొండ, మార్చి 23: కోట్లు గుమ్మరించైనా ఓట్లు కొల్లగొట్టేందుకు సిద్ధమైన ఆ నేతకు ఊహించని షాక్ తగిలింది. ఎన్నికల్లో పంపకాలకు దాచిపెట్టుకున్న రూ.5 కోట్ల మూట గల్లంతైపోయింది. దీంతో ఆ నాయకుడు లబోదిబోమంటున్నారు. పోయింది 'దొంగ' సొమ్ము కావడంతో బయటకు చెప్పుకోలేరు. పోలీసులకూ ఫిర్యాదు చేయలేరు. అయినప్పటికీ... 'వెతికి పెట్టండి ప్లీజ్' అని పోలీసులను వేడుకున్నారు. అధికార పక్ష అభ్యర్థి కావడంతో పోలీసులూ ఆయనకు సహకరిస్తున్నారు. కేసు నమోదు చేయకుండా గుట్టుగా విచారణ చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... ఒంగోలు లోక్‌సభ పరిధి తూర్పు ప్రాంత ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి దిగుతున్న కీలక నేత భారీగా నగదు డంప్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే డబ్బులు సమీకరించి పెట్టుకున్నారు. నియోజకవర్గంలో

మిగతా 2వ పేజీలో...

విశాఖ డ్రగ్స్ కేసులో అంతర్జాతీయ ముఠాలు!

డ్రగ్స్‌ను గుర్తించకుండా ఇతర పదార్థాలతో కలిపి రవాణా



- గమ్యస్థానం చేరాక విడదీసే ప్రక్రియ
- ఆ కోణంలో సీబీఐ విచారణ
- బ్రెజిల్ నుంచి వచ్చిన కంటెయినర్‌లోని ఇన్ యాక్టివ్ ఈస్ట్‌లో కొకైన్
- ప్రతి కిలోకు 100 గ్రాములు మిక్సింగ్?
- ఈ లెక్కన 25 వేల కిలోల ఈస్ట్‌లో 2,500 కిలోల డ్రగ్స్ సరఫరా!

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం డ్రగ్స్ కేసులో అంతర్జాతీయ ముఠాల ప్రమేయం ఉందని సీబీఐ అనుమానిస్తోంది. ఇంటర్‌పోల్ నుంచి అందిన సమాచారం ప్రకారం నార్కోటిక్ డ్రగ్స్‌ను ఇతర పదార్థాలతో కలిపి రవాణా చేసే నెట్‌వర్క్ ఇందులో భాగస్వామ్యమైందని సీబీఐ చెబుతోంది. బ్రెజిల్ నుంచి ఇన్ యాక్టివ్ (డ్రై) ఈస్ట్ పేరుతో విశాఖపట్నం బయలుదేరిన కంటెయినర్‌లో డ్రగ్స్ వస్తున్నాయన్న సమాచారంతో సీబీఐ రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. ఈ డ్రగ్స్ నేరుగా కాకుండా... ఇతర పదార్థాలతో కలిపి (కటింగ్ ఏజెంట్స్) దిగుమతి అవుతున్నట్టు

మిగతా 2వ పేజీలో...

రాష్ట్రపతిపై సుప్రీంకోర్టులో కేరళ సర్కారు దావా

- 4 బిల్లులపై సంతకాలు చేయడం లేదు.. కారణాలూ చెప్పడం లేదని ఆరోపణ
- ఆమోదించొద్దని కేంద్రం సలహా ఇచ్చినట్టు ఆక్షేపణ
- రిట్ పిటిషన్‌లో ప్రతివాదిగా రాష్ట్రపతి కార్యదర్శి పేరు
- గవర్నర్ పైనా వ్యాజ్యం.. బిల్లులపై తాత్సారం చేస్తున్నారని విమర్శ



12

కరువు సాయంపై సుప్రీంలో కర్ణాటక పిటిషన్

- ఎన్‌డీఆర్ఎఫ్ నిధుల్ని తక్షణం విడుదల చేసేలా కేంద్రానికి సూచనలివ్వాలి
- గత్యంతరం లేకే పోరాటం: సీఎం సిద్ధు

12

ఆంధ్రాను దేశ డ్రగ్స్ రాజధానిగా మార్చేసిన జగన్

- రవాణాలోనూ, వాడకంలోనూ ఏపీ నంబర్ వన్
- సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: షర్మిల

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని దేశ డ్రగ్స్ రాజధానిగా సీఎం జగన్ మార్చేశారని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డి ఆరోపించారు. ఇండియాలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా వాటి మూలాలు ఆంధ్రప్రదేశ్‌వైపే ఉన్నాయని శనివారం ఎక్స్ వేదికగా ఆమె విమర్శించారు. "ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ దేశానికి అన్నంపెట్టే అన్నపూర్ణ. ఇప్పుడు యావత్ డ్రగ్స్ సప్లై చేసే క్యాపిటల్ ఆఫ్ ఇండియా. గంజాయి, హెరాయిన్, కొకైన్ ఏది కావాలంటే అది దొరికే 'ఉడ్తా ఆంధ్రప్రదేశ్'. ఇండియాలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా దాని మూలాలు ఏపీవైపే చూపుతున్నాయి. డ్రగ్స్ వాడకంలోనూ, రవాణాలోనూ నంబర్ వన్‌గా ఏపీని మార్చేశారు. టీడీపీ, వైసీపీ, బీజేపీలకు సిగ్గుండాలి. కేంద్ర, రాష్ట్రాల నిఘా వ్యవస్థ సపోర్టు లేకుండా వేల కోట్ల డ్రగ్స్ తీరానికి ఎలా చేరుతాయి? మీ అండదండలతోనే కదా డ్రగ్స్ రవాణాలో ఏపీని 'సేఫ్ హెవెన్'గా మార్చేశారు. తెరవెనుక ఎంతటి వాళ్లున్నా నిజాలు నిగ్గు తేల్చాలని సీబీఐని కోరుతున్నాం. ఆసియాలోనే అతి పెద్ద డ్రగ్ డీల్‌గా పరిగణించే ఈ మాఫియా వెనుక ఎవరున్నారో తేల్చేందుకు పారదర్శక విచారణ కోసం సిటింగ్ జడ్జితో కమిటీ వేయాలి" అని షర్మిల కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

ఫ్లాట్ నుంచి పడిపోయిన పుష్ప శ్రీవాణి గన్‌మ్యాన్!

- రెండు కాళ్లు విరిగి ఆస్పత్రిలో చేరిక!
- ప్రమాదమా.. కుట్రా.. అసలేం జరిగింది?

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి గన్‌మ్యాన్ తిరుమల తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలైనట్లు తెలిసింది. ఈ సంఘటన గురించి అటు పోలీసులు, ఇటు అధికార పార్టీ నేతలు పెదవి విప్పడంలేదు. పలువర్గాలు అందించిన సమాచారం ప్రకారం.. పుష్ప శ్రీవాణికి విశాఖపట్నం మధురవాడ హౌసింగ్ బోర్డు కాలనీలో ఒక అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో ఫ్లాట్ ఉంది. మూడు రోజుల కిందట ఆమె గన్‌మ్యాన్ పైనుంచి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను ఆరిలోవ హెల్త్‌సిటీలోని ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన రెండు కాళ్లు విరిగిపోయాయి. గన్‌మ్యాన్‌కు కుటుంబ సభ్యులెవరూ తోడుగా లేరు. దీంతో 'ప్రమాదవశాత్తూ పడిపోయాను' అని తిరుమల చేత బలవంతంగా వాంగ్మూలం ఇప్పించారని ఆయన స్వగ్రామమైన పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం దత్తివలసకు చెందిన కొందరు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ముందు జరిగిన ఈ సంఘటనపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పొరపాటున మెట్లపై నుంచి జారిపడినా, భవనంపై నుంచి పడినా శరీరంపై తీవ్ర గాయాలవుతాయని... తిరుమలకు రెండు కాళ్లు విరిగిపోయినప్పటికీ ఇంకెక్కడా గాయాలు లేవని చెబుతున్నారు. అయితే... దీనికి సంబంధించి ఎలాంటి కేసు నమోదు కాలేదని ఆరిలోవ, పీఎం పాలెం పోలీసులు స్పష్టం చేశారు.

దుష్ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోండి

- సీఈవోకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఫిర్యాదు

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ డ్రగ్స్ వ్యవహారంలో వైసీపీ అఫీషియల్ సోషల్ మీడియా ఎక్స్ అకౌంట్ ద్వారా తనపై నిరాధార ఆరోపణలు చేయడాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తప్పుబట్టారు. శనివారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను కలిసి తనపై దుష్ప్రచారం చేసే వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. సంధ్య కంపెనీతో తనకు ఎటువంటి లావాదేవీలు లేవని, ఆ కంపెనీలో తాను షేర్‌హోల్డర్‌ను కాదని, బోర్డు మెంబర్‌ను కూడా కాదని స్పష్టం చేశారు. ఎప్పుడో ఆ కంపెనీ వాళ్లతో తాను దిగిన ఫొటోను సోషల్ మీడియాలో పెట్టి ప్రచారం చేస్తున్నారన్నారు. విచారణ జరిపిస్తామని సీఈవో చెప్పారన్నారు.

జగన్‌కు ఓటడిగే హక్కు లేదు: సోమిరెడ్డి

'ప్రపంచమంతా డ్రగ్స్ ఫ్రీ సొసైటీ కోసం తాపత్రయ పడుతుంటే జగన్ రాష్ట్రాన్ని డ్రగ్స్ కేపిటల్ చేస్తున్నారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌కు ఓటడిగే హక్కు లేదు' అని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ శనివారం ఆరోపించారు. 'నెల్లూరు జిల్లాలో పుట్టిన నులిపురుగు విజయసాయిరెడ్డి. రూ.వేల కోట్ల ప్రజల సొమ్ము దిగమింగి 16నెలలు చిప్పకూడు తిన్నారు. ఆయన నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది' అని సోమిరెడ్డి అన్నారు.

విశాఖ డ్రగ్స్ కేసులో



అంతర్జాతీయ ముఠాలు!

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్‌పోల్ పేర్కొనడంతో ఆ కోణంలో విచారణ చేపట్టింది.

కటింగ్ ఏజెంట్స్ అంటే..

డ్రగ్స్ లావాదేవీలు నిర్వహించే ముఠాలు 'కటింగ్ ఏజెంట్స్' అనే పదాన్ని విస్తృతంగా ఉపయోగిస్తాయి. కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్‌లో కల్తీ పదార్థాలు కలిపి.. తక్కువ మొత్తంలో తీసుకుంటే ఎక్కువ మత్తు కలిగేలా చేస్తారు. ఇలా కలిపే కల్తీ పదార్థాలను కటింగ్ ఏజెంట్స్‌గా వ్యవహరిస్తారు. దీనివల్ల భారీ లాభాలు వస్తాయి. వాటిని తీసుకునే వారి ఆరోగ్యం త్వరగా పాడైపోతుంది. ఒక విధంగా చెప్పాలంటే డ్రగ్స్‌ను కల్తీ చేయడం. అలాగే ఈ డ్రగ్స్‌ను సులువుగా రవాణా చేయడానికి, అధికారుల కళ్లు కప్పడానికి వేరే పదార్థాలతో కలిపేస్తారు. గమ్యస్థానం చేరిన తరువాత ప్రత్యేక విధానంలో వాటిని వేరు చేసి తీసుకుంటారు. ఈ విధంగానే తాజాగా బ్రెజిల్ నుంచి విశాఖకు డ్రగ్స్ భారీ మొత్తంలో వచ్చాయి. ఈస్ట్ అనేది తేమతో కూడిన పులుపు పదార్థం. తేమతో ఉన్నప్పుడు యాక్టివ్ ఈస్ట్ అంటారు. కొంత ఉష్ణోగ్రత వద్ద వేడి చేస్తే పొడిరూపం (గ్రాన్యువల్)లోకి మారిపోతుంది. దానిని 'ఇన్ యాక్టివ్' లేదా 'డ్రై ఈస్ట్' అని అంటారు. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టర్స్ కంపెనీ ఇన్ యాక్టివ్ (డ్రై) ఈస్ట్ కావాలని ఆర్డర్ చేసింది. ఇంటర్నేషనల్ క్రిమినల్ గ్యాంగ్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంది. గ్రాన్యువల్ రూపంలో ఉన్న ఇన్ యాక్టివ్ ఈస్ట్‌లో కొకైన్ తదితర డ్రగ్స్‌ను కలిపి ప్యాకింగ్ చేసి విశాఖపట్నం పంపింది. ఈ సమాచారం ఇంటర్‌పోల్‌కు తెలిసింది. ఇక్కడి సీబీఐని అప్రమత్తం చేయడంతో అధికారులు ఇన్ యాక్టివ్ ఈస్ట్ అసలు రంగు బయటపెట్టారు. వేయి సంచుల్లో వచ్చిన ఈస్ట్‌ను బయటకు తీసి నార్కోటిక్ డ్రగ్స్ టెస్ట్ కిట్‌తో ప్రాథమిక పరీక్షలు చేశారు. ఇరవై శాంపిల్స్‌లో డ్రగ్స్ ఉన్నట్టు పాజిటివ్ ఫలితం వచ్చింది. ఇంకా పక్కాగా పరీక్షలు నిర్వహించి, అవి డ్రగ్సే అని నిర్ధారించుకోవడానికి ప్రత్యేక లేబొరేటరీకి పంపించారు.

కొకైన్ ఎలా మిక్స్ చేస్తారంటే..

డ్రగ్స్‌ను గుర్తించకుండా ఇతర పదార్థాలతో ఎలా మిక్స్ చేస్తారని ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ ప్రొఫెసర్‌ను అడగగా కొన్ని విషయాలు వెల్లడించారు. కిలో బరువున్న ఇన్ యాక్టివ్ ఈస్ట్‌లో వంద గ్రాముల కొకైన్‌ను కలిపితే గుర్తించడం కష్టమని, అది ఈస్ట్‌గానే కనిపిస్తుందన్నారు. కొకైన్‌ను మళ్లీ ఈస్ట్ నుంచి విడదీయాలంటే గోరువెచ్చటి నీటిలో సోడియం హైడ్రోక్లోరైడ్ కలిపి, ఆ ద్రావణంలో ఈ మిక్స్‌డ్ పౌడర్ వేసి తిప్పితే ఈస్ట్ అంతా కిందికి వెళ్లిపోయి కొకైన్ గుండ్రటి గడ్డలుగా పైకి తేలుతుందని వివరించారు. ఇలాంటివి మోతాదుకు మించి మిక్స్ చేస్తే అసలు విషయం బయటపడిపోతుందని, పరిమితంగానే చేస్తారన్నారు. అంటే.. కిలోకు 100 గ్రాములు లెక్క వేసుకుంటే, 25 వేల కిలోల ఈస్ట్‌లో 2,500 కిలోల డ్రగ్స్ వచ్చి ఉంటాయనేది అంచనా. ఈ లెక్కలు, అందులో ఏయే రకాలు ఉన్నాయనేది తెలియడానికి రెండు, మూడు వారాల సమయం పట్టే అవకాశం ఉంది. అవి 100 శాతం ప్యూర్ మత్తు పదార్థాలా...? వాటిలో ఇంకేమైనా కల్తీ జరిగిందా? అనేది కూడా ఈ పరీక్షల్లో తేలుతుందని అంటున్నారు.

ఆ కంటెయినర్ ఇంకా అక్కడే

బ్రెజిల్ నుంచి వచ్చిన కంటెయినర్‌లో అన్ని సంచుల నుంచి శాంపిల్స్ తీసుకున్న సీబీఐ అధికారులు, మిగిలిన సరకును అందులోనే పెట్టి సీల్ వేశారు. ఆ కంటెయినర్‌ను బామర్ లారీ లాజిస్టిక్ పార్క్‌కు తరలించాలని నిర్ణయించారు. శనివారం సాయంత్రం నాటికి అది వీసీటీపీఎల్ ఆవరణలోనే ఉంది. తరలించలేదు.

డ్రగ్స్ రవాణాలో వైసీపీ పాత్ర: కనకమేడల

న్యూఢిల్లీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేకుండానే 25వేల టన్నుల డ్రగ్స్ కంటెయినర్ విశాఖకు వచ్చిందా? అని టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ ప్రశ్నించారు. విశాఖకు డ్రగ్స్ రవాణాలో వైసీపీ పాత్ర ఉందని ఆరోపించారు. శనివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. సంధ్య ఆక్వా ప్రైవేటు లిమిటెడ్ నిర్వాహకుడు కూనం వీరభద్రరావు, వైసీపీ నేత కూనం పూర్ణచంద్రరావుకు సోదరుడని తెలిపారు. పూర్ణచందర్‌రావుకు విజయసాయిరెడ్డితో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. వీరభద్రరావుకు అంత పెట్టుబడి పెట్టే స్తోమత లేదన్నారు. బ్రెజిల్ అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు 2022, అక్టోబరు 31న శుభాకాంక్షలు తెలుపుతూ విజయసాయిరెడ్డి ఎక్స్‌లో పోస్టు పెట్టారని, ఆ పోస్టు వెనుక మతలబేంటని రవీంద్రకుమార్ ప్రశ్నించారు.

ఏపీ గంజాయితో పొరుగు రాష్ట్రాలకూ ప్రమాదం

- నాడు అభివృద్ధిలో దేశంలో వెలిగిన రాష్ట్రం... నేడు గంజాయితో చీకట్లోకి వెళ్లింది: చంద్రబాబు

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గంజాయి మాఫియా మన రాష్ట్ర ప్రజలనే కాదు, పొరుగు రాష్ట్రాల వారిని కూడా ప్రమాదంలోకి నెట్టేసిందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శనివారం 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. 'తెలంగాణలోని జగిత్యాలలో గంజాయి ముఠా అరెస్టు సమయంలో వెలుగు చూసిన వాస్తవాలు నివ్వెరపరిచాయి. ఈ ముఠాకి విశాఖలోని సీలేరు నుంచి గంజాయి సరఫరా కావడం ఆందోళన కలిగిస్తోంది. మన రాష్ట్రంలో గంజాయి అమ్మకాల గురించి పొరుగు రాష్ట్ర పోలీసులు చెప్తుంటే ఈ సీఎంకి సిగ్గు అనిపించడం లేదా? ఈ అధికారులకు అవమానకరం కాదా? దేశంలో ఎక్కడ ఏ గంజాయి కేసుకైనా మూలాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం జగన్ పాలనా దౌర్భాగ్యం. నిన్ననే 25 వేల కిలోల డ్రగ్స్ విశాఖ పోర్టులో పట్టుబడ్డాయి. రాష్ట్రాన్ని ఇలా అభాసుపాలు చేసిన జగన్ గ్యాంగ్ పాపాలకు ప్రజలే శిక్ష విధిస్తారు. నాడు అభివృద్ధిలో దేశంలో వెలిగిన మన రాష్ట్రం నేడు గంజాయితో చీకట్లోకి వెళ్లిపోయింది' అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతిపక్ష నేతలపై పోలీసుల బైండోవర్ కేసులు

- సీఈవో మీనాకు టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఫిర్యాదు

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): 'ప్రతిపక్ష పార్టీల నేతలపై పోలీసులు ఏకపక్షంగా బైండోవర్ కేసులు పెడుతున్నారు. నిబంధనల ప్రకారం ఇరుపార్టీలకూ నోటీసులు ఇచ్చి బైండోవర్ కేసులు పెట్టాలి. టీడీపీ సానుభూతిపరులపై మాత్రమే కేసులు పెడుతున్నారు' అని టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేశ్ కుమార్ మీనాను కలసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఎన్నికల్లో సమాన అవకాశాలు కల్పించాలని ఈసీఐ మార్గదర్శకాలు ఉంటే క్షేత్రస్థాయిలో పోలీసు అధికారులు అందుకు భిన్నంగా వ్యవరిస్తున్నారు. టీడీపీ బృందాలపై అట్రాసిటీ కేసులు పెట్టి ప్రచారం ముందుకు సాగనీయకుండా చూడాలని పోలీసు యంత్రాంగంపై వైసీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు. టీడీపీ సానుభూతి పరులపై సస్పెక్ట్ షీటు తెరిచి పోలింగ్ రోజు స్టేషన్‌లో కూర్చోబెడతామని బెదిరిస్తున్నారు. వైసీపీకి చెందినవారిపై ఇప్పటికే రౌడీషీట్‌లను ఎత్తివేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు వేసే వాతావరణం కల్పించాలి. ప్రతిపక్షాల ప్రచారం స్వేచ్ఛాయుతంగా జరిగే విధంగా చూడాల్సిన పూర్తి బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉంది' అని సీఈఓకు వివరించినట్లు పయ్యావుల తెలిపారు. 'విశాఖను డ్రగ్స్ రాజధానిగా చేయాలన్నది వైసీపీ ఆలోచన. 25వేల కిలోల డ్రగ్స్ బయటకు వచ్చాయంటే అందులో నూటికి నూరు శాతం వైసీపీ నేతలు ఉన్నారు. గొడ్డలి ఘటనలాగా దీనిని కూడా ఏమార్చే ప్రయత్నం జరుగుతోంది' అని పయ్యావుల ఆరోపించారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
అనంతపురం	40.0	26.0
తిరుపతి	39.1	24.1
కడప	39.0	24.0
హైదరాబాద్	37.5	23.6
విజయవాడ	36.5	24.4
ఒంగోలు	35.1	25.5

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నేతల దాడి

పార్టీ జెండా తొలగించలేదని ఫిర్యాదు చేసినందుకే!

కొల్లూరు, మార్చి 23: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా వైసీపీ జెండా తొలగించకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశాడనే అక్కసుతో టీడీపీ కార్యకర్తపై వైసీపీ ఎంపీటీసీ దాడికి పాల్పడ్డాడు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం కిష్కిందపాలెం గ్రామంలో శనివారం ఈ దారుణం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... కోడ్ అమలులో భాగంగా టీడీపీ నాయకుల ఇళ్లపై కట్టిన జెండాలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. వైసీపీ ఎంపీటీసీ ఇంటిపై ఉన్న జెండా తొలగించకపోవడంతో టీడీపీ కార్యకర్త కొల్లి వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. దీంతో నాపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ ఎంపీటీసీ పొలిమెట్ల ఆనందకిషోర్, సర్పంచ్ నీలాంబరం, కార్యకర్తలు గురివిందపల్లి లోకం, కొక్కిలిగడ్డ లాజరులతో కలిసి ఇంట్లోకి దూరిమరీ వెంకటేశ్వరరావును విచక్షణ రహితంగా కొట్టారు. తీవ్రంగా గాయపడిన బాధితుడు కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే వెంకటేశ్వరరావే తనపై దాడి చేసి కులం పేరుతో దూషించారని ఎంపీటీసీ కూడా ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రారెడ్డి తెలిపారు. ఇరువురి ఫిర్యాదులపైనా దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వైసీపీ నేత భూదాహానికి కుటుంబం బలి

(మొదటి పేజీ తరువాయి)


తల్లీబిడ్డ మృతదేహాలను పరిశీలిస్తున్న డీఎస్పీ షరీఫ్

రెవెన్యూ అధికారుల అడ్డగోలు వ్యవహారాలకు ఆ కుటుంబం బలైంది. అప్పులు తీర్చే మార్గం లేక, తీవ్ర మనోవేదనతో భర్త, భార్య, కుమార్తె ఆత్మహత్య చేసుకున్నారు. శనివారం కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలో ఈ విషాదకర సంఘటన జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో చేనేత సామాజిక వర్గానికి చెందిన పాల సుబ్బారావు (47), పాల పద్మావతి (41) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె హైదరాబాద్ లో బ్యూటీపార్లర్ కోర్సు చేస్తున్నారు. చిన్న కుమార్తె పాల వినయ (17) తల్లిదండ్రులతో ఉంటూ ఇంటర్ చదువుతున్నారు. సుబ్బారావు యాక్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, పద్మావతి టైలర్ వృత్తి చేస్తున్నారు. వారి స్వస్థలం బద్వేలు నియోజకవర్గం అట్లూరు మండలం ఆకుతోటపల్లి. ఈ గ్రామం సోమశిల మునక ప్రాంతం కావడంతో వీరు 20 ఏళ్ల కిత్రం కొత్తమాధవరం వచ్చి స్థిరపడ్డారు. కొద్ది రోజులుగా వీరు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఒంటిమిట్ట రెవెన్యూ పరిధిలో 2187/2 సర్వే నంబరులో తన తండ్రి పేరుతో ఉన్న 3.10 ఎకరాల భూమిని అమ్మే ప్రయత్నం చేశారు. అయితే ఆ భూమి కట్టా శ్రావణి పేరు మీద ఆన్‌లైన్‌లో ఉన్నట్టు తెలిసింది. ఆమె రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డికి ప్రధాన అనుచరుడైన ఓ మాజీ సర్పంచ్‌కు దగ్గర బంధువు. తాము ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని, కుమార్తెల కోసం ఆ పొలాన్ని ఉంచుకున్నామని, ఎలాగైనా తన పేరుతో ఆ పొలాన్ని మార్చాలని పలుమార్లు సుబ్బారావు రెవెన్యూ అధికారులను వేడుకున్నారు. వారు స్పందించకపోవడంతో ఆయన తీవ్రమనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం తల్లీబిడ్డ పద్మావతి, వినయ ఇంట్లో ఉరేసుకోగా.. సుబ్బారావు ఒంటిమిట్ట సమీపంలో రైలుకింద పడి చనిపోయారు. ఆయన మృతదేహం వద్ద సూసైడ్ నోట్ లభించింది. 'మా నాన్న పేరుతో ఉన్న 3.10 ఎకరాల భూమిని కట్టా శ్రావణి పేరుతో ఆన్‌లైన్ చేశారు. మా నాన్నకు కోవిడ్ రావడంతో రూ.4లక్షలు అప్పు చేసి వైద్యం చేయించాం. తమ్ముడి పెళ్లికి రూ.3 లక్షలు అప్పు చేశాం. మా పొలం కూడా మా పేరుమీద లేకపోవడంతో వేరే మార్గం లేక ఆత్మ చేసుకుంటున్నాం. లంచాలు మరిగిన రెవెన్యూ అధికారులకు శిక్షపడాలి' అని సుబ్బారావు రాసిన సూసైడ్ నోట్‌లో ఉంది. ఘటనా స్థలాన్ని కడప డీఎస్పీ షరీఫ్, సీఐ పురుషోత్తంరాజు పరిశీలించి విచారణ చేపట్టారు.

మృతిపై అనుమానాలు

పాల సుబ్బారావు, ఆయన భార్య కుమార్తె మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమీపంలోనే రైలు పట్టాలు ఉన్నాయని, 3 కిలోమీటర్ల దూరం వెళ్లి ఎందుకు ఆత్మహత్య చేసుకుంటాడని అంటున్నారు. వీరికున్న మూడెకరాల పొలం పక్కనే ఇప్పుడు ఫోర్ లేన్ రోడ్డు వెళుతోంది. ఆ భూమి దాదాపు రూ.3 కోట్లకు పైగా పలుకుతోంది. ఆ మూడెకరాలకు అటు ఇటు ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు రెవెన్యూ వారితో కుమ్మక్కై బినామీ పేర్లతో పట్టా చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో సుబ్బారావు కుటుంబంలో ముగ్గురూ చనిపోవడంతో ఇవి హత్యలేమో అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సర్కార్ దాష్టీకానికి బలి: చంద్రబాబు

వైసీపీ ప్రభుత్వ దాష్టీకానికి చేనేత కుటుంబం బలైందని, రెవెన్యూ సిబ్బంది ద్వారా వైసీపీ నాయకులు చేసిన అధికారిక కబ్జా నిండు కుటుంబం ఉసురుతీసిందని టీడీపీ అధినేత చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డుల్లో పేర్లు మార్చిన వైసీపీ భూబకాసురులతో పోరాడలేక పేద బీసీ కుటుంబం బలవంతంగా ప్రాణాలు తీసుకుందని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'ఈ దారుణంపై ఏం సమాధానం చెప్తావు జగన్' అని ప్రశ్నించారు. సొంతజిల్లాలో చోటుచేసుకున్న ఈ అమానవీయ ఘటనపై జగన్ తక్షణమే స్పందించాలని, కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇవి ప్రభుత్వ హత్యలే: లోకేశ్

తమ భూమిని వైసీపీ నేతలు కబ్జా చేయడంతో చేనేత కుటుంబం బలవన్మరణానికి పాల్పడిందని, ఇది ముమ్మాటికీ జగన్ సర్కార్ చేసిన హత్యేనని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. పాల సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడటం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని విచారం వ్యక్తం చేశారు. మృతులకు 'ఎక్స్' వేదికగా నివాళులర్పించారు. చేనేత కుటుంబం మరణానికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ ల్యాండ్ టైటలింగ్ చట్టం పేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు జగన్ కుట్ర చేస్తున్నారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహనరాజు ఆరోపించారు.

కోడ్ కూయకనే కోట్లు హుష్!

(మొదటి పేజీ తరువాయి)


క్యాంపు కార్యాలయం ఉన్న కీలక మండలంలోనే భారీగా నగదు దాచినట్లు తెలుస్తోంది. ఆ మొత్తాన్ని వైసీపీకి చెందిన వారి నివాసాల్లో ఉంచారు. అందులోభాగంగా వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కీలక నేతకు చెందిన కళాశాలలో రూ.5కోట్లు దాచారు. ఆ డబ్బులు ఈ నెల 10న మాయమయ్యాయి. ఈ విషయం తెలియడంతో కంగుతిన్న అభ్యర్థి సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. కోడ్ వచ్చిన రోజున ఎస్పీని వ్యక్తిగతంగా కలిసి నోటిమాటగా ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. ఎన్నికల్లో ఖర్చుకోసం దాచిన నగదు కాబట్టి కేసు నమోదు చేయకుండా దర్యాప్తు చేయాలని కోరినట్లు సమాచారం. దీంతో ఎస్పీ దర్యాప్తు బాధ్యతలను ఆ ప్రాంత సీఐకి అప్పగించారు. ఆయన గోప్యంగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. నగదు మాయమైనరోజు కళాశాలకు బయట వ్యక్తులు ఎవరు వచ్చారనే కోణంలో ఆరాతీశారు. నెల్లూరు జిల్లా వైసీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ముఖ్య అనుచరులు కొందరు 10న మేదరమెట్ల వద్ద నిర్వహించిన సిద్ధం సభకు వెళ్తూ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ కళాశాలకు వచ్చినట్లు గుర్తించారు. వారు అక్కడే భోజనం చేసి కొంతసేపు గడిపిన అనంతరం బయల్దేరినట్లు నిర్ధారించుకున్నారు. ఫోన్ల సిగ్నల్స్‌ను పరిశీలించగా వారు సిద్ధం సభకు వెళ్లలేదని తేలింది. దీంతో వారిని అనుమానితులుగా భావించి ఇటీవల సీఐ తన స్టేషన్ ఎస్ఐతో కలిసి నెల్లూరు వెళ్లి గోప్యంగా విచారించినట్లు సమాచారం. కొంతమంది స్థానిక వైసీపీ నాయకులను, అనుమానితులను సీఐ కార్యాలయానికి పిలిపించుకొని విచారిస్తున్నారు.

పోలీసులపై నేత ఒత్తిడి

కీలక నేతకు చెందిన రూ.5కోట్లు మాయమైన ఘటనపై కేసు నమోదు చేయకుండా పోలీసులు వ్యక్తిగతంగా దర్యాప్తు చేయడం విమర్శలకు తావిస్తోంది. కోడ్ అమలుపై దృష్టిసారించకుండా అభ్యర్థి వ్యక్తిగత సేవలో పోలీసు అధికారులు నిమగ్నమవడం ఆ శాఖలోని డొల్లతనాన్ని బహిర్గతం చేస్తోంది. అధికారాన్ని అడ్డంపెట్టుకొని కీలక నేత అక్రమంగా సంపాదించిన సొమ్ము కావడం, ఓటర్లకు పంచేందుకు దాచినందున ఆయన ఒత్తిడి మేరకు పోలీసులు గోప్యంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు

ఇళ్ల పట్టాలు... 'ఉత్తుత్తి' పంపిణీ!


మునికూడలిలో లబ్ధిదారుకు పంపిణీ చేసిన ఇంటి పట్టా

సీతానగరం, మార్చి 23: తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో ఉత్తుత్తి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీటిపై తహసీల్దార్ సంతకంగానీ, ప్లాట్ నెంబరుగానీ, సర్వే నెంబరుగానీ లేకపోవడం గమనార్హం. భూమిలో కనీసం లేఅవుట్ కూడా వేయలేదని తెలుస్తోంది. మునికూడలి గ్రామంలో సర్వే నెంబరు 317/1లో 9 ఎకరాల భూమిని ఒక రైతు వద్ద సేకరించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడే నాటికి ఆ రైతుకు సొమ్ములు కూడా చెల్లించలేదు. షెడ్యూలు విడుదలైన రోజునే హడావుడిగా బోగస్ పట్టాలను లబ్దిదారులకు పంపిణీ చేశారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేయనున్నట్లు టీడీపీ, జనసేన నాయకులు తెలిపారు.

వైసీపీ గిఫ్ట్ ప్యాకెట్లు స్వాధీనం


కారులో పట్టుబడిన గిఫ్ట్ బాక్సులు

గిద్దలూరు టౌన్, మార్చి 23: ఎన్నికల నేపథ్యంలో పంపిణీ చేసేందుకు వైసీపీ నాయకులు సిద్ధం చేసిన గిఫ్ట్ ప్యాకెట్లను ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లా గిద్దలూరులో శనివారం వాహనాల తనిఖీ సందర్భంగా ఓ కారులో గిఫ్ట్‌ప్యాక్‌లు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకొన్నారు. కారును పోలీసుస్టేషన్‌కు తరలించారు. కారు వెనుకవైపున జగన్ బొమ్మతో సిద్ధం స్టిక్కర్ అంటించి ఉంది. అందులో 3 గిఫ్ట్‌బాక్స్‌లు, వాటిపై ఎమ్మెల్యే అభ్యర్థి నాగార్జునరెడ్డి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి బొమ్మలతో కూడిన స్టికర్లు అంటించి ఉన్నాయి.

తీరు మారని వలంటీర్లు

- మన్యంలో ఇద్దరు, కాకినాడలో ఒకరు సస్పెన్షన్

బాపట్ల, రౌతులపూడి, పార్వతీపురం రూరల్, మార్చి 23: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వలంటీర్లపై అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ వారి తీరులో మార్పు రావటంలేదు. వైసీపీకి అనుకూలంగా ప్రచారం కొనసాగిస్తూనే ఉన్నారు. బాపట్ల మండలం కొండుభొట్లపాలెం గ్రామ వలంటీర్ కేశన శివగుడారం వైసీపీకి అనుకూలంగా ఏలూరుకు చెందిన ఓ నాయకుడి వీడియోను వాట్సాప్‌లో పెట్టారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో గ్రామ కార్యదర్శి ద్వారా విచారిస్తున్నట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. కాగా, కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం బంగారయ్యపేటలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థితో ప్రచారంలో పాల్గొన్న వలంటీరు గొంపా గోవింద్‌ను అధికారులు విధులనుంచి తొలగించారు. అలాగే, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన వలంటీర్లు జి.ప్రభాకర్, దేవాబత్తుల రవిలను విధుల నుంచి తొలగిస్తున్నట్లుగా శనివారం ఎంపీడీవో షేక్ మహమ్మద్ అకీబ్‌జావిద్ తెలిపారు. గ్రామానికి చెందిన దివ్యాంగులు సంగంరెడ్డి వెంకటరమణ, గొడవ కృష్ణల నుంచి పోస్టల్ బ్యాలెట్ కోసం వీరు దరఖాస్తులపై సంతకాలు చేయించుకున్నారు. దేనికోసమని దివ్యాంగులు ప్రశ్నించగా ఓట్ల కోసమని వలంటీర్లు సమాధానమిచ్చారు. దీనిపై ఎంపీడీవోకు ఫిర్యాదులు వెళ్లగా వారిద్దరిని సస్పెండ్ చేశారు.

ఎన్నికల ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్

వినుకొండ, మార్చి 24: పల్నాడు జిల్లా వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పట్టణంలోని 28వ వార్డులో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రేషన్ సరుకులు డోర్ డెలివరీ చేసే ఎండీయూ ఆపరేటర్ నాగూర్ వలి ఈ ప్రచారంలో పాల్గొనడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొనరాదని ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చింది. ఇలాంటి ఘటనపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

తిరుపతిలో ఓపెన్ యూనివర్సిటీ!

- హైదరాబాద్ నుంచి తరలింపునకు నిర్ణయం
- 16న 'షార్ట్ సర్క్యులేషన్'తో కేబినెట్ ఆమోదం
- ఈసీ ఆమోదిస్తే వెంటనే అమల్లోకి ఆర్డినెన్స్
- ఎన్నికల ముందు జగన్ సర్కారు హడావుడి

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఉమ్మడిగా కొనసాగుతున్న బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని యుద్ధప్రాతిపదికన రాష్ట్రానికి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐదేళ్ల పాటు వర్సిటీ విభజన, ఏపీలో స్టడీ సర్కిళ్ల నిర్వహణ అంశాలను గాలికొదిలేసిన జగన్ ప్రభుత్వం సరిగ్గా ఎన్నికలకు ముందు ఆగమేఘాలపై వర్సిటీ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నందున బిల్లు పెట్టే అవకాశం లేకపోవడంతో, ఆర్డినెన్స్ ద్వారా తిరుపతిలో వర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం షార్ట్ సర్క్యులేషన్ విధానంలో మంత్రులకు నోట్ పంపి ఆమోదముద్ర వేయించింది. సరిగ్గా ఎన్నికల షెడ్యూలు విడుదలైన ఈ నెల 16న ఆ ఫైలుకు కేబినెట్ ఆమోదం లభించగా, 19న ఈసీకి ఈ ప్రతిపాదనను పంపాలని కోరుతూ సాధారణ పరిపాలన శాఖకు ఉన్నత విద్యాశాఖ లేఖ రాసింది. ఈసీ అనుమతిస్తే వెంటనే ఫైల్‌ను గవర్నర్‌కు పంపి ఆర్డినెన్స్ జారీ చేస్తారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఇక్కడ అడ్మిషన్లు చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వర్సిటీ ఏర్పాటుకు అనుమతితో పాటు మొదట రూ.63.85 కోట్ల బడ్జెట్, 50 టీచింగ్, 68 నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు చేయాలని ప్రతిపాదించింది.

పదో షెడ్యూలులో వర్సిటీ

1982లో హైదరాబాద్‌లో స్థాపించిన ఓపెన్ యూనివర్సిటీ రాష్ట్ర విభజన సమయంలో పదో షెడ్యూలు పరిధిలోకి వెళ్లింది. రాష్ట్ర విభజన జరిగి దాదాపు పదేళ్లు అవుతున్నా ఈ షెడ్యూలులో ఉన్న ఉమ్మడి ఆస్తుల విభజన జరగలేదు. అయినా ఉన్నత విద్యా మండలి, తెలుగు అకాడమీ, ఇతర సంస్థలను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసుకుంది. కానీ ఓపెన్ వర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఓపెన్ వర్సిటీకి ఏపీలో 76 స్టడీ సర్కిళ్లున్నాయి. 16 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 500 మంది పార్ట్‌టైం సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి ఏపీ ప్రభుత్వం జీతాలు ఇస్తుంటే, విద్యార్థులు చెల్లించే ఫీజులు మాత్రం హైదరాబాద్‌లోని యూనివర్సిటీకి వెళ్తున్నాయి. దూర విద్య ద్వారా ఏటా 30వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందుతున్నారు. వీరంతా కలిపి సంవత్సరానికి రూ.13కోట్లకు పైగా ఫీజులు కడుతున్నారు. ఈ వర్సిటీని విభజించాలని ఎప్పటినుంచో డిమాండ్ ఉన్నా పట్టించుకోని



ప్రభుత్వం, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత, ఎన్నికల షెడ్యూలు వచ్చాక దీనిపై ఫైలు పెట్టింది. అయితే తిరుపతిలో ఏర్పాటు చేసేది కొత్త వర్సిటీ అవుతుందా లేక పాతదానిగానే పరిగణిస్తారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో దీనికి ఉన్న ఏపీ చట్టమే ఇప్పుడు ఏర్పాటు చేయబోయే దానికీ వర్తిస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కానీ విభజించకుండానే హైదరాబాద్‌లో ఉన్న వర్సిటీని ఏపీకి తరలిస్తే అది కొత్తదే అవుతుందనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికిప్పుడు ఏపీలో వర్సిటీని ఏర్పాటుచేసినా, ఉమ్మడి వర్సిటీపై కొంతకాలం పాటు ఆధారపడాల్సి ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

నిబద్ధతతోనే న్యాయవాద వృత్తిలో ఉన్నతస్థానం

- ఏపీ హైకోర్టుకు రావడం సొంతింటికి వచ్చినట్టుంది: జస్టిస్ భట్టి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తిని ఘనంగా సన్మానించిన హైకోర్టు న్యాయవాదుల సంఘం, మహిళా న్యాయవాదుల సమాఖ్య


జస్టిస్ భట్టికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఏపీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నిబద్ధత, విశ్వాసంతో ముందుకు సాగితే న్యాయవాద వృత్తిలో ఉన్నతస్థానానికి చేరవచ్చని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి అన్నారు. ఏపీ హైకోర్టుకు రావడం సొంత ఇంటికి వచ్చినట్టు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందినవాడిని కావడం వల్లే తాను సుప్రీంకోర్టు న్యాయమూర్తిని కాగలిగానన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హైకోర్టు ప్రాంగణంలో ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం, మహిళా న్యాయవాదుల సమాఖ్య సంయుక్తంగా మహిళా న్యాయమూర్తులు, ఉప లోకాయుక్త, సీనియర్ మహిళా న్యాయవాదులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ భట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా న్యాయమూర్తులు జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ కిరణ్మయి మండవ, జస్టిస్ జగడం సుమతి, ఉప లోకాయుక్త రజనీరెడ్డి, న్యాయవాద వృత్తిలో అపార అనుభవం ఉన్న గుంటూరు బార్‌కు చెందిన సీనియర్ న్యాయవాది గోగినేని ప్రేమకుమారి, విజయవాడ బార్ నుంచి న్యాయవాది అచ్చమ్మ, హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది కె.విజయలక్ష్మిని సన్మానించారు. ఆ తరువాత జస్టిస్ భట్టి, ఆయన సతీమణి అనుపమను గజమాల, శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ భట్టి మాట్లాడుతూ..ఉద్యోగాల పేరుతో అమాయక యువతులను ట్రాఫికింగ్ ఊబిలో దింపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈ ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని తన దృష్టికి వచ్చిందన్నారు. ఆ ప్రాంతాలను గుర్తించి ప్రజలను చైతన్యవంతం చేసేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఏపీఎస్ఎల్ఎస్ఏ), ఏపీ మహిళా న్యాయవాదుల సమాఖ్యను ఆయన కోరారు. మదనపల్లి నుంచి హైదరాబాద్ వెళ్లి లాయర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించేందుకు తన తల్లి ఎంతగానో ప్రోత్సహించారన్నారు. ఈ స్థాయికి ఎదిగేందుకు తన తల్లి, సోదరి, సతీమణి ప్రోత్సాహం, సహకారం ఎంతో ఉందన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. మహిళలు అనాదిగా అసమానత్వాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. పురుషులతో సామానంగా మహిళలు నిలబడేందుకు నిర్మాణాత్మకమైన చర్యలు అవసరమన్నారు. సమర్థత, నిజాయితీ, నిష్పాక్షిత వంటి లక్షణాల కారణంగానే జస్టిస్ భట్టి ఈ స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ.. జస్టిస్ భట్టిని మదనపల్లి మాణిక్యంగా అభివర్ణించారు. ఏ మగాడైతే తన తల్లిని, సోదరిని ప్రేమగా చూసుకుంటాడో.. అతను మంచి భర్తగా, తండ్రిగా నిలుస్తాడన్నారు. తల్లి తన బిడ్డను పెంచే విధానాన్ని బట్టే సమాజంలో నేరాల శాతం ఆధారపడి ఉంటుందని ఓ అధ్యయనం చెబుతోందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకిరామిరెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి, ఏపీ హైకోర్టు మహిళా న్యాయవాదుల సమాఖ్య అధ్యక్షురాలు కె.అరుణ, వ్యవస్థాపక అధ్యక్షురాలు భాస్కరలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. బెజవాడ బార్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ విజయవాడ టీడీపీ హాలులో సంయుక్తంగా శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు.



అడుగంటిన సుంకేశుల

రాయలసీమలో జలాశయాలు అడుగంటి పోతున్నాయి. కర్నూలుకు తాగునీటి ఆధారమైన సుంకేశుల జలాశయం పూర్తిగా ఎండిపోయింది. గరిష్ఠ నీటి మట్టం 1.20 టీఎంసీలకుగాను శనివారం నాటికి 0.05 టీఎంసీలకు పడిపోయింది. కర్నూలు నగరం సహా డోన్, పత్తికొండ, కృష్ణగిరి ప్రాంతాలకు తాగునీరు అందించే గాజులదిన్నె జలాశయంలో 4.5 టీఎంసీలకుగాను 1.7 టీఎంసీలకు పడిపోయింది. శ్రీశైలంలో 215 టీఎంసీలకుగాను 34.78 టీఎంసీలే ఉంది. వెలుగోడులో 16.5 టీఎంసీలకుగాను 1.40, గోరుకల్లులో 12.5 టీఎంసీలకుగాను 2.46, పత్తికొండలో 1.243 టీఎంసీలకుగాను 0.21 టీఎంసీలకు పడిపోయింది. దీంతో మే, జూన్ మాసాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదురయ్యే ప్రమాదం ఉంది. - ఆంధ్రజ్యోతి, కర్నూలు

వ్యవసాయశాఖలో పదోన్నతుల రగడ

- వీఏఏలకు ఏఈవో పోస్టులు
- వేల సంఖ్యలో వీఏఏలు.. వందల్లోనే ఖాళీలు
- మెరిట్ పేరుతో సీనియారిటీకి చెల్లుచీటి
- అభ్యంతరం తెలపకుండా ముందే ఎన్‌వోసీ
- ఎన్నికల షెడ్యూల్‌కు ముందు జీవో జారీ
- కోడ్ వచ్చి వారమైనా పూర్తికాని ప్రక్రియ

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ వ్యవసాయ సహాయకుల(వీఏఏ)కు వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈవో)గా, ఏఈవోలకు ఏవోలుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సాగుతోంది. ఈ నెల 16న ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఐదు రోజుల ముందు పదోన్నతులకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. షెడ్యూల్‌కు ముందే ప్రక్రియను పూర్తి చేయకుండా, కోడ్ అమల్లో ఉండగా, పదోన్నతులు కల్పించే ప్రయత్నాలు చేస్తోంది. ఈ పదోన్నతుల విధానం లోపభూయిష్టంగా ఉందన్న వాదన వ్యవసాయశాఖ వర్గాల్లో వ్యక్తమవుతోంది. గత జూన్ నాటికి రాష్ట్రంలో గ్రేడ్1, గ్రేడ్2 ఏఈవో పోస్టులు 791 ఖాళీగా ఉన్నాయి. గ్రేడ్3 ఏఈవో పోస్టులు వీఏఏలకు ఇవ్వాల్సి ఉంది. కానీ గ్రేడ్3లో ఖాళీ లేకపోవడంతో గ్రేడ్1 ఏఈవోలకు గ్రేడ్2 ఏఈవోలుగా, గ్రేడ్2 ఏఈవోలను గ్రేడ్1గా పోస్టింగులు ఇచ్చి, గ్రేడ్2లో ఖాళీగా ఉన్న 749 పోస్టులను వీఏఏలకు ఇవ్వాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా వీఏఏలు వేల సంఖ్యలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా సీనియారిటీ ప్రకారం వీఏఏల జాబితాలు తయారుచేసి, జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రేడ్2 ఏఈవో పోస్టులను మాత్రమే వీఏఏలకు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం వీఏఏల నుంచి నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ తీసుకుంటున్నారు. దీని వల్ల పదోన్నతి దక్కని వీఏఏలు పదోన్నతులపై అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం లేకుండా పోతుంది. పదోన్నతుల్లో రోస్టర్ పాయింట్లు, సీనియారిటీని పరిగణనలోకి తీసుకోకుండా, కేవలం మెరిట్ ప్రాతిపదికన పదోన్నతులు ఇస్తామంటున్నారు. పైగా వీఏఏలకు గత నాలుగేళ్ల సర్వీస్‌లో వచ్చిన అవార్డులు, రివార్డులకు, పనితీరు సూచికలకు మార్కులు ఇవ్వకుండా, కేవలం వీఏఏల నియామకాలు జరిగినప్పుడు నిర్వహించిన పరీక్షలో వచ్చిన మార్కులను మాత్రమే పరిగణనలోకి తీసుకుని జాబితాలు తయారుచేశారు. ఫలితంగా అతికొద్ది మందికే పదోన్నతులు దక్కనున్నాయి. వాస్తవానికి సీనియారిటీలో ఏడాదికి ఒకటి నుంచి గరిష్ఠంగా 10 మార్కులు కలపాల్సి ఉందని వీఏఏలు చెప్తున్నారు. అలాగే వీఏఏల ప్రొబేషన్ డిక్లేర్ చేయడానికి పెరఫార్మెన్స్ ఇండికేటర్ పెట్టారు. ప్రభుత్వ పథకాలను అమలు చేసే ప్రత్యేక యాప్‌ను ఉపయోగించి, వీఏఏలకు పెరఫార్మెన్స్ ఇండికేటర్స్ ద్వారా జిల్లా, స్టేట్ ర్యాంక్‌లు కూడా ఇచ్చారు. మార్కులివ్వనప్పుడు అవార్డులు ఇచ్చి ఉపయోగం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. పైగా పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించడానికి ఒక్కో వీఏఏ నుంచి కొంత సొమ్ము వసూలు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. కాగా బీఎస్సీ పూర్తి చేసిన గ్రేడ్1 ఏఈవోలకు ఏవోలుగా పదోన్నతులు కల్పిస్తున్నారు. గతంలో నేరుగా బీఎస్సీ చేసిన వారిని ఏఈవోలు నియమించే వారు. కానీ మొత్తం జిల్లాలకు మంజూరైన పోస్టుల్లో 40శాతం మాత్రమే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కింద చూపి, మిగతా 60 శాతం పోస్టులను పదోన్నతులతో భర్తీ చేస్తున్నారు.

రాజకీయాలు మాట్లాడటానికి రాలేదు

మహిళల కష్టాలు వినడానికి వచ్చాను

- శ్రామిక మహిళా శక్తి కార్యక్రమంలో నారా భువనేశ్వరి
- ఓటుతో రాక్షస పాలనను అంతం చేయాలని పిలుపు
- తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో 'నిజం గెలవాలి' పర్యటన



చిల్లకూరులో శ్రామిక మహిళా శక్తి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి, హాజరైన మహిళలు

చిల్లకూరు/వెంకటాచలం, మార్చి 23: రాజకీయాలు మాట్లాడడానికి తాను రాలేదని, శ్రామిక మహిళల్లో ఒకరుగా వారి కష్టాలు వినడానికి వచ్చానని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గం చిల్లకూరులో శనివారం శ్రామిక మహిళా శక్తి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు సొంత కాళ్లపై నిలబడడం చాలా గొప్ప విషయమే కాకుండా వారికి గౌరవం కూడా అని చెప్పారు. తాను హెరిటేజ్ సంస్థను ముందుకు తీసుకెళ్తుండటాకి కారణం చంద్రబాబే అని తెలిపారు. ఆ సంస్థకు ఎండీగా నియమించినప్పుడు తాను చాలా భయపడ్డానని, సంస్థను నడపగలనని ప్రోత్సహించి వెన్నుతట్టి ఆయన ముందుకు నడిపించారని గుర్తు చేసుకున్నారు. కార్మిక శక్తితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, అలాంటి కార్మికుల చెమట నుంచే తెలుగుదేశం పార్టీ పుట్టిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 77లక్షల మంది రోజువారీ కార్మికులున్నారని, వారంతా గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కార్మిక సంస్కరణలు ప్రధాన అజెండాగా ఉంటాయని ఆమె హామీ ఇచ్చారు. మహిళల కోసం కూటమి ఇప్పటికే ప్రత్యేక హామీలు ఇచ్చిందని, అందులో భాగంగా 18ఏళ్లు దాటిన యువతులకు నెలకు రూ.1,500 చొప్పున నగదు, బడికి వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15వేలు చొప్పున ఇస్తారని, కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తారని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తారన్నారు. గతంలో తన భర్త తనకు తగిన సమయం కేటాయించడం లేదని బాధపడేదాన్నని, అయితే ఇపుడు మహిళల కష్టాలు చూస్తుంటే వారి భవిష్యత్తు కోసం ఆయన ఏడాదిలో 365 రోజులూ కష్టపడాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, పదిమందినీ ప్రోత్సహించి ఓట్లు వేసేలా చూడాలని కోరారు. కాగా, రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా రానున్న ఎన్నికలు చాలా కీలకమైనవని, ఓటు అనే ఆయుధంతో రాక్షస పాలనను అంతం చేయాలని పార్టీ శ్రేణులకు భువనేశ్వరి పిలుపునిచ్చారు.

మాదక ద్రవ్యాలకు నిలయంగా ఏపీ

'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో భువనేశ్వరి పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. గూడూరు నియోజకవర్గం వాకాడు మండలం తిరుమూరు గ్రామంలో పిడుగు వెంకటస్వామి, వెంకటాచలం మండలం పుంజులూరుపాడుకు చెందిన ఆర్ని నారాయణరెడ్డి, కురిచెర్లపాడుకు చెందిన బొల్లా సుబ్బానాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి, బాధితులను ఓదార్చారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏపీ మాదక ద్రవ్యాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. తెలుగు ప్రజలందరూ ఒక్కసారి రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆలోచించాలన్నారు. రాష్ట్రాన్ని అందరం కలసి రక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, మీతోపాటు మరో పది మందితో టీడీపీకి ఓటు వేయించి చంద్రబాబుకు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, ఎమ్మెల్సీ పంచమర్తి అనురాధ తదితరులు ఉన్నారు.

'నిజం గెలవాలి'పై ఈసీకి వైసీపీ ఫిర్యాదు

రాయచోటి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నిజం గెలవాలి కార్యక్రమం సందర్భంగా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ప్రజలకు నగదు పంపిణీ చేశారంటూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఈసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై 24గంటల్లోగా నివేదిక ఇవ్వాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నెల 20న అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. రెడ్డెమ్మ, రవీంద్రరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయితే కోడ్ కారణంగా వారికి ఎటువంటి నగదు, చెక్కు ఇవ్వలేదు. అయితే గతంలో మాదిరే ఇక్కడ కూడా మృతుల కుటుంబాలకు నగదు పంపిణీ చేసి.. ఎన్నికల నిబంధనలు అతిక్రమించారని ఈసీకి లేళ్ల అప్పిరెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. 24గంటల్లోగా దీనిపై నివేదిక ఇవ్వమని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌కు సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశాలు ఇచ్చారు.

రేషన్, పెన్షన్ పంపిణీలో వలంటీర్లను దూరంగా పెట్టండి

- సీఈవోకి సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఫిర్యాదు

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పెన్షన్, రేషన్ పంపిణీలో వలంటీర్లను దూరంగా పెట్టాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'గ్రామ, వార్డు వలంటీర్లు ఓటర్లను ప్రభావితం చేయకుండా, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా చూడాలని మేం ఇదివరకే ఈసీని కోరాం. పెన్షన్, రేషన్ పంపిణీలో కూడా వారి పాత్ర లేకుండా చూడాలని సీఈవోకి చెప్పాం. ఎన్నికల నిబంధనలు అతిక్రమించే వలంటీర్లను వెంటనే విధుల నుంచి తప్పించాలి. నిబంధనల అతిక్రమణలపై ప్రసారమాధ్యమాల్లో వస్తే తప్ప కలెక్టర్లు చర్యలు తీసుకోవడం లేదు. ఆర్వో, ఏఆర్వోలు వలంటీర్లను నియంత్రించి అదుపు చేసేలా చర్యలు తీసుకోవాలి' అని సీఈఓని కోరినట్లు రమేశ్ కుమార్ తెలిపారు.

మైపాడు బీచ్ రిసార్ట్స్ లీజు ఉత్తర్వులు రద్దు చేయాలి

- సీఈవోకు సీపీఐ రామకృష్ణ లేఖ

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మైపాడు బీచ్ రిసార్ట్స్‌లోని భవనాలు, స్థిర, చరాస్తుల నిర్వహణను 'ఆఫ్‌హోం హోటల్స్ అండ్ రిసార్ట్స్'కు లీజుకిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనాకు శనివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ)కి చెందిన ఈ రిసార్ట్స్‌ను లీజుకిస్తూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఈ నెల 16న ఏపీటీడీసీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పేరుతో హడావుడిగా ఉత్తర్వులు విడుదల చేశారని, ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

మోదీ... మోనార్క్!

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను లిక్కర్ వ్యవహారంలో ఈడీ అధికారులు అరెస్టు చేశారు. దీంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తలపెట్టిన రాజసూయ యాగం ముగిసినట్టేనా? ఈ ప్రశ్నకు ఇప్పుడే సమాధానం లభించదు. ఎందుకంటే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కాషాయ ఏలుబడిలోకి రావాలన్న మోదీ సంకల్పం ఇంకా నెరవేరలేదు కనుక రాజసూయ యాగం సాగుతూనే ఉండవచ్చు. యూపీఏ హయాంలో అన్నా హజారేతో కలసి అవినీతి వ్యతిరేక ఉద్యమం నడిపిన కేజ్రీవాల్.. ఇప్పుడు అవే అవినీతి ఆరోపణలపై అరెస్టవడం మోదీ మహిమే అని చెప్పవచ్చు. ఎవరు చేసుకున్న కర్మకు వారే బాధ్యులు అవడం అంటే ఇదే. అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరక ముందు ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారిగా పనిచేసిన కేజ్రీవాల్‌పై సర్వీస్‌లో ఉన్నప్పుడు అవినీతి ఆరోపణలు లేవు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత కూడా ఆయనపై అవినీతి ఆరోపణలు లేవు. ఆమ్ ఆద్మీ పార్టీని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలనుకున్న తర్వాతే ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. 'ఢిల్లీ ఏం సరిపోతుంది. దేశాన్నే ఏలేద్దాం' అని అనుకున్న కేజ్రీవాల్ తన పార్టీని పలు రాష్ట్రాలకు విస్తరించారు. మద్యం కేసులో స్వీకరించిన ముడుపుల మొత్తాన్ని పంజాబ్, గోవా ఎన్నికల్లో ఖర్చు చేశారని ఈడీ ఆరోపిస్తోంది.

> బాండ్ల వివరాలు బయటకు వచ్చాక అందరూ అందరే అని స్పష్టం అవుతోంది. అయితే కేంద్రానికి కొరకరాని కొయ్యగా మారినవారే కేసుల్లో ఇరుక్కుంటున్నారు. లిక్కర్ వ్యాపారుల నుంచి ముడుపులు తీసుకోని ముఖ్యమంత్రులు ఉన్నారని చెప్పగలరా? ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక, మద్యం వ్యాపారాల్లో ఏం జరుగుతోందో కేంద్రానికి తెలియదా? కాకపోతే జగన్‌రెడ్డి తమకు విధేయుడిగా ఉన్నారు కనుక ఏజెన్సీల దాడుల నుంచి మినహాయింపు లభిస్తోంది. కేజ్రీవాల్ కూడా ఇండియా కూటమిలో చేరకుండా ఎన్డీయేతో జట్టు కట్టి ఉంటే ఇప్పుడు జైలుకు వెళ్లాల్సి వచ్చేది కాదు. ఈ పరిస్థితులలో ఈ దేశ రాజకీయాల్లో మనగలగాలంటే ప్రధాని మోదీ ఆధిపత్యానికి తలొగ్గి పరిమిత స్థాయిలో రాజకీయం చేసుకోవాలి. అలా కాకుండా అన్ని రాష్ట్రాలకూ విస్తరించాలనుకుంటే కేజ్రీవాల్‌కు పట్టిన గతే పడుతుంది. ధిక్కరించిన వారిని మోదీ అనే పెనుభూతం వదలదు.

పోరు వారిది.. ఫలం మోదీది!

ఢిల్లీ కేంద్రంగా 2011లో అన్నా హజారేతో కలసి చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమం ఫలితంగా 2014లో యూపీఏ ప్రభుత్వం అధికారం కోల్పోయింది. అప్పటి వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి అవినీతి వ్యతిరేక ఉద్యమ ఫలితాలను తనకు అనుకూలంగా మలచుకొని ప్రధానమంత్రి అయ్యారు. అప్పట్లో తాము ఒక రాజకీయ పెను భూతానికి ప్రాణ ప్రతిష్ఠ చేసిన విషయం కేజ్రీవాల్‌కు గానీ, కాంగ్రెస్ పార్టీతో విభేదించిన ఇతర ప్రాంతీయ పార్టీల నాయకులకు గానీ తెలియదు. 2014 తర్వాత కాంగ్రెస్ పార్టీ బలహీనపడటంతో ప్రాంతీయ పార్టీల నాయకుల్లో రాజకీయ దురాశ పెరిగిపోయింది. అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు మమతా బెనర్జీ, నితీశ్ కుమార్, శరద్ పవార్, కేసీఆర్ వంటి వారు ప్రధానమంత్రి పదవిపై కన్నేశారు. తాము సారథ్యం వహిస్తున్న ప్రాంతీయ పార్టీలను పొరుగు రాష్ట్రాలకు విస్తరించారు. ఫలితంగా ఎన్డీయే వ్యతిరేక ఓటు చీలి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంతింతై వటుడింతై అన్నట్టుగా బలపడుతూ వచ్చారు. ప్రాంతీయ పార్టీలు ఈ దేశానికే అరిష్టం అని చెబుతూ వస్తున్న ప్రధాని మోదీ ముందుగా ప్రాంతీయ పార్టీల అధినేతల బలహీనతలపై దృష్టి కేంద్రీకరించారు. ఐటీ, సీబీఐ, ఈడీ వంటి సంస్థలకు చెందిన అధికారులను కిరాయి సైనికులుగా మార్చుకొని ప్రాంతీయ పార్టీల పైకి ఉసిగొల్పారు. ఫలితంగా అనేక మంది నాయకులు కేసుల్లో ఇరుక్కున్నారు. ప్రధాని మోదీని ఎదిరించడం అసాధ్యమని గుర్తించిన నాయకులు తమ సొంత రాష్ట్రాలకే పరిమితమై సామంత రాజులుగా మారిపోయి అధికారంలో కొనసాగగలుగుతున్నారు. 'మాయాబజార్' సినిమాలో ఘటోత్కచుడి సైన్యం 'కోర్ కోర్ శరణు కోర్' అని ప్రత్యర్థులను వేటాడినట్టుగా ఇప్పుడు ప్రధానమంత్రి మోదీ రాజకీయ ప్రత్యర్థుల నుంచి ఇదే ఆశిస్తున్నారు. శరణు కోరిన వారు మాత్రమే రాజకీయాల్లో మనగలుగుతున్నారు. ప్రాంతీయ పార్టీల స్వయంకృతాపరాధమే ఇది. అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీకే పరిమితమై ఉన్నట్టయితే గోవా, పంజాబ్ ఎన్నికల సందర్భంగా మద్యం వ్యవహారంలో ముడుపులు తీసుకోవలసిన అవసరం ఉండేది కాదు కదా? ఢిల్లీని ఏలుకోమని ప్రజలు ఆశీర్వదిస్తే దేశాన్ని ఏలుతానని బయలుదేరి ఇప్పుడు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి కొనితెచ్చుకున్నారు. ఆమ్ ఆద్మీ పోటీ చేయడం వల్ల అనేక రాష్ట్రాలలో ప్రతిపక్ష ఓట్లు చీలి బీజేపీ లాభపడింది. ప్రతిపక్షాల అనైక్యత, రాజకీయ దురాశ వల్ల రాజకీయంగా పెనుభూతంగా మారిన ప్రధాని మోదీని ఇప్పుడు అందరూ ఏకమైనా కదిలించలేని పరిస్థితి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిన్నటి వరకు ఎగిరెగిరి పడ్డారు. ప్రధానమంత్రి అయిపోదామని కలలుగన్నారు. స్వరాష్ట్రంలో ఎదురు ఉండకూడదని వామపక్ష కూటమిని దెబ్బతీశారు. అయితే, అప్పుడు ఆమెకు తెలియదు— తన చర్య వల్ల ఏర్పడిన శూన్యాన్ని ప్రధాని మోదీ తన పార్టీకి అనుకూలంగా మార్చుకుంటారని! తత్వం బోధపడే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇప్పుడు కనీసం సొంత రాష్ట్రంలో అయినా అధికారంలో కొనసాగాలంటే నరేంద్ర మోదీ అనే రాజకీయ పెనుభూతానికి తల వొంచక తప్పదని గుర్తించారు. ఈ కారణంగానే ఇండియా కూటమి గురించి ఆమె ఇప్పుడు పెద్దగా మాట్లాడటం లేదు. అంతకు ముందు ఆమె ఢిల్లీలో తరచూ హడావిడి చేయడాన్ని చూశాం. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా ప్రధానమంత్రి కావాలని కలలు కన్నవారే. అయితే, ఆయనకు ముందుగానే జ్ఞానోదయమై ఇండియా కూటమి నుంచి తప్పుకొని బీజేపీతో కలసి మరోమారు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

తెలుగు రాష్ట్రాల్లో ఇలా....

తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, 2019కి ముందు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కాంగ్రెస్‌తో చేతులు కలిపి... ప్రతిపక్షాలను ఏకం చేసే ప్రయత్నం చేసి, ఆ ఎన్నికల్లో ఘోరంగా దెబ్బతిన్నారు. ఫలితంగా రాష్ట్రం ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల్లోకి వెళ్లి విలవిల్లాడుతోంది. తత్వం బోధపడిన చంద్రబాబు మరోమారు ప్రధాని మోదీని ఆశ్రయించారు. మోదీని ధిక్కరిస్తే ఏం జరుగుతుందో గ్రహించడం వల్లనే చంద్రబాబు తనను తాను తగ్గించుకొని ఎన్డీయేతో జట్టు కట్టారు. కేంద్రం శక్తి ఏమిటో ప్రతిపక్షంలో ఉన్నప్పుడే తెలుసుకున్న జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రధాని మోదీ పట్ల వినయ విధేయతలు ప్రదర్శిస్తూనే ఉన్నారు. బెయిలు కోసం అప్పుడు అధికారంలో ఉన్న సోనియా గాంధీ వద్దకు కుటుంబ సభ్యులను పంపి కాళ్ల బేరానికి దిగిన చరిత్ర జగన్‌ది. దాని ఫలితమే అవినీతి కేసులలో జగన్‌పై విచారణ కూడా జరగని పరిస్థితి. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడైన అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయలేని పరిస్థితిలో సీబీఐ ఉందంటే, పైవాడి ఆశీస్సులు లేకుండా సాధ్యమా? నరేంద్ర మోదీ ఎంతటి ప్రమాదకర రాజకీయ నాయకుడో గుర్తించగలిగినవారు ఆయన పట్ల విధేయత ప్రదర్శిస్తూ రాజకీయం చేసుకోగలుగుతున్నారు. ధిక్కరించిన వారు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రధాని వద్ద చంద్రబాబు సాగిలపడ్డారని నిందించి ప్రయోజనం ఏమిటి? ధిక్కరిస్తే ఏం జరుగుతుందో తెలుసు కనుకే చంద్రబాబు రాజీపడిపోయారు. జగన్‌రెడ్డిపై నమోదైన కేసులతో పోల్చితే అరవింద్ కేజ్రీవాల్‌పై పెట్టిన కేసు ఏ పాటిది? లిక్కర్ వ్యవహారంలో చేతులు మారిన మొత్తం వంద కోట్లని ఈడీ అధికారులే చెబుతున్నారు. వేల కోట్ల అవినీతితో పోల్చితే వంద కోట్లు ఏ మూలకు? అవినీతికి పాల్పడాలనుకున్నా అనుభవం కూడా కావాలి. ఆ అనుభవం లేనందువల్ల కాబోలు కేజ్రీవాల్ దొరికిపోయారు.

కేసీఆర్, పవార్... మరికొందరు

ఇప్పుడు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విషయానికి వద్దాం! తెలంగాణను ఉద్ధరించమని ప్రజలు ఆయనకు రెండో పర్యాయం కూడా అధికారం కట్టబెడితే జాతీయ రాజకీయాలు అంటూ గాల్లో మేడలు కట్టారు. మహారాష్ట్రలో జెండా పాతాలనుకుంటే సొంత రాష్ట్రంలోనే ప్రజలు ఆయన గులాబీ జెండాను పీకేశారు. మరోవైపు ఢిల్లీ లిక్కర్ కేసులో కుమార్తె కవితను ఈడీ అధికారులు అరెస్టు చేసి తీసుకెళ్లినా నోరు కూడా విప్పలేని పరిస్థితిలో కేసీఆర్ ఉన్నారు. ఒకప్పుడు మోదీపై కత్తులు దూసిన కేసీఆర్ ఇప్పుడు సొంత పార్టీని కూడా కాపాడుకోలేని పరిస్థితిలో ఉన్నారు. మహారాష్ట్రలో ప్రధానమంత్రి మోదీతో విభేదించిన శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే అధికారంతోపాటు సొంత పార్టీని కూడా కోల్పోయారు. ఏక్‌నాథ్ షిండేను ప్రోత్సహించిన బీజేపీ పెద్దలు శివసేనను చీల్చి ఉద్ధవ్ ఠాక్రేను బలహీనుడ్ని చేశారు. మరో వృద్ధ నేత శరద్ పవార్ పరిస్థితి కూడా ఇదే. ఆయన ప్రారంభించిన ఎన్సీపీ కూడా చీలిపోయింది. పార్టీ గుర్తును కూడా శరద్ పవార్ కోల్పోయారు. గడచిన దశాబ్దకాలంగా దేశంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే, భారతీయ జనతా పార్టీతో తీవ్రంగా విభేదించినవారే కాదు— అతిగా అంటకాగినవారు కూడా బతికి బట్ట కట్టలేని పరిస్థితి. ఒడిసా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వంటి వారు జాతీయ రాజకీయాల జోలికి పోకుండా ఉన్నందునే కడుపులో నీళ్లు కదలకుండా అధికారంలో కొనసాగగలుగుతున్నారు. మమతా బెనర్జీ వంటి వారు రాజీ పడిపోవడం వల్లనే కేసుల బెడద లేకుండా మనగలుగుతున్నారు. ఇండియా కూటమిలో మిగిలిన బలమైన నాయకుడు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఒక్కరే.



> 2014 తర్వాత కాంగ్రెస్ పార్టీ బలహీనపడటంతో ప్రాంతీయ పార్టీల నాయకుల్లో రాజకీయ దురాశ పెరిగిపోయింది. అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు మమతా బెనర్జీ, నితీశ్ కుమార్, శరద్ పవార్, కేసీఆర్ వంటి వారు ప్రధానమంత్రి పదవిపై కన్నేశారు. తాము సారథ్యం వహిస్తున్న ప్రాంతీయ పార్టీలను పొరుగు రాష్ట్రాలకు విస్తరించారు. ఫలితంగా ఎన్డీయే వ్యతిరేక ఓటు చీలి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంతింతై వటుడింతై అన్నట్టుగా బలపడుతూ వచ్చారు. ప్రాంతీయ పార్టీలు ఈ దేశానికే అరిష్టం అని చెబుతూ వస్తున్న ప్రధాని మోదీ ముందుగా ప్రాంతీయ పార్టీల అధినేతల బలహీనతలపై దృష్టి కేంద్రీకరించారు. ఐటీ, సీబీఐ, ఈడీ వంటి సంస్థలకు చెందిన అధికారులను కిరాయి సైనికులుగా మార్చుకొని ప్రాంతీయ పార్టీల పైకి ఉసిగొల్పారు. ఫలితంగా అనేక మంది నాయకులు కేసుల్లో ఇరుక్కున్నారు. ప్రధాని మోదీని ఎదిరించడం అసాధ్యమని గుర్తించిన నాయకులు తమ సొంత రాష్ట్రాలకే పరిమితమై సామంత రాజులుగా మారిపోయి అధికారంలో కొనసాగగలుగుతున్నారు.

ఆ రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల వల్లే ఆయన కూడా బీజేపీని వ్యతిరేకిస్తున్నారు. ఫలితంగా తమిళనాడు మంత్రులపై కేసులు నమోదవుతున్నాయి. ఈ ఎన్నికల తర్వాత కూడా స్టాలిన్ ఇదే విధంగా ప్రధాని మోదీని వ్యతిరేకించి నిలబడతారని చెప్పలేం. ఒకప్పుడు తమిళనాట ఎంజీ రామచంద్రన్, కరుణానిధి కేంద్ర ప్రభుత్వాలను ధిక్కరించి అధికారం కోల్పోయారు. అప్పుడు ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ శక్తిని తట్టుకోలేక చివరకు రాజీ పడిపోయారు. అప్పటి నుంచి ద్రవిడ పార్టీలు కేంద్రంతో సఖ్యతగా మెలుగుతున్నాయి.

కేసీఆర్‌కు కష్టకాలం

మద్యం కేసులో కవిత అరెస్టయిన తర్వాత కేంద్ర పెద్దలతో సంధి కుదుర్చుకోవడానికి కేసీఆర్ అండ్ కో ఎన్ని ప్రయత్నాలు చేసినా కేంద్ర పెద్దలు సందు ఇవ్వలేదు. తెలంగాణలో ప్రస్తుతం బీజేపీ గాలి వీస్తోందని ప్రధాని మోదీ నమ్ముతున్నారు. ఈ కారణంగానే భారత రాష్ట్ర సమితి నుంచి వస్తున్న పొత్తు ప్రతిపాదనలను కూడా తిరస్కరిస్తున్నారు. ప్రాంతీయ పార్టీల సంహారం అనే రాజసూయ యాగం నుంచి ప్రస్తుతానికి తప్పించుకున్న పార్టీల పరిస్థితి తాజాగా జరగనున్న లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎలా ఉంటుందో చెప్పలేం. ప్రధాని మోదీ అనే రాజకీయ పెనుభూతం నుంచి ఎవరికైనా తాత్కాలిక రక్షణ మాత్రమే లభిస్తుంది. పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయన్న నమ్మకం కుదిరాక మిగిలిన పార్టీలను కూడా మింగేస్తారు. యావత్ భారతావని కాషాయ దళం ఏలుబడిలోకి వచ్చేవరకు ప్రధానమంత్రి విశ్రమించక పోవచ్చు. సుదీర్ఘ కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఏ స్థితిలో ఉందో చూస్తున్నాం. ఆ పార్టీ ఖాతాలలో ఉన్న నిధులను ఆదాయం పన్ను శాఖ స్తంభింపజేసింది. నిబంధనల ప్రకారం పదేళ్ల క్రితం వ్యవహారాల్లో తదుపరి చర్యలు తీసుకోవడానికి ఐటీ శాఖకు అధికారం ఉండదు. అయినప్పటికీ పదిహేను సంవత్సరాల క్రితం కేసును తిరగదోడి కాంగ్రెస్ పార్టీ ఖాతాలను స్తంభింపజేశారు. ఈ వివరాల్లోకి వెళ్లడానికి తీరిక లేని న్యాయస్థానాలు కూడా కాంగ్రెస్ పార్టీకి ఉపశమనం ఇవ్వడం లేదు. 2024 తర్వాత దేశంలో పరిస్థితులు ఎలా ఉండబోతున్నాయో తెలిసిపోతోంది. స్వతంత్రంగా పనిచేసే వ్యవస్థల కోసం వెతుక్కోవాల్సిందే! ప్రధానమంత్రి మోదీ ప్రస్తుతానికి మహా శక్తిమంతుడు కావొచ్చు. కానీ ఆయనకంటే ప్రకృతి మరింత శక్తిమంతమైనది. సమతుల్యం కోసం ప్రకృతి కల్పించుకుంటుంది. భారతీయ జనతా పార్టీ ఇప్పుడు తిరుగులేని శక్తిగా కనిపించవచ్చు. అయితే ఆ పార్టీ పునాదులు బలహీనపడుతున్నాయి. అది కూడా ప్రధాని మోదీ చర్యల వల్లే. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీని కను సైగలతో శాసించిన ఇందిరాగాంధీ... రాష్ట్రాలలో బలమైన నాయకులను అణచివేశారు. తోలు బొమ్మలను తెరపైకి తీసుకొచ్చి ముఖ్యమంత్రులను చేశారు. ఆమెను ఎదిరించగల నాయకుడే కనిపించలేదు. రాజీవ్‌గాంధీ కూడా ఇదే విధానాన్ని అనుసరించారు. యూపీఏ హయాంలో కూడా ఇలాగే జరిగింది. ఫలితంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన బలమైన నాయకులు పార్టీని వదిలిపెట్టి సొంత పార్టీలు పెట్టుకున్నారు. మమతా బెనర్జీ, పీఏ సంగ్మా, శరద్ పవార్ వంటి వారు ఈ జాబితాలో ఉన్నారు. బలమైన నాయకులను దూరం చేసుకోవడం వల్లనే కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుత దుస్థితి దాపురించింది. నాటి ఇందిరా గాంధీ బాటలోనే ప్రస్తుత ప్రధాని మోదీ కూడా నడుస్తున్నారు. బలమైన నాయకులను పక్కన పెట్టి అసమర్థులను, బలహీనులను ముఖ్యమంత్రులను చేస్తున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో ఇదే జరిగింది. ప్రతిపక్షాలే వణికిపోతున్న మోదీ అనే పెనుభూతాన్ని బీజేపీ నాయకులు మాత్రం ఎలా ఎదిరించగలరు? ఇందిరాగాంధీ లేకపోతే కాంగ్రెస్ లేదు అనే భావన ఒకప్పుడు ఉండేది. ఇప్పుడు అదే విధంగా నరేంద్ర మోదీ లేకపోతే భారతీయ జనతా పార్టీ పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వ్యక్తి ఆరాధన పెరిగిన ఏ పార్టీలోనైనా ఇదే పరిస్థితి ఉంటుంది. 'అబ్ కీ బార్ మోదీ సర్కార్' అని నినదిస్తున్నారేగానీ బీజేపీ సర్కార్ అని అనడంలేదు. మోదీ రూపంలో ప్రస్తుతం బీజేపీకి లభిస్తున్న బలమే దీర్ఘకాలంలో ఆ పార్టీకి బలహీనత అవుతుంది. రాష్ట్రాలలో బలహీనమైన నాయకులను అందలం ఎక్కించడం వల్ల కాంగ్రెస్‌కు పట్టిన దుర్గతే భవిష్యత్తులో బీజేపీకి కూడా పట్టవచ్చు.

> మన దేశంలో రాజకీయ పార్టీలన్నీ ప్రైవేట్ కంపెనీలు ఇచ్చే ముడుపులపై ఆధారపడి బతుకుతున్నాయి. భారతీయ జనతా పార్టీ మాత్రం అవినీతికి మినహాయింపు అని చెప్పుకోవడం అతిశయోక్తి అవుతుంది. పార్టీయే ప్రధాని – ప్రధానే పార్టీ అయిన చోట అవినీతి మరకల నుంచి నరేంద్ర మోదీకి మినహాయింపు ఉండబోదు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాత్రమే తప్పు చేశారని చెప్పడం ఆత్మవంచనే అవుతుంది.


చట్టబద్ధంగా 'కమీషన్లు'

తల ఎగరేస్తున్న ప్రతిపక్ష నాయకులు నరేంద్ర మోదీ అధికార బలానికి సమిధలు కావడానికి కారణం రాజకీయాలలో డబ్బు ప్రభావం పెరిగిపోవడమే. కంపెనీలు, వ్యక్తులకు మేళ్లు చేసి ప్రతిఫలం పొందడంలో ఏ రాజకీయ పార్టీ కూడా మినహాయింపు కాదు. రాజకీయ పార్టీలకు అందుతున్న ముడుపులు ఒక్కో దశలో ఒక్కో రూపంలో ఉంటున్నాయి. అధికారంలో ఉన్న వారితో సఖ్యతగా ఉండటం కోసం ఒకప్పుడు విరాళాలు ఇచ్చేవారు. ఆ తర్వాత కాలంలో ప్రభుత్వం నుంచి మేళ్లు పొందేందుకు పర్సెంటేజ్‌లు ఇవ్వడం మొదలైంది. కాంట్రాక్టులు దక్కాలంటే 8 నుంచి 15 శాతం వరకు కమీషన్ తీసుకోవడం ఇప్పుడు సర్వసాధారణం అయింది. ఎలక్టోరల్ బాండ్స్ అని ఇప్పుడు కొత్తగా వచ్చాయి. సుప్రీంకోర్టు పుణ్యమా అని ఏయే పార్టీకి ఏయే కంపెనీలు బాండ్లు కొని ఇచ్చాయో తెలిసిపోయింది. ఈ బాండ్ల వ్యవహారమంతా చట్టబద్ధంగా సాగించిన కమీషన్ల బాగోతమే. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన కంపెనీలే బాండ్లు కొని సమర్పించుకున్నాయి. విచిత్రం ఏమిటంటే అదానీ గ్రూప్ మాత్రం బాండ్లు కొన్నట్టు ఎక్కడా వివరాలు లేవు. నిజంగా ఇది ఎనిమిదో వింతే. గత పదేళ్లలో అదానీ ఎంతలా విస్తరించారో మనం చూశాం. ఎయిర్ పోర్టులు, పోర్టులు అదానీ గుత్తాధిపత్యంలోకి వచ్చాయి. ఇతర సంస్థలు నెలకొల్పిన పోర్టులు, ఎయిర్ పోర్టులు చేతులు మారడానికి ముందు ఏం జరిగిందో అందరికీ తెలుసు. ఐటీ, సీబీఐ, ఈడీ వంటి సంస్థలు ఎటువంటి పాత్ర పోషించాయో చూశాం. అయినా ఎలక్టోరల్ బాండ్లు కొనే అవసరం అదానీకి ఏర్పడకపోవడం ఆశ్చర్యంగా ఉంది. మిగతా కంపెనీలకు భిన్నంగా అదానీ గ్రూపు ఎలా తప్పించుకున్నదో మిస్టరీయే. తెర వెనుక ఏం జరిగిందో తెలియాల్సి ఉంది. ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారాన్ని తరచి చూస్తే వీటి వెనుక క్విడ్ ప్రో కో ఉన్నట్టు అర్థమవుతుంది. ప్రభుత్వాల నుంచి మేళ్లు పొందిన కంపెనీలు అన్నీ దాదాపుగా బాండ్లు కొన్నాయి. ప్రతిపక్షాల నోళ్లు మూయించేందుకు వాటికి కూడా కొన్ని బాండ్లు కొనిచ్చాయి. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక ఈ బాండ్లు ప్రవేశపెట్టారు. ఎన్నికల కమిషన్‌కు అందిన వివరాల ప్రకారం మొత్తం బాండ్ల విలువలో 50 శాతం వరకు భారతీయ జనతా పార్టీ ఖాతాలోనే జమయ్యాయి. అటు కేంద్రంలో, ఇటు అనేక రాష్ట్రాలలో అధికారంలో ఉన్నందువల్లే ఎలక్టోరల్ బాండ్లలో బీజేపీకి సింహభాగం దక్కాయి. పార్టీల మీద అభిమానంతో మాత్రమే ఆయా కంపెనీలు ఈ బాండ్లు కొని సమర్పించుకున్నాయని చెప్పడం బూతు అవుతుంది. ఈ బాండ్ల బాగోతాన్ని లోతుగా విశ్లేషిస్తే అసలు బాగోతం బయటపడుతుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒక సందర్భంలో వ్యాఖ్యానిస్తూ, ఈ బాండ్ల వివరాలు బయటకొస్తే ప్రతిపక్షాల బండారం కూడా బయటపడుతుంది అన్నారు. 'మీలో పాపం చేయని వారు ఎవరో చెప్పండి?' అని ఏదో సినిమాలో పాటలో ప్రశ్నించినట్టుగా మన దేశంలో రాజకీయ పార్టీలన్నీ ప్రైవేట్ కంపెనీలు ఇచ్చే ముడుపులపై ఆధారపడి బతుకుతున్నాయి. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ మాత్రం అవినీతికి మినహాయింపు అని చెప్పుకోవడం అతిశయోక్తి అవుతుంది. ఆ పార్టీ కూడా ప్రైవేటు సంస్థలకు మేళ్లు చేసి ఉండాలి. లేదా సదరు కంపెనీలు అంతకు ముందు చేసిన పాపాలకు శిక్ష పడకూడదనుకుంటే బాండ్లు కొనైనా ఇచ్చి ఉండాలి. దర్యాప్తు ఏజెన్సీలను చూపెట్టి బాండ్లు వసూలు చేసుకోవడం కూడా అవినీతికి మరో రూపమే. తళతళ మెరిసే నరేంద్ర మోదీ దుస్తుల్ని చూపించి, అవినీతి మరక లేని ప్రధాని అని గొప్పలు చెప్పుకొంటే సరిపోదు. పార్టీయే ప్రధాని — ప్రధానే పార్టీ అయిన చోట ఆ మరకల నుంచి మోదీకి మినహాయింపు ఉండబోదు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాత్రమే తప్పు చేశారని చెప్పడం ఆత్మవంచనే అవుతుంది. బాండ్ల వివరాలు బయటకు వచ్చాక అందరూ అందరే అని స్పష్టం అవుతోంది. అయితే కేంద్రానికి కొరకరాని కొయ్యగా మారిన వారే కేసుల్లో ఇరుక్కుంటున్నారు. లిక్కర్ వ్యాపారుల నుంచి ముడుపులు తీసుకోని ముఖ్యమంత్రులు ఉన్నారని చెప్పగలరా? ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక, మద్యం వ్యాపారాల్లో ఏం జరుగుతోందో కేంద్రానికి తెలియదా? కాకపోతే జగన్‌రెడ్డి తమకు విధేయుడిగా ఉన్నారు కనుక ఏజెన్సీల దాడుల నుంచి మినహాయింపు లభిస్తోంది. కేజ్రీవాల్ కూడా ఇండియా కూటమిలో చేరకుండా ఎన్డీయేతో జట్టు కట్టి ఉంటే ఇప్పుడు జైలుకు వెళ్లాల్సి వచ్చేది కాదు. ఈ పరిస్థితులలో ఈ దేశ రాజకీయాల్లో మనగలగాలంటే ప్రధాని మోదీ ఆధిపత్యానికి తలొగ్గి పరిమిత స్థాయిలో రాజకీయం చేసుకోవాలి. అలా కాకుండా అన్ని రాష్ట్రాలకూ విస్తరించాలనుకుంటే కేజ్రీవాల్‌కు పట్టిన గతే పడుతుంది. ధిక్కరించిన వారిని మోదీ అనే పెనుభూతం

> మోదీని ధిక్కరిస్తే ఏం జరుగుతుందో గ్రహించడం వల్లనే చంద్రబాబు తనను తాను తగ్గించుకొని ఎన్డీయేతో జట్టు కట్టారు. కేంద్రం శక్తి ఏమిటో ప్రతిపక్షంలో ఉన్నప్పుడే తెలుసుకున్న జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రధాని మోదీ పట్ల వినయ విధేయతలు ప్రదర్శిస్తూనే ఉన్నారు. బెయిలు కోసం అప్పుడు అధికారంలో ఉన్న సోనియా గాంధీ వద్దకు కుటుంబ సభ్యులను పంపి కాళ్ల బేరానికి దిగిన చరిత్ర జగన్‌ది. దాని ఫలితమే అవినీతి కేసులలో జగన్‌పై విచారణ కూడా జరగని పరిస్థితి. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడైన అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయలేని పరిస్థితిలో సీబీఐ ఉందంటే, పైవాడి ఆశీస్సులు లేకుండా సాధ్యమా? ఈ నేపథ్యంలో ప్రధాని వద్ద చంద్రబాబు సాగిలపడ్డారని నిందించి ప్రయోజనం ఏమిటి? ధిక్కరిస్తే ఏం జరుగుతుందో తెలుసు కనుకే చంద్రబాబు రాజీపడిపోయారు.

పరిష్కారం సాధ్యం కాని వేల ఏళ్ల పగ!

> ఇజ్రాయెల్–పాలస్తీనా ఘర్షణలోని ప్రమాదకరమైన లక్షణం ఏమిటంటే దీనికి న్యాయమైన పరిష్కారం లేదు. యావత్ప్రపంచాన్ని చుట్టబెట్టి వినాశనంలోకి లాగగల శక్తి మాత్రం ఈ వివాదానికి ఉంది. పాలస్తీనా ముస్లింలు, ఇజ్రాయెలీ యూదులు కూడా ఈ భూభాగం తమదని చెప్పుకోదగిన చరిత్రను కలిగివున్నారు. ఇరుపక్షాలు పరస్పర స్నేహంతో కలిసి అక్కడే ఉండడం ఒక పరిష్కారం. కాని పాము, ముంగిస కలిసి ఉండడం ఎంత సాధ్యమో ఇదీ అంతే!



ఒక స్త్రీకి వివాహమైంది. భర్త యుద్ధంలోకి వెళ్లాడు. తిరిగి రాలేదు. చనిపోయాడని అధికారులు చెప్పారు. కొన్నేళ్లకు ఆమె ఇంకొకరిని పెళ్లి చేసుకుంది. ఈ భర్తతో కలిసి బతుకుతుండగా మొదటి భర్త తిరిగి వచ్చాడు. ఇప్పుడామె ఎవరితో ఉండాలి? ఇది ఒక సినిమా కథ అవునా? ఇటువంటిదే పాలస్తీనా సమస్య, లేక నేటి గాజా—ఇజ్రాయెల్ ఘర్షణ సమస్య.

క్రీస్తు జీవితకాలం నాటికి నేటి పాలస్తీనా, జోర్డాన్‌లు కలిసిన ప్రాంతమంతా యూదుల నివాస భూమి. క్రీ.శ. మొదటి శతాబ్దం చివరలో ఆ ప్రాంతమంతటినీ రోమన్ ప్రభుత్వం ధ్వంసం చేసి యూదు జనాభాను అక్కడి నుంచి వెళ్లగొట్టింది. యూదులు ప్రపంచంలో అన్ని దేశాలకు చెదిరిపోయారు, రెండువేల సంవత్సరాలు ప్రవాసులుగానే బతికారు. కాని తమ మాతృభూమిపై మమకారాన్ని, ఏనాటికైనా మళ్లీ అక్కడకు చేరుకుని కలిసి బతకాలనే కోరికను మాత్రం నిలబెట్టుకొనే ఉన్నారు. ఈ మధ్యకాలంలో అరేబియాలో మహమ్మదీయ మతం పుట్టడం, ముస్లింలైన అరబ్బులు ఆ పాలస్తీనా ప్రాంతంలో నివాసం ఏర్పరచుకొని కొన్ని శతాబ్దాలు నివసించారు.

యూరప్ దేశాలన్నిటిలోనూ యూదులు తీవ్ర వివక్షకు, సామూహిక వధలకు గురయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జర్మనీ నియంత హిట్లరు ఏకంగా అరవై లక్షల మంది యూదులను మట్టుబెట్టాడు. ఈ హోలోకాస్ట్‌తో ప్రపంచ వ్యాప్తంగా యూదుల పట్ల సానుభూతి పెల్లుబికింది. అప్పటికి మూడు దశాబ్దాల క్రితమే బాల్ఫరు ప్రకటనలో ఇంగ్లండు తన పెత్తనంలో ఉన్న పాలస్తీనాకు ప్రపంచం అంతటి నుంచి యూదులు వచ్చి స్థిరపడనిస్తానని ప్రకటించింది. అన్ని దేశాల నుంచి యూదులు పాలస్తీనాకు వచ్చి స్థిరపడడమూ ఆరంభమైంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఈ వలసలు ఉధృతమయ్యాయి. దీనితో స్థానిక ముస్లిం అరబ్బుల నుంచి వ్యతిరేకత ఎదురైంది, ముస్లింలు మూకదాడులు జరిపి యూదులపై సామూహిక వధలకు పాల్పడ్డారు. మొదట్లో బలైపోయినా తరువాత యూదులు ఎదురుదెబ్బ తీయగలిగారు. ఐక్యరాజ్యసమితి పాలస్తీనాను రెండుగా విభజించి ఒకటి యూదుల రాజ్యంగా, మరొకటి ముస్లింల రాజ్యంగా ఏర్పరచాలని తీర్మానించింది. ఈ లోపల యూదులు ఇజ్రాయెల్‌ను తమ స్వతంత్ర దేశంగా ప్రకటించుకొన్నారు. తమపైకి దాడి చేసిన అరబ్బు దేశాలను ఓడించి పాలస్తీనా ముస్లింలను ఇజ్రాయెల్ నుంచి తరిమివేశారు. 1967లో అరబ్బు దేశాలు, ఈజిప్టు మళ్లీ దాడి చేయగా వాటిని ఓడించి గాజా, వెస్ట్‌బాంక్ ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. తరువాత కొంతకాలానికి వెస్ట్‌బ్యాంక్‌లోను, గాజాలోను అక్కడి ముస్లింలను స్వపరిపాలన చేసుకోనిచ్చారు.

తరిమికొట్టబడ్డ పాలస్తీనా ముస్లింలు అరబ్బు దేశాలలో శరణార్థులుగా బతుకుతున్నారు. వారికి తమ భూభాగంలోకి, అంటే ఇప్పటి ఇజ్రాయెల్‌లోకి మళ్లీ వచ్చి నివసించాలని కోరిక. అది యూదులకు సమ్మతం కాదు. పాలస్తీనా ముస్లింల పట్ల అరబ్బు దేశాలకు సానుభూతి ఉంది. ఇజ్రాయెల్‌కు యూరప్ దేశాలు, అంతకుమించి అమెరికా అండదండలు ఉన్నాయి. అమెరికా దన్నుతోటే ఇజ్రాయెల్ తన చుట్టూ గల అరబ్బు దేశాలను లెక్కచేయకుండా మనగలుగుతోంది.


పన్నెండు శతాబ్దాలకు పైగా అక్కడ నివసించారు కనుక ఆ భూభాగంపై పాలస్తీనా ముస్లింలకూ అధికారం ఉంది. అదే భూభాగంపై యూదులకూ అధికారం ఉంది—రోమన్లు తమను వెళ్లగొట్టక ముందు అదే వాళ్ల నివాసభూమి కనుక, వాళ్లు అక్కడకు తిరిగి వచ్చి నివసించడానికి అంతర్జాతీయ సమాజం అనుమతించింది కనుక. అది తమకు దేవుని చేత వాగ్దత్తమైన భూమి అనేది వాళ్లలో జీర్ణించుకుపోయిన మత విశ్వాసం. ఇద్దరు అప్పచెల్లెళ్లకు ఒకే శరీరం అని మనలో ఒక మోటు సామెత ఉంది. సరిగ్గా ఆ పరిస్థితే ఇప్పుడు ఇజ్రాయెల్/పాలస్తీనా అనబడే భూభాగానిది.

యూదుల మాతృభూమి సమస్య ఎప్పుడూ మానవజాతికి పెను సమస్యే. ఆ సమస్య ఈనాటిది కాదు. క్రీస్తు పూర్వం రెండువేల సంవత్సరాల నాటికి యూదులు ఈ పాలస్తీనా నివాసులే. (అప్పుడు ఈ ప్రాంతాన్ని కనాన్ అనేవారు.) కరువు కారణంగా వాళ్లు ఈ ఎడారి ప్రాంతం నుంచి ఈజిప్టుకు వలసవెళ్లి అక్కడ చాలా తరాలు ఉన్నారు. అక్కడ ఎదురైన వివక్ష, కష్టాల కారణంగా క్రీ.పూ. 14వ శతాబ్ది ప్రాంతంలో మోజెస్ నాయకత్వంలో మళ్లీ ఈజిప్టు నుంచి ఇక్కడకు వచ్చేశారు. ఆ సందర్భంలోనే మోజెస్ యూదు జనాభా అంతా తన మాట ప్రకారం నడుచుకునేలా చెయ్యడానికి వాళ్లకు జెహోవా అనే దేవుడిని పరిచయం చేసి... తనను ఆ దేవుడి ఆదేశాలను అందించేవాడిగా ప్రతిష్ఠించుకున్నాడు. అప్పటికి ఈ ప్రాంతంలో స్థిరపడి నివసిస్తున్న కనానైట్లను, అమోనైట్లను, హిత్తైట్లను, మోయబైట్లను, ఫిలిస్తీన్లను, ఇతర జాతులను యూదులు ఊచకోత కోసి, తమ రాజ్యాన్ని స్థాపించుకున్నారు. ఆ తరువాత కొన్ని శతాబ్దాలకు మళ్లీ అస్సీరియన్లు, బాబిలోనియన్లు ఆ రాజ్యాన్ని విధ్వంసం చేసి యూదు జనాభానంతటినీ బానిసలుగా తరలించుకుపోగా, క్రీ.పూ. 5వ శతాబ్ది ప్రాంతంలో పర్షియన్ చక్రవర్తి సైరస్ అనుగ్రహంతో మళ్లీ ఆ భూమిలోకే వచ్చి జెరూసలెంలో గుడి, కోట కట్టుకొని బతకడం మొదలుపెట్టారు. తరువాత మళ్లీ క్రీ.శ. మొదటి శతాబ్దంలో రోమన్ చక్రవర్తితో ఘర్షణ, మాతృభూమి నుంచి బహిష్కరణ, ఇరవయ్యవ శతాబ్దంలో మళ్లీ అక్కడకే వచ్చి ఇజ్రాయెల్ రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడం, దానిని వెన్నంటి ఈ పరిష్కారం లేని ఘర్షణలు, విధ్వంసం, రక్తపాతం.

ఈ ఘర్షణలోని ప్రమాదకరమైన లక్షణం ఏమిటంటే దీనికి న్యాయమైన పరిష్కారం లేదు. యావత్ప్రపంచాన్ని చుట్టబెట్టి వినాశనంలోకి లాగగల శక్తి మాత్రం ఈ వివాదానికి ఉంది. పాలస్తీనా ముస్లింలు, ఇజ్రాయెలీ యూదులు కూడా ఈ భూభాగం తమదని చెప్పుకోదగిన చరిత్రను కలిగివున్నారు. ఇరుపక్షాలు పరస్పర స్నేహంతో కలిసి అక్కడే ఉండడం ఒక పరిష్కారం. కాని పాము, ముంగిస కలిసి ఉండడం ఎంత సాధ్యమో ఇదీ అంతే సాధ్యం. అన్యదైవ ద్వేషం, అన్యమత ద్వేషం ఇరుపక్షాలకు మతసూత్రాల పరంగా సమానలక్షణాలు. ఈ లక్షణం మోజెస్ యూదులలో ప్రవేశపెట్టిన జెహోవా మత వ్యవస్థలోనే ఉంది. ఆ వ్యవస్థ నుంచే, ఆ లక్షణాలతోనే క్రైస్తవ, ఇస్లాం మతాలు కూడా పుట్టాయి. కనుక ఒకే దేశంలో ఆ రెండు సమూహాలు స్నేహంగా కలిసివుండడం జరగని పని.

రెండు రాజ్యాల ఏర్పాటు దీనికి హేతుబద్ధమైన పరిష్కారం. మొదట్లో ఐక్యరాజ్యసమితి దీనినే తీర్మానించింది. ప్రస్తుతం భారతదేశం, అమెరికా కూడా దీనినే బలపరుస్తున్నాయి. కాని ఆ ప్రాంతపు భౌగోళికత ఇందుకు అనుకూలంగా లేదు. అదీగాక అలా చేస్తే అతి తక్కువ జనాభా గల యూదులకు ఎక్కువ భూభాగం, అత్యధిక జనాభా గల ముస్లింలకు తక్కువ భూభాగం కేటాయించవలసి వస్తుంది ఇప్పటి వారి వారి వ్యాప్తి ప్రకారం. దీనివల్ల మాకు అన్యాయం జరిగిందని ముందు ముందు ముస్లింలు, యూదులూ ఆందోళన లేవదీయడం తథ్యం. ఇజ్రాయెల్‌ను వదిలిపెట్టి ఇంకెక్కడికైనా పొమ్మని యూదులకు చెప్పడం కుదిరే విషయం కాదు-. ఇజ్రాయెల్ ఉనికికి సమ్మతించడం పాలస్తీనా ముస్లింలకు సాధ్యం కాదు. ఈ వివాదాన్ని కాలం ఎలా పరిణమింపజేస్తుందో, యూదుల మాతృభూమి సమస్య మానవజాతిని ఎటు తీసుకుపోతుందో చూడవలసిందే.

■ వి.వి. సుబ్రహ్మణ్యం



మైలవరం రేంజర్ డిప్యుటేషన్ రద్దు

- ఉన్నతాధికారులకు చేరిన విజిలెన్స్ నివేదిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయవాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖ మైలవరం రేంజర్ కల్యాణి డిప్యుటేషన్‌ను ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఆమె సొంత స్థానమైన ఏలూరు జిల్లాలోని పోలవరం రేంజ్‌కు బదిలీ చేశారు. మూడు రోజుల క్రితం ఈ డిప్యుటేషన్‌ను రద్దు చేశారు. ఇంతకుముందు కల్యాణి మైలవరం రేంజర్‌గా పనిచేశారు. తర్వాత ఆమెను పోలవరం రేంజ్‌కు బదిలీ చేశారు. మైలవరంలో పనిచేస్తున్న అనురాధ అనే అధికారి సెలవులో ఉండడంతో తిరిగి కల్యాణిని డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారు. మైలవరం రేంజ్ పరిధిలోని చీమలపాడు, రెడ్డిగూడెం మండలంలోని రంగాపురం తదితర ప్రాంతాల్లో ఒక సర్వే నంబర్‌లో టేకు చెట్లు నరకడానికి అనుమతులు తీసుకుని వేరే సర్వే నంబర్లలో చెట్లను నరికారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై స్థానికులు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో 'టేకు చెట్టు... కొల్లగొట్టు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై విజిలెన్స్ అధికారులు స్పందించారు. రేంజ్ పరిధిలో అనేక ఉల్లంఘనలు జరిగినట్టు గుర్తించారు. ఉల్లంఘనలపై విజిలెన్స్ విభాగంలోని అటవీ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక అందిన సందర్భంలోనే కల్యాణి డిప్యుటేషన్‌ను రద్దు చేయడం గమనార్హం. రెగ్యులర్ రేంజర్ రాధా కుమారి సెలవులో ఉండడంతో ఇన్‌చార్జి బాధ్యతలను విజయవాడ సామాజిక అటవీ విభాగ రేంజర్ ఆర్వీ రామారావుకు అప్పగించారు.

వెనక్కు రండి!

జడ్పీ చైర్‌పర్సన్ దగ్గర పనిచేసే ఉద్యోగుల రీ కాల్

- ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం చర్యలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాలి హారికకు కేటాయించిన వ్యక్తిగత సహాయకులు, వ్యక్తిగత కార్యదర్శులు, క్యాంపు క్లర్కులు, ఇతర సిబ్బందిని ఇన్‌చార్జి జడ్పీ సీఈవో ఆనందరావు వెనక్కి తీసుకున్నారు. శనివారం ఈ మేరకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. జడ్పీ సీఈవో జ్యోతిబసు స్థానిక జిల్లా అధికారి అయి ఉండి కూడా కదలకపోవటంపై ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేయడంతో జడ్పీ సీఈవోపై జిల్లా యంత్రాంగం వేటు వేసింది. ఈ క్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు కేటాయించిన సిబ్బందిని కూడా వెనక్కు తీసుకోవాల్సిందిగా కృష్ణా కలెక్టర్ రాజబాబు ఆదేశించారు. జడ్పీ ఇన్‌చార్జి సీఈవో తక్షణం వారిని వెనక్కు రావాల్సిందిగా ఆదేశించారు. జడ్పీ చైర్‌పర్సన్ హారికకు వీరిని కేటాయించినప్పటికీ ఆమె భర్త, వైసీపీ పెడన నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాంప్రసాద్‌కు వీరంతా సేవలు చేస్తున్నారు. ఎన్నికల సంఘం జోక్యంతో.. జడ్పీ చైర్‌పర్సన్‌కు కేటాయించిన వ్యక్తిగత సిబ్బంది అందరినీ వెనక్కు తీసుకోకతప్పలేదు. జడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు క్లర్కు (సీసీ) ఏవో అయిన నూతలపాటి శ్రీనివాసరావు పనిచేసేది మొవ్వ ఎంపీపీ పరిధిలో అయినప్పటికీ.. సీసీగా చైర్‌పర్సన్ వద్ద ఉంటున్నారు. అసిస్టెంట్ సీసీగా జూనియర్ అసిస్టెంట్ అయిన శివక్రిష్ణను నియమించారు. ఈయన ఒరిజినల్ పని బాధ్యతలు చిన్నాపురం జడ్పీ హైస్కూల్‌లో. జడ్పీ చైర్‌పర్సన్ డ్రైవర్లుగా ఇద్దరు పనిచేస్తున్నారు. వీరిలో మొదటి డ్రైవర్ ప్రసాద్ జడ్పీ ఆఫీసులో పనిచేయాల్సి ఉంది. రెండవ డ్రైవర్ రమేష్. ఇతను విజయవాడలోని పీఐయూ డివిజన్ ఈఈ దగ్గర పనిచేయాల్సి ఉండగా.. చైర్‌పర్సన్ దగ్గర పనిచేయటానికి కేటాయించారు. జడ్పీ చైర్‌పర్సన్‌కు ఇద్దరు ఆఫీసు సబార్డినేట్లను ఇచ్చారు. వీరిద్దరిలో ఎం.కుసుమ హరీష్ అనే వ్యక్తి జడ్పీకి చెందినవారు. వీర శివాజీ అనే వ్యక్తి నందివాడ ఎంపీపీ ఆఫీసు ఒరిజినల్ వర్కింగ్ ప్లేస్. వీళ్లందరినీ తాజాగా జడ్పీ చైర్‌పర్సన్ నుంచి వెనక్కు తీసుకున్నారు.

ప్రాణాపాయస్థితిలోనూ

ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన డ్రైవర్

- బస్సు నడుపుతుండగా ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు
- ఆస్పత్రికి తరలించాక మృతి

- 6లో..



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) : 6-21 (ఆది)
సహర్ (ఉదయం) : 4-56 (సోమ)


వైసీపీ కుట్రలను ఎదుర్కోండి!

- సీట్లు త్యాగం చేసిన వారిని మర్చిపోను
- పార్టీ అభ్యర్థులకు టీడీపీ అధినేత దిశానిర్దేశం
- దేవినేని ఉమా పేరు ప్రస్తావించిన చంద్రబాబు
- ఎన్నికల వ్యూహం వర్క్‌షాపునకు హాజరైన ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల టీడీపీ అభ్యర్థులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : రెడ్డప్పగారి మాధవి ఓ సామాన్య తెలుగు మహిళ. గన్నవరం మీదుగా విజయవాడ వస్తుంటే దారిలో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సిద్ధం పోస్టర్లు కనిపిస్తే వాటిని ఫొటోలు తీసి సీ-విజిల్ యాప్‌లో పెట్టింది. దానికే అక్కడ ఉన్న గన్నవరం నియోజకవర్గ వైసీపీ రౌడీ మూకలు రెచ్చిపోయి ఆమెను అడ్డుకుంటే మహిళ అయి ఉండీ వారికి దీటుగా సమాధానం చెప్పింది. టీడీపీ అభ్యర్థులతోపాటు నాయకులందరిలోనూ అదే విధమైన స్ఫూర్తి కనిపించాలి. వైసీపీ రౌడీయిజాన్ని, కుట్రలను ధైర్యంగా ఎదుర్కోవాలి' అని టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. నగరంలోని ప్రైవేటు కన్వెన్షన్ హాలులో ఎన్నికల వ్యూహం పేరుతో కూటమి అభ్యర్థులతో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో ఆయన గన్నవరం ఉదంతాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటానికి సరిగ్గా 25 రోజుల సమయం ఉందని, ఈ సమయాన్ని ప్రతి అభ్యర్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఇంటి గడప తొక్కండి.. వైసీపీ అరాచకాలను, మోసాలను వివరించండి. మన పార్టీ వస్తే ఏం చేస్తామో చెప్పండి' అని చంద్రబాబు టీడీపీ అభ్యర్థులను కోరారు. బీజేపీ, జనసేనతో పొత్తు కారణంగా కొందరు సీనియర్లకు సీట్లు ఇవ్వలేకపోయామని, మరి కొందరు సీనియర్లకు సర్దు బాట్ల కారణంగా సీట్లు ఇవ్వలేకపోయామని అలాంటి వారి త్యాగాలను ఎన్నటికీ మర్చిపోనని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మైలవరం నుంచి దేవినేని ఉమా పేరును ఆయన ప్రస్తావించారు. సీట్లు దక్కని వారు సరిగా పనిచేయలేదన్నది కారణం కాదని, కొన్ని సర్దుబాట్లు వల్ల మాత్రమే వారికి టికెట్ ఇవ్వలేకపోయా మని స్పష్టం చేశారు. ఈ వర్క్‌షాపులో విజయవాడ పార్లమెంటు అభ్యర్థి కేశినేని చిన్నితోపాటు కొల్లు రవీంద్ర, కాగిత కృష్ణ ప్రసాద్, వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్ రాజా, బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్, బొండా ఉమ, వసంత కృష్ణ ప్రసాద్, సౌమ్య కొలికపూడి శ్రీనివాస్, శ్రీరాం తాతయ్య, నారాయణ, గన్నె ప్రసాద్, బొప్పన భవకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లా నేతలు



ఈ 25 రోజులు జనంలోనే ఉండండి

భజనచంద్రపై వేటుకు రంగం సిద్ధం

- చేస్తున్న ఉద్యోగానికి, పెడుతున్న పోస్టులకు సంబంధం లేదట
- ముందు పోరాడట.. ఆ తర్వాతే అధికారట
- వైసీపీకి అనుకూలంగా కొనసాగుతున్న పోస్టుల పరంపర



నిండా మునుగుతానని తెలిసి కూడా చిలుక పలుకులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీకి భజన చేస్తున్న డీపీవో జయచంద్ర గాంధీపై వేటుకు రంగం సిద్ధం అవుతోంది. ఎన్నికల కోడ్ వచ్చినా స్థానిక జిల్లాను వదలకుండా అధికార పార్టీకి కార్యకర్తగా కంటే కూడా ఎక్కువగా పనిచేస్తున్నారు. స్థానిక జిల్లాకు చెందిన అధికారులు ఇంకా కదలకుండా ఉండటంపై రాష్ట్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా దృష్టి సారించింది. ఎన్నికల సమయంలో సొంత జిల్లాలో పనిచేసే అధికారులను బదిలీ చేసే విషయంలో ఉపేక్షించవద్దని కూడా ఎన్నికల సంఘం కలెక్టర్లకు గట్టిగా చెబుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఇలాంటి అంశాలను చాలా సీరియస్‌గా తీసుకుంటోంది. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోమని రాష్ట్ర ఎన్నికల సంఘాలకు నిర్దేశిస్తోంది. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లా డీపీవో రాజకీయ పార్టీని భుజాన వేసుకుని భజన చేస్తున్న అంశం రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి కూడా వెళ్లింది. దీనిపై జిల్లా ఎన్నికల యంత్రాంగాన్ని వివరణ కోరే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా ఎన్నికల యంత్రాంగం కూడా ఈ అంశాన్ని సీరియస్‌గానే తీసుకుంది. ఈ అంశంపై దర్యాప్తు జరుపుతోంది. ఆయన గురించి లోతుగా పరిశీలించాల్సిన అవసరం లేకున్నప్పటికీ కోడ్ ఉల్లంఘనలను కూడా పరిశీలిస్తున్నారని తెలుస్తోంది.

వైసీపీ అనుకూల ప్రచారంపై డీపీవో సమర్థన

అధికార పార్టీకి భజన చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా డీపీవో జయచంద్ర గాంధీ వాట్సాప్ గ్రూపుల్లో వైసీపీ పట్ల తాను చేస్తున్న ప్రచారాన్ని సమర్థించుకుంటున్నారు. ఆయన చేస్తున్న ఉద్యోగానికి.. పెడుతున్న పోస్టులకు సంబంధం లేదట. ఒక పౌరుడిగా చట్టబద్ధంగా ఆయన ఏదైనా కామెంట్ చేయవచ్చట. ఆయన ముందు పౌరుడట. ఆ తర్వాతే అధికారి అట. ఆయనకు ఊరికే జీతం ఇవ్వటం లేదట. పనిచేస్తున్నందునే జీతం ఇస్తున్నారట. డీపీవో జయచంద్ర గాంధీ తనను ట్రోల్ చేస్తున్న వారికి విసురుతున్న సమాధానాలు ఇవి. ప్రభుత్వ అధికారిగా ప్రభుత్వానికి లాయల్‌గా ఉండాల్సిన పరిస్థితుల్లో డీపీవో గాంధీ తాను భజన చేస్తున్న రాజకీయ పార్టీ ప్రతిపక్షంలో ఉంటే పరిస్థితి ఏమిటో? ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ విధానాల పట్ల అంకితభావం చూపవచ్చేమో కానీ, రాజకీయ పార్టీల రంగులను పులుముకోవటం చాలా తప్పు. సీసీఏ రూల్స్‌కు కూడా విరుద్ధం. జిల్లా ఎన్నికల యంత్రాంగం ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది.



తన పోస్టింగ్‌లకు, ఉద్యోగానికి సంబంధం లేదంటూ తనపై ట్రోల్ చేస్తున్న వారికి రీ కౌంటర్ వేస్తున్న డీపీవో జయచంద్ర వ్యాఖ్యానాలు

- మిగతా 6లో

అన్నదాతకు అప్పులకుప్ప!

గతం ఇలా..

రైతులు పండించిన ధాన్యాన్ని కల్లంలోనే వ్యాపారి కొనుగోలు చేసేవాడు. మార్కెట్ రేటు ప్రకారం క్వింటాకు ఇంత అని రైతులతో ధర నిర్ణయించుకుని తరలించుకుపోయేవాడు. వారంలోపు రైతులకు నగదు ఇచ్చేవాడు. దీంతో తరువాత పంటకు రైతులు సిద్ధమయ్యేవారు.

వైసీపీ ప్రభుత్వంలో ఇలా..

రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్బీకేలో ఆన్‌లైన్ చేయించాలి. అక్కడ సిబ్బంది రైతు పేరు, ఎంత ధాన్యం? వాటిని ఏ మిల్లుకు పంపాలి? తదితర వివరాలు ఆన్‌లైన్ చేసి ట్రక్‌షీట్‌లో నమోదు చేసి సంబంధిత మిల్లుకు పంపుతున్నారు. మిల్లుకు పంపే రవాణా ఖర్చులు కూడా రైతే భరించాలి. మిల్లు వద్ద వాహనాలు వెయిటింగ్ చార్జీలు రైతుకు మోయలేని భారంగా ఉంది. ఆ తర్వాత రైతుల ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేస్తుంది. అవి ఎప్పుడు వస్తాయో తెలియదు. తరువాత పంటకు డబ్బులు ఎక్కడి నుంచి తేవాలో తెలియదు. జనవరి 14 తేదీన అమ్మిన ధాన్యానికి రెండు నెలలు గడిచినా ఆ బిల్లులకు నేటికీ దిక్కులేదు. అంతా అయోమయమే.




రెండు నెలలుగా రూ.325.02 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించని

జనవరి 19వ తేదీ నుంచి నిలిచిన చెల్లింపులు

- రేపు, మాపు అంటూ కాలయాపన
- పెట్టుబడులకు వడ్డీ చెల్లించలేక రైతు అగచాట్లు
- ఎన్నికలు అయ్యే వరకు రావేమోనని ఆందోళన
- నడిసముద్రంలో వదిలేసిన నావలా రైతుల

ఆలస్యమయ్యేకొద్దీ ధాన్యం బిల్లుతో సమానమవుతున్న వడ్డీ భారం

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం బిల్లులు రూ.325.02 కోట్లు రెండు నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. 21 రోజుల్లోనే బిల్లులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని సీఎం జగన్, వైసీపీ ప్రజాప్రతినిధులు ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చి ఉసూరుమనిపించారు. జనవరి 19వ తేదీ నుంచి ధాన్యం బిల్లులు ఆగిపోయాయి. దీంతో పంటల సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీ, చక్ర వడ్డీలు పెరిగిపోయి కట్టాల్సిన బాకీ కొండవీటి చాంతాడులా పెరిగిపోతోంది. ఎన్నికల కోడ్ రావడంతో ప్రభుత్వం రైతులను పూర్తిగా వదిలేసింది. వారికి చెల్లించాల్సిన బకాయిలను తొక్కిపెట్టింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు రైతుల బిల్లులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. తరువాత కొత్త ప్రభుత్వం వచ్చాక పాలనను గాడిలోకి తెచ్చుకోవడానికి కనీసం నెల రోజులైనా పడుతుంది. అంటే పంట సాగుకు తెచ్చిన అప్పులకు ఐదు నెలలపాటు రైతులు వడ్డీ కట్టాల్సిందేనన్నమాట. ధాన్యం బిల్లులు రైతుల ఖాతాలో పడేలా జేసీ గీతాంజలి శర్మ చొరవ తీసుకుని చర్యలు చేపడితేనే రైతుల అప్పుల బాధ కొంతైనా తగ్గుతుంది.



బంగారం తాకట్టు పెట్టి రెండో పంటకు పెట్టుబడి తెచ్చి..




పెడన మండలం చెన్నూరుకు చెందిన కోడూరు బుచ్చిబాబు 4.50 ఎకరాలను కౌలుకు తీసుకుని వరిసాగు చేశాడు. 230 బస్తాలను చెన్నూరు ఆర్బీకే ద్వారా రెండు నెలల క్రితం విక్రయించాడు. రూ.2 లక్షలు బిల్లులు రావాలి. సకాలంలో ధాన్యం బిల్లులు రాకపోవడంతో ఇంటిలోని బంగారం తాకట్టుపెట్టి రెండో పంటగా వినుము సాగుచేశాడు. వరి సాగులో కౌలు చెల్లింపు, పెట్టిన పెట్టుబడి వచ్చినా, రెండో పంటగా సాగుచేసిన మినుములో ఎంతోకొంత మిగులుతుందనే ఆశిస్తే వరిసాగులో పెట్టుబడికి రెండు నెలలపాటు అదనంగా

రూ.70 వేలు అప్పు మిగిలింది...



ఈయన మోపిదేవి మండలం, చిరువోలు గ్రామానికి చెందిన గోరిపర్తి సత్యనారాయణ. రెండెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. ఐదు టన్నుల ధాన్యం రావివారిపాలెంలోని ఆర్బీకే ద్వారా నాగాయలంకలోని రైస్‌మిల్లుకు ఆన్‌లైన్‌లో పంపారు. ధాన్యం బిల్లు రూ.1,11,015 రెండు నెలలుగా పెండింగులోనే ఉన్నాయి. వరి తరువాత రెండో పంటగా మినుము సాగు చేశాడు. ఈ రెండిటికీ చేసిన అప్పుల కారణంగా రెండు నుంచి మూడు రూపాయల వడ్డీగా చెల్లించాల్సి వచ్చింది. వ్యవసాయంలో ఖర్చులు పోను రూ.70వేలు అప్పు మిగిలింది.

జేసీ గారు కరుణ చూపండి..



ఈయన మోపిదేవి మండలం కప్తానుపాలేనికి చెందిన కేసాని సురేష్‌బాబు. రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశాడు. పెదప్రోలు ఆర్బీకే ద్వారా ఫిబ్రవరి 7వ తేదీన ధాన్యం విక్రయించాడు. ధాన్యం బిల్లులు రూ.1.08 లక్షలు రావాలి. 45 రోజులుగా బిల్లులు రాకపోవడంతో పంట సాగు కోసం తెచ్చిన అప్పునకు వడ్డీ కింద రూ.16,500 చెల్లించాల్సి వచ్చింది. ఈ వడ్డీ డబ్బుల కోసం మరో చోట అప్పు చేయాల్సి వచ్చింది. రెండో పంటగా సాగుచేసిన మినుము పంటకు రూ.60వేల వరకు అప్పుచేయాల్సి వచ్చింది. ధాన్యం బిల్లులు వచ్చేసరికి కట్టాల్సిన వడ్డీ కూడా బిల్లులతో సమానమయ్యేలా ఉంది. అప్పు అలాగే మిగిలిపోతుందేమోనని రైతు వాపోతున్నాడు. జేసీ స్పందించి మా

వైసీపీ సమావేశంలో ఆశావర్కర్

- ఎన్నికల కోడ్ ఉల్లంఘన



వైసీపీ సమావేశంలో పాల్గొన్న ఆశావర్కర్ పద్మ (సర్కిల్‌లో)

లబ్బీపేట, మార్చి 23 : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి జీతం పొందుతున్న ఉద్యోగులు పార్టీ సమావేశాలకు, ప్రచారాలకు దూరంగా ఉండాలని కచ్చితమైన ఆదేశాలు కొందరు వైసీపీ జపం చేస్తున్నారు. రాణిగారితోటలో పనిచేస్తున్న ఒక ఆశా వర్కర్ తాను ఒక ఉద్యోగినన్న సంగతి మరిచి వైసీపీ సమావేశంలో పాల్గొన్నారు. రాణిగారితోట 18వ డివిజన్‌లోని మాదాల వెంకటేశ్వరరావు వీధిలో వైసీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆశావర్కర్‌గా పనిచేస్తున్న పద్మ పాలొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ కోసం పని చేయాలని, అభ్యర్థిని గెలిపించుకోవాలని తీర్మానించారు. పార్టీ సమావేశంలో పాల్గొనకూడదని తెలిసినా ఆమె పాల్గొనటంపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.



విలక్షణం..విజయవాడ రూరల్

రెండు పార్లమెంట్, 2 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి మండలం

- జిల్లాల పునర్విభజనలో ఏర్పడిన చిక్కుముడి
- ఆ దిశగానే ఎన్నికల ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నవ ఎన్టీఆర్ జిల్లాలో అంతర్భాగంగా ఉన్న విజయవాడ రూరల్ మండలం వైవిధ్యమైన పాత్ర పోషించబోతోంది. ఎందుకంటే ఎన్టీఆర్ జిల్లాలో అంతర్భాగంగా ఉన్నప్పటికీ కృష్ణాజిల్లాతోనూ ఎన్నికల సంబంధాన్ని కలిగి విలక్షణ మండలంగా పేరుగాంచింది. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి, కృష్ణాజిల్లాలో మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. పార్లమెంట్ నియోజకవర్గాలే కాదు..ఈ మండలం రెండు జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉంది. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో మైలవరం నియోజకవర్గం, కృష్ణాజిల్లాలో గన్నవరం నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఇలాంటి విలక్షణమైన మండలం ఎన్టీఆర్ జిల్లాలో మొత్తంలో విజయవాడ రూరల్ మాత్రమే ఉంది. భౌగోళికంగా జిల్లాల పునర్విభజనలో చేసిన తప్పిదాలకు విజయవాడ రూరల్ మండలం జిల్లాల వారీగా చూస్తే రెండు ముక్కలు అయింది. ఒకే జిల్లాలో ఉన్నా .. రెండు వేర్వేరు జిల్లాల పరిధిలోకి గ్రామాలు వెళ్లిపోయాయి. విజయవాడ రూరల్ మండలానికి చెందిన 16 గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలో అంతర్భాగంగా ఉన్నాయి. ఈ 16 గ్రామాల్లో గొల్లపూడి, రాయనపాడు, షైదూరుపాడు, జక్కంపూడి, వైఎస్సార్ గ్రామ పంచాయతీ, రామరాజ్య నగర్, కొత్తూరు తాడేపల్లి మొత్తం 7 గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం, మైలవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వస్తున్నాయి. విజయవాడ రూరల్ మండలంలోని మరో 9 గ్రామాలు గూడవల్లి, నిడమానూరు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు, నున్న, పాతపాడు, పీ నైనవరం, అంబాపురం పంచాయతీలు గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంతో పాటుగా మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. మండలంలో కిందటి పంచాయతీ ఎన్నికలకు ముందే రామరాజ్యనగర్, వైఎస్సార్ గ్రామం పంచాయతీలు ఏర్పడినా వీటికి ఎన్నికలు జరగలేదు.

ప్రత్యేక నియోజకవర్గం చేయాలని డిమాండ్

విజయవాడ రూరల్ మండలంలో అత్యధికంగా లక్షన్నర మంది ఓటర్లు ఉన్నారు. కృష్ణా జిల్లాలో పెడన నియోజకవర్గంతో దాదాపుగా సమానంగా ఓటర్లు ఉన్నారు. అందుకే విజయవాడ రూరల్‌ను ఎప్పటి నుంచో ప్రత్యేక నియోజకవర్గం చేయాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో కాకినాడ రూరల్, రాజమండ్రి రూరల్, నెల్లూరు రూరల్ తరహాలో విజయవాడ రూరల్‌ను కూడా ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటించాలన్న డిమాండ్ స్థానికంగా రెండు దశాబ్దాలుగా డిమాండ్ వస్తోంది. విజయవాడ రూరల్ మండలం పరిధిలో ఎన్నికల ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగమే నిర్వహిస్తోంది.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి

- అధికారులకు కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశం

మచిలీపట్నం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజా బాబు ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్ ఆయన మాట్లా డారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ, ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకోసం నీటిని కాలు వలకు విడుదలచేస్తే, సముద్రతీర ప్రాంతంలోని తాగునీటి చెరువులను నింపుతా మని సీఎస్‌కు కలెక్టర్ తెలిపారు. తర్వాత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా లోని తాగునీటి పథకాలన్నీ సక్రమంగా పనిచేసేలా ముందుగానే చూసుకోవాల న్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం తాగునీటి చెరువులో అందుబాటులో ఉన్న నీటినిల్వల వివరాలను తనకు నివేదికరూపంలో అందజేయాలన్నారు. ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది 73లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలి పారు. అధికశాతం కుటుంబాలకు వందరోజులపాటు పని కల్పించాలని అధికారు లను ఆదేశించారు. డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టి.శివప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఆదర్శ నియోజకవర్గంగా గుడివాడను తీర్చుదిద్దుతా


పెదవిరివాడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు, పిన్నమనేని వెంకటేశ్వరరావు తదితరులు

- నన్ను ఎమ్మెల్యేగా గెలిపించండి.. ప్రజలతో వెనిగండ్ల రాము

నందివాడ, మార్చి 23: ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వండి..అందరికీ అందుబాటులో ఉంటా, ఆదర్శ నియోజకవర్గంగా గుడివాడను తీర్చిదిద్దుతానని టీడీపీ గుడివాడ అభ్యర్థి వెనిగండ్ల రాము ప్రజలను కోరారు. శనివారం రామాపురం, పెదవిరివాడ గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. ఇరవై ఏళ్లుగా ఎమ్మెల్యేగా పనిచేస్తున్న కొడాలి నాని డబ్బులు సంపాదించుకోవటం తప్ప నియోజకవర్గానికి చేసేందేమీ లేదని, కల్లబొల్లి మాటలతో జనాలను మోసగించారని, గెలిచిన తర్వాత ఈ ఐదేళ్లలో ఏ ఒక్క గ్రామానికీ వచ్చి గ్రామ సమస్యలు పరిష్కరించలేదని రావి వెంకటేశ్వరరావు విమర్శించారు. ఒక్కసారి రాముకు అవకాశమిస్తే గుడివాడ నియో జకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతారని తెలిపారు. సన్యాసిరావు, దాసు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాపాయస్థితిలోనూ
ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన డ్రైవర్

- బస్సు నడుపుతుండగా ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు
- పక్కన నిలుపుదల చేయడంతో ప్రయాణికులు సురక్షితం
- ఆస్పత్రికి తరలించాక డ్రైవర్ మృతి

వత్సవాయి, మార్చి 23: తాను ప్రాణాపాయ స్థితిలో ఉన్నా బస్సులో ఉన్న 35 మంది ప్రయాణిలను సురక్షి తంగా ఉంచి ఆర్టీసీ బస్సు డ్రైవర్ అశువులు బాసిన సం ఘటన జాతీయరహదారిపై భీమవరం వద్ద శనివారం మధ్యాహ్నం జరిగింది. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ ఆర్టీసీ బస్సు డ్రైవర్ భద్రయ్య(55) విజయవాడ నుంచి మిర్యాలగూడకు వెళుతూ భీమవరం వద్ద గుండెపోటు రావడంతో బస్సును పక్కకు తీసి నిలిపాడు. జీఎంఆర్ టోల్‌ప్లాజా సిబ్బంది ప్రథమ చికిత్స చేసి జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ ఆయన మృతి చెందాడు. డ్రైవర్ ముందుగా ముప్పును గమనించకుంటే ప్రయాణికులకు ముప్పువాటిల్లేది. డ్రైవర్ భద్రయ్యకు ప్రయాణికులు అశ్రునయనాలతో నివాళులర్పించారు.


గుండెపోటుతో మృతి చెందిన డ్రైవర్ భద్రయ్య

మీ ముగ్గురూ విధులకు రావొద్దు

- దుర్గగుడి కేశఖండనశాల క్షురకులకు ఈవో రామారావు ఆదేశం
- ద్వారకాతిరుమల కేశఖండనశాలలో వైసీపీ తరఫున ప్రచారం చేసినందుకు చర్యలు

వన్‌టౌన్, మార్చి 23: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి టీటీడీ సభ్యుడు యానాదయ్యతో కలిసి శుక్రవారం ద్వారకాతిరుమల కేశఖండనశాలలో వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారం చేసి కరపత్రాలను పంపిణీ చేసిన దుర్గగుడి కేశఖండనశాలలో పనిచేస్తున్న ముగ్గురు క్షురకులను విధులకు తాత్కాలికంగా రానీయకుండా దేవస్థాన ఈవో కేఎస్ రామారావు శనివారం నిలుపుదల చేశారు. ఆలయాల క్షురక సంఘాల జేఏసీ నాయకుడిగా చలామణీ అవుతున్న రామదాసు, క్షురకుడు ఆర్వీ రమణ, దుర్గగుడి ట్రస్ట్‌బోర్డులో ఎక్స్ అఫిషియో సభ్యురాలి భర్త, దుర్గగుడి కేశఖండనశాలలో పనిచేస్తున్న ఏజీఎల్ నారాయణలు ద్వారకాతిరుమ లలో వైసీపీ ప్రచారంలో పాల్గొనడంపై కేశఖండనశాల ఏఈవో జగదీష్, సూపరిం డెంటెంట్ డీవీపీ సత్యనారాయణను పూర్తి నివేదిక ఇవ్వాలని ఈవో ఆదేశించారు. దీంతో వారు ఆదివారం పూర్తి నివేదికను ఈవోకు ఇవ్వనున్నారు. దేవదాయ శాఖ కమిషనర్‌కు ఈవో సమాచారమిచ్చారు. ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుం టామని, ప్రస్తుతానికి విధులకు రానీయకుండా నిలుపుదల చేశామని ఈవో తెలి పారు. ఇటీవల రామదాసు అప్పన్నపల్లి దేవస్థానం కేశఖండనశాలలో పలువురు క్షురకుల వద్ద రూ.50వేల చొప్పున వసూ లు చేసి ప్రభుత్వం జారీ చేసిన 11జీవోను అమలు చేయిస్తానని మోసం చేసినట్లు పలువురు బాధితులు దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖలో ఫిర్యాదు చేశారు. దీనిపైనా కమిషనర్ రామదాసుతో పాటు మరికొందరిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.


రామదాసు, ఆర్వీ రమణ, ఏజీఎల్ నారాయణ

చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 23: సాధారణ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు విలువైన వస్తువుల అనధికార రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా కొనసాగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు స్పష్టం చేశారు. పోలీసు కమిషనర్ కాంతి రాణాతో కలిసి శనివారం ఆయన జిల్లాలో వివిధ చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద వాహనాల తనిఖీని పరిశీలించారు. ఇబ్రహీంపట్నం ఆటవీ చెక్‌పోస్టుతో పాటు తిరువూరు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేశారు. చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠ నిఘా నిర్వహణపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. తిరువూరు, మైలవరం పరిధిలోని డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల కోసం వివిధ ప్రాంతాలను సందర్శించారు. ఎన్టీఆర్ జిల్లా లో 21 చెక్‌పోస్టుల వద్ద కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అధిక మొత్తంలో నగదు, మద్యం, మత్తుపదార్థాలు, విలువైన వస్తువుల రవాణాపై నిఘా వుంటుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. పోలీస్, ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) సిబ్బందితో పాటు సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు చేస్తున్నామని, జిల్లాలో 42 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు సమర్థవంతంగా పని చేస్తున్నాయని ఆయన తెలిపారు.


తిరువూరులో కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ కాంతిరాణాకు పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుపుతున్న తిరువూరు ఆర్డీవో మాధవి

రూ.50 వేలకు మించి తీసుకెళ్లొద్దు

రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లకూడదని, తప్పనిసరైతే సరైన ఆధారాలు ఉండాలని లేకుంటే చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు. నగదు సీజర్స్‌ను పరిశీలనకు జిల్లాస్థాయి కమిటీ పని చేస్తుందని, రూ.10 లక్షలకు మించితే ఐటీకి సమాచారం ఇస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.కోటి వరకు నగదు, రెండున్నర కిలోల బంగారాన్ని సీజ్ చేశామని, రాష్ట్రంలోనే అత్యధిక సీజ్‌లు జిల్లాలో జరిగాయని తెలిపారు.

ఫిర్యాదులపై సత్వర విచారణ, పరిష్కారం

సీ విజిల్‌తో పాటు 1950 ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్(ఎన్‌జీఎస్‌పీ), జిల్లాస్థాయి కాల్‌సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులపై ప్రత్యేక బృందాలు సత్వరం స్పందించి, పరిష్కరిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వస్తున్న ప్రతికూల వార్తల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నట్లు వివరించారు. సీజర్స్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ, నివేది కల నిర్వహణ వ్యవస్థ(ఆర్ఎంఎస్) పకడ్బందీగా పనిచేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది రాజకీయ సభలు, ర్యాలీల్లో పాల్గొనకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు. తిరువూరు ఆర్డీవో కె.మాధవి, ఏసీపీ మురళీమోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ. 37 లక్షలు స్వాధీనం

పాయకాపురం: వాహన తనిఖీల్లో భాగంగా శనివారం పాయకాపురం ప్రాంతంలో కారులో తరలిస్తున్న రూ.37 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్టాటిక్ సర్వేలైన్స్ టీం-1 సారథ్యంలో శనివారం పైపులరోడ్డు ప్రాంతంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఎనికేపాడుకు వెళ్తున్న టీఎస్ 12 ఈవై 3456 నెంబరు గల కారును తనిఖీ చేశారు. కారులో రూ.37 లక్షల పోలీసులు గుర్తించారు. కారును, అందులోని నగదును స్వాధీనం చేసుకుని నున్న రూరల్ పోలీసులకు అప్పగించారు.

దేవినేని ఉమాపై కేసు


- జక్కంపూడి కాలనీలో అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారని ఎంసీసీ టీం ఫిర్యాదు

చిట్టినగర్, మార్చి 23: ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీ చేశారంటూ టీడీపీ ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావుతోపాటు పలువురు టీడీపీ నాయకులపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. శుక్రవారం సాయంత్రం జక్కంపూడి గ్రామం జక్కంపూడి కాలనీలో దేవినేని ఉమా మరో 300 మంది టీడీపీ నాయకులతో ఎన్నికల అధికారి నుంచి అనుమతులు తీసుకోకుండా ప్రచారం చేశారని, సాధారణ ప్రజానీకానికి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తూ కాలనీ అవుట్‌పోస్ట్ నుంచి ర్యాలీ చేశారని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ బృందం(ఎంసీసీ టీం) కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొత్తపేట పోలీసులు ఎంసీసీ బృందం నుంచి వీడియోలు, ఫొటోలు, వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

27న నారా భువనేశ్వరి
బిళ్లనపల్లి రాక

హనుమాన్‌జంక్షన్, మార్చి 23: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 27న బాపులపాడు మండలం బిళ్లనపల్లి గ్రామానికి వస్తున్నారని పార్టీ మండల అధ్య క్షుడు దయాల రాజేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు మనస్థాపంతో మృతిచెందిన పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎదురువాడ కిరణ్, నాయకుడు ఎదురువాడ బసవరావు కుటుంబాలను భువనేశ్వరి పరామర్శిస్తారని ఆయన పేర్కొన్నారు. భువనేశ్వరికి ఘనస్వాగతం పలకడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని దయాల రాజేశ్వరరావు పిలుపునిచ్చారు.





అంబేడ్కర్ విగ్రహం కింద విగ్రహావిష్కర్త వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేరు(ఇన్‌సెట్‌లో), లాబీలో జగన్ చిత్రపటం

అంబేడ్కర్ స్మృతివనంలో కోడ్ ఉల్లంఘన

ముఖ్యమంత్రి భారీ చిత్రపటాన్ని తొలగించని అధికారులు ● విగ్రహావిష్కర్త పేరును మూసివేయని వైనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అంబేడ్కర్ స్మృతి వనంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్(ఎంసీసీ) బృందాలు పట్టించుకోవటం లేదు. అంబేడ్కర్ స్మృతివనంలో విగ్రహావిష్కర్త వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనే పేరును ఇంకా మూసివేయలేదు. విగ్రహం దిగువన లాబీలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేరుతో ఉంచిన భారీ చిత్రపటాన్ని కూడా తొలగించలేదు. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన చోట్ల 24 గంటల్లో ముఖ్యమంత్రి ఫొటోలను తొలగించాలి. కానీ అంబేడ్కర్ స్మృతివనంలో ఇంకా సీఎం చిత్రపటాన్ని తొలగించలేదు. ఎన్నికల కోడ్ నిబంధనలను స్మృతివనానికి సవరించారేమోనన్న అనుమానాలు కలుగుతున్నాయి. కోడ్ అమల్లోకి వచ్చి వారమవుతున్నా ఇంకా సీఎం చిత్రపటాన్ని తొలగించకపోవడం గమనార్హం.

గంజాయి, డ్రగ్స్‌కు కేరాఫ్‌గా రాష్ట్రం

- ఆ ఘనత జగన్‌దే: నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట, మార్చి 23: గంజాయి, మాదక ద్రవ్యాలకు చిరునామాగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌రెడ్డిదేనని, తనిఖీలకు వెళ్లకుండా సీబీఐను అడ్డుకున్న ఖ్యాతి ఏపీ అధికారులు, పోలీసులదేనని టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. ఆయన శనివారం విలేకరులతో మాటాడారు. బ్రెజిల్ నుంచి రాష్ట్రానికి వైసీపీ నేతలు డ్రగ్స్‌ను దిగుమతి చేసుకుని, రాష్ట్రంలో యువతను గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిసలను చేసి ఇష్టారాజ్యంగా దోచుకోవాలనుకుంటున్నారని ఆరోపించారు. ఒక ప్రాంతీయ పార్టీ ఎంపీ బ్రెజిల్ దేశాధ్యక్షుడిని అభినందిస్తూ ట్వీట్లు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కూనం కుటుంబం మొత్తం వైసీపీకి చెందినవారేనని, జగన్‌రెడ్డి తన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు టీడీపీకి అంటగట్టేందుకు యత్నిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐను విచారించకుండా ఏపీ పోలీసులతో ఆటంకాలు సృష్టించటం వెనుక ఎవరి హస్తముందో తెలుసుకోలేని స్థితిలో ప్రజలు లేరని అన్నారు.

నూజివీడు స్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీ

హనుమాన్‌జంక్షన్, మార్చి 23: వేసవిలో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని నూజివీడు రైల్వే స్టేషన్ అధికారులను విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఆనంద్‌పాటిల్ ఆదేశించారు. శనివారం ఆయన నూజివీడు రైల్వేస్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. టికెట్ కౌంటర్, వెయిటింగ్ హాలు, రిజర్వేషన్ ప్రయాణికుల వెయింటింగ్ రూం, ప్లాట్‌ఫాంలను ఆయన పరిశీలించారు. వేసవి సందర్భంగా రిజర్వేషన్‌పై వెళ్లే ప్రయాణికులకు వెయిటింగ్‌రూం అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. వెయిటింగ్ రూంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. 1వ నెంబర్ ప్లాట్‌ఫాంపై స్టేషన్ ఎదుట ఫ్యాన్ ఏర్పాటు చేయాలని స్టేషన్ మాస్టర్‌కు సూచించారు. తాగునీటికి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. స్టేషన్‌లో ఏఏ రైళ్లు ఆగుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైల్వే సిబ్బందికి వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సెమినార్ నిర్వహించారు. రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, స్టేషన్ సూపరింటెండెంట్ ఎ.విశ్వేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.




త్రిపుర నిఖిత బృందం నాట్యాభినయం, నర్తనశాల నృత్యరూపకంలో కళాకారుల అభినయం

ఆనందపరవశులై..

కూచిపూడి, మార్చి 23: బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా నాలుగోరోజు శనివారం కూచిపూడి సిద్ధేంద్ర కళావేదికపై కళాకారులు ప్రదర్శించిన అంశాలు నాట్య పరిమళాలు వెదజల్లి ప్రేక్షకులను ఆనందపారవశ్యంలో ముంచెత్తాయి. వేదాంతం రామలింగ శాస్త్రి నృత్య దర్శకత్వంలో ప్రదర్శించిన నర్తనశాల నృత్యరూపకం ప్రేక్షకులను ఆనందడోలికల్లో ముంచెత్తింది. నటరాజ కళాక్షేత్రం (నెల్లూరు)కు చెందిన త్రిపుర నిఖిత బృందం నాట్యాంశాలకు వన్నె తెచ్చారు. కళాకారులకు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతలు వేదాంతం రాదేశ్యామ్, పసుమర్తి రత్తయ్యశర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కావూరి భానుమూర్తి, బాలకృష్ణ, ఫణికుమార్ మెమెంటోలు అందించి సత్కరించారు.


యార్లగడ్డ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

గన్నవరంలో వైసీపీ ఖాళీ

- అందుకు పార్టీలో చేరికలే నిదర్శనం
- జగన్ జిల్లాలో పాదయాత్ర చేస్తే అన్నం పెట్టా
- కానీ, ఆయన నాకు సున్నం రాశారు: యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం/గుణదల, మార్చి 23: "వైసీపీ ఐదేళ్ల పాలన నుంచి నియోజకవర్గంలోని ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు విముక్తి కోరుకుంటున్నారు. నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అవుతోంది. అందుకు వైసీపీని వీడి టీడీపీలో చేరికలే నిదర్శనం" అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఈ ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి శూన్యమని, ఎక్కడ చూసినా అవినీతిమయమేనని ఆయన ఆరోపించారు. అక్రమ మైనింగ్, భూ కబ్జాలు, ప్రతిపక్షాల నాయకుల ఆస్తుల ధ్వంసం, దాడులతో పాలన కొనసాగిందని ధ్వజమెత్తారు. మహనీయులు పాలించిన నియోజకవర్గం గన్నవరంలో అదే ఒరవడిని మీ అందరి ఆశీస్సులతో కొనసాగిస్తానని యార్లగడ్డ హామీ ఇచ్చారు. కానూరులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గన్నవరం మండలం బీబీగూడెం, గొల్లనపల్లి, చిక్కవరం, కొత్తగూడెం, సూరంపల్లి గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్‌పర్సన్, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి యార్లగడ్డ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచి గన్నవరం సీటును చంద్రబాబు, భువనమ్మలకు గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. జిల్లాలో జగన్ పాదయాత్ర చేస్తే భోజనం పెట్టానని అందుకు ప్రతిగా తనకు సున్నం రాశారని అన్నారు.

వైసీపీ నుంచి 450 మంది టీడీపీలో చేరిక

యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో ఏఎంసీ మాజీ చైర్మన్, వైసీపీ జిల్లా కార్యదర్శి కోటగిరి వరప్రసాదరావు, గొల్లనపల్లి సర్పంచ్ గణపవరపు శాంతి, మాజీ సర్పంచ్ కోటగిరి రామచంద్రరావు, గన్నవరం ఉపసర్పంచ్ పాలడుగు నాని, జల సూత్రం నరసింహారావు, షేక్ రఫీ, షేక్ ఫరూక్, జగీన, బీబీగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ బోయపాటి మురళీకృష్ణ(బుల్లియ్య), మాజీ సర్పంచ్ బోయపాటి బసవపూర్ణయ్య(నల్లబాబు), సూరంపల్లి వైసీపీ కన్వీనర్ గొట్టిపూళ్ల శ్రీనాథ్, ఎంపీటీసీ సభ్యురాలు బాణావతు నీలిమ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొట్టిపూళ్ల వీరబాబు, రఘునాథ్, పులపాక చినబాబురావు, కొలుసు రాఘవులు, మర్లచెరువు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మేడసాని రామకృష్ణతో పాటు 450మందికి పైగా మహిళలు, యువకులు, ముస్లింలు టీడీపీలో చేరారు.

భజనచంద్రపై వేటుకు రంగం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

వాట్సాప్ గ్రూపులలో ఆగని ప్రచారం

వాట్సాప్ గ్రూపులలో అధికార వైసీపీకి భజన కార్యకర్తగా కంటే కూడా ఎక్కువగా భజన చేస్తున్న డీపీవో జయచంద్ర మరికొన్ని చిట్‌చాట్‌లు, వాట్సాప్ డీపీలు బయటకు వచ్చాయి. జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైసీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేయబోతున్న సామినేని ఉదయభానుకు భారీగా ప్రచారం చేస్తున్నారు. తాను డీపీవోగా ఉద్యోగంలో చేరిన మరుసటి రోజునే తాను ఎన్టీఆర్ జిల్లా డీపీవోగా పోస్టింగ్ రావటానికి సర్దార్ సామినేని ఉదయభాను, పెద్దాయన పుల్లారెడ్డి కారణమని అధికారుల వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు కూడా చేశారు. ఇప్పుడు అదే సామినేని ఉదయభాను ఫొటోను తన స్టేటస్‌లో పెట్టుకుని కాబోయే మంత్రికి వచ్చేనెలలో రాబోయే శ్రీరామనవమిని పురస్కరించుకుని శుభాకాంక్షలు చెప్పటం గమనార్హం. ఆయన కార్యాలయం ఫొటోను కూడా షేర్ చేసుకున్నారు.

జగన్ నామస్మరణ పోస్టుల పరంపర

వాట్సాప్ గ్రూపులలో జగన్ నామస్మరణతో డీపీవో జయచంద్ర పోస్టులను చేస్తున్నారు. జగన్‌కు అనుకూలమైన పోస్టులను పోస్టు చేయటం ఒక ఎత్తు అయితే తెలుగుదేశం పార్టీని విమర్శిస్తూ దారుణమైన పోస్టింగ్‌లు పెట్టడం మరోఎత్తు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ అంశంపై సీరియస్‌గా తీసుకోకపోతే ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగే అవకాశం ఉంటుంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.23

6,7 తేదీల్లో గాలీబ్ షహీద్ దర్గా ఉరుసు వేడుకలు

భవానీపురం, మార్చి 23 : 41వ డివిజన్‌లోని భవానీపురంలో అత్యంత పురాతనమైన హజ్రత్ సయ్యద్ గాలీబ్ షహీద్ దర్గాలో ఏప్రిల్ 6,7 తేదీల్లో 436 ఉరుసు వేడుకలు నిర్వహించనున్నట్లు ముజావర్స్ కమిటీ పెద్దలు అబ్దుల్ జలీల్, ఎండీ హిమయత్ ఆలీ, ఎండీ జక్రియలు ఒక ప్రకటనలో తెలిపారు. 6న రాత్రి 11.45 గంటలు ఎండీ జమీర్ ఇంటి మహాత్ముల వారి గంధంను పుర వీధుల్లో ఊరేగించి 7న దర్గాలో ప్రవేశ పెడతామన్నారు. ఆ రోజు ప్రత్యేక అలంకరణ పూజలుంటాయన్నారు. దీపారాధన అనంతరం ఆదివారం రాత్రి భారీ అన్నదానం చేస్తామన్నారు. ఈ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.



ఆంధ్రరత్న భవన్‌లో



త్రివేణి డిగ్రీ కళాశాలలో



ఆల్ ఇండియా జైహింద్ పార్టీ ఆధ్వర్యంలో



యువైఎఫ్ఐ ఆధ్వర్యంలో

భగత్‌సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకం

గవర్నర్‌పేట, మార్చి 23: స్వాతంత్ర్య సమర యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఏలూరు రోడ్డులోని కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో కాంగ్రెస్ శ్రేణులు నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఏపీసీసీ జనరల్ సెక్రటరీ పివై కిరణ్, అల్లం రాజేష్‌లు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో దేశం కోసం భగత్‌సింగ్ చేసిన సేవల్ని, ప్రాణ త్యాగాన్ని గుర్తు చేశారు.

విద్యాధరపురం: నగరంలోని త్రివేణి డిగ్రీ కళాశాలలో శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమం ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. జిల్లా ఏఐఎస్ఏ ప్రెసిడెంట్ మహేష్, జిల్లా సెక్రటరీ శివకుమార్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్: అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ముందుగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మతసామరస్యాన్ని కాపాడుకోవడమే అమరవీరులకు మనం ఇచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు.

ధర్నాచౌక్: ఆల్ ఇండియా జైహింద్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో తొలుత భగత్‌సింగ్ , రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగిరెడ్డి దశరథ రామ్‌రెడ్డి మాట్లాడుతూ 21 ఏళ్లకే దేశం కోసం ఉరి తీయబడ్డ భగత్‌సింగ్ నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య, ఆప్ నేతలు ఫణిరాజ్, కందుల రమేష్, మైనార్టీ నేత షేక్ జలీల్, శ్రీనివాసరావు నివాళులర్పించారు.

పాతరాజరాజేశ్వరి పేట : స్థానిక 55వ డివిజన్ విఎంచిపేట, సీఎస్ఐ చర్చి వద్ద శనివారం భారత ఐక్య యువజన సమైఖ్య (యువైఎఫ్ఐ) ఆధ్వర్యంలో సర్దార్ భగత్‌సింగ్ 93వ వర్ధంతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి విచ్చేసిన ఎంసీపీఐ(యు) ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ బాబు పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలవమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

వైసీపీ పాలనలో కొండ ప్రాంత అభివృద్ధి శూన్యం

జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

మొగల్రాజపురం, మార్చి 23: తూర్పు నియోజకవర్గంలో కొండ ప్రాంతంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్పితే వైసీపీ వచ్చిన తరువాత జరిగింది శూన్యం అని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ చెప్పారు. శుక్రవారం సాయంత్రం 7వ డివిజన్ బందిల దొడ్డి ఏరియాలో టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్(చిన్ని)ల విజయాన్ని కాంక్షిస్తూ ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులకు టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ హయాంలోనే డివిజన్‌లో, కొండ ప్రాంతంలో మంచినీటి రిజర్వాయర్ నిర్మాణం, రోడ్లు, మెట్ల మార్గాలు, డ్రెయినేజీలు, మంచినీటి పైపు లైన్ల పనులు చేశామన్నారు. వైసీపీ వచ్చిన తరువాత చిన్న చిన్న మరమ్మతులకు కూడా నోచుకోని దుస్థితి తలెత్తిందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తు మీద ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. డివిజన్ టీడీపీ, జనసేన అధ్యక్షులు పటమట సతీష్ చంద్ర, దోమకొండ అశోక్ , గుమ్మడి గురుప్రసాద్, దయాల శిరీషా గాంధీ, దోమకొండ జ్యోతి, శివలక్ష్మి, పెనుగొండ శ్రీను, రేపాకుల శ్రీను, కర్రి రాజేష్, పరసా లక్ష్మిణ్ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న గద్దె అనురాధ

రాణిగారితోట: 19వ డివిజన్ పకీర్‌గూడెంలో జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని వైఎస్ జగన్‌మోహనరెడ్డి చెబుతుంటే ప్రజలు వారిని ఓడించడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన, బీజేపీలు బలపరిచిన అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కోరుతూ సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు.

వాన నీటిని సద్వినియోగం చేసుకోవాలి

గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ నియంత

పటమట, మార్చి 23 : వర్షం ద్వారా మనకు లభించే నీటిని సద్వినియోగం చేసుకోవాలని, ప్రపంచ వ్యాప్తంగా 220 కోట్ల జనాభాకు సరైన మంచినీటి సదుపాయం లేదని ఐక్యరాజ్యసమతి ఆందోళన వెల్లిబుచ్చిందని గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ నియంత తెలిపారు. ప్రపంచ నీటిదినోత్సవం సందర్భంగా నాస్తిక కేంద్రంలో శనివారం గోరా సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నియంత మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల అకాల వర్షాలు ఎక్కువ, తక్కువ పడటం వలన చాలా ప్రదేశాల్లో నీటికి కటకట ఏర్పడుతుందని తెలిపారు. ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి 'వాటర్ ఫర్ ప్రాస్పిరిటి ఆఫీస్ 'అనే నినాదం ఇచ్చిందని, ఏదైనా నీటి వినియోగంపై శ్రద్ధ అవసరమని అందరూ గుర్తించాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నీటి వనరుల అభివృద్ధికి కృషి చేయాలని, కాలుష్య కారకాల నుంచి నీటిని కాపాడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీటి ప్రాధాన్యత- తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సభలో డాక్టర్ మారు, డాక్టర్ డిమోస్ గోరా, కృష్ణమోహన్, రిటైర్డు ప్రిన్సిపాల్ దిలీప్‌లు పాల్గొన్నారు.



డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సత్యనారాయణపురం, మార్చి 23: సెంట్రల్ రిటర్నింగ్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ శనివారం దుర్గాపురం బీఆర్టీఎస్ రోడ్డు వెంట ఉన్న ఎస్టీవీఆర్ మున్సిపల్‌స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంను పరిశీలించారు.

పాఠశాల ప్రాంగణంలో ఎన్నికల నియమావళిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులు, ప్రాంగణం పరిశీలించి ఎన్నికల నిర్వహణకు ఎటువంటి సమస్యలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

టీడీపీ పశ్చిమ క్లస్టర్‌ల నియామకం



మాట్లాడుతున్న బుద్దా వెంకన్న, పక్కన నాగూల్‌మీరా

వన్‌టౌన్, మార్చి 23: నూతనంగా నియమించిన క్లస్టర్ ఇన్‌చార్జులు ఆయా డివిజన్ పరిధిలోని డివిజన్ అధ్యక్షులను, యూనిట్ యూనిచార్జులను సమన్వయం చేసుకోని వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగూల్‌మీరా అన్నారు. శనివారం వన్‌టౌన్ అర్జున వీధిలోని బుద్దా వెంకన్న కార్యాలయంలో వారు పశ్చిమలో 11 మంది క్లస్టర్ ఇన్‌చార్జులను నియమించారు. 34, 35 డివిజన్ ఇన్‌చార్జులుగా కొట్టేటి హనుమంతరావు, 48, 49 డివిజన్లకు గణపారాము, 50, 51 డివిజన్లకు సుకాశి కిరణ్, 38, 52 డివిజన్లకు నందం భవానిప్రసాద్, 39, 44 డివిజన్లకు బడుగు గణేష్, 43, 45 డివిజన్లకు ఆలుగండ్ల సుబ్బారెడ్డి, 41, 42 డివిజన్లకు వై.రామయ్య, 54, 53 డివిజన్లకు సయ్యద్ కరీముల్లా, 46, 47 డివిజన్లకు పోతినీడు లోకేష్, 37, 40 డివిజన్లకు పల్లంటి గంగాధర్, 55, 56 డివిజన్లకు ధనేకుల వెంకటసుబ్బారావులను నియమించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ నియమించబడిన క్లస్టర్‌లందరూ బాధ్యతగా టీడీపీ గెలుపునకు పనిచేయాలని సూచించారు. ఏదైనా సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

సీపీఐను గెలిపించండి

● జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

వన్‌టౌన్, మార్చి 23: ధనస్వామ్యవాదులు, ప్రజాస్వామ్యవాదుల మధ్య జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐను గెలిపించాలని పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. పశ్చిమలోని డివిజన్ పార్టీల కార్యదర్శుల సమావేశం పి.తాతారావు అధ్యక్షతన శనివారం లెనిన్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావులు మాట్లాడుతూ నగర సమగ్రాభివృద్ధిలో కమ్యూనిస్టుల పాత్ర మరువలేనిదని, పశ్చిమ ఎమ్మెల్యేలుగా తమ్మిన పోతరాజు, ఉప్పలపాటి రామచంద్రరాజు, కే.సుబ్బరాజు, షేక్ నాసర్‌వలి, మేయర్లుగా టి.వెంకటేశ్వరరావు, లంకా గోవిందరాజులు, అయితా రాములు మరువలేని కృషి చేశారన్నారు. రాబోయే కాలంలో పశ్చిమలో సీపీఐ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బుట్టి రాయప్ప, మూలి సాంబశివరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు పాల్గొన్నారు.

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత: ధూళిపాళ్ల



మాట్లాడుతున్న ధూళిపాళ్ల రామకృష్ణ

వన్‌టౌన్, మార్చి 23: మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత అని మారిస్ స్టెల్లా కళాశాల సంస్కృత విభాగాధిపతి డాక్టర్ ధూళిపాళ్ల రామకృష్ణ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మాతృభాషా పరిరక్షణ అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలుగువారు తమ జీవన విధానం కోసం భాషను వదులుకుంటున్నారని అది సరైనది కాదని చెప్పారు. ఎక్కడ ఉన్నా భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భాష పట్ల గౌరవం ఉండాలని, నా భాష చాలా గొప్పదనే భావనతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. భాష పట్ల విద్యార్థులు ప్రేమను పెంచుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి అవకాశాల కోసం ఆంగ్లంపై పట్టు సాధించినా మాతృభాషను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రామకృష్ణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ జీ.నాగరాజు, అధ్యాపకులు ఆర్ జితేంద్రకుమార్, వెన్నపూస పవన్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి

● నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఫాదర్ నీలం రత్న కుమార్

పాతరాజరాజేశ్వరి పేట, మార్చి 23 : పౌష్టికాహారం తీసుకుని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా జీవించాలని నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఫాదర్ నీలం రత్న కుమార్ కోరారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో 35వ డివిజన్ పెజ్జోనిపేటలోని నీతోడు మానసిక వికాస కేంద్రంలో శనివారం హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంలో ఫాదర్ నీలం రత్నకుమార్ మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే మనిషి ఆరోగ్యంగా ఉండగలుగుతాడని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేసి వేసవిలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. మానసిక వికాస కేంద్రం సైకాలజిస్ట్ ఫాదర్ విజయానంద్, నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు, సైకాలజిస్ట్ జి. అనూష్, జోనల్ కో ఆర్డినేటర్లు కె. నజ్మా, వసంత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 23 : స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్సీఎం చర్చి ఫాదర్ గడ్డం జోజి చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు మన సంస్కృతి, సంప్రదాయాలను, పెద్దల పట్ల గౌరవ మర్యాదలను నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ కరస్పాండెంట్ థామస్, ప్రిన్సిపాల్ ఆశా జార్జ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లీడర్‌షిప్ సక్సెస్‌పై ముగిసిన సదస్సు

భారతీనగర్, మార్చి 23: ఆంధ్రా లయోల కళాశాల బీబీఏ విభాగం ఆధ్వర్యంలో లీడర్‌షిప్ సక్సెస్‌పై రెండు రోజులు నిర్వహించిన అవగాహన సదస్సు శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హయత్ హోటల్ ప్లేస్ చైర్మన్ ఆర్‌వీ స్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ కె.ప్రభుదాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.మాధురి, బీబీఏ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డి.ఉమామారి, శ్రావణి, సునీల్ సుబ్రహ్మణ్యం,ఎంబీఏ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలు

విద్యాధరపురం, మార్చి 23: కనకదుర్గమ్మ వారధి వద్ద శనివారం ఉదయం ఓ ప్రైవేట్ బస్సు ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. గుంటూరు జిల్లా తెనాలి మండలం చిన్నరావూరు తోటకు చెందిన చిన్నప్రసన్న కుమార్ స్నేహితుడు జగదీష్‌తో కలిసి శుక్రవారం రాత్రి గన్నవరంలో ఉన్న బంధువు వద్దకు వెళ్లారు. శనివారం ఉదయం 7.30కు ప్రసన్న కుమార్, మరో స్నేహితుడు నాగరాజు ఒక బైక్‌పై, ప్రసన్నకుమార్ బంధువు ప్రేమ్, జగదీష్‌లు మరో బైక్‌పై సొంతూరుకు బయలుదేరారు. ప్రసన్నకుమార్ బైక్ ముందు వెళ్లడంతో ప్రేమ్ ఫోన్ చేసి కానూరు వెళదామని చెప్పాడు. దీంతో వారధి వరకు వచ్చిన ప్రసన్నకుమార్ కానూరు వెళ్లడానికి యూటర్న్ తీసుకుంటుండగా బెంజిసర్కిల్ నుంచి వారధివైపు వేగంగా వెళుతున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వారిని ఢీకొంది. ఈ ఘటనలో గాయపడ్డ ఇరువురిని గవర్నరుపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. నాగరాజుకు తీవ్ర గాయాలు కావడంతో మంగళగిరిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకుని వెళ్ళారు. బాధితుడు ప్రసన్నకుమార్ ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు.

దిక్సూచి
DIKSUCHI

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ పీజీ ఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్వీయూ) నిర్వహిస్తోంది. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంటెక్/ఎంఫార్మసీ/ఫార్మాడీ (పీబీ)ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఇంజనీరింగ్/ఫార్మసీ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. సీట్ల భర్తీలో గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. తరవాతనే ఏపీపీజీఈసెట్ 2024 స్కోర్ సాధించిన అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏపీ పీజీ ఈసెట్

విభాగాలు: కెమికల్, అగ్రికల్చరల్, ఏరోనాటికల్, అప్లయిడ్ పెట్రోలియం, ఆర్కిటెక్చరల్, ఏరోస్పేస్, ఆటోమొబైల్, బయో కెమికల్, బయోఇన్ఫర్మాటిక్స్, బయోటెక్నాలజీ, బయోమెడికల్, సివిల్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ, సివిల్ ఎన్విరాన్‌మెంటల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్, డెయిరీ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీమాటిక్స్, ఫుడ్ సైన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ, జియో ఇన్ఫర్మాటిక్స్, జియోసైన్స్, ఇండస్ట్రియల్ బయోటెక్నాలజీ, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇండస్ట్రియల్ ప్రొడక్షన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇంజనీరింగ్, మెకట్రానిక్స్, మెకానికల్, మెటలర్జీ, మైనింగ్, మెకానికల్ మెరైన్, నేవల్ ఆర్కిటెక్చర్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, ఫార్మసీ, వెటర్నరి సైన్స్, డెంటల్, అప్లయిడ్ కెమిస్ట్రీ, అప్లయిడ్ ఫిజిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, టెలి కమ్యూనికేషన్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పవర్ ఇంజనీరింగ్, మైక్రో బయాలజీ, లైఫ్ సైన్సెస్ తదితరాలు.

ఏపీ పీజీ ఈసెట్ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. విభాగానికి నిర్దేశించిన ప్రకారం సంబంధిత స్పెషలైజేషన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.



ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. పరీక్ష సమయం రెండు గంటలు.

అర్హతలు: ఏఐసీటీఈ/యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్/ఫార్మసీ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/బీఆర్క్/ఏఎంఐఈ+డిప్లొమా/ఎమ్మెస్సీ/ఎంసీఏ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.
- ఎంఫార్మసీ/ఫార్మాడీ(పీబీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి బీఫార్మసీ/బీడీఎస్/ఎమ్మెస్సీ/ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **ఏపీ పీజీ ఈసెట్ తేదీలు:** మే 29 నుంచి 31
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/xGJZGARలో చదవండి.

కాకినాడ ఐఐఎఫ్‌టీలో బీబీఏ-ఎంబీఏ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - కాకినాడ క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం)ను అందిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఇందులో బీబీఏ(బిజినెస్ అనలిటిక్స్), ఎంబీఏ (ఇంటర్నేషనల్ బిజినెస్) కోర్సులు ఉంటాయి. ఇండోర్ ఐఐఎం నిర్వహించే ఐపీమ్యాట్ 2024 స్కోర్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 60 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూప్‌లతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్/ బిజినెస్ మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. పదోతరగతి, ఇంటర్ స్థాయిల్లో ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి. 2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు, 2024లో చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు 2004 ఆగస్టు 1న/ఆ తరవాత జన్మించి ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల మినహాయింపు వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

ఐఐఎం ఇండోర్-ఐపీమ్యాట్ 2024
- **ఐపీమ్యాట్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **ఐపీమ్యాట్ 2024 తేదీ:** మే 23
- **వెబ్‌సైట్:** www.iimidr.ac.in

ఐఐఎఫ్‌టీ-ఐపీఎం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 23
- **వెబ్‌సైట్:** www.iift.ac.in



మహిళలకు 'జనరేషన్ గూగుల్ స్కాలర్‌షిప్'

ప్రముఖ ఎంఎన్‌సీ 'గూగుల్- మహిళలకు 'జనరేషన్ గూగుల్ స్కాలర్‌షిప్' పేరిట ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే మహిళలు అర్హులు. భారత విద్యార్థినులు 'ఆసియా పసిఫిక్' కేటగిరీ కింద దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 1250 దరఖాస్తులను అనుమతిస్తారు. ఎంపికైనవారికి 2500 యూఎస్ డాలర్ల స్కాలర్‌షిప్ లభిస్తుంది.

అర్హత: ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఏదేని ఆసియా పసిఫిక్ దేశంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీలో బ్యాచిలర్స్ డిగ్రీ ప్రవేశం పొందాలనుకునేవారు అప్లయ్ చేసుకోవచ్చు. కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్/తత్సమాన సాంకేతిక విభాగాలకు సంబంధించిన డిగ్రీ కోర్సులు ఎంచుకోవాలి. స్కూల్ స్థాయి నుంచి మంచి అకడమిక్ రికార్డ్ తప్పనిసరి. నాయకత్వ లక్షణాలు ఉండాలి. కంప్యూటర్లపై ప్రాథమిక అవగాహన కూడా లేనివారికి అవసరమైన పరిజ్ఞానాన్ని అందించడంలో ఆసక్తి ఉండాలి. టెక్నికల్ ప్రాజెక్ట్‌లకు సంబంధించిన నైపుణ్యాలు ఉండాలి. దరఖాస్తుతోపాటు ఇచ్చిన రెండు షార్ట్ ఆన్సర్ ఎస్సే క్వశ్చన్స్‌కు కనీసం 500 పదాలకు తగ్గకుండా సమాధానాలు రాసి అప్‌లోడ్ చేయాలి. 2023-2024 విద్యా సంవత్సరంలో డిగ్రీ రెండో ఏడాది/మూడో ఏడాది కోర్సు రిజిస్టర్ చేసుకున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం తదితరాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 23
- **వెబ్‌సైట్:** https://buildyourfuture.withgoogle.com/

మలేషియాలో నవతిహి ఉత్సవం

తెలుగు చిత్ర పరిశ్రమ 90 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మలేషియాలో 'నవతిహి ఉత్సవం' నిర్వహించనున్నారు. దీని వివరాలు వెల్లడించడం కోసం శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు మాట్లాడుతూ 'తెలుగు సినిమా 90 ఏళ్ల ఉత్సవాన్ని నిర్వహించాలని రెండేళ్ల క్రితమే నిర్ణయించుకున్నాం. తెలుగు సినిమా ప్రారంభమైన రోజుల నుంచి ఎంతోమంది నటీనటులను గుర్తు చేసుకుంటూ ఈ వేడుకని చాలా గ్రాండ్‌గా నిర్వహించాలని అనుకున్నాం. అనివార్య కారణాల వల్ల అది వాయిదా పడుతూ వస్తోంది. ఈ ప్రోగ్రామ్ నుంచి 'మా' కోసం ఫండ్ రైజింగ్ కూడా చేయాలనుకున్నాం. తాజాగా మలేషియా ప్రభుత్వం సహకారంతో ఈ వేడుక నిర్వహించాలని నిర్ణయించుకున్నాం. జులైలో మలేషియాలో భారీగా జరుపుతాం. పరిశ్రమ పెద్దలతో నిర్ణయించి తేదీని ఖరారు చేస్తాం. మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించే ఈ వేడుకల కోసం సినిమా ఇండస్ట్రీకి సెలవు ఇవ్వాలని ఫిల్మ్ ఛాంబర్ పెద్దలను అడిగాం. ఇతర రాష్ట్రాల సినీ ప్రముఖులను కూడా ఇందులో భాగం చేయాలనుకుంటున్నాం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మలేషియా ప్రభుత్వం నుంచి వచ్చిన కమలనాథన్, మలేషియా టూరిజం డైరెక్టర్ రాజౌది అబ్దుల్ రాహిమ్, రాహుల్ రెడ్డి, ఎడ్విన్ ఆనందరాజ్, 'మా' ఉపాధ్యక్షుడు మాదాల రవి, శివబాలాజీ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



భావితరాల భవిష్యత్తు కోసం...

- నిర్మాత గూడూరు నారాయణరెడ్డి



నేషనల్ అవార్డ్ విన్నర్ బాబీ సింహా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'రజాకార్'. రాజ్ అర్జున్, మకరంద్ దేశ్ పాండే, ప్రేమ, ఇంద్రజ, అనసూయ భరద్వాజ్, వేదిక కీలక పాత్రల్లో నటించారు. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదలైంది. శనివారం చిత్ర యూనిట్ 'హిస్టారికల్ హిట్' పేరిట సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టార్ రైటర్ విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ " నేను తీసిన 'రాజన్న' సినిమాలో రజాకార్ల తాలూకు విషయాన్ని టచ్ చేశాను. ఈ సబ్జెక్ట్‌పై ఎవరైనా పూర్తి స్థాయి సినిమా చేస్తే బావుంటుందని అనుకున్నాను. గూడూరు నారాయణరెడ్డి నా ఆలోచనను నిజం చేశారు. ఈ సినిమాకు పాజిటివ్ టాక్ రావడం ఎంతో ఆనందంగా ఉంది" అని అన్నారు. నిర్మాత గూడూరు నారాయణరెడ్డి మాట్లాడుతూ "భావితరాల భవిష్యత్తు కోసం తీసిన సినిమా ఇది. డబ్బు కోసం, గ్లామర్ కోసం తీయలేదు" అని చెప్పారు. దర్శకుడు యాటా సత్యనారాయణ మాట్లాడుతూ "ఈ సినిమాకు సంబంధించిన వారందరూ ప్రాణం పెట్టి పని చేశారు. ఈ సినిమాకు నేను పడిన కష్టం కంటే వారు పడిన కష్టమే ఎక్కువ" అని అన్నారు. నటి ఇంద్రజ మాట్లాడుతూ "చాకలి ఐలమ్మగా నా కెరీర్‌లోనే ఉత్తమ పాత్ర పోషించాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొంది.

25 ఏళ్ల తర్వాత మళ్లీ...



సూపర్ హిట్ కాంబినేషన్లు ఎప్పుడెప్పుడు రిపీట్ అవుతుంటాయా అని ప్రేక్షకులు ఎదురుచూస్తుంటారు. అలాంటి వాటిలో ప్రభుదేవా, ఏ. ఆర్. రెహమాన్ కలయిక ఒకటి. దాదాపు 25 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ హిట్ కాంబో ప్రేక్షకులను పలకరించనుంది. ఇది వీరిద్దరి కలయికలో వస్తున్న ఆరో చిత్రం కావడం విశేషం. ఈ చిత్రానికి వర్కింగ్ టైటిల్ 'ఏఆర్ఆర్‌పీడీ6'. ఎన్. ఎస్. మనోజ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. యోగిబాబు, అజు వర్గీస్, అర్జున్ అశోకన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వైవిధ్యమైన కథాంశంతో, పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మే నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

నాన్‌స్టాప్ ఎంటర్టైనర్



శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ నటించిన చిత్రం 'ఓం భీం బుష్'. శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. సునీల్ బలుసు నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలైన 'ఓం భీం బుష్' హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత దిల్ రాజ్ మాట్లాడుతూ "దర్శకుడు నాన్‌స్టాప్ ఎంటర్టైన్‌మెంట్‌ను అందివ్వాలని చేసిన ప్రయత్నానికి సక్సెస్ లభించడం ఆనందంగా ఉంది" అని అన్నారు. డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ "సమ్మర్‌లో మంచి ఎంటర్టైన్‌మెంట్ కావాలంటే ఈ చిత్రాన్ని చూడండి" అని అన్నారు. శ్రీవిష్ణు మాట్లాడుతూ "ఈ సినిమాకు యూత్‌తో పాటు ఫ్యామిలీస్ నుంచి కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది" అన్నారు. రాహుల్ రామకృష్ణ మాట్లాడుతూ "కష్టే ఫలి అంటారు. మేము పడిన కష్టానికి తగ్గ హిట్ ప్రేక్షకులు ఇచ్చారు" అని చెప్పారు. దర్శకుడు హర్ష కొనుగంటి మాట్లాడుతూ "థియేటర్స్‌లో సినిమా చూసిన వారు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొంది.

కొత్త ఎక్స్‌పీరియెన్స్

రామ్ మిర్యాల.. ఆయన పాట వింటుంటే మన స్నేహితుడే పాడుతున్నట్లుంటుంది. మన మట్టి వాసనను గుర్తుకు తెచ్చేలా, మన భావోద్వేగాలను స్పృశించేలా పాట పాడటం రామ్ మిర్యాల ప్రత్యేకత. ఓ వైపు సింగర్‌గా, మరో వైపు మ్యూజిక్ డైరెక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం 'ఆయ్' చిత్రానికి సంగీతం అందిస్తున్న రామ్ మిర్యాల మీడియాతో ముచ్చటించారు.



"ఆయ్' సినిమా కోసం నన్ను బన్నీవాస్ పిలిచారు. నా స్టైల్ ఆఫ్ మ్యూజిక్ ఒకలా ఉంటుంది. ఆయనేమో నెటివిటీ బేస్డ్ ఫన్ ఎంటర్టైనర్ మూవీ చేస్తామని అన్నారుగా.. నాకేం సెట్ అవుతుందిలే నో చెప్పేద్దామని అనుకున్నాను. కానీ అక్కడకు వెళ్లి కథ విన్నాక.. చాలా బాగా నచ్చేసింది. గోదావరి బ్యాక్ డ్రాప్‌లో సాగే సినిమా ఇది. ఇప్పటి వరకు ఇలాంటి జోనర్‌లో నేను సినిమా చేయలేదు, అందుకే ఒప్పేసుకున్నా. ఈ చిత్రం నాకు సరికొత్త ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చింది. ఈ సినిమాలో చక్కటి కామెడీతో పాటు ఎంతో మంచి లవ్ స్టోరీ కూడా ఉంటుంది. ఈ సినిమాలో రెండు పాటలు చేశాను. రీసెంట్‌గా 'సూఫియానా' అనే మెలోడి సాంగ్ రిలీజైంది. ఈ పాటకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో చేసిన మరో పాట పెళ్లి నేపథ్యంలో ఉంటుంది. అది కూడా త్వరలోనే రిలీజ్ అవుతుంది. సాధారణంగా మ్యూజిక్ డైరెక్టర్‌కి, చిత్ర దర్శకుడితో మంచి బంధం ఉండాలి. అప్పుడే మంచి సంగీతం కుదురుతుంది. ఓ సింగర్‌గా, మ్యూజిక్ డైరెక్టర్‌గా అన్ని రకాల పాటలను చేయాలనేది నా కోరిక. నేను రీసెంట్‌గా వర్క్ చేసిన 'టిల్లు స్క్వేర్' మూవీ ఈ నెల 29న రిలీజ్ అవుతోంది.



భరతనాట్యంతో బాగా నవ్విస్తాం

సూర్యతేజ ఏలేను హీరోగా పరిచయం చేస్తూ రూపొందుతున్న 'భరతనాట్యం' చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. 'దొరసాని' చిత్ర దర్శకుడు కేవీఆర్ మహేంద్ర రూపొందించిన ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది. పాయల్ సరాఫ్ నిర్మాత. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన కోన వెంకట్ మాట్లాడుతూ 'క్రైమ్ కామెడీ ఇతివృత్తంతో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఇంతమంచి ఎంటర్‌టైనర్ ద్వారా ధని ఏలే కుమారుడు సూర్యతేజ పరిచయం కావడం ఆనందంగా ఉంది. సినిమా తప్పకుండా విజయం సాధించాలి' అని కోరారు. కంటెంట్ నమ్మి ఈ సినిమా తీయడానికి ముందుకు వచ్చిన నిర్మాతలకు హీరో సూర్యతేజ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన వారందరికీ ఆయన ధన్యవాదాలు చెప్పారు. దర్శకుడు మహేంద్ర మాట్లాడుతూ 'దొరసానికి భిన్నమైన కథ ఇది. అందుకే సవాల్‌గా తీసుకుని మంచి చిత్రం అందించడానికి ప్రయత్నించా. ఇందులో మంచి డ్రామా ఉంది. పాత్రలన్నీ కొత్తగా ఉంటాయి. ప్రేక్షకులు కోరుకొనే అన్నీ అంశాలు ఉన్నాయి. నలభై నిమిషాల పాటు కడుపుబ్బ నవ్వించే సీన్లు ఉన్నాయి' అని తెలిపారు. కామెడీ, థ్రిల్, డాన్స్, ఫ్యామిలీ, లవ్, డ్రామా.. ఇలా అన్ని అంశాలు చిత్రంలో ఉన్నాయని హీరోయిన్ మీనాక్షి గోస్వామి తెలిపారు

నవ్య కుటుంబ కదంబం ఆదివారం

సండే సెలబ్రిటీ



ఖమ్మం నుంచి ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా 'మల్లేశం' ద్వారా టాలీవుడ్‌లో ప్రవేశించిన నటి **అనన్య నాగేళ్ల.** నాలుగేళ్లలో ఆమె చేసినవి కొన్ని సినిమాలే అయినా ప్రేక్షకులు తనను గుర్తించేలా చేసుకుంది. తాజాగా ఆమె నటించిన 'తంత్ర' విడుదలయింది. ఈ నేపథ్యంలో టాలీవుడ్‌లో గత నాలుగేళ్లలో తాను నేర్చుకున్న పాఠాలను 'నవ్య'కు వివరించింది.

నేనే పెద్ద షోకిల్లా అనుకొనేదాన్ని..

మాది ఖమ్మం. మధ్యతరగతి కుటుంబం. బీటెక్ అయిన తర్వాత ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేసేదాన్ని. షార్ట్‌ఫిల్మ్‌లో యాక్ట్ చేసేదాన్ని. వాటిని చూసుకున్నప్పుడు- 'నేను కూడా నటించగలను' అనే ధైర్యం కలిగింది. దాంతో సినిమాల్లోకి వచ్చేశాను.. నాకు టాలీవుడ్ గురించి ఏమి తెలియదు. కేవలం సినిమాలను నమ్ముకొని వచ్చాను... అంతే!

• మధ్యతరగతి కుటుంబం కదా... ఇంట్లో వాళ్లు ఏమీ అనలేదా?

నేను వాళ్లకు చెబితే కదా! 'మల్లేశం' సమయంలో నాకు వేరే చోట పని ఉందని చెప్పి వెళ్లేదాన్ని. కంపెనీకి సెలవు పెట్టేదాన్ని. ఇలా కొద్దికాలం గడిచింది. సినిమా వచ్చిన తర్వాత తర్వాత అమ్మానాన్నలకు తెలిసింది. వాళ్లు విపరీతంగా కోప్పడ్డారు. ఆ సినిమా ఆడటంతో వాళ్లకు కూడా కొంత నమ్మకం కలిగింది.

• సినిమా ప్రపంచంలో స్థిరత్వం ఉండదు. దీన్ని ఎలా తట్టుకుంటారు?

కుదరదు. కొన్నిసార్లు చాలా ఉత్సాహంగా ఉంటుంది. కొన్నిసార్లు అస్సలు పనిలేకుండా నిరాశగా ఉంటుంది. ఈ సమయంలో అనేక అనుమానాలు వెంటాడుతూ ఉంటాయి. ఉదాహరణకు 'వకీల్‌సాబ్' తర్వాత కొంత గ్యాప్ వచ్చింది. 'నేను ఉద్యోగం మానేసి రావటం సరైన పనేనా' అనే అనుమానం కలిగింది.

• వీటి నుంచి ఎలా బయటపడ్డారు?

సినిమా తీసే ప్రక్రియ అర్థమయితే ఈ అనుమానాలన్నీ తీరిపోతాయి. ఇదంతా ఒక జర్నీలో భాగమని అర్థమవుతుంది. నేను ఇలాంటి పరిస్థితుల నుంచి బయటపడటానికి నాతో నేను మాట్లాడుకుంటూ ఉంటా. నా ఉద్దేశంలో- మనకు శక్తిని ఇచ్చేవి ఆలోచనలే! ఎంత బలహీనంగా ఉన్నా- ఒక పాజిటివ్ ఆలోచన వస్తే చాలు- బలం దానంతట అదే వస్తుంది. ఇది అంత సులభం కాదు. కానీ ఎప్పుడూ పాజిటివ్‌గా ఉండటానికి ప్రయత్నిస్తా! ఏడుపు మరో స్ట్రెస్ బస్టర్. ఒక్కసారి ఏడిస్తే- మనసు తేలికపడుతుంది. పాజిటివిటీ వచ్చేస్తుంది.

• ఈ జర్నీ ఎలా ఉంది?

చాలా బావుంది.ఉత్సాహంగా, ఉత్సుకతతో ముందుకు వెళ్తున్నా. అదే సమయంలో భయంగా కూడా అనిపిస్తూ ఉంటుంది. ఈ నాలుగేళ్లలో జయపజయాల కన్నా నా జర్నీ ముఖ్యమని తెలుసుకున్నా. సినిమాలు ఎలా తీస్తారో తెలిసింది. ఈ క్రాఫ్ట్ వెనుక ఉన్న విషయాలు తెలుస్తున్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా నన్ను నేను ఎలా ప్రజెంట్ చేసుకోవాలో కూడా తెలిసింది.

• ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా సినిమాల్లోకి వచ్చే నటీనటులకు ఎదురయ్యే ప్రధాన సమస్య ఏమిటి?

సరైన రోల్‌ను పట్టుకోవటం చాలా ముఖ్యం. చాలా చోట్ల అవకాశాలు కనిపిస్తూ ఉంటాయి. కానీ 'మనం ఎంచుకొనేది సరైనదా? కాదా?' అనే విషయాన్ని తెలుసుకోవటంలోనే సగం జీవితం అయిపోతుంది. అంతేకాదు, పెద్ద పెద్ద అవకాశాలు వస్తాయని ఎదురుచూస్తూ కూర్చోకూడదు. మనకు దొరికిన పని చేయాలి. ఇండస్ట్రీలో 'వర్క్ ఎట్రాక్ట్స్ వర్క్' అనే సూత్రం పనిచేస్తూ ఉంటుంది. ఇలా పనిచేస్తూ పోతే ఎక్కడో ఒక చోట సక్సెస్ లభిస్తుంది. ఈ విషయంలో ఎవరికైనా ఎటువంటి షార్ట్‌కట్స్ ఉండవు. ఈ జర్నీలో సంతోషాలు, దుఃఖాలు... ఇలా రకరకాల భావోద్వేగాలుంటాయి. వీటన్నింటినీ దాటుకొనే వెళ్లాలి. అయితే ఈ జర్నీ అందరికీ ఒకే విధంగా ఉండదు. ఒక్కొక్కళ్లకు ఒకో విధంగా ఉంటుంది.

• మీ బ్యాక్‌గ్రౌండ్ ఏమిటి?

అవును. చదువు, స్థిరమైన ఉద్యోగం గురించి ఆలోచించే ప్రపంచం నుంచి వచ్చినదాన్ని నేను. చదువుకొనేదాన్ని. ఉద్యోగం చేసేదాన్ని. ఇంట్లో పని... ఇలా ఒక్క నిమిషం కూడా ఖాళీ ఉండేది కాదు. కానీ సినిమాల్లో అలా

> • ఒక అమ్మాయిగా చెబుతున్నా! అమ్మాయిల జీవితాలను ప్రతిబింబించే సినిమాలు వస్తే బావుంటుంది. చాలా సినిమాల్లో అమ్మాయిలు వస్తారు. హీరోలను ప్రేమిస్తారు. వారి జీవితంలో ఒక భాగమయిపోతారు. అంతకన్నా వారికి పెద్ద అస్థిత్వం ఉండదు. అమ్మాయిలకు కూడా ఒక జీవితం... వారికి కూడా భావోద్వేగాలు ఉంటాయనే విషయం చెప్పే కథలు బావుంటాయి"
>
> • నా ఉద్దేశంలో నటన అందరికీ వస్తుంది. కానీ నటించటానికి కొంత తర్ఫీదు అవసరం. సమయం కూడా వెచ్చించాలి. ఆసక్తి కూడా ఉండాలి. ఇవి రెండు ఉంటే ఎవరైనా నటించవచ్చు.
>
> • నా ఫేవరెట్ హీరోయిన్ ఆలియా భట్. సమంతా. వీరిద్దరి జర్నీ నాకు నచ్చుతుంది. ఇద్దరు కష్టపడి పైకి వచ్చినవాళ్లే!



• మీకు ఇప్పటి దాకా వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్?

'మల్లేశం' ప్రీమియర్ తర్వాత ఒకాయన వచ్చి "నువ్వు ఇంట్లో అమ్మాయిలా ఉన్నావు. సాఫ్ట్‌వేర్ నుంచి వచ్చావనుకోలేదు" అన్నారు. అది నాకు పెద్ద కాంప్లిమెంట్!

• మీరు పల్లెటూరి నేపథ్యం నుంచి వచ్చారు. ముంబయి హీరోయిన్లు, కాన్వెంట్లలో చదువుకొని వచ్చిన వారిని చూస్తే మొదట్లో ఎలా అనిపించేది?

మొదట్లో కొంత అభద్రతా భావం ఉండేది. 'నేను అందంగా లేనా? ఈ ఇండస్ట్రీకి సరిపోనా?' అనిపించేది. కానీ తర్వాత ఆ ఆలోచనలు తగ్గిపోయాయి. దానికి కారణం నేను చేసిన పాత్రలు కావచ్చు. కాలేజీలో ఉన్నప్పుడు- నేనే పెద్ద షోకిల్లానని అనుకొనేదాన్ని. ఇక్కడకు వచ్చిన తర్వాత అందంగా లేనా? అనే ఫీలింగ్ ఉండేది. కానీ దక్షిణాది పాత్రలకు- ఇక్కడ అమ్మాయిలే బావుంటారని, వారినే ప్రేక్షకులు ఆదరిస్తారని అర్థమయింది. దాంతో ఇప్పుడు నాకు ఎలాంటి అభద్రతా భావం లేదు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

మెయిన్‌స్ట్రీమ్ నటి కాదన్నా... పట్టించుకోను

ఆమె బాలీవుడ్‌లో చెలరేగుతున్న బెంగాల్ తుఫాన్. నటి, దర్శకురాలిగా ఆమె ఎప్పటికప్పుడు తన ప్రతిభ నిరూపించుకుంటూనే ఉంటుంది. ఆమె పేరు కొంకణా సేన్. ఇటీవలే 'కిల్లర్ సూప్' వెబ్‌సిరీస్‌తో ప్రేక్షకులముందుకు వచ్చింది. కొంకణా సేన్ గురించి కొన్ని విశేషాలు.

ఇటీవల వచ్చిన 'కిల్లర్ సూప్' వెబ్‌సిరీస్‌లో కొంకణా సేన్ నటనకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. కొంకణ పెద్దగా కలర్ ఉండదు. ఆమె ఇన్‌స్టాలాంటి వేదికలమీద పోజులేమీ కనిపించవు. చూడటానికి సాధారణంగా ఉంటుంది. అయితే ఆమెకు వచ్చిన పాత్రల్లో మాత్రం అసాధారణమైన నటన కనబరుస్తుంది. అందుకే ఆమె నటనకు ఫిదా అవ్వని ప్రేక్షకులుండరు.

అలా సినిమా ఇండస్ట్రీలోకి...

కొంకణా సేన్ బెంగాల్‌లో పుట్టి పెరిగింది. ఆమె తండ్రి ముకుల్ శర్మ రైటర్, జర్నలిస్ట్. తల్లి నటి, దర్శకురాలు... అపర్ణా సేన్. తాతయ్య చిదానంద రచయిత, ఫిల్మ్ క్రిటిక్. అలా క్రియేటివిటీ కుటుంబంలోంచి వచ్చిన కొంకణ.. నాలుగో తరగతి చదువుతున్నప్పుడే 'ఇందిర' అనే బెంగాలీ చిత్రంలో నటించింది. మ్యూజిక్ వినటం, పుస్తకాలు చదవటం, వరల్డ్ మూవీస్ చూడటం చిన్నప్పటి నుంచే ఆ నేచర్ అబ్బింది. పదిహేనేళ్ల వయసులో 'ఆమోదిని' అనే చిత్రంలో నటించింది. నటిగా తొలి చిత్రంలో నెగటివ్ షేడ్‌లో నటించింది. ఆమె నటిగా అందరికీ పరిచయమైంది మాత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ అయ్యర్'తో. తన తల్లి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో తమిళ గృహిణిగా కొంకణా నటించింది. తొలి చిత్రానికే ఉత్తమ నటిగా జాతీయ అవార్డు దక్కించుకుంది. ఇప్పటి వరకూ ఫిల్మ్‌ఫేర్ ప్రచురించిన '80 ఐకానిక్ పర్ఫార్మెన్స్'లో ఈ సినిమాలో నటించిన పాత్ర ఒకటి.

బాలీవుడ్‌లో క్రేజ్...

జాతీయ అవార్డ్ వచ్చినా ఆమెను బాలీవుడ్‌లో ఎవరూ పట్టించుకోలేదు. 'పేజ్ 3', 'ఓంకార', 'లైఫ్ ఇన్ మెట్రో', 'ఫ్యాషన్'.. లాంటి చిత్రాల్లో నటనకు స్కోప్ ఉండే చిన్న పాత్రల్లో నటించింది. రణబీర్ కపూర్‌తో నటించిన 'వేకప్ సిడ్'తో కమర్షియల్ హిట్ అందుకుంది. అయినా ఆమెకు సోలో హీరోయిన్ పాత్రలు రాలేదు. అందుకు బాధపడలేదు. తన ట్రాక్ ఏంటో ఆమెకు తెలుసు. అందుకే చాలా సందర్భాల్లో 'నటిగా నా స్థానం ఏంటో తెలుసు. నేనెప్పుడూ మెయిన్‌స్ట్రీమ్ హీరోయిన్ కాదు. ఎవరైనా కాదన్నా.. పెద్దగా పట్టించుకోను. ఇచ్చిన పాత్రకు న్యాయం చేయటమే నాకు ముఖ్యం' అన్నది.

> మా అమ్మ నాకు మంచి స్నేహితురాలు. తను కూడా చిన్న వయసులో కెరీర్‌లోకి వచ్చింది. ఇద్దరం కథల గురించి మాట్లాడతాం. జనరేషన్ గ్యాప్ ఎక్కువ ఉన్నా.. మా అమ్మ ఆలోచనాతీరు అద్భుతం.

దర్శకురాలిగా సక్సెస్...

తన తండ్రి ముకుల్ శర్మ రాసిన కథతో 'ఎ డెత్ ఇన్ ద గంజ్' చిత్రాన్ని తెరకెక్కించింది కొంకణ. ఈ చిత్రానికి 'బెస్ట్ డెబ్యూ డైరక్టర్' అవార్డు దక్కించుకుంది. 2000 నుంచి 2003 మధ్యలో వచ్చిన ముంబై డైరీస్' టెలివిజన్ సిరీస్‌లో ఆమె నటనకు ప్రశంసలు దక్కాయి. గతేడాది 'లస్ట్ స్టోరీస్ 2' చిత్రాన్ని తెరకెక్కించింది. 'మా అమ్మ నాకు మంచి స్నేహితురాలు. తను కూడా చిన్న వయసులో కెరీర్‌లోకి వచ్చింది. ఇద్దరం కథల గురించి మాట్లాడతాం. జెనరేషన్ గ్యాప్ ఎక్కువ ఉన్నా.. మా అమ్మ ఆలోచనాతీరు అద్భుతం. మా నాన్న ఫెమినిస్ట్. ఆయనో థింకర్. క్రియేటివిటీ పేరెంట్స్ మధ్యన నేను ఇలా దర్శకురాలిని కావటం పెద్ద గొప్పేమీ కాదు' అంటుంది కొంకణ.

అదే నాకు సంతోషం...

కొంకణా తన భర్త నుంచి నాలుగేళ్ల క్రితం విడిపోయింది. తనకో కొడుకు ఉన్నాడు. 'సినిమాలపైనే ఆలోచన. నాకు ఉండే స్పేస్‌లో ఫిట్ అవ్వాలనుకుంటా. అంతేకానీ స్టార్స్‌తో నటించాలనుకోను' అంటుంది. ముందు నుంచి స్టయిల్‌గా కెమెరా ముందు ఫోజులు ఇవ్వటం ఆమెకు నచ్చని వ్యవహారం. 'మా అమ్మనే నా వ్యక్తిత్వాన్ని మార్చింది. నటిగా రాణిస్తున్నానంటే ఆ ఘనత అమ్మదే' అంటుంది కొంకణా.



నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/5okMpcN లో చదవండి.

న్యూస్‌మేకర్

'కంటెంట్ ఉన్నోడికి కటౌట్ చాలు'...
పవన్‌కల్యాణ్ 'గబ్బర్‌సింగ్'లో బ్రహ్మానందం డైలాగ్. పక్కనున్న కటౌట్ అలాంటిదే.
ఫుడ్, ట్రావెల్ కంటెంట్‌లో ఈమెను కొట్టినవారు దేశంలోనే లేరు.
అందుకే ప్రధాని మోదీ నుంచి ఇటీవల 'బెస్ట్ ట్రావెల్ క్రియేటర్' అవార్డు అందుకుంది.
ఒక రిక్షా కార్మికుడి కూతురు... ఉన్నత చదువులు చదివి... దేశదేశాలు తిరుగుతూ...
భారతీయ సంస్కృతిని, వారసత్వాన్ని ఘనంగా ప్రపంచానికి పరిచయం చేస్తోంది.
'కర్లీ టేల్స్' యూట్యూబ్ చానల్ కామియా జాని కథ ఇది...

కంటెంట్‌తో ఫిదా చేస్తోంది

> **ఎన్నో ప్రత్యేకతలు...**
>
> చదువుతూనే ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా 2006లో కెరీర్ ప్రారంభించిన కామియా... ఆ తరువాత పలు ప్రముఖ టీవీ చానళ్లలో రిపోర్టర్‌గా, యాంకర్‌గా పని చేసింది. ఉద్యోగంలో భాగంగా విభిన్న రంగాలు, వ్యక్తులు, ప్రాంతాలకు సంబంధించి ఎన్నో పరిశోధనాత్మక కథనాలు రాసింది. కార్పొరేట్ లైఫ్‌స్టయిల్, ట్రావెలింగ్, పర్సనల్ ఫైనాన్స్, ఆరోగ్యం, ఫిట్‌నెస్... ఒకటని లేదు... ఏ విషయం అయినా అద్భుతమైన కంటెంట్ ఇవ్వడం ఆమె ప్రత్యేకత. ఈ అనుభవమే కామియాకు ఎన్నో అంశాలపై పట్టు రావడానికి కారణమైంది. సంకోచం లేకుండా ఎక్కడికైనా వెళ్లగలగడం, అనర్గళంగా, సూటిగా మాట్లాడగలగడం... ఇలా ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకుంది.



ఢిల్లీలోని భారత మండపం. సృజనకు రెక్కలు తొడిగినవారు... వినోదంతో విజ్ఞానాన్ని పంచేవారు... పర్యావరణ, సమాజ హితం కోసం తమ వంతు పాత్ర పోషిస్తున్నవారు... వివిధ రంగాల్లో రాణిస్తూ... సానుకూల మార్పు దిశగా చైతన్యం రగిలిస్తున్న ఇరవై మూడు మంది అక్కడ ఆశీనులయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ పేరు పేరునా వారిని పలుకరిస్తూ... భుజం తట్టారు. వారందరికీ 'నేషనల్ క్రియేటర్స్ అవార్డు'లు అందించి, అభినందించారు. ఆ ఇరవై మూడు మందిలో ఒకరే 32 ఏళ్ల కామియా జాని. 'బెస్ట్ ట్రావెల్ క్రియేటర్'గా అవార్డు అందుకున్న ఆమె... ఆ క్షణం ఎంతో భావోద్వేగానికి లోనైంది. తను ఎక్కడ మొదలైంది? ఎక్కడికి వచ్చి నిలబడింది! ఒక్కసారిగా తన గతం కళ్లముందు తిరిగింది ఆమెకు.

పేద కుటుంబం నుంచి..: ముంబయికి చెందిన కామియాకు మొదటి నుంచీ కొత్త ప్రదేశాల గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి. ఆమె తండ్రి మోహన్ రిక్షా కార్మికుడు. తల్లి పూనమ్ గృహిణి. కూతురు ఉత్సాహాన్ని గ్రహించిన ఆమె... ఉన్నంతలో ప్రోత్సహిస్తూ వచ్చారు. తల్లి ప్రోద్బలం, అండతోనే కామియా చదువుపై శ్రద్ధ పెట్టింది. పాఠశాల విద్యాభ్యాసం పూర్తయ్యాక 'ఆర్‌డీ నేషనల్ కాలేజీ'లో మాస్ మీడియా చదివింది. తరువాత 'జీజే అద్వానీ కాలేజీ'లో ఎల్ఎల్‌బీ పూర్తి చేసింది. చదువుకొనే రోజుల్లో అవకాశం దొరికినప్పుడల్లా కొత్త ప్రాంతాలు చుట్టివచ్చేది. ఏదైనా ఊరుకు వెళితే అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్ల గురించి తెలుసుకోవడం అలవాటుగా మారింది. రొటీన్‌కు భిన్నమైన జీవితాన్ని గడపాలనేది కామియా ఆకాంక్ష.

యూట్యూబ్ చానల్‌తో..: 2016లో కామియా జీవితం ఊహించని మలుపు తిరిగింది. ట్రావెలింగ్‌పై ఉన్న మక్కువతో 'కర్లీ టేల్స్' పేరిట యూట్యూబ్ చానల్ ప్రారంభించింది. ఫుడ్, ట్రావెలింగ్‌కు సంబంధించి వీడియోలు పోస్ట్ చేయడం మొదలుపెట్టింది. అలా నెలలు తిరక్కుం డానే చానల్ పాపులర్ అయిపోయింది. 30 లక్షల మంది ఈ చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 15 లక్షలమంది, ఫేస్‌బుక్‌లో 36 లక్షలమంది ఫాలో అవుతున్నారు. 2019లో 'ది మోస్ట్ ఇన్‌ఫ్లుయన్షియల్ కంటెంట్ మార్కెటింగ్ ప్రొఫెషనల్' అవార్డు గెలుచుకున్న కామియా... తన చానల్‌ను ఒక కంపెనీగా మార్చేసింది.

దానికి తనే చీఫ్ ఎడిటర్. సినీ, రాజకీయ, క్రీడారంగ ప్రముఖులు ఎందరితోనో కలిసి భోజనం చేసి, వారికి ఇష్టమైన రుచులను నెటిజనులకు పరిచయం చేసింది. అలాగే దేశంలోని ప్రముఖ దేవాలయాలను, అక్కడి ఆచారాలను చూపించింది. ఇప్పటికి 40 దేశాల్లో 123 నగరాలు చుట్టివచ్చిన ఆమె... 'మిగిలిన ప్రపంచాన్ని కూడా త్వరలోనే చూపిస్తా' అని తన అభిమానులకు చెబుతోంది.



అలనాటి కథ

గాంధీజీకి బట్టలు ఇద్దామా?

పూణే ఒకప్పుడు దేశంలోనే అందమైన నగరం. అందుకే అనేక రాజ కుటుంబాలు పూణేలోని కోరేగాం పార్క్ పక్కన నివాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. నా చిన్నతనంలో కొంతకాలం అక్కడే గడిచింది. ఆ సమయంలో గాంధీజీ పూణేకు వచ్చారు. ఆయనను కలవటం ఒక అద్భుత అనుభవం. నాటి సంఘటనలు ఇప్పటికీ నా కళ్ల



ముందు కదులుతున్నాయి.

పూణేలో కోరేగాంబన్ రోడ్డులో మా ప్యాలెస్ ఉండేది. పాలరాతి విగ్రహాలు.. ఫౌంటెన్స్.. ఏడు రోల్స్ రాయిస్ కార్లు.. వెండి, బంగారు పాత్రలు.. చుట్టూ అందమైన ఉద్యానవనాలతో చాలా ఆహ్లాదంగా ఉండేది. బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమం జరుగుతున్న సమయంలో దేశవ్యాప్త పర్యటనలో భాగంగా గాంధీజీ పూణేకు వచ్చారు. అప్పటికి నేను చాలా చిన్న పిల్లని. నాన్న రాజా ధన్‌రాజ్‌గిర్ అప్పుడప్పుడు నన్ను కూడా తనతో తీసుకువెళ్తూ ఉండేవారు. అలా ఒక రోజు నేను, నాన్న గాంధీజీకి, ఆయన భార్య కస్తూరీబాకు స్వాగతం చెప్పటానికి పూణే రైల్వే స్టేషన్‌కు వెళ్లాం. స్టేషన్‌కు వేల మంది వచ్చారు. గాంధీజీని చూడటం నాకు అదే తొలిసారి. మూడో తరగతి కంపార్ట్‌మెంట్ నుంచి దిగి ఆయన బయటకు వస్తుంటే- ప్రజలను నియంత్రించటం కష్టమయిపోయింది. మమ్మల్ని కలిసిన తర్వాత గాంధీజీ ఊరేగింపుగా ఎరవాడ వైపు వెళ్లి, అక్కడ నిరాహారదీక్ష చేయటం మొదలుపెట్టారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి ఆఘాఖాన్ ప్యాలెస్‌లో నిర్బంధించారు. అక్కడ కూడా గాంధీజీ తన దీక్ష మానలేదు. దీనితో ఆయన ఆరోగ్యం క్షీణించింది. ఈ వార్త తెలుసుకొని బి.సి.రాయ్, సరోజినీనాయుడు పూణేకు వచ్చారు. నాన్న వారికి మా ఇంట్లోనే వసతి ఏర్పాటు చేశారు. వారు ప్రతి రోజూ సాయంత్రం గాంధీజీని కలవటానికి ఆగాఖాన్ ప్యాలెస్‌కు వెళ్తూ ఉండేవారు. ఒక రోజు నేను, నాన్న కూడా వారితో వెళ్లాం. గాంధీజీని కలిశాం. చిన్న పిల్లను కావటంవల్ల నాకు గాంధీజీ పూర్తిగా బట్టలు ఎందుకు ధరించటం లేదో అర్థం కాలేదు. ప్యాలెస్‌కు తిరిగి వస్తున్న సమయంలో నాన్నతో "గాంధీజీకి బట్టలు ఇద్దమా? మనం బట్టలు ఇస్తే బావుంటుంది" అన్నా. నాన్నకు విపరీతమైన కోపం వచ్చింది. కారులో ఉన్న తన సెక్రటరీ వైపు తిరిగి... "ఇందిరకు మీరు మేనర్స్ నేర్పించాలి" అని తీవ్ర స్వరంతో అన్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత- నాన్న సెక్రటరీ గాంధీజీ గురించి చెప్పారు. పోరుబందర్ దివాన్‌గా పనిచేశారని.. ఇంగ్లాండ్‌లో చదువుకున్నారని.. గొప్ప విద్యావేత్త అని తెలుసుకొని చాలా ఆశ్చర్యపోయా! ఆ తర్వాత గాంధీజీ గురించి మరిన్ని పుస్తకాలు చదివా! నాకు కూడా ఖద్దరు ధరించాలనిపించింది. చాలా కాలం ఖద్దరు ధరించేదాన్ని. ఆ సమయంలో నాన్న- ఆల్ ఇండియా కాంగ్రెస్‌లో చాలా చురుకుగా పాల్గొనేవారు. నేను కూడా ఆయనతో సమావేశాలకు వెళ్లేదాన్ని!



గాంధీజీ రెండుసార్లు హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సమయంలో గాంధీజీకి నాన్న తోడుగా ఉండేవారు. 1929లో గాంధీజీ తొలిసారి హైదరాబాద్‌కు వచ్చినప్పుడు నాన్న రెండు వేల రూపాయలు విరాళం ఇచ్చారు. ఆయన పర్యటనకు తన రోల్స్ రాయిస్ వాహనం కూడా ఇచ్చారు. ఆ పర్యటనలో గాంధీజీ 12 వేల రూపాయల విరాళాలు సేకరించగలిగారు. రెండో సారి 1934లో గాంధీజీ హైదరాబాద్‌లో పర్యటించారు. నాన్న ఆయన పర్యటనకు కావాల్సిన కొన్ని ఏర్పాట్లను చేశారు. నాన్న రోల్స్ రాయిస్ కారును గాంధీజీ తన హైదరాబాద్ పర్యటనలో ఉపయోగించుకున్నారు. ఆ సమయంలో హైదరాబాద్‌ను నిజాం పాలిస్తూ ఉండేవారు. ఆయనకు బ్రిటిష్‌వారికి మంచి స్నేహ సంబంధాలు ఉండేవి. దాంతో బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీ పర్యటనపై అనేక ఆంక్షలు విధించింది. నాన్న ఆ ఆంక్షలను పట్టించుకోకుండా గాంధీజీని తీసుకురావటానికి సరోజినినాయుడు, వామనరావుగార్లతో కలిపి నాంపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లి స్వాగతం చెప్పారు. గాంధీజీ బస చేసిన ప్రాంతానికి వెళ్లి- నవాబ్ సాలార్‌జంగ్, మహరాజా కిషన్ ప్రసాద్‌లు వెళ్లి కలిసారు. ఆ రోజుల్లో అదొక సంచలనం. ఆ మర్నాడు వివేకవర్ధని మైదానంలో గాంధీజీ ప్రసంగం. ఆ సభకు కావాల్సిన ఏర్పాట్లన్నీ నాన్నే చేశారు. ఆ సభలో గాంధీజీ అంటరానితనం సమాజానికి ఎలాంటి హాని చేస్తుందో వివరించారు. హైదరాబాద్ ఈ విషయంలో ప్రగతి సాధించిందని.. ఇతర ప్రాంతాల్లో ఉన్న అంటరానితనం ఇక్కడ కనబడదని పేర్కొంటూ- నిజాంను మెచ్చుకున్నారు. ఈ వివరాలను అప్పటి పత్రికలన్నీ ప్రముఖంగా ప్రచురించాయి! ఇక్కడ చెప్పాల్సిన ఇంకో విషయం కూడా ఉంది. అది గోల్డెన్ థ్రెష్ హోల్డ్. దానిని నిర్మించింది మా పూర్వీకులే! సరోజిని దేవి దానిలో నివాసం ఉండేవారు. సరోజినీ నాయుడు కుమారుడు జయసూర్యను మా అమ్మ సోదరుడిగా భావించేది. ప్రతి ఏడాది రాఖీ కట్టేది. గాంధీజీకి హైదరాబాద్‌లో ఇష్టమైన ప్రదేశాల్లో గోల్డెన్ థ్రెష్‌హోల్డ్ ఒకటి. అది ఎప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉండాలనేది నా ఉద్దేశం. అందుకే దానిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు విరాళంగా ఇచ్చా! ఒకసారి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ చాన్సలర్- ఒక నాటక ప్రదర్శనకు పిలిచారు. విరామంలో వీసీ నన్ను- గోల్డెన్ థ్రెషోల్డ్ పునఃనిర్మాణం చేయాలి.. రెండు కోట్ల రూపాయల సాయం చేయగలరా? అని అడిగారు. నా దగ్గర అంత సొమ్ము లేదని చెప్పా. "ఇక్కడ ఒక హాల్ ఉంది. మీరు సాయం చేస్తే- దానిపైన మీ భర్త శేషేంద్రగారి పేరు మీద ఇంకో హాల్ నిర్మిస్తాం" అన్నారు. వెంటనే రెండు లక్షల రూపాయల విరాళం ఇచ్చా! హాలు పూర్తయిన తర్వాత శేషేంద్ర సన్మాన పత్రాలు, చిత్రాలు అక్కడ పెడతాం అని చెప్పారు. కానీ ఇప్పటికీ ఆ హామీ నెరవేరలేనేలేదు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండాలని నేను ఇచ్చిన విరాళం- ఇప్పటికీ ప్రజలకు అందుబాటులో లేదు!

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ గిరాకీ రెండింతలు



ఆరు ప్రధాన నగరాల్లో 35 శాతం వృద్ధి

ఈ త్రైమాసికానికి కొలియర్స్ అంచనా

న్యూఢిల్లీ: దేశంలో కార్యాలయ స్థలాల (ఆఫీస్ స్పేస్)కు గిరాకీ బలంగా కొనసాగుతున్నదని రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ కంపెనీ కొలియర్స్ ఇండియా పేర్కొంది. ఈ ఏడాది తొలి త్రైమాసికాని (జనవరి-మార్చి)కి హైదరాబాద్ సహా దేశంలోని 6 ప్రధాన నగరాల్లో ఆఫీస్ స్పేస్ డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 35 శాతం వృద్ధి చెందవచ్చని తాజా నివేదికలో అంచనా వేసింది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, పుణె నగరాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ మూడు నెలల్లో ఆరు నగరాల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ 1.36 కోట్ల చదరపు అడుగుల స్థాయిలో ఉండవచ్చని అంటోంది. గత ఏడాదిలో ఇదే కాలానికి ఈ నగరాల్లో మొత్తం 1.01 కోట్ల చదరపు అడుగుల కార్యాలయ స్థలాల లీజు ఒప్పందాలు కుదిరాయని కొలియర్స్ ఇండియా వెల్లడించింది. మిగతా నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ డిమాండ్ చాలా అధికంగా ఉందని, ఈ మూడు నెలలకు గాను 29 చదరపు అడుగులకు పెరగవచ్చని రిపోర్టు అంచనా వేసింది. గత ఏడాదిలో ఇదే కాలానికి నమోదైన 13 లక్షల చదరపు అడుగుల లీజింగ్‌తో పోలిస్తే రెట్టింపు కన్నా అధికమిది.

ఈ త్రైమాసికానికి హైదరాబాద్‌తో పాటు ముంబై, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో గిరాకీ పెరగగా.. చెన్నైలో తగ్గనుందని, పుణెలో దాదాపుగా గత ఏడాది స్థాయిలోనే (8 లక్షల చదరపు అడుగులు) నమోదు కానుందని రిపోర్టు పేర్కొంది. ముంబైలో డిమాండ్ 90 శాతం వృద్ధితో 19 లక్షల చదరపు అడుగులకు, బెంగళూరులో 25 శాతం పెరుగుదలతో 40 లక్షల చదరపు అడుగులకు, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 14 శాతం వృద్ధితో 25 లక్షల చదరపు అడుగులకు చేరుకోనుందని అంచనా. చెన్నైలో మాత్రం 6 శాతం తగ్గి 15 లక్షల చదరపు అడుగులకు పరిమితం కావచ్చని కొలియర్స్ ఇండియా పేర్కొంది. కాగా, ఈ త్రైమాసికంలో ఆరు నగరాల్లో కార్యాలయ స్థలం అద్దెకు తీసుకున్న కంపెనీల్లో టెక్నాలజీ, ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్, బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగాల వాటా 58 శాతంగా ఉందని కొలియర్స్ ఇండియా సీనియర్ డైరెక్టర్ అండ్ రీసెర్చ్ హెడ్ విమల్ నాడార్ తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ కంపెనీల నుంచి కొత్త కార్యాలయ స్థలాలకు గిరాకీ బలంగా ఉందని ఫ్లెక్సీ ఆఫీస్ స్పేస్ ఆపరేటర్ అర్బన్ వాల్ట్ సహ వ్యవస్థాపకులు, సీఈఓ అమల్ మిశ్రా అన్నారు. ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం, అందుబాటు ధరల్లో స్థలాలు అద్దెకు లభిస్తుండటం, నిపుణుల లభ్యత పెరగడం వంటి అంశాలు ఇందుకు దోహదపడుతున్నాయని అన్నారు.

బీమా.. ఇక ఈజీగా!



మరింత అందుబాటు ధరల్లో పాలసీలు

- కొనుగోలు, క్లెయిమ్ కూడా సులువు
- బీమా సుగమ్‌కు ఐఆర్‌డీఏఐ ఆమోదం

న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌లో బీమా పథకాల కొనుగోళ్లు, విక్రయాలతో పాటు క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ల కోసం ప్రతిపాదించిన డిజిటల్ మౌలిక వసతి 'బీమా సుగమ్' ఏర్పాటుకు భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ఆమోదం తెలిపింది. బీమా పాలసీల సార్వత్రీకరణ, ప్రజాస్వామీకరణతో పాటు పాలసీదారుల సాధికారత, వారి ప్రయోజనాల పరిరక్షణ, అలాగే 2047 నాటికి అందరికీ బీమా కవరేజీ కల్పించేందుకు బీమా సుగమ్ దోహదపడనుందని ఐఆర్‌డీఏఐ తన ప్రకటనలో పేర్కొంది.

బీమా సుగమ్ అంటే..?

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ లాంటిదే బీమా సుగమ్ కూడా. ఈ వేదిక ద్వారా జీవిత, సాధారణ, ఆరోగ్య, వాహన బీమా కంపెనీలు తమ పాలసీలను విక్రయిస్తాయి. కొనుగోలుదారులు తమ అవసరాలకు తగిన, నచ్చిన, అందుబాటు ధరలో ఉండే పాలసీని ఈ వేదిక ద్వారా కొనుగోలు చేసే వీలుంటుంది. ఒకే తరహా పాలసీకి సంబంధించి ఆయా కంపెనీలందిస్తున్న కవరేజీ, అదనపు రైడర్లు, వసూలు చేస్తున్న ప్రీమియం వంటి అంశాలను పోల్చి చూసుకుని కస్టమర్ తనకు నచ్చిన పాలసీని ఎంచుకునే వీలుంటుంది. బీమా పాలసీ కొనుగోలుతో పాటు రెన్యువల్, క్లెయిమ్ సెటిల్‌మెంట్, బీమా పోర్టబిలిటీ, ఇబ్బందుల పరిష్కారం వంటి అన్నీ సేవలనూ ఈ పోర్టల్ ద్వారా పొందవచ్చు. బీమా రంగ సంబంధిత వర్గాలందరినీ అనుసంధానించే ఈ ఉమ్మడి వేదిక ద్వారా పాలసీల విక్రయంలో పారదర్శకత, దక్షత పెరగనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ప్రస్తుతం ఏజెంట్లు, బ్రోకర్ల ద్వారా బీమా పాలసీ కొనుగోలు చేసే సమయంలో దరఖాస్తు నింపడంతోపాటు పలు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. క్లెయిమ్, రెన్యువల్ సమయాల్లోనూ ఇదే భౌతిక ప్రక్రియ కొనసాగుతుంది. బీమా సుగమ్ అందుబాటులోకి వచ్చాక అంతా ఆన్‌లైన్‌లోనే పూర్తి చేయవచ్చు. పేపర్ వర్క్ బెడద తప్పుతుంది. పాలసీని కూడా ఎలక్ట్రానిక్ రూపంలోనే జారీ చేస్తారు.

కస్టమర్లకు ప్రయోజనాలు

- బీమా పథకాల కొనుగోలు, క్లెయిమ్ సులభతరం కానుంది. అంతేకాదు, పలు పథకాలు కొనుగోలు చేసిన కస్టమరు ఒక్కో పాలసీకి విడిగా విండో ట్యాబ్ ఓపెన్ చేయడానికి బదులుగా.. ఒకే విండోలో అన్ని రకాల (లైఫ్, హెల్త్, నాన్-లైఫ్) పాలసీలను, వాటి వివరాలను వీక్షించవచ్చు.
- ఇన్సూరెన్స్ పాలసీలు మరింత అందుబాటు ధరల్లో లభించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో పాలసీల విక్రయం జరుగుతున్నప్పటికీ, వెబ్ అగ్రిగేటర్లు పాలసీల విక్రయంపై కొంత కమీషన్ వసూలు చేస్తున్నారు. బీమా సుగమ్ ద్వారా నేరుగా కస్టమర్లకు పాలసీలు విక్రయించే కంపెనీలు బ్రోకర్లు, ఏజెంట్లకు కమీషన్ చెల్లించాల్సిన అవసరం తప్పుతుంది. కాబట్టి, మరింత చౌకగా పాలసీలను ఆఫర్ చేసే వెసులుబాటు ఉంటుంది. అంతేకాదు, కస్టమర్లు ఈ పోర్టల్ సేవలను వినియోగించుకునేందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

అపెరల్ వ్యాపారానికి పోకర్ణ గుడ్‌బై

హైదరాబాద్: పోకర్ణ లిమిటెడ్.. అపెరల్ వ్యాపారానికి గుడ్‌బై చెప్పింది. కంపెనీ అపెరల్ డివిజన్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల 31 నుంచి ఇది అమల్లోకి వస్తుందని వెల్లడించింది. శనివారం నాడు సమావేశమైన కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఈ నిర్ణయం తీసుకుందని తెలిపింది. కంపెనీకి చెందిన అపెరల్ డివిజన్ చాలా కాలంగా నిర్వహణాపరమైన సవాళ్లు ఎదుర్కొంటూ వస్తోందని, అంతేకాకుండా నష్టాలను మూటగట్టుకుంటూ వస్తోందని పోకర్ణ తెలిపింది. రానున్న రోజుల్లో ఈ డివిజన్‌ను నిర్వహించటం సాధ్యం కాదని భావించటంతో మూసివేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. కాగా అడిషనల్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఇండిపెండెంట్ డైరెక్టర్లుగా ప్రశాంత్ నందిగాల, అగ్నిహోత్ర దక్షిణ మూర్తి చావలి, పౌలోమీ ధావన్‌లను నియమించినట్లు వెల్లడించింది. మూడేళ్ల పాటు వీరు ఈ పదవిలో ఉంటారని పేర్కొంది.

భారత్‌లోని చమురు నిల్వల ఎగుమతికి

అడ్నోక్‌కు ప్రభుత్వ అనుమతి

న్యూఢిల్లీ: భారత్‌లో కంపెనీ నిల్వ చేసుకున్న చమురును ఎగుమతి చేసుకునేందుకు అబుదాబీ నేషనల్ ఆయిల్ కంపెనీ (అడ్నోక్)కి కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. మంగళూరులోని భూగర్భ వ్యూహాత్మక నిల్వల క్షేత్రంలో అడ్నోక్ తన ముడిచమురును నిల్వ చేసింది. కంపెనీకి కార్యకలాపాల నిర్వహణలో వెసులుబాటు కల్పించేందుకు మన దేశంలో దాచుకున్న ముడి చమురును ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు అనుమతిని ఇచ్చినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ శనివారం వెల్లడించింది. ప్రస్తుతం క్రూడాయిల్‌ను ప్రభుత్వ రంగానికి చెందిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) తప్ప మరే సంస్థ ఎగుమతి చేసేందుకు అనుమతి లేదు. ఈ నిబంధన అలాగే కొనసాగుతుందని, అడ్నోక్‌కు మాత్రం ఇందుకు మినహాయింపు కల్పించినట్లు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

ఈ నెల 31 లోపు చేయాల్సిన పనులేమిటంటే?

ఇదీ GST



రాంబాబు గొండాల

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) కొద్ది రోజుల్లో ముగియనుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని పన్ను చెల్లింపుదారులు ఈ లోపు చేయాల్సిన పనులు ఏమిటి? కొత్త ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇవ్వాల్సిన అప్లికేషన్లు లేదా డిక్లరేషన్స్ ఏమిటి? మొదలైన విషయాలు మీకోసం.

ముందుగా జీఎస్‌టీలో రిజిస్టర్ అయిన ప్రతి ఒక్కరూ తమ టర్నోవర్‌ను సరిచూసుకోవాలి. ఒక ఆర్థిక సంవత్సరపు టర్నోవర్ జీఎస్‌టీలోని రిటర్నులకు, ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులకు సరిపోవాలి. వారి పద్దు పుస్తకాలతో పోలిస్తే ఎలాంటి వ్యత్యాసం ఉండకూడదు. అలాగే జీఎస్‌టీలో చిన్న, మధ్య తరగతి వ్యాపారులను దృష్టిలో ఉంచుకుని ప్రకటించిన అనేక ప్రయోజనాలకు గడిచిన ఆర్థిక సంవత్సరంలోని టర్నోవర్ ఆధారంగా అర్హత ఉంటుంది. అంటే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇలాంటి ప్రయోజనం ఏదైనా పొందాలంటే, ఈ ఆర్థిక సంవత్సరపు టర్నోవర్ ఆధారమవుతుంది. ఉదాహరణకు కాంపోజిషన్ స్కీమ్‌కు అర్హత పొందాలంటే టర్నోవర్ రూ.కోటి యాభై లక్షలు దాటకూడదనే నిబంధన ఉంది.

ముఖ్యంగా ఎంతో ప్రాచుర్యం పొందిన క్యూఆర్‌ఎంపీ స్కీమ్‌కు అర్హత పొందాలంటే టర్నోవర్ రూ.5 కోట్లు దాటకూడదు. అలాగే, సవరించిన నిబంధనల ప్రకారం రూ.5 కోట్ల టర్నోవర్ దాటితే ఈ-ఇన్వాయిస్ తప్పనిసరి. కాబట్టి టర్నోవర్ సరిగ్గా చూసుకోవటం తప్పనిసరి.

ఇంకా సెజ్‌లకు జరిపే సరఫరాలకు లేదా విదేశాలకు చేసే ఎగుమతులకు పన్ను వర్తించకూడదంటే లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ అవసరం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ సదుపాయం ఉపయోగించుకోవాలంటే మార్చి 31లోపు ఈ లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ దాఖలు చేయాలి. ఇంకా చెప్పాలంటే, ఎవరైనా వ్యాపారస్తుడు పన్ను వర్తించే, పన్ను మినహాయింపు పొందే సరఫరాలు చేస్తూ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకునేటట్లయితే నిబంధనల ప్రకారం ప్రతి నెలా తీసుకున్న క్రెడిట్ నుంచి అర్హత లేని మేరకు క్రెడిట్ రివర్స్ చేయాలన్న విషయం తెలిసిందే. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ప్రతి నెలా క్రెడిట్ రివర్స్ చేసినప్పటికీ, సంవత్సరంలో తీసుకున్న మొత్తం క్రెడిట్‌ను పరిగణనలోకి తీసుకుని ఆ సంవత్సరానికి రివర్స్ చేయాల్సిన మొత్తాన్ని లెక్కించాలి. నెలవారీ రివర్స్ చేసిన మొత్తాల కంటే ఈ మొత్తం ఎక్కువ ఉంటే.. ఆ మేరకు ప్రభుత్వానికి చెల్లించాలి. ఈ మొత్తం చెల్లించటానికి అక్టోబరు 20 వరకు సమయం ఉన్నప్పటికీ ఈ నెల (మార్చి) 31 లోపు చెల్లిస్తే ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదు. అలాగే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకునే బిల్డర్లు అంటే వాణిజ్య నిర్మాణాలు చేసే వారు కావచ్చు లేదా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వర్తించే పాత స్కీమ్‌లో ఉన్న వారు కావచ్చు. వీరు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చే నాటికి అమ్ముడుపోకుండా మిగిలిపోయిన ఫ్లాట్స్‌కు సంబంధించి క్రెడిట్ రివర్స్ చేయాలి. దీనికి కూడా పైన చెప్పిన గడువు వర్తిస్తుంది.

అంతేకాకుండా క్రెడిట్ నోట్స్, డెబిట్ నోట్స్ జారీ చేయాల్సి ఉన్నా.. అర్హత ఉండి కూడా తీసుకోకుండా మిగిలిపోయిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఏమైనా ఉన్నా, పొరపాటున ఎక్కువ క్రెడిట్ తీసుకున్నా గడువు తేదీ వరకు వేచి ఉండకుండా ఈ నెల 31 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయటం మంచిది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

టాటా ఏఐఏ రైజింగ్ ఇండియా ఫండ్

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్.. రైజింగ్ ఇండియా ఫండ్‌ను విడుదల చేసింది. భారత వృద్ధి జోరులో పాలుపంచుకోవటంతో పాటు లాభాలు పొందాలనుకునే వారి కోసం ప్రత్యేకంగా ఈ కొత్త ఫండ్‌ను రూపొందించినట్లు తెలిపింది. ఈ నెల 31న ముగియనున్న ఈ ఫండ్ లో ఒక్కో యూనిట్ రూ.10తో అందుబాటులో ఉండనుంది. ఈ ఫండ్.. ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత విభాగాల్లో 70-100% వరకు పెట్టుబడులు పెట్టనుంది. మిగిలిన 0-30% డెట్, మనీ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయనుంది.

- మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ తాజాగా టెక్నాలజీ స్టార్టప్ అమాల్గో ల్యాబ్స్‌లో 6.5 శాతం వాటాను దాదాపు రూ.2 కోట్లకు కొనుగోలు చేసింది. మారుతి సుజుకీ ఇన్నోవేషన్ ఫండ్ ద్వారా ఈ పెట్టుబడి పెట్టింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,820 ▼	61,250 ▼	80,500 ▲
ముంబై	66,268 ▼	60,702 ▼	74,052 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ	
హైదరాబాద్	395
24వ తేదీ	
చిత్తూరు	458
గోదావరి	425
విజయవాడ	425
విశాఖపట్నం	415
వరంగల్	397


డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118
వరంగల్	118
కరీంనగర్	118
మహబూబ్‌నగర్	118
కర్నూలు	118
విశాఖపట్నం	110
గోదావరి	116
విజయవాడ	116
గుంటూరు	117
ఒంగోలు	117
చిత్తూరు	115

క్లాసెన్ పోరాడినా..



రస్సెల్ ఆల్‌రౌండ్ షో

200 ఐపీఎల్‌లో ఆండ్రీ రస్సెల్ సిక్సర్ల సంఖ్య. ఓవరాల్‌గా ఈ టోర్నీలో ఎక్కువ సిక్సర్లు బాదిన తొమ్మిదో బ్యాటర్.

ఆండ్రీ రస్సెల్ (25 బంతుల్లో 64 నాటౌట్)

సన్‌రైజర్స్‌కు తప్పని ఓటమి

ఆఖరి బంతికి కోల్‌కతా విజయం

పరుగుల వరద పారిన ఈడెన్‌లో అదిరిపోయే మ్యాచ్.. 4 ఓవర్లలో 76 పరుగులు కావాల్సి వేళ హెన్రిచ్ క్లాసెన్ అసమాన ఆటతీరును ప్రదర్శించాడు. బంతి పడితే సిక్సర్ అనే రీతిలో విధ్వంసం సాగించాడు. ఇక సన్‌రైజర్స్ గెలుపు ఖాయమే అనుకున్న వేళ ఆఖరి ఓవర్‌లో పేసర్ హర్షిత్ మాయ చేశాడు. దీంతో చివరి బంతికి గెలిచిన కేకేఆర్ ఊపిరిపీల్చుకుంది. అయితే లీగ్‌లో అత్యంత విలువైన ఆటగాడు స్టార్క్ అసలే మాత్రం ప్రభావం చూపలేదు..

కోల్‌కతా: కొత్త జెర్సీ. కొత్త కెప్టెన్‌తో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తృటిలో విజయాన్ని చేజార్చుకుంది. భారీ లక్ష్య ఛేదనలో హెన్రిచ్ క్లాసెన్ (29 బంతుల్లో 8 సిక్సర్లతో 63) ప్రత్యర్థికి ముచ్చెమటలు పట్టించినా ఫలితం లేకపోయింది. దీంతో శనివారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ 4 పరుగుల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్లకు 208 రన్స్ చేసింది. ఆండ్రీ రస్సెల్ (25 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 64 నాటౌట్), సాల్ట్ (54) మెరుపు ఆటను ప్రదర్శించారు. నటరాజన్‌కు మూడు, మార్కండేకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 204 పరుగులు చేసి ఓడింది. మయాంక్ (32), అభిషేక్ (32) రాణించారు. హర్షిత్‌కు మూడు, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ రస్సెల్‌కు రెండు వికెట్లు దక్కాయి.

ఛేదన బాగానే ఉన్నా..: భారీ ఛేదనను సన్‌రైజర్స్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. ఓపెనర్లు మయాంక్, అభిషేక్ పోటాపోటీ చెలరేగారు. నాలుగో ఓవర్‌లో మయాంక్ 6,4 బాదగా ఐదో ఓవర్‌లో అభిషేక్ 4,6,6తో మరింత జోరు చూపాడు. ఆరో ఓవర్‌లో మయాంక్ వెనుదిరిగినా పవర్‌ప్లేలో జట్టు 65 పరుగులతో నిలిచింది. అటు అభిషేక్‌ను రస్సెల్ అవుట్ చేసినా త్రిపాఠి (20), మార్క్రమ్ (18) ఓవర్‌కు పది రన్‌రేట్ తగ్గకుండా చూడగా పది ఓవర్లలో జట్టు 99రన్స్ సాధించింది. కానీ ఇద్దరూ వరుస ఓవర్లలో వెనుదిరగడం దెబ్బతీసింది. సమద్ (15) దూకుడు కాసేపే అయింది.



క్లాసెన్ (29 బంతుల్లో 63)

వామ్మో.. క్లాసెన్: చివరి నాలుగు ఓవర్లలో క్లాసెన్ అంచనాలకు మించి ఆడాడు. సిక్సర్లు బాదడమే లక్ష్యంగా ఆడేస్తూ కేకేఆర్‌కు వణుకు పుట్టించాడు. 18వ ఓవర్‌లో తను రెండు సిక్సర్లు, షాబాజ్ ఓ సిక్సర్‌తో 21 రన్స్ సమకూరాయి. దీంతో సమీకరణం 12 బంతులు 39 రన్స్‌కు చేరింది. అయితే స్టార్క్ వేసిన 19వ ఓవర్‌లో క్లాసెన్ మూడు సిక్సర్లు, షాబాజ్ సిక్సర్ బాదడంతో 26 పరుగులు వచ్చాయి. ఆఖరి ఓవర్‌లో 13 పరుగులే కావాల్సి ఉండడంతో కేకేఆర్‌కు ఓటమి తప్పదనిపించింది. తొలి బంతినే క్లాసెన్ సిక్సర్‌గా మలిచినా పేసర్ హర్షిత్ ఒత్తిడికి లోను కాలేదు. ముందు షాబాజ్, ఆ తర్వాత క్లాసెన్ వికెట్లు తీయడంతో కేకేఆర్ ఆశలు పెరిగాయి. ఆఖరి బంతికి ఐదు రన్స్ అవసరమైనా కమిన్స్ (0 నాటౌట్) కనీసం టచ్ కూడా చేయలేకపోయాడు.

సాల్ట్ మెరుపు ఆరంభం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఇన్నింగ్స్‌లో ఓవైపు ఓపెనర్ ఫిల్ సాల్ట్ బాదుడు సాగుతుంటే.. మరోవైపు టపటపా వికెట్లు కోల్పోయింది. 51/4 స్కోరుతో కష్టాల్లో పడినా, జట్టు 200 దాటిందంటే రస్సెల్ విజృంభణే కారణం. ఇక నాలుగో ఓవర్‌లో వెంకటేశ్ అయ్యర్ (7), కెప్టెన్ శ్రేయాస్ (0)ల వికెట్లు తీసి పేసర్ నటరాజన్ షాక్ ఇచ్చాడు. రాణా (9)రివర్స్ హిట్‌కు వెళ్లి మార్కండే గూగ్లీకి బలయ్యాడు.

ఏమా బాదుడు..: గత సీజన్‌లో దారుణంగా విఫలమైన రస్సెల్ ఈసారి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 16వ ఓవర్‌లో మూడు సిక్సర్లు, 17వ ఓవర్‌లో 6,4 బాదడంతో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. భువీ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో రస్సెల్ 6,6,4తో 26 రన్స్ రాబట్టడంతో స్కోరు 200కి చేరింది. 20 బంతుల్లోనే రస్సెల్ ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. మరోవైపు చివరి 30 బంతుల్లో కేకేఆర్ 85 పరుగులు సాధించడం విశేషం.

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి) యాన్సెన్ (బి) మార్కండే 54, నరైన్ (రనౌట్/షాబాజ్) 2, వెంకటేశ్ (సి) యాన్సెన్ (బి) నటరాజన్ 7, శ్రేయాస్ (సి) కమిన్స్ (బి) నటరాజన్ 0, నితీశ్ (సి) త్రిపాఠి (బి) మార్కండే 9, రమణ్‌దీప్ (సి) మార్కండే (బి) కమిన్స్ 35, రింకూ (బి) మార్క్రమ్ (బి) నటరాజన్ 23, రస్సెల్ (నాటౌట్) 64, స్టార్క్ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు 8, (మొత్తం 20 ఓవర్లలో) 208/7 : వికెట్లపతనం:** 1-23, 2-32, 3-32, 4-51, 5-105, 6-119, 7-200 **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-51-0, యాన్సెన్ 3-0-40-0, నటరాజన్ 4-0-32-3, కమిన్స్ 4-0- 32-1, మార్కండే 4-0-39-2, షాబాజ్ 1-0-14-0

హైదరాబాద్: మయాంక్ (సి) రింకూ (బి) హర్షిత్ 32, అభిషేక్ (సి) వరుణ్ (బి) రస్సెల్ 32, త్రిపాఠి (సి) హర్షిత్ (బి) సునీల్ 20, మార్క్రమ్ (సి) రింకూ (బి) వరుణ్ 18, క్లాసెన్ (సి) సుయాష్ (బి) హర్షిత్ 63, సమద్ (సి) వెంకటేశ్ (బి) రస్సెల్ 15, షాబాజ్ (సి) శ్రేయాస్ (బి) హర్షిత్ 16, యాన్సెన్ (నాటౌట్) 1, కమిన్స్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు 7, (మొత్తం 20 ఓవర్లలో) 204/7 : వికెట్లపతనం :** 1-60, 2-71, 3-107, 4-111, 5-145, 6-203, 7-204 : **బౌలింగ్:** స్టార్క్ 4-0-53-0, హర్షిత్ రాణా 4-0-33-3,వరుణ్ 4-0-55-1, సునీల్ 4-0-19-1, రస్సెల్ 2-0-25-2, సుయాష్ 2-0-18-0.

స్పోర్ట్స్

డబ్ల్యూటీటీ ఫైనల్స్‌లో శ్రీజ


బీరుట్ (లెబనాన్): డబ్ల్యూటీటీ ఫీడర్ బీరుట్-2 టోర్నమెంట్ డబుల్స్‌లో తెలుగమ్మాయి ఆకుల శ్రీజ జోడీ ఫైనల్స్‌కు చేరింది. సింగిల్స్‌లో శ్రీజ, సాథియన్ క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించారు. శనివారం ముగిసిన డబుల్స్ సెమీస్ పోరులో శ్రీజ-దియ జోడీ జారేష్-సర్బినోజ్(కజకిస్థాన్) ద్వయంపై నెగ్గింది. సింగిల్స్ ప్రీక్వార్టర్స్ పోరులో శ్రీజ 3-1తో సహచర ప్యాడ్లర్ అర్చన కామత్‌పై నెగ్గింది. తొలి గేమ్‌లో 11-4తో సునాయాసంగా నెగ్గిన అర్చన, రెండోగేమ్‌లో 8-11తో ఓటమి పాలైంది. ఆతర్వాత 11-4, 11-8 స్కోరుతో వరుస గేములు నెగ్గి విజేతగా నిలిచింది. పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో సాథియన్ 3-1తో నికోలస్ (చిలీ)పై నెగ్గగా, మిక్స్‌డ్‌లో మనవ్-అర్చన జోడీ ఓటమి పాలైంది.

భారీ ఆధిక్యం దిశగా శ్రీలంక

బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక 211 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. మ్యాచ్‌కు రెండో రోజైన శనివారం ఆట ముగిసే సమయానికి శ్రీలంక తమ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 119 పరుగులు సాధించింది. కరుణరత్నె (52) రాణించాడు. అంతకుముందు 32/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 188 పరుగులకు కుప్పకూలడంతో లంకకు 92 పరుగుల ఆధిక్యం లభించింది. లంక తొలి ఇన్నింగ్స్‌లో 280 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

పీసీబీ మాజీ చైర్మన్ షహర్యార్ మృతి



లాహోర్: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మాజీ చైర్మన్ షహర్యార్ ఖాన్ (89) దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో శనివారం తుదిశ్వాస విడిచారు. భోపాల్ రాజ కుటుంబంలో జన్మించిన షహర్యార్ భారత జట్టు మాజీ కెప్టెన్ మన్సూర్ అలీ ఖాన్ పటౌడికి సమీప బంధువు.. షహర్యార్ 2003-2006, తర్వాత 2014-2017 మధ్య కాలంలో పీసీబీ చైర్మన్‌గా పని చేశారు. 1999, 2003 వరల్డ్‌కప్‌లకు పాక్ జట్టు మేనేజర్‌గా కూడా విధులు నిర్వహించారు.

రిటైర్మెంట్‌పై ఇమాద్ యూ-టర్న్



లాహోర్: టీ20 వరల్డ్‌కప్‌నకు అందుబాటులో ఉండేందుకుగాను పాకిస్థాన్ స్పిన్ ఆల్‌రౌండర్ ఇమాద్ వసీం (35) తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకొన్నాడు. గత నవంబరులో వసీం అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం విదితమే.

కిరణ్, రజావత్ పరాజయం

బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో యువ ఆటగాళ్లు కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్ పోరు క్వార్టర్‌ఫైనల్లో ముగిసింది. రాస్మస్ జమ్కే (డెన్మార్క్)తో జరిగిన రౌండ్-8 మ్యాచ్‌లో కిరణ్ 23-21, 17-21, 15-21తో పోరాడి ఓడాడు. మరో క్వార్టర్స్‌లో తైపీకి చెందిన చౌ టీన్ చెన్ 21-5, 21-19తో ప్రియాన్షు రజావత్‌పై గెలుపొందాడు.

నేటి మ్యాచ్‌లు

రాజస్థాన్ x లఖ్‌నవూ	మ.3.30 గం. నుంచి
గుజరాత్ x ముంబై	రాత్రి 7.30 గం. నుంచి

అదరగొట్టిన కర్రాన్



కర్రాన్ (63)

● పంజాబ్ బోణీ ● 4 వికెట్లతో ఓడిన ఢిల్లీ

చండీగఢ్: రీఎంట్రీని ఘనంగా చాటాలనుకొన్న రిషబ్ పంత్ ఆశలపై సామ్ కర్రాన్ (47 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 63) నీళ్లు కుమ్మరించాడు. లివింగ్‌స్టోన్ (21 బంతుల్లో 38 నాటౌట్) కూడా రాణించడంతో.. కొత్త హోంగ్రౌండ్‌లో పంజాబ్ కింగ్స్ శుభారంభం చేసింది. ఐపీఎల్‌లో శనివారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 4 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. 453 రోజుల తర్వాత మళ్లీ మైదానంలోకి పునరాగమనం చేసిన ఢిల్లీ కెప్టెన్ పంత్ (13 బంతుల్లో 2 ఫోర్లతో 18) ఈ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. బ్యాట్‌తో అతడు పెద్దగా మెరవకపోయినా.. ఉత్సాహంగా కీపింగ్ చేస్తూ ఒక స్టంపింగ్‌తోపాటు క్యాచ్‌ను తీసుకున్నాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 20 ఓవర్లలో 174/9 స్కోరు చేసింది. మార్ష్ (20)తో కలసి తొలి వికెట్‌కు 39 పరుగులు జోడించిన వార్నర్ (29).. షాయ్ హోప్ (33)తో రెండో వికెట్‌కు 35 రన్స్ భాగస్వామ్యం నెలకొల్పాడు. హోప్, పంత్, రికీ భుయ్ (3) వెంటవెంటనే అవుటయ్యారు. చివర్లో అభిషేక్ పోరెల్ (10 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 32 నాటౌట్) వేగంగా ఆడడంతో క్యాపిటల్స్ స్కోరు 170 దాటింది.

అలవోకగా..: ఛేదనలో పంజాబ్ 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 177 పరుగులు చేసి గెలిచింది. బెయిర్‌స్టో (9), ధవన్ (22) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. అయితే, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (26)తో కలసి మూడో వికెట్‌కు 42 పరుగులు జోడించిన కర్రాన్ జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. సింగ్‌ను కుల్దీప్ అవుట్ చేసినా.. లివింగ్‌స్టోన్‌తో కలసి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' కర్రాన్ 5వ వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో పంజాబ్ సునాయాసంగా నెగ్గింది. గాయపడిన ఇషాంత్ శర్మ (1/16) మళ్లీ బౌలింగ్‌కు రాకపోవడం డెత్ ఓవర్లలో ప్రభావం చూపింది. ఖలీల్, కుల్దీప్ చెరో 2 వికెట్లు కూల్చారు.

స్కోరుబోర్డు

ఢిల్లీ: వార్నర్ (సి) జితేష్ (బి) హర్షల్ 29, మార్ష్ (సి) చాహర్ (బి) అర్ష్‌దీప్ 20, హోప్ (సి) హర్‌ప్రీత్ (బి) రబాడ 33, పంత్ (సి) బెయిర్‌స్టో (బి) హర్షల్ 18, రికీ భుయ్ (సి) జితేష్ (బి) హర్‌ప్రీత్ 3, స్టబ్స్ (సి) శశాంక్ (బి) చాహర్ 5, అక్షర్ (రనౌట్) 21, సుమీత్ (సి) జితేష్ (బి) అర్ష్‌దీప్ 2, పోరెల్ (నాటౌట్) 32, కుల్దీప్ (రనౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం 20 ఓవర్లలో 174/9; వికెట్ల పతనం:** 1-39, 2-74, 3-94, 4-111, 5-111, 6-128, 7-138, 8-147, 9-174; **బౌలింగ్:** కర్రాన్ 1-0-10-0, అర్ష్‌దీప్ 4-0-28-2, రబాడ 4-0-36-1, హర్‌ప్రీత్ 3-0-14-1, రాహుల్ చాహర్ 4-0-33-1, హర్షల్ 4-0-47-2.

పంజాబ్: ధవన్ (బి) ఇషాంత్ 22, బెయిర్‌స్టో (రనౌట్) 9, ప్రభ్‌సిమ్రన్ (సి) వార్నర్ (బి) కుల్దీప్ 26, కర్రాన్ (బి) ఖలీల్ 63, జితేష్ (స్టంప్డ్) పంత్ (బి) కుల్దీప్ 9, లివింగ్‌స్టోన్ (నాటౌట్) 38, శశాంక్ (సి) పంత్ (బి) ఖలీల్ 0, హర్‌ప్రీత్(నాటౌట్)2;**ఎక్స్‌ట్రాలు:8;మొత్తం: 19.2 ఓవర్లలో 177/6; వికెట్ల పతనం:** 1-34,2-42, 3-84, 4-100, 5-167, 6-167; **బౌలింగ్:**ఖలీల్ 4-0-43-2,ఇషాంత్ 2-0-16-1,మార్ష్ 4-0-52-0,అక్షర్ 4-0-25-0,కుల్దీప్ 4-0-20-2, సుమీత్ 1.2-0-19-0.

ధోనీ అన్ని మ్యాచ్‌లూ ఆడకపోవచ్చు..



గేల్

చెన్నై: కెప్టెన్సీని వదిలేసుకున్న చెన్నై స్టార్ మహేంద్ర సింగ్ ధోనీ ఈ సీజన్‌లో అన్ని మ్యాచ్‌లూ ఆడకపోవచ్చునని వెస్టిండీస్ లెజెండరీ ఆటగాడు క్రిస్ గేల్ అంటున్నాడు. 'ధోనీ అన్ని పోటీల బరిలో దిగే అవకాశాల్లేవు. మ్యాచ్‌ల మధ్య కొంత విరామం తీసుకొనే చాన్సుంది. అసలందుకే సారథ్య బాధ్యతలనుంచి వైదొలిగాడు. ఏదేమైనా ఈసారి ధోనీ బ్యాటింగ్ మెరుపులు మాత్రం ఖాయం' అని అన్నాడు.

రాక్షస పాలన అంతానికే కలిశాం

- సామాజిక వర్గాల మధ్య చిచ్చుపెట్టి గెలవాలని చూస్తున్న వైసీపీ
- టీడీపీ వర్క్‌షాప్‌లో బీజేపీ నేత శ్రీపాద సత్యనారాయణ

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాక్షస పాలన అంతానికే మూడు పార్టీలు కలిసి పోటీచేయాలని నిర్ణయానికి వచ్చాయని బీజేపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ శ్రీపాద సత్యనారాయణ పేర్కొన్నారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్ సమావేశ మందిరంలో టీడీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ అభ్యర్థుల కోసం నిర్వహించిన వర్క్‌షాప్‌లో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. 'సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెట్టి గెలవాలని వైసీపీ చూస్తోంది. ఆ విషయంలో అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలి. అమరావతి, పోలవరం, రైల్వే జోన్, విశాఖ ఉక్కు విషయంలో బీజేపీ నుంచి మరి కొంత స్పష్టత రావాల్సి ఉంది. త్వరలో అది వస్తుందని ఆశిస్తున్నాం. కుల గణన సమాచారాన్ని వైసీపీ తన వద్ద పెట్టుకొని బయటకు చెప్పడం లేదు. దానిని ఖచ్చితంగా బహిర్గతం చేసేలా చర్యలు తీసుకోవాలి. రాజకీయ పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులపై ఉన్న కేసులను పోలీస్ శాఖ బహిరంగంగా ఆన్‌లైన్‌లో పెట్టాలన్నది మా డిమాండ్. దీనిపై ఎన్నికల కమిషన్‌ను కోరాలని అనుకొంటున్నాం. మూడు పార్టీలు కింద నుంచి సమన్వయం పెంచుకోవడానికి ప్రయత్నం చేయాలి. ఎక్కడ తగ్గాలో జనసేన పార్టీని చూసి నేర్చుకోవాలి. రాష్ట్ర హితం కోసం సీట్ల విషయంలో ఆ పార్టీ తగ్గి ఆదర్శంగా వ్యవహరించింది' అని శ్రీపాద సత్యనారాయణ ప్రశంసించారు.

రాష్ట్రం కోసం కలిశామని ప్రతివారూ గుర్తించాలి: మనోహర్

రాజకీయ పదవులు, అధికారం కోసం కాకుండా రాష్ట్రం కోసం కలిశామని మూడు పార్టీల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త గుర్తించాలని, పొత్తు విలువను కాపాడుకోవాలని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు. 'రూ.500 చెల్లించి క్రియాశీల సభ్యత్వం తీసుకొన్న వారు జనసేన పార్టీలో ఆరున్నర లక్షల మంది ఉన్నారు. అందరినీ కలుపుకొని ఎన్నికల వాతావరణం సృష్టించండి. ఎవరైనా దూరంగా ఉంటే మీ స్థాయిలో నాలుగైదు రోజులు ప్రయత్నించండి. అప్పటికీ కాకపోతే కేంద్ర కార్యాలయానికి చెప్పండి. సమయం వృథా చేయవద్దు. మూడు పార్టీల వారిపై వైసీపీ దాడులు జరుగుతూనే ఉంటాయి. కలిసికట్టుగా వాటిని ఎదుర్కోండి' అని మనోహర్ సూచించారు.

కోడ్ వల్ల విశాఖలో డ్రగ్స్ దొరికాయి: అచ్చెన్న

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం వల్ల విశాఖ పోర్టులో డ్రగ్స్ దొరికాయని, లేకపోతే దొరికేవి కావని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. 'వైసీపీ నేతలు విశాఖను డ్రగ్స్ కేంద్రం చేశారు. కోడ్ వల్ల రాష్ట్రంలో వారి చేతుల్లో ఉన్న పోలీసు అధికారులు వైసీపీ నేతలకు సాయం చేయలేకపోయారు. దీనిని కప్పిపుచ్చడానికి వైసీపీ నేతలు సిగ్గు లేకుండా మన మీద ఆరోపణలు చేస్తున్నారు. పొత్తులో కొందరికి సీట్లు రాలేదు. రాష్ట్రం బాగు కోరి విశాల దృక్పథంతో ఆ నేతలు సహకరించాలని మనవి' అని అచ్చెన్న అన్నారు.

నన్ను ఓడించేందుకు 300 కోట్లు పంపారు

- తాడేపల్లి రచ్చబండలో లోకేశ్



తాడేపల్లిలో జరిగిన రచ్చబండలో మాట్లాడుతున్న నారా లోకేశ్


తాడేపల్లి టౌన్, మార్చి 23: ముఖ్యమంత్రి జగన్ తనను మంగళగిరిలో ఓడించేందుకు రూ.300 కోట్లు పంపించారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. ఈ డబ్బులు ఆయన గంజాయి, ఇసుక, మద్యం అమ్మి సంపాదించారని మండిపడ్డారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన రచ్చబండ కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. "ప్రజలు అప్రమత్తంగా ఉండి వైసీపీ కుట్రలు తిప్పి కొట్టాలి. మాయమాటలకు మోసపోవద్దు" అని ప్రజలను కోరారు. టీడీపీ హయాంలో నేరుగా కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు చెల్లించేవారమని, జగన్ వచ్చిన తర్వాత కాలేజీలకు బకాయిలతో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందని దుస్థితి నెలకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే పాతఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం తీసుకువస్తామని, విద్యార్థులకు ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసి సర్టిఫికెట్లు అందేలా చూస్తామని లోకేశ్ భరోసా ఇచ్చారు. పేదలకు విద్యను దూరం చేసే ఎయిడెడ్ విద్యా సంస్థల విలీన జీవో 117ను రద్దు చేస్తామన్నారు. వైసీపీ పాలనలో గంజాయి ప్రతి గడపను తాకిందని, దీనివల్ల ఒక తరం నాశనం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లి డోలాస్‌నగర్‌లో ప్రచారం చేస్తుండగా.. ఓ తల్లి తనను కలిసిందని, తన పిల్లలు గంజాయికి బానిసలయ్యారని వాపోయిందని తెలిపారు. గంజాయి విజృంభనకు వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబే కారణమని, ఆయన తన దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేశారని ఆరోపించారు. అలాంటి వ్యక్తిని జగన్ తన పక్కన కూర్చోబెట్టుకుంటున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని లోకేశ్ హామీ ఇచ్చారు.

అన్నా రాంబాబుపై కోడ్ ఉల్లంఘన కేసు

మార్కాపురం రూరల్, మార్చి 23: గిద్దలూరు వైసీపీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదైంది. ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలో కంభం కూడలిలో ప్రభుత్వం నిర్మిస్తున్న షాదీఖానా శ్లాబు పనుల ప్రారంభ కార్యక్రమంలో 17న ఆయన పాల్గొన్నారు. మార్కాపురం నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన కోడ్ ఉల్లంఘించి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాంబాబు పాల్గొన్న ఫొటోలు, వీడియోలను సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రహమాన్ తెలిపారు.

పోటీచేసే ప్రతి స్థానమూ కీలకమే

- పి.గన్నవరంలో విజయం జనసేనదే: పవన్



పి.గన్నవరం జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు ఎన్నికల నియమావళి పత్రాలను అందజేస్తున్న పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో పోటీచేసే ప్రతి స్థానంలోనూ జనసేన గెలిచి తీరుతుందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ధీమా వ్యక్తం చేశారు. జనసేన పోటీచేసే ప్రతి స్థానమూ కీలకమైనదేనన్నారు. శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పి.గన్నవరం నియోజకవర్గ నేతలతో ఆయన సమావేశమయ్యారు. "స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడిన కారణంగా కనీసం నామినేషన్ వేసే పరిస్థితి కూడా లేదు. అయినా, వైసీపీ ఆరాచకాలను పి.గన్నవరం జనసేన నాయకులు తట్టుకొని నిలబడ్డారు. మన పార్టీ నుంచి పూర్తిస్థాయి ఇన్‌చార్జి లేకపోయినా అక్కడి పార్టీ నేతలు, వీర మహిళలు, జనసైనికులు ఏకతాటి మీద నిలిచారు. పార్టీ విధివిధానాలను అనుసరించారు. ప్రతి కార్యక్రమాన్నీ విజయవంతం చేశారు. ఇది అందరికీ ఆదర్శం కావాలి. స్థానిక ఎన్నికల్లో చూపించిన ఈ స్ఫూర్తిని సార్వత్రిక ఎన్నికల్లో కూడా కొనసాగించాలి. పి.గన్నవరం కచ్చితంగా జనసేనదే" అని పవన్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికలు రాష్ట్రం దిశదిశను నిర్దేశించేవని, ప్రతి స్థానమూ కీలకమేనని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని స్పష్టం చేశారు. పి.గన్నవరం నుంచి గిడ్డి సత్యనారాయణ బరిలో నిలుస్తున్నారు. ఆయనకు పవన్ ఎన్నికల నియమావళి, నిబంధనలతో కూడిన పత్రాలను అందించారు. కాగా, ఎన్డీయే కూటమిలోని జనసేన, టీడీపీ, బీజేపీ మధ్య ఓటు బదిలీ వంద శాతం జరిగి తీరుతుందని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో ఎవరు పోటీ చేసినా కూటమి అభ్యర్థిగానే భావించి గెలిపించుకోవాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా పార్టీ కార్యాలయంలో జనసేన వీరమహిళలతో సమావేశం నిర్వహించారు. పార్టీలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో వీరమహిళలు క్రియాశీల పాత్ర పోషించాలని పవన్ అన్నారు. 2029 ఎన్నికల నాటికి 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమల్లోకి రానున్న నేపథ్యంలో వీరమహిళా విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు.




శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌నకు హాజరైన టీడీపీ కూటమి అభ్యర్థులు, సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు, వేదికపై జనసేన, బీజేపీ నేతలు

160 సీట్లు కూటమివే!

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థులు సహా జనసేన, బీజేపీల ముఖ్య నేతలు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, శ్రీపాద సత్యనారాయణ, పాతూరి నాగభూషణం కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడానికి, అభివృద్ధి పథంలో నడిపించడానికే టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. "జాతీయ స్థాయిలో ఎన్డీఏ కూటమి నాలుగు వందలకు పైగా లోక్‌సభ స్థానాలు గెలిచి కేంద్రంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఇక్కడ మనం 160కి పైగా సీట్లు గెలవబోతున్నాం. 25 లోక్‌సభ స్థానాల్లో కడప సహా 24 సీట్లు మనవే. కడప లోక్‌సభ స్థానం కూడా మనమే గెలవబోతున్నాం. కడపలో ఏ మొహం పెట్టుకొని వైసీపీ ఓట్లు అడుగుతుంది? బాబాయి మాదిరిగా అందరినీ లేపేస్తామని ఓట్లు అడుగుతారా? రాష్ట్రంలో అవినీతి అరాచక విధ్వంసక పాలన రెండు నెలల్లో ముగిసిపోనుంది. ప్రజలు గెలవాలి. రాష్ట్రం నిలవాలి. ఇదే మన లక్ష్యం. దీని కోసమే పోరాడాలి. నేను 160 నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేస్తా. పవన్ కల్యాణ్‌తో కూడా మాట్లాడా. ఆయన కూడా వీలైనంత విస్తృతంగా ప్రచారం చేస్తారు. వచ్చే 25 రోజులకు సంబంధించి పార్టీ అభ్యర్థులకు ఒక టైం టేబుల్ ఇస్తున్నాం. దాని ప్రకారం వీలైనంత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలి. అన్ని వర్గాల వారికి చేరువ కావాలి. వచ్చే రెండు నెలల్లో ఒక్క రోజు కూడా వృథా చేయొద్దు. ఘన విజయంతో తిరిగి రండి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

పదవులు కొత్తకాదు

"మాకు పదవులు కొత్త కాదు. ప్రభుత్వాలు కొత్త కాదు. పొత్తులో మేం లాభనష్టాలను బేరీజు వేసుకోలేదు. మా మూడు పార్టీలకు అంకిత భావం, విశ్వసనీయత ఉన్నాయి. పొత్తుల వల్ల మూడు పార్టీల్లో కొందరికి అవకాశాలు రాలేదు. ఈ ఐదేళ్లలో ఎన్నో పోరాటాలు చేసి జైళ్లకు వెళ్లిన వారికి కూడా టికెట్లు ఇవ్వలేకపోయాం. టీడీపీలో ఇలా 31 మంది నేతలు అవకాశాలు కోల్పోయారు. ఇదే సమస్య జనసేన, బీజేపీ పార్టీల్లో కూడా ఉంది. టీడీపీలో గుండా లక్ష్మీదేవి, కలమట వెంకట రమణ, దేవినేని ఉమా, కొమ్మాలపాటి శ్రీధర్ వంటి వారికి టికెట్లు ఇవ్వలేకపోయాం. మంచి అభ్యర్థులను పెట్టుకోవడానికి మూడు పార్టీల వాళ్లం ఎన్నో గంటలపాటు కసరత్తు చేశాం. వ్యక్తులతోపాటు కొన్ని సామాజిక వర్గాలకు కూడా ఆకాంక్షలు ఉన్నాయి. అవి కూడా నెరవేర్చాలి. రాజకీయాలను 'రీ ఇంజనీరింగ్' చేయాలి. ఈసారి అభ్యర్థుల ఎంపికలో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాం. క్షేత్రస్థాయి సర్వేలతో పాటు ఫోన్ సర్వేలు కూడా చేశాం. సిఫారసులు పట్టించుకోలేదు. పార్టీకి, ప్రజలకు చేసిన సేవ, పార్టీ పట్ల అంకిత బావం వంటి అంశాలు పరిగణనలోకి తీసుకున్నాం. పరిశీలకులను కూడా పెట్టి వీలైనంత ఉత్తమంగా అభ్యర్థులను ఎంపికచేశాం. ఈ మూడు పార్టీలు కలిసికట్టుగా ఇప్పుడు వేసే పునాది 30 ఏళ్ల నిలబడాలన్నది నా ఆశయం" అని చంద్రబాబు తెలిపారు.

ఇలాంటి వ్యక్తి సీఎం అవుతాడని..

అక్రమంగా ఆర్జించిన డబ్బును రాశులుగా పోసుకున్న జగన్‌కు ముకుతాడు వేయడానికి 500, 200ల నోట్లు కూడా రద్దు చేయాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. "ఇసుక, మద్యం, గనుల నుంచి దోపిడీ చేసిన రూ.లక్షల కోట్ల డబ్బు జగన్ దగ్గర గుట్టలుగా పోగైంది. ఈ డబ్బుతో ఏమైనా చేయగలమని విర్రవీగుతున్నాడు. డిజిటల్ కరెన్సీ పూర్తిస్థాయిలో వస్తే ఈ డబ్బు ప్రభావం పోతుంది. వచ్చే ఐదేళ్లలో ఈ నోట్లు పోయి డబ్బు ప్రభావం తగ్గితే సేవా భావంతో పనిచేసేవారు గెలిచే అవకాశం వస్తుంది. జగన్ లాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా వస్తాడని నేను ఏనాడూ ఊహించలేదు. పదవులు అడ్డుపెట్టుకొని వ్యాపారం చేసుకున్నాడు. నోరు తెరిస్తే అబద్ధాలు. దబాయింపులు. బ్లాక్‌మెయిలింగ్. ఎవరైనా తప్పు చేస్తున్నావంటే మీద పడిపోతున్నారు. కేసులు పెడుతున్నారు. చెప్పుకోవడానికి ఏమీ లేక ఫేక్ ప్రచారాలను నమ్ముకున్నారు. పురందేశ్వరి నాకు బంధువు అయినా 30 ఏళ్లగా వేరే పార్టీల్లో ఉన్నారు. ఆమె మీద భయంకరమైన ప్రచారాలు చేస్తున్నారు. ఆమె బీజేపీలో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఒక లేఖ సృష్టించారు. పొత్తు తాత్కాలికమే అని నేను అన్నట్టుగా మరో ప్రకటన పుట్టించారు. వైసీపీ దేని మీద బతుకుతోందో ఇదే ఉదాహరణ. ఈ మూడు పార్టీల మధ్య పొత్తు కుదరకుండా చూడటానికి విశ్వ ప్రయత్నం చేశారు. కాపులను రెచ్చగొట్టాలని చూశారు. విశాఖలో పట్టుబడిన డ్రగ్స్ వ్యవహారాన్ని టీడీపీ, బీజేపీ నేతలకు అంటగట్టాలని విశ్వ ప్రయత్నం చేశారు. 'డ్రై ఈస్ట్' అంటూ దిగుమతి చేసుకున్న కంపెనీ యాజమాన్యం వైసీపీ నేతలకు బాగా దగ్గర. ఈ ముఖ్యమంత్రి ఈ ఐదేళ్లలో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై ఒక్కసారి కూడా నోరు తెరవలేదు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి.. ప్రధానమంత్రి స్థాయి వ్యక్తి మాదిరిగా బ్రెజిల్‌కు అధ్యక్షుడు ఎన్నికైతే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పుడు అదే బ్రెజిల్ నుంచి ఈ డ్రగ్స్ వచ్చాయి. డ్రగ్స్ దిగుమతి వ్యవహారంలో ఇరుక్కున్న 'సంధ్య' ఆక్వా కంపెనీ వ్యక్తులు ఢిల్లీ మద్యం కేసులో కూడా ఉన్నారని చెబుతున్నారు. ఇన్ని వ్యవహారాలు చేసిన వాళ్లు మనపైకి తోసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారు. బాబాయి కేసుకు ఐదేళ్లయినా దిక్కు లేదు. సీబీఐ అధికారిపైనే కేసు పెడితే ఆయన బెయిల్ తెచ్చుకోవాల్సి వచ్చింది. దావూద్ మాదిరిగా ఈ రాష్ట్రంలో బెదిరింపు వసూళ్లు మొదలు పెట్టారు.

దీన్ని సామాజిక న్యాయం అంటారా?

సొంత కులానికి చెందిన నలుగురు రెడ్లకు రాష్ట్రాన్ని రాసిచ్చి వారిని అడ్డుపెట్టుకొని రాష్ట్రాన్ని దోపిడీ చేయడం సామాజిక న్యాయం అవుతుందా?. ఆ నలుగురికి తప్ప అదే కులంలో మిగిలిన రెడ్లకు, క్రైస్తవులకు, ముస్లింలకు ఏం చేశారు? అందరికీ అమలు చేసే పథకాలు తప్ప దళితులకు అదనంగా చేసింది ఏమిటి? మనుషులను క్రూరంగా చంపారు. డ్రైవర్ సుబ్రమణ్యాన్ని చంపి శవాన్ని డోర్ డెలివరీ చేశారు. ఒక పది సీట్లు ఇస్తే సరిపోతుందా? రాయలసీమలోని 62 సీట్లలో 51 జనరల్ సీట్లు. అందులో 41 సీట్లు ఒకే కులం వారికి ఇచ్చారు. ఇదేనా బీసీల ఉద్ధరణ? మేం అన్ని కులాలకు టికెట్లు ఇస్తున్నాం. ఎక్కడా బీసీలకు అన్యాయం చేయలేదు. అన్ని కులాలకు సాధికారత కల్పించిన పార్టీ టీడీపీ అని గర్వంగా చెప్పగలం. సీట్లు రాని వారు నిరాశ పడాల్సిన అవసరం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అనేక అవకాశాలు ఉంటాయి. వాటిలో వారిని సర్దుబాటు చేయడానికి మూడు పార్టీలు కృషి చేస్తాయి.

'గాండ్ల'కు న్యాయం చేస్తాం

తాము అధికారంలోకి వచ్చాక గాండ్ల సామాజిక వర్గం సమస్యలపై దృష్టి పెట్టి, తగు న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. గాండ్ల సామాజిక వర్గ ప్రతినిధులు శనివారం ఉండవల్లిలో చంద్రబాబును కలిశారు. రాష్ట్రంలో 10 లక్షల మంది గాండ్ల కులస్తులు ఉండగా, లక్షన్నర మందే ఉన్నారని ప్రభుత్వం చెబుతోందన్నారు. కులగణన జరిపి, తమ వర్గాన్ని గుర్తించి, సాయం చేయాలని చంద్రబాబును కోరారు.

"ప్రజల కోసం.. వారి భవిష్యత్తు కోసం మేం కలిశాం. రాష్ట్రం నష్టపోకూడదన్న భావనతో పవన్ కల్యాణ్ పొత్తుకు ముందుకు వచ్చారు. ఈ పొత్తులో మేం లాభనష్టాలను బేరీజు వేసుకోలేదు. మా మూడు పార్టీలు కలిసికట్టుగా ఇప్పుడు వేసే పునాది 30 ఏళ్లు నిలబడాలన్నది నా ఆశయం. మూడు పార్టీలకు అంకిత భావం, విశ్వసనీయత ఉన్నాయి".

"పురందేశ్వరి నాకు బంధువు అయినా 30 ఏళ్లుగా వేరే పార్టీల్లో ఉన్నారు. ఆమె మీద భయంకరమైన ప్రచారాలు చేస్తున్నారు. ఆమె బీజేపీలో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఒక ఫేక్ లేఖ సృష్టించారు. పొత్తు తాత్కాలికమే అని నేను అన్నట్లుగా మరో ప్రకటన పుట్టించారు. వైసీపీ దేని మీద బతుకుతోందో ఇదే ఉదాహరణ".

"ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలో తమ వారు ఎంపిక కాలేదని పరీక్షా పత్రాలను రెండోసారి దిద్దించారు. అదేమీ లేదని కోర్టు ముందు దబాయించారు. ఇప్పుడు ఏపీపీఎస్సీలో రికార్డులు ధ్వంసం చేసే పనిలో పడ్డారు"

"ఇప్పుడు మనం చేస్తోంది యుద్ధం. పోరాడితేనే రాజ్యం వస్తుంది. తొడగొట్టి దూకండి. బేలతనం వద్దు. అధికారంలో ఉన్నవారి హడావుడి చూసి భయపడవద్దు. ప్రజలు మనతో ఉన్నారు. దేనికీ వెనకాడవద్దు" - చంద్రబాబు

టీడీపీలోకి పులివెందుల నేతలు

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు జోరందుకున్నాయి. శనివారం చంద్రబాబు సమక్షంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు, మాలమహానాడు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు నెక్కలి నాగమణి, పులివెందులకు చెందిన చక్రాయపేట మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య, వేంపల్లికి చెందిన జయరామిరెడ్డి తదితరులు టీడీపీలో చేరారు.

కదిరి సీటు నాదే: కందికుంట

అనంతపురం జిల్లా కదిరి సీటు తనదేనని మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ చెప్పారు. 'నాకు న్యాయపరమైన సమస్యలు ఉండటం వల్ల నా సతీమణి యశోదకు టికెట్ ప్రకటించారు. నాపై ఉన్న కేసులను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఇక నేనే పోటీ చేస్తా' అని అన్నారు.

'రావి' సహకారం అద్భుతం: వెనిగళ్ల

గుడివాడలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు తనకు ఇస్తున్న సహకారం అద్భుతమని ఆ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వెనిగళ్ల రాము అన్నారు. గుడివాడకు అంతకు ముందు రావి ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన స్థానంలో వెనిగళ్లకు టికెట్ ఇచ్చారు. "నియోజకవర్గంలో నాకు రావి ఇస్తున్న సహకారం మాటల్లో చెప్పలేను. అంత మంచి మనిషిని నేను చూడలేదు. ఆయననే ముందు పెట్టి కార్యక్రమాలు చేస్తున్నా" అన్నారు.

వర్క్‌షాప్‌నకు గండి బాబ్జి

టీడీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన విశాఖ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి శనివారం టీడీపీ వర్క్‌షాప్‌నకు హాజరయ్యారు. ఆయన ఇన్‌చార్జిగా ఉన్న సీటు.. పొత్తులో భాగంగా మిత్రపక్షాలకు పోవడంతో అలిగి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ, పార్టీ నేతలు ఆయనతో మాట్లాడడంతో మెత్తబడ్డారు.

'మద్దిపాటి'కి అసమ్మతి పోటు!

గోపాలపురం టీడీపీలో సద్దుమణగని వర్గపోరు

అధిష్ఠానం వైఖరిపై ముళ్లపూడి కినుక

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని గోపాలపురం ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గంలో అసమ్మతి సద్దుమణగలేదు. అభ్యర్థి ఎంపిక విషయంలో సుమారు మూడేళ్ల నుంచి కొనసాగుతున్న వర్గపోరు ఇంకా రగులుతూనే ఉంది. అసెంబ్లీ అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజును టీడీపీ ఖరారు చేసినా ఇక్కడ అసమ్మతి వర్గం తమ పోరు మానలేదు. అభ్యర్థిగా ఖరారైన వెంకట్రాజు అసమ్మతి నేతల వద్దకు వెళ్లి మాట్లాడినా ఎవరూ ఒప్పుకోవడంలేదు. దీనికి అనేక కారణాలు. అందులో ఒకటి.. మద్దిపాటి వైఖరి కూడా కారణమే వాదన ఉంది. వెంకట్రాజు యువకుడు కావడం, పార్టీ అధిష్ఠానం వద్ద పనిచేసిన అనుభవంతో కొంత ఆదరణ సంపాదించుకున్నప్పటికీ, ఆయన వ్యవహార శైలి వల్ల ఇబ్బంది కలుగుతున్నట్టు తెలుస్తోంది. విద్యావంతుడైన వెంకట్రాజు రాష్ట్ర టీడీపీ ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో ఆయన అధినేత చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు దగ్గరయ్యారు. రెండేళ్ల కిందటే ఆయనను గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించారు. అప్పటి నుంచి ఇక్కడ వర్గపోరు పెరిగింది. 2019 ఎన్నికల్లోనే మద్దిపాటి వెంకట్రాజుకు సీటిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ముప్పిడి వెంకటేశ్వరరావుకు అవకాశం లభించినా వైసీపీ గాలిలో ఓడిపోయారు. టికెట్ దక్కని వెంకట్రాజు అప్పటి నుంచి నియోజకవర్గంలో తనకం టూ వర్గాన్ని తయారు చేసుకున్నారు. ముప్పిడి కూడా ఎన్నడూ పార్టీని వదలలేదు. కానీ అధిష్ఠానానికి దగ్గరగా ఉన్న వెంకట్రాజు.. అసమ్మతి నేతలు లెక్కచేసేదేంటనే స్థాయికి ఎదిగారు. అన్ని ప్రాంతాల్లో తన వర్గానికి పెంచుకున్నారు. కానీ, అప్పటి వరకూ నియోజకవర్గంలో పట్టు సంపాదించుకున్న నేతలు ఆయనతో విభేదించడం గమనార్హం.

మద్దిపాటి వర్సెస్ ముళ్లపూడి

టీడీపీ సీనియర్‌నేత, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, గోపాలపురం టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజుకు మధ్య పొసగడం లేదు. ఈ నేపథ్యంలో ముప్పిడి వెంకటేశ్వరరావుకే గోపాలపురం టికెట్ ఇవ్వాలని ముళ్లపూడి అధిష్ఠానం దృష్టిలో పెట్టారు. ఇక్కడి అసమ్మతి వర్గం కూడా అనేక సార్లు అమరావతికి వెళ్లి, ముప్పిడికే టికెట్ ఇవ్వాలని కోరింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల చంద్రబాబు స్వయంగా ముళ్లపూడి బాపిరాజుతోపాటు, నియోజకవర్గంలోని గోపాలపురం, ద్వారకాతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి మండల టీడీపీ అధ్యక్షులను, ఇద్దరు స్టేట్ కమిటీ సభ్యులను కూడా పిలిచి ఇక్కడ పరిస్థితిపై ఆరా తీశారు. అక్కడ బాపిరాజుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎస్సీల్లో మరోవర్గానికి చెందిన ఓ అధికారి ఉన్నారని, ఆయనకు మంచి నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, ఆయనకు సీటివ్వాలని, జిల్లాలో మాల వర్గానికి సీటు ఇచ్చినట్టు అవుతుందని బాపిరాజు చెప్పినట్టు సమాచారం. అయినా కూటమి ఉమ్మడి అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజు పేరునే చంద్రబాబు ఖరారు చేశారు. దీంతో ముళ్లపూడి బాపిరాజు కినుక వహించారు. కానీ, టికెట్ ప్రకటించగానే బాపిరాజును కలిశానని, వారే కలిసి రావడంలేదని మద్దిపాటి చెబుతున్నారు.

3 స్థానాలపై పవన్ కసరత్తు!

ఇప్పటికే 18 చోట్ల అభ్యర్థులు ఖరారు

- పాలకొండ, అవనిగడ్డ, రైల్వేకోడూరు పెండింగ్
- రైల్వేకోడూరు స్థానాన్ని మార్చుకోవాలని సూచనలు
- ధర్మవరం లేదా రాజంపేట తీసుకోవాలని పార్టీ ఆలోచన
- తిరుపతి పంచాయితీ తేల్చేందుకు ఫీల్డ్ సర్వే
- పోలవరం అభ్యర్థిగా చిర్రి బాలరాజు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దాదాపు 18 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఇక మిగిలినవి 3 స్థానాలు మాత్రమే. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పాలకొండ, ఉమ్మడి కృష్ణా జిల్లాలో అవనిగడ్డ, కడపలో రైల్వేకోడూరు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. పాలకొండలో జనసేన పార్టీకి బలమైన కేడర్ ఉంది. కాపు ఓటు బ్యాంక్ అధికంగానే ఉంది. బలమైన అభ్యర్థిని బరిలోకి దించితే విజయం తథ్యం. వైసీపీ ఎమ్మెల్యే కళావతి రెండుసార్లు గెలవడంతో స్థానికంగా ఆమెకు వ్యతిరేకత ఉంది. ఆ వ్యతిరేకత కూడా జనసేనకు కలిసి వస్తుంది. కానీ, అభ్యర్థి ఎంపిక కీలకంగా మారింది. కొత్త వారిని కాకుండా రాజకీయ అనుభవం ఉన్న వారిని బరిలో దించాల్సిన అవసరం ఉంది. మరోవైపు అవనిగడ్డ సీటు కోసం పార్టీలో పోటీ ఎక్కువ ఉంది. ఇక్కడ విక్కుర్తి వెంకట శ్రీనివాస్, మదివాడ వెంకటకృష్ణ పోటీ పడుతున్నారు. విక్కుర్తికి సీటు దాదాపు ఖరారవుతుందని భావించారు. పార్టీ కూడా అతని పేరునే దాదాపు ఖరారు చేసేందుకు సిద్ధమైంది. కానీ, మధ్యలో వంగవీటి రాధా తెరపైకి వచ్చారు. రాధాను అక్కడ బరిలోకి దించాలని మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి భావిస్తున్నారు. దీని కోసం రెండు రోజుల క్రితం పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కలిశారు.

రైల్వేకోడూరు ఎందుకు?

మరోవైపు రైల్వేకోడూరు సీటు ఎందుకు తీసుకున్నారని పార్టీలో అంతర్గత చర్చ జరుగుతోంది. అక్కడ పార్టీకి బలమైన నాయకుడే లేడు. దీంతో అభ్యర్థి ఎంపిక పెద్ద సవాల్‌గా మారింది. దానికి బదులు ధర్మవరం లేదా రాజంపేట స్థానాలు తీసుకోవాలన్న సూచనలు వస్తున్నాయి. ధర్మవరంలో జనసేన బలంగా ఉంది. అక్కడ టీడీపీ, బీజేపీ మధ్య వర్గపోరాటాలు జరుగుతున్నాయి. దీంతో ధర్మవరం సీటు జనసేన తీసుకోవాలని సూచిస్తున్నారు. లేదంటే రాజంపేట స్థానాన్ని తీసుకోవాలని రాయలసీమ నాయకులు పార్టీని కోరుతున్నారు. రాయలసీమలో బలిజ సామాజిక వర్గం ఎక్కువ. దాదాపు 46 లక్షల మంది బలిజ ఓటర్లు రాయలసీమలో ఉన్నారు. అలాంటి చోట కేవలం రెండు సీట్లు తీసుకోవడం, అందులో ఒక ఎస్సీని తీసుకోవడంపై పార్టీలో కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైల్వేకోడూరు స్థానాన్ని మార్చుకోవడమే మేలనే ఆలోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మూడు స్థానాలపై అధినేత తీవ్ర కసరత్తు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తేలని తిరుపతి పంచాయితీ...

మరోవైపు తిరుపతి పంచాయితీ ఇప్పటి వరకూ తేలలేదు. దీంతో ఈపాటికే ప్రచారంలో ఉండాల్సిన నాయకులు, కేడర్.. అభ్యర్థిపై వ్యతిరేకతతో ప్రచారానికి రావడం లేదు. స్థానిక నేతలతో సమావేశంలో ఫీల్డ్ సర్వే చేస్తామని నాగబాబు హామీ ఇచ్చారు. ప్రస్తుతం పార్టీ తిరుపతిలో ఫీల్డ్ సర్వే చేయిస్తోంది. రెండుమూడు రోజుల్లో సర్వే రిపోర్టు రావాల్సి ఉంది. అభ్యర్థిని మార్చడమే మంచిదన్న సూచనలు అధినేత దృష్టికి వెళ్లాయి. స్థానికులకు టికెట్ ఇస్తేనే సహకరిస్తామని టీడీపీ నాయకులు కూడా స్పష్టంగా చెబుతున్నారు. దీంతో స్థానికులనే బరిలోకి దించాలని పార్టీ కూడా భావిస్తోంది. దీనిపై రెండుమూడు రోజుల్లో స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. ఇక పోలవరంలో పార్టీ నాయకుడు చిర్రి బాలరాజు బరిలోకి దిగనున్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో పోలవరం నాయకులతో సమావేశమైన పవన్ కల్యాణ్.. బాలరాజుకు ఎన్నికల నియమావళి, నిబంధనలతో కూడిన పత్రాలను అందించారు.

అభ్యర్థుల ప్రకటన ఇంకెప్పుడు?

బీజేపీ శ్రేణుల్లో పెరిగిపోతున్న అసహనం

- రోజుల తరబడి ఢిల్లీలో మకాం వేసిన నేతలు
- ఇంకా జాప్యం చేస్తే అభ్యర్థులకు ఇబ్బందులే!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'ఎన్డీఏ కూటమిలో ప్రధాన పక్షమైన టీడీపీ మూడు విడతల్లో 139 అసెంబ్లీ, 13 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించింది. జనసేన విడతల వారీగా 17 అసెంబ్లీ, ఒక(కాకినాడ) లోక్‌సభ స్థానానికి అభ్యర్థుల పేర్లు వెల్లడించిం ది. మన పార్టీ ఢిల్లీ నుంచి 4 విడతలుగా ప్రకటించిన జాబితాలో ఏపీ మినహా దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల నుంచి ఎంపీ అభ్యర్థుల పేర్లు ప్రకటించేసింది. ఏపీ విషయంలో ఎందుకింత జాప్యం. 10 అసెంబ్లీ, 6 పార్లమెంటు స్థానాలకు అభ్యర్థుల్ని ఎంపిక చేసేందుకు ఇంత కసరత్తు చేయాలా? ఇప్పటికీ అభ్యర్థి ఎవరో తేల్చకపోతే పొత్తుల్లో ఉన్న మిత్ర పక్షాల నేతలను, శ్రేణుల్ని ఎప్పుడు కలవాలి?' అంటూ బీజేపీలో టికెట్ ఆశిస్తోన్న అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పొత్తు కుదరక ముందు అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు తీసుకుని, ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురిని ఎంపిక చేసిన పార్టీ పెద్దలు.. ఇప్పుడు అభ్యర్థుల్ని ఎంపిక చేసుకోలేరా? అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రోజు ఒక్కో నియోజకవర్గం పేరు తెరపైకి వస్తుండటంతో కేడర్ సైతం గందరగోళానికి గురౌతోందని, మార్చి 24 నాటికీ బీజేపీ అభ్యర్థులెవరో వెల్లడి కాకపోతే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రతి నిమిషమూ విలువైందేనని, ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ ముఖ్యనేతలు ఏమీ చెప్పకుండా రోజుల తరబడి ఢిల్లీలో కూర్చుంటే కేడర్ సహనం నశిస్తోందని నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇంకా జాప్యం చేస్తే ఇబ్బందేనని పార్టీ పెద్దల ఫోన్లకు సందేశాలు పంపుతున్నారు.

ఆ స్థానాల్లోనూ గందరగోళమే..

పొత్తుల్లో భాగంగా బీజేపీకి 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించినట్లు వార్తలు వచ్చాయి. కూటమి పార్టీ నేతల్లో వినిపిస్తున్న వివరాల ప్రకారం రాయలసీమలో 4, కోస్తాలో 3, ఉత్తరాంధ్రలో 3 సీట్లలో బీజేపీ బరిలో నిలవనుంది. కర్నూలు జిల్లాలో ఆదోని, ఆలూరు సీట్లలో ఒకటి బీజేపీకి ఇస్తారని తెలుస్తోంది. అనంతపురంలో ధర్మవరం ఖరారైనట్లు చెబుతున్నా.. ఇటీవలే వైసీపీ నుంచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యే గుంతకల్లు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ధర్మవరం అభ్యర్థికి సహకరించబోమంటూ పరిటాల కుటుంబం నుంచి బీజేపీ పెద్దలకు సంకేతాలు అందడంతో కేడర్‌లో అయోమయం నెలకొంది. కడపలో జమ్మలమడుగు, బద్వేలు బీజేపీకి కేటాయించినట్లు తెలిసినప్పటి నుంచి జమ్మలమడుగు అభ్యర్థి కుటుంబం నుంచి వ్యతిరేకత ఎక్కువైంది. ఇదే అవకాశంగా రాజంపేట అసెంబ్లీ స్థానం కోసం మాజీ సీఎం ద్వారా ఒక ఎమ్మెల్యే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. విజయవాడ పశ్చిమలో జనసేన టికెట్ ఆశించిన నేత మద్దతుదారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కైకలూరు నుంచి మాజీ మంత్రి పేరు వినిపిస్తున్నా ఆయన వయసు ఎక్కువంటూ పార్టీలో మరో వర్గం బలంగా ప్రయత్నిస్తోంది. అనపర్తి సీటుకు అభ్యర్థి పేరు చెప్పలేక పార్టీలోనే నీళ్లు నములుతున్నారు. పాడేరు బరిలో దిగుతారనే అభ్యర్థి ఏ మాత్రం సత్తాలేని వ్యక్తి అంటూ ప్రచా రం జరుగుతోంది. ఎచ్చెర్ల అభ్యర్థి సామాజిక వర్గం ఓట్లు కనీసం వెయ్యి కూడా లేవంటున్నారు. అక్కడ టీడీపీలో బలమైన నేతలు సహకరించే అవకాశమేలేదని, తూర్పు కాపులకు కాకుండా మరెవ్వరికి ఇచ్చినా డిపాజిట్లు కష్టమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పేరు వినిపిస్తోన్న అభ్యర్థి, వైసీపీ అభ్యర్థికి వ్యాపార భాగస్వామి అనే ప్రచారం కూడా సోషల్ మీడియాలో జరుగుతోంది. ఇక లోక్‌సభ స్థానాల్లోనూ విజయనగరం, రాజంపేట ఇప్పటికీ అయోమయంగానే ఉన్నాయి.

కరువుసాయంపై సుప్రీంకు కర్ణాటక

» ఎన్‌డీఆర్‌ఎఫ్ నిధులను తక్షణం విడుదల చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి



బెంగళూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం తీవ్ర కరువుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సాయం విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని, దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బెంగళూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం చట్టబద్ధమైన హక్కును పొందేందుకు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని అన్నారు. రాష్ట్రానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ నిధులను తక్షణం విడుదల చేసేలా కేంద్రానికి తగిన సూచనలివ్వాలని పిటిషన్‌లో కోరామని అన్నారు. రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన వాటాను కేంద్రం విడుదల చేస్తుందని గత ఐదునెలలుగా ఎదురు చూస్తున్నా ఫలితం కనిపించలేదని అన్నారు. ఈ అంశంపై కేంద్ర మంత్రులను కలిశామని, పరిస్థితిని వివరించామని, లేఖలు కూడా రాశామని అన్నారు. గత్యంతరం లేక, అనివార్య పరిస్థితులలో కరువుసాయం కోసం సుప్రీంకోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చిందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థలో ఇలాంటి పరిణామం చోటుచేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రాల హక్కుల విషయంలో కేంద్రం నిరంకుశంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. కరువు సమయంలో ప్రజల సమస్యలపై తక్షణం స్పందించాల్సిన కేంద్రం, కేవలం రాజకీయ కారణాలతోనే జాప్యం చేస్తూ ప్రజలకు ద్రోహం చేయడం అన్యాయమని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధి విడుదల విషయంలో రాజకీయాలు తగవని అన్నారు. రాష్ట్రంలోని 240 తాలుకాలకు గాను 223 తాలుకాల్లో తీవ్ర కరువు పరిస్థితి నెలకొని ఉందని తెలిపారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం.. నిబంధనల ప్రకారం పరిస్థితిని స్వయంగా సమీక్షించేందుకు వారంలోగా రాష్ట్రానికి రావాల్సి ఉండగా, చాలా ఆలస్యంగా అక్టోబరులో వచ్చి పరిస్థితిని సమీక్షించి, కేంద్రానికి నివేదికను అందజేసిందని అన్నారు. ఇది జరిగిన తర్వాత కూడా పరిపరి విధాల కేంద్రానికి, ప్రధానికి తాము చేసిన విజ్ఞప్తులను పట్టించుకోలేదని, రాష్ట్రానికి నయాపైసా కరువుసాయం విడుదల కాలేదని సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా, ఉత్తర కర్ణాటక జిల్లాల్లో తాగునీటి కోసం కనీసం 3 టీఎంసీల నీటిని విడుదల చేయాలని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండేకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య లేఖ రాశారు.

రాష్ట్రపతిపై సుప్రీంకోర్టులో కేరళ దావా



» నాలుగు బిల్లులపై సంతకాలు చేయడం లేదని ఆరోపణ

కోచి, మార్చి 23: కేరళ ప్రభుత్వం శనివారం అసాధారణ చర్యకు పాల్పడింది. కేరళ అసెంబ్లీ ఆమోదించిన నాలుగు బిల్లులపై సంతకాలు చేయకుండా జాప్యం చేస్తున్నారని, ఇందుకు కారణాలు కూడా చెప్పడం లేదని పేర్కొంటూ ఏకంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై సుప్రీంకోర్టులో దావా వేసింది. రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌పైనా దావా వేసింది. అసెంబ్లీ తీర్మానించిన ఈ బిల్లులను దీర్ఘకాలం, అనిశ్చితి కాలం పాటు తన వద్ద పెండింగ్‌లో పెట్టుకొని, చివరకు రాష్ట్రపతి పరిశీలనకు పంపించడాన్ని కూడా ప్రశ్నించింది. సుప్రీంకోర్టు ప్రశ్నిస్తుందన్న కారణంతోనే ముందు జాగ్రత్తగా వాటిని రాష్ట్రపతి పరిశీలనకు పంపినట్టు అభిప్రాయపడింది. విశ్వవిద్యాలయాల చట్టాల సవరణ బిల్లు-2022, విశ్వవిద్యాలయాల చట్టాల సవరణ బిల్లు (నెంబరు-2)-2022, విశ్వవిద్యాలయాల చట్టాల సవరణ బిల్లు (నెంబరు-3)-2022, కేరళ సహకార సంఘాల సవరణ బిల్లు-2022లకు రాష్ట్రపతి ఆమోదం తెలిపి సంతకం పెట్టకపోవడాన్ని ఆ పిటిషన్‌లో ప్రశ్నించింది. ఎలాంటి కారణాలు చెప్పకుండానే ఆమోదం తెలపకపోవడాన్ని రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరింది. ఈ నాలుగు బిల్లులతో పాటు మరో మూడు బిల్లులు...మొత్తం ఏడింటిని గవర్నర్ ఆరిఫ్ ఖాన్ రాష్ట్రపతి పరిశీలనకు పంపించడాన్ని కూడా తప్పుపట్టింది. గవర్నర్ చర్యను చట్టవ్యతిరేకమైనదిగా ప్రకటించాలని కోరింది. ఈ ఏడు బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపించడం ద్వారా రాజ్యాంగ నైతికతను ఉల్లంఘించినట్టయిందని, అందువల్ల ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కేరళ ప్రభుత్వం తన రిట్ పిటిషన్‌లో విజ్ఞప్తి చేసింది. అయితే, ప్రతివాదిగా మాత్రం రాష్ట్రపతి కార్యదర్శిని పేర్కొంది. ఆరిఫ్‌ఖాన్‌పై పిటిషన్‌లో గవర్నర్‌ను, గవర్నర్ కార్యాలయ అదనపు ప్రధాన కార్యదర్శిని ప్రతివాదులుగా పేర్కొనడం గమనార్హం. కేరళ అసెంబ్లీ 11 నుంచి 24 నెలల క్రితం ఆమోదించిన ఈ బిల్లులపై సంతకాలు చేయకుండా ఆపాలంటూ కేంద్రం రాష్ట్రపతికి సలహా ఇవ్వడాన్ని కూడా ప్రశ్నించింది. ఈ బిల్లులన్నీ రాష్ట్ర పరిధిలోకి వచ్చే అంశాలని తెలిపింది. వీటికి అనుమతి నిరాకరించడం అంటే సమాఖ్య వ్యవస్థకు నష్టం కలిగించడం, ఆటంకపరచడం కిందకే వస్తుందని వివరించింది.

చంద్రబాబును కలసిన టీడీపీ నేతలు

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వివిధ నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నేతలు శనివారం చంద్రబాబుతో భేటీ అయ్యారు. డోన్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, పార్టీ నేత ధర్మవరం సుబ్బారెడ్డి చంద్రబాబును కలిశారు. డోన్‌లో సమష్టి కృషితో పార్టీ విజయానికి పని చేస్తామని వారు చెప్పారు. అలాగే అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ప్రొద్దుటూరుకు చెందిన సీఎం సురేశ్, పిఠాపురం టీడీపీ నేత వర్మ, యలమంచిలికి చెందిన ప్రగడ నాగేశ్వరరావు కూడా చంద్రబాబుతో భేటీ అయ్యారు. తమ నియోజకవర్గాల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయం కోసం పని చేస్తామని చెప్పారు. కాగా, పీగన్నవరం నుంచి మహాసేన రాజేశ్ కూడా చంద్రబాబును కలిశారు.

నా అరెస్టు చట్ట విరుద్ధం

వెంటనే విడుదలకు ఆదేశించండి.. ఢిల్లీ హైకోర్టులో కేజ్రీవాల్ పిటిషన్

» వెంటనే విచారణకు కోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో ఈడీ తనను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అరెస్టు చట్ట వ్యతిరేకమని, తనను వెంటనే విడుదల చేసేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు. కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ అరెస్టు చేసి మర్నాడు ప్రత్యేక కోర్టులో హాజరుపరిచిన తర్వాత ఈ నెల 28 వరకు రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. తొలుత కేజ్రీవాల్ తన అరెస్టును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌ను సుప్రీం తిరస్కరించడంతో కేజ్రీవాల్ తన పిటిషన్‌ను చివరి నిమిషంలో ఉపసంహరించుకున్నారు. తనకు ఈడీ సమన్లు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ గతంలోనే హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో మధ్యంతర రక్షణ కావాలని కోరినందువల్ల తన అరెస్టుపై హైకోర్టునే ఆశ్రయించాలని ఆయన నిర్ణయించుకున్నట్లు న్యాయ వర్గాలు తెలిపాయి. అయితే ఆయన పిటిషన్‌పై వెంటనే విచారణ చేపట్టేందుకు హైకోర్టు నిరాకరించింది. హోలీ సెలవు తర్వాత బుధవారం కోర్టు పునఃప్రారంభమైనప్పుడు ఈ పిటిషన్‌ను విచారణకు లిస్టింగ్ చేయనున్నారు. ఢిల్లీ మద్యం విధానాన్ని కేజ్రీవాలే రూపొందించారని, కొన్ని ప్రైవేట్ కంపెనీలకు 12% మేరకు లాభాల్లో వాటా ఇచ్చేందుకు ఆయన కుట్రపన్నారని, తన సన్నిహితుడు విజయ్ నాయర్ ద్వారా సౌత్ గ్రూప్‌ను సంప్రదించి ముడుపులు కోరారని ఈడీ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తనను కోర్టులో హాజరుపరిచే సమయంలో ఏసీపీ ఏకే సింగ్ దురుసుగా వ్యవహరించారని కేజ్రీవాల్ కోర్టుకు ఫిర్యాదు చేశారు.

ఏ జైలూ నన్ను బంధించలేదు: కేజ్రీవాల్

ఏ జైలూ తనను బంధించలేదని, త్వరలో తాను జైలు నుంచి బయటకొచ్చి ప్రజలకు చేసిన వాగ్దానాలను నెరవేరుస్తానని కేజ్రీవాల్ ఒక సందేశంలో పేర్కొన్నారు. ఈడీ కస్టడీ నుంచి ఆయన పంపిన సందేశాన్ని ఆయన సతీమణి సునీతా కేజ్రీవాల్ మీడి



కేజ్రీవాల్ సందేశాన్ని వినిపిస్తున్న ఆయన సతీమణి సునీత

యాకు వీడియో ద్వారా చదివి వినిపించారు. 'మీ సోదరుడు, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జైలు నుంచి ఈ సందేశం పంపారని ఆమె చెప్పారు. 'ప్రియమైన నా దేశవాసులారా' అన్న సంబోధనతో ప్రారంభించిన ఈ సందేశంలో తాను జైలులో ఉన్నా దేశానికి సేవ చేస్తూనే ఉంటానని కేజ్రీవాల్ చెప్పారు. తన మొత్తం జీవితం దేశానికి అంకితమైందని, జీవితంలో తానెంతో సంఘర్షించానని, ఇది కొనసాగుతుందని తనకు తెలుసని తెలిపారు. తాను జైలుకు వెళ్లినంత మాత్రాన సామాజిక సంక్షేమ, ప్రజా సంక్షేమ కార్యక్రమాల పని ఆగకూడదని వారికి తెలిపారు. ఎన్నో శక్తులు దేశాన్ని బలహీనపరుస్తున్నాయని, మనం అప్రమత్తంగా ఉండి, ఈ శక్తులను గుర్తించి ఓడించాలని పిలుపునిచ్చారు. మోదీ అధికార గర్వంతో కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని, ఇది ఆయనను ఎన్నుకున్న ప్రజలను వంచించడమేనని సునీతా కేజ్రీవాల్ పేర్కొన్నారు. మోదీ అందర్నీ అణచివేయాలని అనుకుంటున్నారన్నారు. జైలులో ఉన్నా కేజ్రీవాల్ ప్రజల కోసమే తపిస్తారన్నారు.

నిష్పాక్షికంగా విచారించాలి

కేజ్రీవాల్‌ను నిష్పాక్షికంగా విచారించాలని జర్మనీ విదేశాంగ ప్రతినిధి చేసిన వ్యాఖ్యను భారత్ తీవ్రంగా పరిగణించింది. భారత్ ప్రజాస్వామిక దేశమని, అక్కడ న్యాయ వ్యవస్థ స్వతంత్రతకు చెందిన ప్రమాణాలు పాటిస్తారని ఆశిస్తున్నామని జర్మనీ విదేశాంగ ప్రతినిధి మీడియాతో మాట్లాడుతూ అన్నారు. కేజ్రీవాల్ విషయంలో కనీస ప్రజాస్వామిక సూత్రాలను అన్వయిస్తారని భావిస్తున్నామని, ఆయన ఎలాంటి అడ్డంకులు లేని చట్టపరమైన మార్గాల్ని ఉపయోగించుకునేలా చూడాలన్నారు. ఏ వ్యక్తి అయినా నేరస్థుడిగా రుజువు కానంతవరకూ అమాయకుడేనన్నది న్యాయపాలన ప్రధాన సూత్రమని, అది కేజ్రీవాల్‌కు వర్తించాలన్నారు. ఈ ప్రకటన గురించి తెలిసిన వెంటనే భారత్... జర్మనీ రాయబారిని పిలిచి తన నిరసన తెలిపింది. జర్మనీ విదేశాంగ ప్రతినిధి వ్యాఖ్యలు భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని పేర్కొంది. జర్మనీ దౌత్య కార్యాలయంలోని డిప్యూటీ రాయబారి జార్జ్ ఎంజ్ వీలర్‌ను సౌత్ బ్లాక్‌లోని భారత విదేశాంగ శాఖకు పిలిపించారు. ఈ వ్యాఖ్యలు భారత న్యాయ వ్యవస్థ స్వతంత్రతను లోకువ చేయడమేనని విదేశాంగ శాఖ ఆ సమావేశం తర్వాత ఒక ప్రకటనలో తెలిపింది. భారత్‌లో ప్రజాస్వామ్యం, న్యాయపాలన అద్భుతంగా, బలంగా పని చేస్తున్నాయని, అన్ని ప్రజాస్వామిక దేశాల్లో మాదిరి భారత్‌లో కూడా చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొంది. ఈ విషయంలో పక్షపాత దృష్టితో చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని పేర్కొంది.

అప్రూవర్‌గా మారతా: సుఖేశ్

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా అప్రూవర్‌గా మారతానని సుఖేశ్ చంద్రశేఖర్ పేర్కొన్నాడు. కేజ్రీవాల్‌కు, ఆయన టీమ్‌కు సంబంధించిన విషయాలను బయటపెడతానని హెచ్చరించాడు. పోలీసులు అతన్ని కోర్టులో హాజరపరచడానికి తీసుకెళుతున్నప్పుడు విలేకరులతో మాట్లాడారు. కేజ్రీవాల్‌కు తీహార్ జైలుకు స్వాగతం పలుకుతున్నానని వ్యాఖ్యానించాడు. రూ.200 కోట్ల మనీ లాండరింగ్ కేసులో అరెస్టైన సుఖేశ్ ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నాడు.

కాంగ్రెస్‌లో తరం మారుతోంది

» రేవంత్‌రెడ్డే ఉదాహరణ: జైరామ్ రమేశ్



న్యూఢిల్లీ, మార్చి 23: కాంగ్రెస్‌లో ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న 'తరం మార్పు' ప్రస్తుతం ఆచరణలోకి వచ్చిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అభిప్రాయపడ్డారు. ఇందుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డే ఉదాహరణ అని చెప్పారు. "తెలంగాణలో ఎంతో మంది కొత్తవారు పార్టీలోకి వస్తున్నారు. కొత్తవారిని రంగంలో నిలపడమే తెలంగాణలో విజయానికి ఒక కారణం. ఆయన రెండు మూడేళ్ల క్రితమే పార్టీలో చేరారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లోనూ తరం మార్పిడి ప్రారంభమయింది. మిగిలిన రాష్ట్రాలూ ఈ మార్గాన్ని అనుసరిస్తాయి" అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం 70 ఏళ్ల వ్యక్తుల తరం నుంచి 50 ఏళ్ల వ్యక్తుల తరానికి వెళ్తోందని అన్నారు. "కాంగ్రెస్‌లో ఎప్పటి నుంచో కొనసాగుతున్న అనుభవజ్ఞులు కూడా ఉన్నారు. రెండు తరాల మధ్య సమన్వయం అవసరం. ఈ విషయంలో బీజేపీకి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఎందుకంటే అది చాలా రాష్ట్రాల్లో ఇంకా స్టార్ అప్ మాత్రమే" అని జైరామ్ వ్యాఖ్యానించారు. మనుగడ కోసమే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేస్తోందా అన్న ప్రశ్నకు జైరాం రమేష్ సమాధానం ఇస్తూ "కాంగ్రెస్‌ను తీసి పారేయడం చాలా కష్టం. కచ్చితంగా తిరిగి అధికారంలోకి వస్తాం" అని అన్నారు. 2004లోనూ ఇలాగే అన్నారని, కానీ ప్రభుత్వం ఏర్పాటు చేశామని అన్నారు.

46 మందితో కాంగ్రెస్ 4వ జాబితా

» బరిలో సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్

న్యూఢిల్లీ, మార్చి 23 : వచ్చే లోక్‌సభ ఎన్నికలకు ఎంపిక చేసిన అభ్యర్థుల నాలుగో జాబితాను కాంగ్రెస్ శనివారం ప్రకటించింది. పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సహా 46 మంది అభ్యర్థులు ఈ జాబితాలో ఉన్నారు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘడ్ నుంచి దిగ్విజయ్ బరిలో దిగనున్నారు. ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజయ్ రాయ్ మరోసారి వారాణసీ నుంచి పోటీ చేయబోతున్నారు. వారాణసీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో వరుసగా మూడోసారి పోటీపడబోతున్నారు. తమిళనాడులోని శివగంగ నుంచి కార్తీ చిదంబరం, విరుధనగర్‌లో మాణిక్యమ్ ఠాకూర్ పోటీ చేయనున్నారు. కాగా, ఈ నాలుగో జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతల పేర్లు లేవు.

17 వేల ఎకరాలు సమర్పయామి!

(మొదటి పేజీ తరువాయి)

కట్టబెడుతున్నట్టు ఆ జీవోల్లో పేర్కొన్నారు. ఇందులో 12,918.43 ఎకరాలకు వార్షిక లీజు ఎకరాకి రూ.31,000 మాత్రమే. మిగతా 4714 ఎకరాలను ఉచితంగా వాడేసుకొమ్మని ఇండోసోల్‌కు ఇచ్చేశారు. జగన్ సీఎం అయి దాదాపు ఐదేళ్లవుతోంది. ఆయన వచ్చాక రాష్ట్రం నుంచి కంపెనీలు పారిపోవడం, ఉపాధి, ఉద్యోగాలు లేక యువత, ప్రజలు వలసపోవడం చూస్తూనే ఉన్నాం. ఒక్క కంపెనీని కూడా ప్రారంభించడం చేతగాని జగన్, ఇప్పుడు ఎన్నికలు సమీపించిన వేళ రాయలసీమ వ్యాప్తంగా సోలార్ పవర్ ప్రాజెక్టులు భారీస్థాయిలో తీసుకొస్తామంటూ బినామీ కంపెనీలకు భూముల పందేరం మొదలుపెట్టారు. వేల ఎకరాలు ఇండోసోల్‌కు కట్టబెట్టారుగానీ, దానివల్ల కనీసం 17 ఉద్యోగాలైనా ఇస్తారో లేదో ఆ జీవోల్లో చెప్పలేదు. బినామీ కంపెనీలకు భూములు దోచిపెట్టడంపై ఉన్న శ్రద్ధ రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు కల్పించడంలో లేదు.

ఎక్కడెక్కడ.. ఎంతెంత...

- నంద్యాల జిల్లా హనుమంతగుండం గ్రామం, కొలిమిగుండ్ల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 10,225.94 ఎకరాల భూమిని ఆ సంస్థకు లీజుకు ఇచ్చారు. లీజు ధర ఎకరానికి రూ.31,000.
- అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం ఉరచింతల గ్రామానికి చెందిన 2692.49 ఎకరాలు ఇండోసోల్‌కు లీజుకిచ్చారు. వార్షిక లీజు ఎకరానికి రూ.31,000.
- కడప జిల్లా మైలవరం మండలంలో ఎం.కంబాలదిన్నె, నేలనూతల గ్రామాల్లో సర్వే నంబర్ 186లో ఉన్న 3773.91 ఎకరాలు ఉచితంగా వాడుకోమని ఎస్ఆర్ఈడీక్యాప్ ద్వారా ఇండోసోల్‌కు అప్పగిస్తూ జీవో ఇచ్చారు.
- కడప జిల్లాలోని మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామంలో ఎల్‌పీఎం నంబర్ 58లోని 941.39 ఎకరాలను ఉచితంగా వాడుకోమని ఎస్ఆర్ఈడీక్యాప్ ద్వారా ఇండోసోల్‌కు ధారాదత్తం చేశారు.

రాష్ట్రంలో భూములన్నీ ఇండోసోల్‌కే...

ఇండోసోల్ కంపెనీ సంప్రదాయ, పునరుత్పాదక విద్యుత్ కంపెనీగా నమోదు అయింది. జీగన్ బినామీ కంపెనీ షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ దీని మాతృ సంస్థ. షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌తో ముఖ్యమంత్రికి ఉన్న బంధం ఏవిటో అందరికీ తెలుసు. జగన్ అధికారంలోకి వచ్చాకే ఇండోసోల్ పుట్టింది. ఇంకా పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. ఈ కంపెనీ మూలధనం కేవలం రూ.లక్ష మాత్రమే. ఈలోపే 2023లో నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో 5418ఎకరాలు కేటాయించి లీజు ఒప్పందం చేశారు. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పారిశ్రామిక విధానం వల్ల ఇండోసోల్ కంపెనీ లీజుదారు స్థాయి నుంచి ఆ భూమికి యజమానిగా మారింది. మరో 3,200 ఎకరాల భూమిని సేకరించుకునేందుకు అనుమతిని ఇవ్వడమే కాకుండా అందుకు ఫెసిలిటేటర్‌గా ఉంటామని కూడా చెప్పింది. అంటే ఒక్క రామాయపట్నం వద్దే ఇండోసోల్ కంపెనీకి 8,348 ఎకరాలు ధారాదత్తం చేశారు. ఈ ప్రతిపాదనలపై 2023 నవంబరు 3వ తేదీన కేబినెట్‌లో సంతకాలు చేశారు. ఇప్పుడు కొత్తగా మరో రూ.17633 ఎకరాలు ఆ కంపెనీకి అప్పగించారు. మొత్తం 25,981 ఎకరాలు ఆ సంస్థ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇండోసోల్ సోలార్ కార్పొరేషన్‌కు రాబోయే 15 ఏళ్లలో రూ. 47,809 కోట్ల మేర రాయితీలు ఇచ్చేలా 2023 డిసెంబరులోనే ఉత్తర్వులు ఇచ్చింది జగన్ సర్కార్. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్-పీఎల్ఐ పథకం కింద ఇండోసోల్‌కు జగన్ ప్రభుత్వం... సోలార్ మాడ్యూల్స్ తయారీ ప్రాజెక్టును కట్టబెట్టారు. వెనువెంటనే దానికనుగుణంగా ఆ సంస్థకు 15 ఏళ్లపాటు విద్యుత్ రాయితీ వర్తించేలా జీవో ఇచ్చేశారు. ఇందుకోసం విద్యుత్ టారిఫ్‌లోనే కొత్త కేటగిరీ సృష్టించారు. మరి ఆ ప్రాజెక్టు పనులు ఇండోసోల్ ఎప్పుడు ప్రారంభిస్తుందన్న సమాచారం ఏ జీవోలో నూ లేదు. ఉత్పత్తి ప్రారంభమయ్యాక ఆరు నెలల తర్వాతే ప్రభుత్వ ప్రోత్సాహక రాయితీలు వర్తింపజేయాలన్నది పారిశ్రామిక విధానం. కానీ, ఇండోసోల్‌కు ఇవేవీ వర్తించడం లేదు.

'షిర్డీసాయి' చేతికి పవర్

జగన్ సీఎం అయ్యేంతవరకు షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సంస్థ మాత్రమే. వైసీపీ అధికారంలోకి వచ్చాక విద్యుత్ శాఖను శాసించడం మొదలుపెట్టింది. విద్యుత్ రంగంలోని ఏ భారీ కాంట్రాక్ట్ అయినా, ప్రాజెక్టు అయినా ఆ కంపెనీ చేతుల్లో పడాల్సిందే. డిస్కమ్‌లకు కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లే కాదు, 18లక్షలకుపైగా వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు కాంట్రాక్టు, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు.. ఇలా చెప్పుకొంటూ పోతే ఈ జాబితాకు అంతే ఉండదు. కడప జిల్లాకు చెందిన సంస్థ కావడమే దానికున్న అర్హత. దాని యజమాని విశ్వేశ్వరరెడ్డి జగన్‌కు అత్యంత సన్నిహితుడు. షిర్డీసాయికి రాయితీ ఇవ్వడం వల్ల ప్రభుత్వంపై రూ.23వేల కోట్ల భారం పడుతుంది. చిన్న పరిశ్రమలకు, బీసీలు, ఎస్సీలు నడిపే పరిశ్రమలకు రాయితీ ఊసే ఉండదు. షిర్డీసాయి ఇంజనీరింగ్ లిమిటెడ్, ఇండోసోల్ కంపెనీలకు విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల నిర్వహణ అనుభవం ఎంత? ఆ కంపెనీల నికర పెట్టుబడి సామర్థ్యం ఎంత? రాష్ట్రంలోగానీ, దేశంలో గానీ వీటికంటే మెరుగైన కంపెనీలే లేవా? ఉన్న భూములన్నింటినీ ఇండోసోల్‌కు, విద్యుత్ ప్రాజెక్టులన్నీ షిర్డీసాయికి కేటాయించడం, పైగా ఆ రెండు కంపెనీలకు రూ.వేల కోట్ల విద్యుత్ రాయితీ ప్రకటించడం చూస్తుంటే జగన్‌కి ఆ కంపెనీలు బినామీలనేది తేలిపోతున్నదని విద్యుత్ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

కన్నీటి మాస్కో



(మొదటి పేజీ తరువాయి)

పుతిన్ శనివారం జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న నలుగురు పారిపోయి, ఉక్రెయిన్ సరిహద్దు దాటటానికి ప్రయత్నిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. వారితోపాటు మొత్తం 11 మందిని భద్రతా దళాలు అరెస్టు చేశాయన్నారు. దాడిని పాశవిక ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. ఆదివారం దేశవ్యాప్త సంతాపదినంగా ప్రకటించారు. ఉగ్రదాడికి సంబంధించి మరిన్ని వివరాలు శనివారం వెల్లడయ్యాయి. వాటి ప్రకారం.. మాస్కో శివార్లలోని క్రాస్‌నొగొర్స్క్ ప్రాంతంలో ఉన్న క్రాకస్ సిటీ హాల్‌లో సోవియట్ యూనియన్ కాలం నాటి 'పిక్‌నిక్ రాక్‌బాండ్' సంగీత కార్యక్రమాన్ని తిలకించటానికి శుక్రవారం వందలాది మంది తరలివచ్చారు. ఆ హాల్‌లో 6,200 మంది కూర్చోగల సామర్థ్యం ఉంది. కొద్దిసేపట్లో మ్యూజిక్ షో ప్రారంభమవుతుందనగా.. రాత్రి 7.40 గంటలకు సైనిక దుస్తులు ధరించిన నలుగురు ఉగ్రవాదులు ఏకే 47 తుపాకులతో ఓ మినీవ్యాన్‌లో వచ్చారు. వచ్చీరాగానే హాల్‌లోకి ప్రవేశించి అమాయక జనంపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. బాంబులు వేసి విధ్వంసం సృష్టించారు. హాలును తగలబెట్టటానికి మంటలను పుట్టించే ద్రావకాన్ని కుర్చీలపై, కర్టెయిన్లపై వెదజల్లారు. మంటలు క్షణాల్లో ఎగిసిపడ్డాయి. జనం కకావికలమై.. ప్రాణాలు రక్షించుకోవటానికి పరుగులు తీశారు. పారిపోతున్న జనంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. హాలుపై అంతస్తులో కూర్చున్న వారు ఈ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. ఆ దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఉగ్రవాదుల కాల్పులతోపాటు, హాలులో పొగ దట్టంగా అలుముకోవటంతో ఊపిరాడక కూడా చాలా మంది మరణించి ఉంటారని పేర్కొన్నారు. కాగా, దాడి నేపథ్యంలో మాస్కో నగరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. క్షతగాత్రులకు రక్తదానం చేయటానికి మాస్కో వాసులు ఆసుపత్రుల ముందు బారులు తీరి మానవత్వం చాటుకున్నారు. 145 మంది గాయాలు పాలుకాగా వారిలో ఐదుగురు పిల్లలతో సహా 115 మంది చికిత్స పొందుతున్నారని ప్రభుత్వ ఆరోగ్య శాఖ అధికారులు ఓ జాబితాను వెలువరించారు.

ఇది మా పనే: ఇస్లామిక్ స్టేట్

రష్యాలో జరిగిన దాడి తమ పనేనని ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రసంస్థ అఫ్ఘానిస్థాన్ శాఖ ప్రకటించింది. మాస్కో సమీపంలో భారీ సంఖ్యలో సమావేశమైన క్రైస్తవులపై దాడి జరిపి పెద్ద ఎత్తున విధ్వంసం సృష్టించామని, తమ ఫైటర్లు తిరిగి సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారని తమ సోషల్ మీడియా ఖాతాల్లో వెల్లడించింది. దాడి ఇస్లామిక్ స్టేట్ పనేనన్న సంగతిని అమెరికా కూడా ధ్రువీకరించింది. మాస్కోపై దాడికి ఐఎస్ కుట్ర పన్నుతోందని తమకు లభించిన సమాచారాన్ని రష్యాకు ఈ నెలలోనే అందజేశామని అమెరికా అధికారులు వెల్లడించారు. దీనిపై అప్పట్లో వార్తలు రాగా.. ఇదంతా రష్యన్లను భయపెట్టటానికి అమెరికా చేస్తున్న ప్రచారంలో భాగమని పుతిన్ కొట్టివేశారు. కాగా, సిరియాలో 2012లో చెలరేగిన అంతర్యుద్ధంలో ఆ దేశ ప్రతిపక్షం, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రసంస్థ.. దేశాధ్యక్షుడు బషార్ అల్ అస్సాద్‌పై సాయుధ పోరు జరిపాయి. ఈ అంతర్యుద్ధంలో రష్యా అధ్యక్షుడు పుతిన్.. అస్సాద్‌కు మద్దతుగా 2015లో తమ సైన్యాన్ని పంపించారు. దీంతో తిరుగుబాటు విఫలమైంది. ఈ నేపథ్యంలోనే, పుతిన్‌పై ఇస్లామిక్ స్టేట్ ప్రతీకారం తీర్చుకోవటానికి తాజా దాడి జరిపినట్లుగా భావిస్తున్నారు.

తీవ్రంగా ఖండించిన ప్రపంచదేశాలు

రష్యాపై ఉగ్రదాడిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్రంగా ఖండించారు. ఈ విషాద సమయంలో రష్యాకు బాసటగా ఉంటామన్నారు. అత్యంత హీనమైన పిరికి చర్యగా రష్యాపై ఉగ్రదాడిని ఐక్యరాజ్యసమితి అభివర్ణించింది. పలు దేశాలు దాడిని తీవ్రంగా ఖండించి, రష్యన్లకు సానుభూతి ప్రకటించాయి.

యుద్ధోన్మాదాన్ని పెంచటానికే మాపై ఆరోపణలు

ఉగ్రదాడిలో ఉక్రెయిన్ కోణం ఉందంటూ పుతిన్‌తోపాటు రష్యా అధికారులు చేస్తున్న ప్రకటనలను ఉక్రెయిన్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. యుద్ధాన్ని మరింతకాలంపాటు పొడిగించటానికి, రష్యన్లలో ఉక్రెయిన్ వ్యతిరేక ఉన్మాదాన్ని రెచ్చగొట్టటానికి, అంతర్జాతీయంగా ఉక్రెయిన్‌ను దోషిగా నిలబెట్టటానికి రష్యా ఈ ఆరోపణలు చేస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సలహాదారు పేర్కొన్నారు. కాగా, పాతికేళ్లుగా అధికారంలో ఉన్న పుతిన్ ఇటీవల రష్యా అధ్యక్షుడిగా ఐదోసారి ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల నిష్పాక్షికతపై తీవ్ర సందేహాలున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

రంగుల పండగకు అంతా సిద్ధం

రెండు రోజుల్లో రంగుల పండుగ హోలీ రానుంది. దీంతో నగరంలో ఆయా దుకాణాల్లో రంగులు, వాటర్ గన్స్, తదితర పండుగకు కావాల్సిన సరంజామా కొనుగోలు కు చిన్నారులు బారులు తీరుతున్నారు. తమ తల్లిదండ్రులను వెంట పెట్టుకుని రంగుల దుకాణాల్లో తమకు నచ్చిన రంగులను ఎంపిక చేసుకుని హోలీ పండుగకు సిద్ధమవుతున్నారు.













16వ డివిజన్ డొంకరోడ్డులో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల తొలగింపు

రామలింగేశ్వరనగర్: అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం కూడా చర్యలు తీసుకున్నారు. 16వ డివిజన్ డొంకరోడ్డులో టౌన్ ప్లానింగ్ అధికారి ఆదేశాలను ధిక్కరించి నిర్మించిన అదనపు నిర్మాణాన్ని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. అయితే ఈ నిర్మాణం చేపట్టిన వీధిలో ప్రభుత్వానికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్టు సమాచారం. దీనిపై వివరాలను చెప్పేందుకు స్థానికంగా కొందరు ముందుకొచ్చిన వారిని అధికారం పార్టీ నేతలు అడ్డుకున్నట్టు తెలిసింది. దీనిపై వివరాలు త్వరలోనే బయటికి వచ్చే అవకాశం ఉంది. అలాగే 15, 16 డివిజన్ల ఉన్న మరో రెండు అక్రమ నిర్మాణాలపై సోమవారం చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారి తెలిపారు. ఈ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా అధికార పార్టీ నేతలు సదరు టౌన్ ప్లానింగ్ అధికారిపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేసినట్టు సమాచారం. అయితే ఆయన తన పని తాను చేయడంతో వారి ప్రయత్నాలు ఫలించలేదు.

దొంగసొత్తుకు అడ్డాగా ఎన్టీఆర్ కాంప్లెక్స్!

- చోరీకి గురైన వాటిని కొనుగోలు చేసిన దుకాణదారులు
- కేసులు పెట్టకుండా ముడుపులు తీసుకుని వెళ్లిపోయిన తిరుపతి పోలీసులు

వన్‌టౌన్: కొందరు చోరులు దొంగిలించిన సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లను కొద్దిరోజుల క్రితం స్థానిక ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని పలువురు దుకాణదారులకు విక్రయించారు. ఈ చోరీ కేసులో తిరుపతి పోలీసు లు కొందరిని విచారించగా తాము దొంగిలించిన ల్యాప్‌ట్యాప్‌లు, సెల్‌ఫోన్లను ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని కొన్ని దుకాణాల్లో విక్రయించినట్టు తెలపడంతో అ క్కడి పోలీసులు నగరానికి వచ్చి దుకాణదారులను విచారించారు. తరువాత చోరీ సొత్తును స్వాధీనం చేసుకోకుండానే ముడుపులు తీసుకుని వెళ్లిపోయారని కాంప్లెక్స్‌లోని కొందరు దుకాణదారులు ఆరోపిస్తున్నారు. దొంగ సొత్తుకు ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని ప లు దుకాణాలు కేంద్రంగా మారాయని స్థానిక వ్యా పారులు చెబుతున్నారు. ఆయా దుకాణాలపై పోలీసుల నిఘా లేనందున నేరస్థులకు ఈ దుకాణాలు కేంద్రంగా మారాయని, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.

ఎన్నికల వేళ కాంగ్రెస్ అకౌంట్లు నిలిపేయడం దారుణం: గిడుగు

గవర్నర్‌పేట: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తు న్న వేళ కాంగ్రెస్ పార్టీ అకౌంట్లు స్తంభింపచేసి, ఆర్థి క ఇబ్బందులు కలుగచేయడం నీచమైన చర్యని సీడబ్ల్యూసీ సభ్యుడు, ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడు గు రుద్రరాజు శనివారం ఒక ప్రకటనలో విమర్శిం చారు. స్వాతంత్ర్యం వచ్చాక ఎప్పుడూ చూడని నీచమైన పాలనను బీజేపీ దేశ ప్రజలకు అందిస్తోందని దుయ్యబట్టారు. దేశంలో కాంగ్రెస్ ఉనికే లేకుండా చేయాలనే కుటిల ప్రయత్నాలను బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఐటీ, ఈడీ, సీబీఐ వంటి జా తీయ దర్యాప్తు సంస్థలను కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకం గా వినియోగిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. ఎస్‌బీఐ వంటి జాతీయ బ్యాంకు రూ.వందల కోట్ల ఎలక్టోరల్ బాండ్ల వివరాలను సరిగా ఇవ్వకుండా బీజేపీకి దాసోహమైందన్నారు.

రేపటి నుంచి తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల

పెనుగంచిప్రోలు, మార్చి 23: అఖండ జ్యోతిస్థాపనలో పెనుగంచిప్రోలు తిరుపతమ్మ వారి చిన్న తిరునాళ్ల మహోత్సవాలు 25న ప్రారంభమవుతాయ ని ఈవో కె.రమేష్ నాయుడు తెలిపారు. 26న గ్రా మోత్సవం, 27న దివ్య ప్రభోత్సవం, 28న అమ్మవారి పుట్టిల్లు అనిగండ్లపాడు నుంచి కొల్లా కుటుంబీకు లు పసుపు, కుంకుమలు తీసుకురావటం, 29న భ క్తుల బోనాల సమర్పణతో ముగుస్తాయన్నారు.

న్యాయవాదులు అంకితభావంతో సేవలందించాలి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి భట్టి

విజయవాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు సమాజంలో అకింతభావంతో సేవలందించి, కక్షిదారులకు సత్వర న్యాయం చేయడానికి కార్యోన్ముఖులు కావాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్‌వీఎన్ భట్టి అభిప్రాయపడ్డారు. బెజవాడ బార్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ అఫ్ లాయర్స్ స్థానిక బీబీఏ హాలులో సంయుక్తంగా శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బెజవాడ బార్‌లో ఎంతో నైపుణ్యం కలిగిన న్యాయవాదులు ఉన్నారన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో కోర్టులో ఇంతకు ముందు వెలువరించిన తీర్పులను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుందన్నారు. నగరంలో అందుబాటులోకి వచ్చిన కోర్టు కాంప్లెక్స్ పనులు చాలా కాలం నత్తనడకన సాగాయన్నారు. అప్పుడు సీజేగా ఉన్న ఎన్వీ రమణను కలిసినప్పుడు ఆయన చాలా ఆవేదన చెందారన్నారు. ఈ భవన నిర్మాణంపై ఒక కమిటీని ఏర్పాటు చేసిన తర్వాత పనుల్లో వేగం పుంజుకుందన్నారు. ప్రాజెక్టు అంచనాల సవరించడం వల్ల రూ.72 కోట్లకు వ్యయం పెరిగిందన్నారు. ఉమ్మడి జిల్లాకు జస్టిస్ శేషసాయి వంటి న్యాయమూర్తి అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా ఉండడం అదృష్టమన్నారు. అనంతరం భట్టిని న్యాయమూర్తులు, న్యాయవాదులు సత్కరించారు. హైకోర్టు న్యాయమూర్తి శేషసాయి, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి అరుణసారిక, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సత్యానంద్, ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, బీబీఏ అధ్యక్షుడు సుందర్ పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న సుప్రీం న్యాయమూర్తి భట్టి



తదుపరి కార్యాచరణ త్వరలో ప్రకటిస్తా

- చలసాని పండు కుమార్తె దేవినేని స్మిత

పటమట, మార్చి 23: పెనమలూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బోడే ప్రసాద్‌ను ప్రకటించి అధిష్టానం తమకు అన్యాయం చేసిందని చలసాని పండు కుమార్తె దేవినేని స్మిత ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి తన తండ్రి చలసాని పండు పార్టీలోనే కొనసాగాడని, 2009 ఎన్నికల్లో ఆయన ఓటమి చెందడానికి స్థానిక పార్టీ నేతలే కారణమన్నారు. స్థానిక జేడీ నగర్‌లోని తన స్వగృహంలో శనివారం దేవినేని స్మిత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పండు చనిపోయాక నిరంతరం పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గతంలో పెనమలూరుకు టికెట్ కేటాయించినప్పుడు పార్టీ అధిష్టానం తమను సంప్రదించలేదని వాపోయారు. పండు ఆత్మశాంతి కోసమే పనిచేస్తున్నా తప్ప పదవుల కోసం కాదన్నారు. కార్యకర్తలతో మాట్లాడి తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కిలారు ఆంజనేయులు, భద్రయ్య, వెంకట్, దేవినేని గౌతమ్ పెద్ద ఎత్తున ముస్లిం మహిళలు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగూరు యూనియన్ బ్యాంకు మేనేజర్ ప్రభావతి అరెస్టు



పెనమలూరు, మార్చి 23: ఖాతాదారుడి బంగారాన్ని ఫోర్జరీ చేసి కాజేసి కొన్ని రోజులుగా తప్పించుకు తిరుగుతున్న గంగూరు యూనియన్ బ్యాంకు మేనేజరు దావులూరి ప్రభావతిని పెనమలూరు పోలీసులు అరెస్టు చేశారు. నూజివీడు మండలం మర్రిబంధం గ్రామానికి చెందిన కవులూరి యోగేశ్వరరావు అదే గ్రామానికి చెందిన గంగూరు యూనియన్ బ్యాంకు మేనేజరు దావులూరి ప్రభావతి పరిచయస్తులు. దీంతో యోగేశ్వరరావు తన 380 గ్రాముల బంగారాన్ని గంగూరు యూనియన్ బ్యాంకులో గతేడాది జులైలో తాకట్టు పెట్టి రూ.2లక్షల లోన్ తీసుకొన్నాడు. ఆ మొత్తాన్ని గత నవంబరులో చెల్లించాడు. బంగారం తీసుకోవడానికి వెళ్లగా బంగారాన్ని తన ఇంట్లో ఉంచానని, ఇంటికి రమ్మని పిలిచి తనను పెళ్లి చేసుకొమ్మని ఒత్తిడి చేసింది. దీంతో మోసపోయానని గ్రహించిన యోగేశ్వరరావు దాదాపు నెల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాంకులో అంతర్గత విచారణ చేసిన అధికారులు ప్రభావతి మోసాన్ని కనిపెట్టి ఆమెను సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న ప్రభావతిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

మహిళల అభ్యున్నతికి టీడీపీ పథకాలు: జ్ఞానేశ్వరి

గుణదల, మార్చి 23: మహిళల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశం పార్టీ పలురకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడానికి రూపకల్పన చేసిందని టీడీపీ గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి యార్లగడ్డ జ్ఞానేశ్వరి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె శనివారం ఎనికేపాడు గ్రామంలో పర్యటించారు. స్థానిక మహిళలు ఆమెకు పూలమాల వేసి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తేనే యువతకు, మహిళలకు సరైన పథకాలు అమలవుతాయన్నారు. సూపర్ సిక్స్ పథకాల కర పత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఇంటర్ పూర్తిచేసిన మహిళలకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయించి ఉన్నత చదువులకు ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. తెలుగుదేశం మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు టీడీపీ అధికారంలోకి రాగానే మహాశక్తి ఆడబిడ్డ నిధి కింది ప్రతి మహిళకు నెలకు రూ.1500 అందించనున్నట్టు చెప్పారు. గన్నవరం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ బలపర్చిన యార్లగడ్డ వెంకట్రావును అత్యధిక మెజారిటీతో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కోనేరు వెంకట శివరామకృష్ణ (పెదబాబు), కోనేరు సందీప్, వెంకటకృష్ణ, గోగం బాల కోటేశ్వరరావు, పొదిలి లలిత, అనుమోలు విజయ, బొకినాల రాజేంద్రప్రసాద్, వరికూటి కోటేశ్వరరావు, పొదిలి దుర్గారావు, బీజేపీ నేతలు కురుమద్దాలి ఫణి కుమార్, ముప్పా విజయలక్ష్మి పాల్గొన్నారు.



ఎనికేపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న యార్లగడ్డ జ్ఞానేశ్వరి



గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన వాహనాలు చూపిస్తున్న మెకానిక్

కార్పొరేటర్ వేధిస్తున్నారని ఫిర్యాదు

రాణిగారితోట, మార్చి 23: కార్పొరేటర్ తమపై పగబట్టి కక్ష సాధింపునకు పాల్పడుతూ బెదిరించడమే కాక తమ జీవనోపాధిపై దెబ్బకొట్టేలా దాడులు చేయిస్తున్నాడని ఒక ముస్లిం కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 18వ డివిజన్ ఆంథోని వీధిలో నివశించే యాసిన్ బేగ్ కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ కార్యాలయ సమీపంలో మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. అక్కడ కొందరు కూర్చొని స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అక్కడ ఎవరినీ కూర్చోకుండా చూడాలని బేగ్‌కు కార్పొరేటర్ చెప్పాడు అందుకు బేగ్ సరేనని చెప్పాడు. గురువారం మళ్లీ వచ్చిన కార్పొరేటర్.. బేగ్‌పై ఇష్టానుసారంగా మాట్లాడడంతో మెకానిక్ బేగ్ భార్య తన బంధువులతో వచ్చి కార్పొరేటర్‌ను నిలదీసింది. ఇద్దరి మధ్య వివాదం రేగడంతో అక్కడున్న కొందరు సర్ది చెప్పడంతో వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మెకానిక్ షాపు వద్ద రిపేర్‌కు ఉంచిన ఐదు వాహనాలను గ్రైండర్‌తో ధ్వంసం చేశారు. శనివారం ఉదయం షాపు వద్దకు వచ్చిన మెకానిక్ ఈఘటనను చూసి కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కార్పొరేటర్ తనపై అకారణంగా వివాదానికి దిగడం, షాపు వద్ద వాహనాలను అనుచరులైన రమేష్, నాగరాజుతో ధ్వంసం చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

నిరుద్యోగ యువతకు జగన్‌రెడ్డి మోసం

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి, నక్కా

వన్‌టౌన్, మార్చి 23: నిరుద్యోగ యువతను మోసం చేసిన జగన్మోహన్ రెడ్డిని, మతోన్మాద శక్తులను భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ఓడిద్దామని, ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలిస్తానని మోసం చేసిన మోదీని, జతకట్టిన పార్టీలను ఓడిద్దామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కా లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రానాయక్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 93వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో హనుమాన్ పేట దాసరిభవన్‌లో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదని, 12ఏళ్ల అతి చిన్న వయసులోనే స్వాతంత్రోద్యమంలో పాల్గొని 23 ఏళ్ల యువప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశభక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవమూర్తి భగత్ సింగ్ అని కొనియాడారు. ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజు, ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అఫ్సర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎంవీ సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నసర్, నేతలు పాల్గొన్నారు.



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలు

పశ్చిమ సీటు ఇవ్వాలని పవన్‌ను కోరా!

- జనసేన పశ్చిమ ఇన్‌చార్జి మహేష్

వన్‌టౌన్, మార్చి 23: పశ్చిమ సీటు తనకు కేటాయించాలని జనసే న పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను కోరానని, ఆయనపై తనకు పూర్తిగా నమ్మకం ఉందని పార్టీ నగరాధ్యక్షుడు పోతిన మహేష్ తెలిపారు. శనివారం కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పశ్చిమ నుంచి పోటీ చేయాలనుకుంటున్నానని, పోటీకి అర్హత కూడా ఉందన్నారు. తాను ఎక్కడి నుంచో ఎన్నికల కోసం ఊడిపడ్డ నేతను కాదన్నారు. ఇదే అంశాన్ని పవన్‌కు కూడా చెప్పానన్నారు. పవన్‌కల్యాణ్‌కు విషయాలు తెలుసని సీట్ల కేటాయింపులో న్యాయం చేస్తారన్న మ్మకం ఉందన్నారు. నగరంలో పార్టీని లేకుండా చేయాలనుకున్నవారినే ఇక్కడ లేకుండా చేశానన్నారు. 2019 ఎన్నికల్లో గెలవకపోయినా ప్రజల సమస్యలపై పో రాటం చేశానన్నారు. సొంత పార్టీ నేతలే ఇబ్బంది పెట్టినా తిరిగి విమర్శించలేదన్నారు. కార్యకర్తలను జైలులో పెడితే అండగా ఉన్నానన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసినట్టు తెలిపారు. రూ.300 కోట్ల విలువైన కొత్తగుళ్ల స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడానన్నారు. పోలీసులు తనపై కేసులు పెట్టినా భయపడకుండా పార్టీ కోసం పనిచేసానన్నారు. పవన్ స్ఫూర్తితో జనసేన మార్క్ రాజకీయాలు చేశాన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు

వన్‌టౌన్, మార్చి 23: దుర్గగుడిలో కొలువైన కనకదుర్గమ్మ దర్శనా నికి శనివారం పలువురు ప్రముఖులు ఆలయానికి విచ్చేశారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్టి కుటుంబ సభ్యు లు, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి దంపతులు ఆలయానికి రాగా వారికి ఈవో రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దుర్గమ్మ దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేయగా ఈవో వారికి దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. అనంతరం జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్టి ఆయన కుటుంబసభ్యులు మల్లేశ్వరస్వామి స్వామిని దర్శించుకున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


దుర్గగుడిలో ప్రతిరోజూ నిర్వహించే నిత్యాన్నదానానికి హైదరాబాద్ కల్యాణ్ నగర్‌కు చెందిన వి.జ్యోత్స్న రూ.లక్షను సహాయ కార్యనిర్వాహణాధికారి ఎన్.రమేష్‌ను కలిసి చెక్కు అందజేశారు. దాతకు దుర్గమ్మ దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేయగా ఏఈవో వారికి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు.



కళాకారులు సుధారాణి, నాట్యాచార్య శ్రీనివాసులును సత్కరిస్తున్న నిడుమోలు రమా సత్యనారాయణ, చావా నర్సింహారావు

సుధారాణి, శ్రీనివాస్ దంపతులకు సత్కారం

విజయవాడ కల్చరల్, మార్చి 23: గాయనీ సుధారాణి, నాట్యాచార్య శ్రీనివాస్ దంపతులకు డ్రీమ్ ఆడియో, మహానటి సావిత్రి కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరా య గ్రంథాలయంలో శనివారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ, బ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు వెంకట బలరామకృష్ణమూ ర్తి, పరుచూరి విజయలక్ష్మి, చాలా నర్సింహారావు దంపతులను అభినందించారు. గాయనీ, గాయకులు మహ్మద్ ఖాజా, సత్యవర్ధన్, రసూల్ బా బు, డేవిడ్ రాజు, గొట్టిపాటి రామారావు, వాసిరెడ్డి శ్రీనివాస్, సాయిబాబు, సత్య కల్యాణి, ప్రజ్ఞ, విష్ణుప్రియ, డాక్టర్ భాగ్యశ్రీ, అమలారాణి, సూర్యకామేశ్వరి పాల్గొనగా కొప్పుల అశోక్ ఆనంద్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



మీడియా కమిటీ సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా తదితర విభాగాల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ దిల్లీరావు

ఎంసీఎంసీ, సోషల్ మీడియా విభాగాల్లో కలెక్టర్ దిల్లీరావు సందర్శన

కృష్ణలంక, మార్చి 23: ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించేందుకు తీసుకొంటున్న చర్యల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను కలెక్టర్ దిల్లీరావు శనివారం సందర్శించారు. జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), సోషల్ మీడియా సెల్, గ్రీవెన్సు పరిష్కార కవిటీ విభాగాల అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. నిబంధనలపై పూర్తిస్థాయిలో అవగాహన, అప్రమత్తత, నిబద్ధతతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు.

మద్యం స్వాధీనం

తిరువూరు/ విస్సన్నపేట: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో సర్కి ల్ పరిధిలో విస్సన్నపేట, గంపలగూడెం మండలాల్లో ఎస్ఈబీ అధికారులు శనివారం విస్తృతదాడులు నిర్వహించారు. ఎస్ఈబీ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం కొండపర్వలో అన్నంశెట్టి సాంబశివరావు నుంచి 87 తెలంగాణ మద్యం సీసాలు, పుత్రాలంలో కొచెర్ల అన్నమ్మ నుంచి 33, గంపలగూడెం మండలం సత్యలపాడులో నాగనబోయిన కొండలు నుంచి 30, ఇలా మొత్తం 106 తెలంగాణ మద్యం సీసాలు, 44 డ్యూటిపెయిడ్ బాటిళ్లు స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. తిరువూరు ఎస్ఈబీ ఎస్సైలు జి.రఘు, జగ్గరావు, ఎస్ఈబీ ఎస్సై రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌వోలకు ప్రత్యేక మెజిస్టీరియల్ అధికారాలు

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరగనున్న 2024 లోక్‌సభ, శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న రిటర్నింగ్ అధికారులకు (ఆర్‌వోలు) ప్రత్యేక మెజిస్టీరియల్ అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెక్టార్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లకు మెజిస్టీరియల్ అధికారాలు కల్పించింది. స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలకు స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్టీరియల్ అధికారాలు కల్పించింది. ఎంసీసీ బృందాలకు కూడా అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు న్యాయశాఖ గెజిట్‌ను విడుదల చేసింది.

జూన్ వరకు వేసవి అత్యవసర ప్రణాళిక: సీఎస్

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జూన్ నెలాఖరు వరకు వేసవి అత్యవసర ప్రణాళిక అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మంచినీటి సరఫరా, ఉపాధి హామీ పనులపై శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... వేసవి దృష్ట్యా రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, ఇందుకు నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1000 కోట్లు విడుదల చేశామన్నారు. ఈ నిధులతో వివిధ తాగునీటి పథకాల నిర్వహణ, నీటి ఎద్దడి గల ఆవాసాలకు ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. రానున్న మూడు నెలలు రాష్ట్రంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడడంతోపాటు కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా తగిన పనులు కల్పించాలన్నారు. ఒక్కో కుటుంబానికి 100 రోజుల పని దినాల కల్పన లక్ష్యాన్ని అధికమించాలని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా, ఉపాధి పనులు విధులు నిర్వహించే అధికారులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కలెక్టర్లకు సీఎస్ స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే పొన్నాడను అడ్డుకున్న మహిళలు

తాళ్లరేవు, మార్చి 23: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ముమ్మిడివరం వైసీపీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీశ్‌కుమార్‌ను మహిళలు అడ్డుకున్నారు. గ్రామంలో ఇళ్ల స్థలాలను స్థానికులకే ఇవ్వాలని లబ్ధిదారులు 47రోజులుగా నిరసన దీక్షలు చేసినా ఎమ్మెల్యే గానీ, వైసీపీ నేతలు గానీ పట్టించుకోలేదని.. ఇప్పుడు ఓట్లు కావాల్సి వచ్చాయా అని ఎమ్మెల్యేపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో ఇళ్ల స్థలాలు ఎవరికో ఇచ్చి మమ్మల్ని ఓట్లు అడగడం ఎందుకని నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే నీళ్లు నమిలి లబ్ధిదారులకు ఏమీ చెప్పలేక మెల్లగా జారుకున్నారు.

మావోయిస్టు డిప్యూటీ కమాండర్ లొంగుబాటు

ఎటపాక, మార్చి 23: మావోయిస్టు పార్టీకి చెందిన కిష్టారం ఏరియా కమిటీ డిప్యూటీ కమాండర్ మడివి ఊరలు అలియాస్ ఊర శనివారం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓఎస్డీ కె.మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్ మీనా వివరాలు వెల్లడించారు. ఛత్తీసగఢ్‌లోని కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధి సాకిలేరు గ్రామానికి చెందిన ఊర మావోయిస్టు పార్టీలో 18 ఏళ్లుగా పని చేస్తున్నట్లు చెప్పారు. 2006లో దర్భగుడా గ్రామంలో ఇద్దరు, 2007లో చీకొరుగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు సల్వా జుడుం సానుభూతిపరులను హత్య చేసిన ఘటనల్లో ఊర పాల్గొన్నాడని పేర్కొన్నారు. అలాగే 2006లో బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధి కొత్తచెరువు గ్రామంతో పాటు కుంట పీఎస్ పరిధిలో అప్పటి కుంట ఏరియా కమిటీ ఇన్‌చార్జ్ దేవ డీవీసీఎం ఆధ్వర్యంలో జరిపిన ఐఈడీ పేలుడు ఘటనల్లోనూ ఊర హస్తం ఉందని వివరించారు. ఆ రెండు ఘటనల్లో మొత్తం 21 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు మృతిచెందినట్లు చెప్పారు. జనజీవన స్రవంతిలో కలిసిన ఊరకు రూ.4 లక్షల రివార్డుతో పాటు ప్రభుత్వం నుంచి సౌకర్యాలు కల్పిస్తామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

ఏపీఈఏపీ పీజీ సెట్ నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 23: ఏపీ ఇంజనీరింగ్-ఫార్మసీ(ఏపీఈపీ) పీజీ సెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. దరఖాస్తుకు ఏప్రిల్ 20 వ తేదీ గడువు అని, మే 29వ తేదీ నుంచి ప్రవేశ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఏపీసీహెచ్‌ఈ.ఏపీ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లో సమగ్ర వివరాలు పొందుపర్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్ రమాశ్రీ, రిజిస్ట్రార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'మణిపాల్'లో గవర్నర్‌కు వైద్యపరీక్షలు


మణిపాల్ ఆస్పత్రికి విచ్చేస్తున్న అబ్దుల్ నజీర్

తాడేపల్లి టౌన్, మార్చి 23 : ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం శనివారం సాయంత్రం తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. పరీక్షించిన వైద్యులు ఆయనకు ఎండోస్కోపీ టెస్టులు నిర్వహించాలని సూచించినట్టు తెలిసింది. ఆదివారం ఉదయం సంబంధిత టెస్టులు నిర్వహించనున్నట్టు మణిపాల్ ప్రతినిధులు తెలిపారు.

ఉదయగిరి టికెట్ కోసం 30 కోట్లు అడిగారు!

▸▸ విజయసాయిపై మాజీ ఎమ్మెల్యే వంటేరు ఆరోపణ

జలదంకి, మార్చి 23: 'వైసీపీ తరఫున ఉదయగిరి అసెంబ్లీ టికెట్ అడిగేందుకు విజయసాయిరెడ్డి వద్దకు వెళితే రూ.30 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు' అని టీడీపీ నేత, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. నెల్లూరు జిల్లా జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో శనివారం వంటేరు తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి తాను రూ.7 కోట్లు తీసుకుని టీడీపీలో చేరానని ఆరోపించడాన్ని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా వంటేరు మాట్లాడుతూ... 'విజయసాయీ... నా 30 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ఒక్క పైసా అవినీతికి పాల్పడ్డానని నిరూపించగలవా!? నేను అవినీతికి పాల్పడలేదని కాణిపాకం వినాయకుడి సన్నిధిలో ప్రమాణం చేస్తా. అదే విజయసాయి ఎక్కడా అవినీతికి పాల్పడలేదని జగన్‌పై ప్రమాణం చేస్తే చాలు. పదేళ్ల క్రితం నేను వైసీపీలో చేరినప్పుడు ఎంత డబ్బు ఇచ్చారు? నాకు నేనే టీడీపీలో చేరాను. ఇకనైనా విజయసాయి అవాస్తవ ఆరోపణలు మాని, రాజకీయం చేయాలి' అని హితవు పలికారు. సమావేశంలో బ్రాహ్మణక్రాక సర్పంచ్ సుధాకర్, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఉల్లి ఎగుమతిపై నిరవధిక నిషేధం

ముంబై, మార్చి 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై నిరవధిక నిషేధాన్ని విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మూడవ దఫా రాజ్యాధికారాన్ని చేపట్టాలని ఉవ్విళ్లూరుతున్న మోదీ ప్రభుత్వం గత ఏడాది డిసెంబరులోనే ఉల్లి ఎగుమతులపై నిషేధాన్ని విధించింది. మార్కెట్‌లో ధరల పెరుగుదలను అడ్డుకోవడానికి విధించిన ఈ నిషేధం మార్చి 31తో ముగియనుంది. శుక్రవారం పొద్దుపోయిన తరువాత కేంద్రం ఉల్లి నిషేధాన్ని నిరవధికంగా పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలోనే అత్యధికంగా ఉల్లిపాయను పండించేది మహారాష్ట్ర. కొత్త పంట మార్కెట్‌లోకి వస్తున్న నేపథ్యంలో ముంబయి హోల్‌సేల్ మార్కెట్‌లో డిసెంబరులో క్వింటా రూ.4,500 ధర పలికిన ఉల్లి నేడు రూ.1,400కు పడిపోయింది. కాగా, 2023, మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 25 లక్షల టన్నుల ఉల్లిని ఇండియా ఎగుమతి చేసింది.

పైరేట్ల నుంచి 110 మందిని కాపాడిన నేవీ

న్యూఢిల్లీ, మార్చి 23: ఇటీవలి కాలంలో అరేబియా సముద్రంలో చేపట్టిన వివిధ ఆపరేషన్లలో పైరేట్ల నుంచి సుమారు 110 మందిని భారత నావికాదళం కాపాడింది. వారిలో 27 మంది పాకిస్థానీలు, 30 మంది ఇరాన్ దేశస్థులు కూడా ఉన్నారు. పైరేట్ల దాడికి సంబంధించిన 13 ఘటనల్లో ఎమర్జెన్సీ ఫోన్‌కాల్స్‌కు భారత నేవీ స్పందించి ఆపరేషన్లు చేపట్టింది. ఈ విషయాన్ని నేవీ అధికారులు శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 'ఆపరేషన్ సంకల్ప్ సహా వివిధ మిషన్లు చేపట్టి భారత నేవీ 110 మందిని కాపాడింది. వీరిలో 45 మంది భారతీయులు, 65 మంది ఇతర దేశాల పౌరులు ఉన్నారు. 13 దాడి ఘటనలకు సంబంధించిన అత్యవసర ఫోన్‌కాల్స్‌కు సైతం భారత నేవీ స్పందించింది' అని అధికారులు తెలిపారు.

విశాఖ పర్యటన మరిచిపోలేని అనుభూతి

▸▸ అమెరికా యుద్ధనౌక సిబ్బంది

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పర్యటన మరిచిపోలేని అనుభూతిని కలిగించిందని అమెరికా నేవీ అధికారులు తెలిపారు. భారత్ నౌకాదళంతో కలిసి టైగర్ ట్రయంఫ్-24 విన్యాసాల్లో పాల్గొనడానికి వచ్చిన వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. వారి నౌక యుఎస్‌ఎస్ సోమర్‌సెట్ గురించి సర్ఫేస్ వార్‌ఫేర్ ఆఫీసర్ బ్రెంజిక్ వివరించారు. డజన్ల కొద్దీ మిలటరీ వాహనాలను తరలించే శక్తి ఆ నౌకకు ఉందన్నారు. ఇది ఉభయచర వాహనాలను చేరవేస్తుందని, వేయి మంది సెయలర్లకు ఏర్పాట్లు ఉన్నాయన్నారు. బోట్లకు రిపేర్లు చేసేందుకు వర్క్‌షాపు కూడా ఉందన్నారు. హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు ల్యాండింగ్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. ఇక్కడ భారత నౌకాదళంతో గడిపిన సమయం ఎంతో విలువైనదని, వారి నుంచి అనేకం తెలుసుకున్నామని సంతోషం వ్యక్తంచేశారు.


అమెరికా యుద్ధ నౌక

ఉన్నత విద్య.. మిథ్య!

▸▸ ఇంటర్ తర్వాత ఆపేస్తున్న విద్యార్థులు
▸▸ జగన్ పాలనలో లక్షల మంది చదువుకు దూరం
▸▸ 2020-21, 2021-22ల్లో లక్ష మందికి పైనే
▸▸ ఆల్ పాస్‌ను సాకుగా చూపిస్తున్న ప్రభుత్వం
▸▸ అందరూ పాసైతే ఉన్నతవిద్య చదవకూడదా?
▸▸ 2022-23లోనూ 22వేల మంది డ్రాపవుట్
▸▸ అయినా విద్యాభివృద్ధి అంటూ జగన్ గొప్పలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



"వైసీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. విద్యారంగాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దాం. రాష్ట్రంలో చదువు మానేసే విద్యార్థే లేడు.." ఇలా బహిరంగ వేదికలపై ముఖ్యమంత్రి జగన్ చెప్పే మాటలు చూస్తే కోటలు దాటుతాయి. కానీ, ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు మాత్రం ఉన్నత విద్య చదివేందుకు కాలేజీల గేటు దాటడం లేదు. రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు పరిస్థితులు అనుకూలించడం లేదని వేలాది మంది విద్యార్థులు అక్కడితోనే ఆగిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మారిన విధానాలు విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నాయి. విద్యా దీవెన నగదు సకాలంలో విడుదల చేయకపోవడం పేద విద్యార్థులకు శాపంగా మారింది. హడావిడిగా సింగిల్ మేజర్ డిగ్రీ ప్రవేశపెట్టిన ఉన్నత విద్యా మండలి, దానిపై అవగాహన కల్పించడంలో నూరు శాతం విఫలమైంది. అసలు ఏ కోర్సు ఎక్కడుంది? ఏది చదవాలి? అన్నదానిపై కనీస అవగాహన విద్యార్థులకు లేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా జగన్ పాలనలో ఏటా వేలాది మంది ఇంటర్ తర్వాత చదువు ఆపేస్తున్నారు. 2020-21, 2021-22 విద్యా సంవత్సరాల్లో అయితే ఏటా లక్ష మందికి పైగా ఇంటర్ పూర్తయిన విద్యార్థులు ఉన్నత విద్యకు వెళ్లకుండా ఆగిపోయారు.

ఉన్నత విద్యలో చేరుతున్న వారి వివరాలు

విద్యా సంవత్సరం	ఇంటర్ చదివినవారు	ఉన్నత విద్యలో చేరినవారు	చదువు ఆపేసినవారు
2019-20	3,97,494	3,50,540	46954
2020-21	4,99,127	3,97,303	1,01,824
2021-22	5,20,903	4,02,601	1,18,302
2022-23	3,37,987	3,15,600	22387

ఉన్నత విద్యలో ఎంతమంది..?

2022-23 విద్యా సంవత్సరంలో 3,37,987 మంది ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించారు. వారిలో ఇంజనీరింగ్‌లో 1.2లక్షల మంది, ఫార్మసీలో 12వేలు, అగ్రికల్చర్ కోర్సుల్లో 5వేలు, మెడికల్, నర్సింగ్‌లో 15వేలు, డిగ్రీలో 1.48లక్షలు, జాతీయ విద్యా సంస్థల్లో 5,600 మంది చేరారని, 10వేల మంది ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయారని ఉన్నత విద్యామండలి తాజా నివేదిక వెల్లడించింది. అంటే.. 22,387 మంది ఇంటర్ తర్వాత చదువులు ఆపేశారు. 2019-20 విద్యా సంవత్సరంలో 46,954 మంది ఉన్నత విద్యకు వెళ్లకుండా ఆగిపోయారు. 2020-21లో 1,01,824 మంది, 2021-22లో 1,18,302 మంది ఇంటర్‌తోనే ఆపేశారు. 2019-20, 2020-21 విద్యా సంవత్సరాల్లో కొవిడ్ కారణంగా ఇంటర్ పరీక్షలు నిర్వహించకుండా ఆల్ పాస్ చేశారని, అందుకే ఆ సంవత్సరాల్లో ఎక్కువ మంది డ్రాపౌట్ అయ్యారని విద్యా మండలి సాకులు చెబుతోంది. వాస్తవానికి ప్రభుత్వం అందరినీ ఆల్ పాస్ చేసినప్పుడు ఇంకా ఎక్కువ మంది ఉన్నత విద్యా కోర్సుల్లో చేరాలి. కానీ అందుకు విరుద్ధంగా లక్షల మంది డ్రాపౌట్ అయ్యారు. కాగా అంతకముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2018-19 విద్యా సంవత్సరంలో 81,813 మంది ఇంటర్ వరకే చదివారని నివేదిక చెబుతోంది. ఆ తర్వాత సీఎం జగన్ విద్యారంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దినప్పుడు ఉన్నత విద్య చదివే వారి సంఖ్య ఎందుకు పెరగలేదనేది మాత్రం చెప్పడం లేదు.

వలసలపైనా అబద్ధాలే

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్నత విద్య కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరిగిపోయింది. గతంతో పోలిస్తే ఏటా తెలంగాణ ఎంసెట్ రాసేవారి సంఖ్య పెరిగింది. రెండేళ్ల నుంచి ఏటా 40వేల మంది చొప్పున ఏపీ విద్యార్థులు టీఎస్-ఎంసెట్ రాస్తున్నారు. వారితో పాటు మేనేజ్‌మెంట్ కోటాలోనూ భారీగా ఏపీ విద్యార్థులు అక్కడి కాలేజీల్లో చేరుతున్నారు. తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు విద్యార్థులు వలస వెళ్తున్నారు. కానీ 10వేల మంది మాత్రమే ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నట్లు ఉన్నత విద్యామండలి సొంత లెక్కలు వేసింది. 2018-19 నుంచి 2022-23 వరకు ఏటా 10వేల మంది వలస వెళ్తున్నట్లు లెక్కలు వేసింది. అప్పటితో పోలిస్తే ఇటీవల వలస వెళ్లేవారి సంఖ్య పెరిగినా తక్కువగా చూపించే ప్రయత్నం చేస్తోంది.

డిగ్రీ అడ్మిషన్లు ఢమాల్

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్ చదివిన విద్యార్థుల్లో ఎక్కువ మంది సాధారణ డిగ్రీ కోర్సులు చదువుతుంటారు. కానీ జగన్ ప్రభుత్వంలో డిగ్రీ అడ్మిషన్లు దారుణంగా పడిపోయాయి. డిగ్రీ కోర్సుల్లో... 2018-19లో 1,94,388 మంది, 2019-20లో 2,17,217 మంది, 2020-21లో 2,57,584 మంది, 2021-22లో 2,47,666 మంది చేరారు. కానీ 2022-23లో ఒక్కసారిగా లక్ష మంది డిగ్రీ కోర్సులకు దూరమయ్యారు. ఆ సంవత్సరంలో 1.48లక్షల మంది మాత్రమే డిగ్రీలో చేరారు. పోనీ బదులుగా ఇంజనీరింగ్‌లో చేరినవారి సంఖ్య విపరీతంగా పెరిగిందా అంటే అదీ లేదు. నాలుగేళ్ల డిగ్రీ విధానం, ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభించిన ఉన్నత విద్యామండలి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించలేకపోయింది. ఇక ఈ విద్యా సంవత్సరంలోనూ డిగ్రీ అడ్మిషన్లు 1.5లక్షలు దాటలేదు. ఈ ఏడాది సింగిల్ మేజర్ డిగ్రీ విధానం ప్రవేశపెట్టిన విద్యామండలి దానిపై ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని చెప్పి వదిలేసింది. వాస్తవానికి జాతీయ విద్యా విధానంలో ఉన్న సింగిల్ మేజర్ డిగ్రీని వెంటనే అమలుచేయాలని నిబంధనలు లేకపోయినా, మేమే ముందు చేశాం అనే గొప్ప కోసం పిల్లలకు అర్థం కాకపోయినా హడావిడిగా అమలుచేసింది.



ఐఎన్ఎస్ సుమిత్ర సిబ్బందికి జ్ఞాపిక అందజేస్తున్న నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్

విశాఖలో నేవీ చీఫ్ వీడ్కోలు పర్యటన

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళం చీఫ్ అడ్మిరల్ హరికుమార్ త్వరలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో మూడు రోజుల వీడ్కోలు పర్యటనకు విశాఖపట్నం వచ్చారు. తూర్పు నౌకాదళంలో అన్ని యూనిట్లను సందర్శించి, సమీక్షించారు. యుద్ధనౌకలు, యుద్ధ విమానాలను సందర్శించి అక్కడే అధికారులతో పలు అంశాలపై చర్చించారు. సముద్రిక ఆడిటోరియంలో అధికారులతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. డిఫెన్స్ సెక్యూరిటీ దళానికి నౌశక్తి నగర్‌లో ప్రత్యేకంగా నిర్మించిన 492 గదుల నిర్మాణం 'వీరం'ను ప్రారంభించారు. అరేబియా మధ్యధరా సముద్రంలో సముద్రపు దొంగల దాడులను తిప్పికొట్టడంలో చురుకైన పాత్ర పోషించిన ఐఎన్ఎస్ సుమిత్రకు ప్రత్యేక పురస్కారం అందించారు.

తులసిరెడ్డితో సునీత భేటీ

వేంపల్లె, మార్చి 23: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డిని వైఎస్ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి కలిశారు. సుమారు అరగంటకు పైగా చర్చించారు. కడప పార్లమెంట్‌కు షర్మిల బరిలో ఉంటారని ప్రచారం సాగుతోంది. పులివెందుల ఎమ్మెల్యే స్థానంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వీరు భేటీ కావడం చర్చనీయాంశమైంది. అనంతరం తులసిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సునీత దంపతులు తనను మర్యాదపూర్వకంగా కలిశారని చెప్పారు.

27 వరకు సీమలో వేడి వాతావరణం

విశాఖపట్నం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మూడు వారాల నుంచి ఎండలతో రాయలసీమ మండిపోతోంది. శనివారం దేశంలోనే అత్యధికంగా అనంతపురంలో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈనెల 27 వరకు ఎండ వేడి, ఉక్కపోత కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా శనివారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో వాతావరణం పొడిగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

ఏపీ బీజేపీ జాబితా రెడీ!

▸▸ ఐదో జాబితాలో 6 ఎంపీ అభ్యర్థుల పేర్లు ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేనతో పొత్తులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో పోటీ చేస్తున్న 10 అసెంబ్లీ, ఆరు లోక్‌సభ సీట్లకు అభ్యర్థుల ఎంపికపై బీజేపీ ఓ స్పష్టతకు వచ్చినట్టు తెలిసింది. శనివారం ఢిల్లీలో ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, సోము వీర్రాజు... ఆ పార్టీ ఏపీ ఎన్నికల ఇన్‌చార్జులు అరుణ్ సింగ్, సిద్ధార్థ నాథ్‌తో భేటీ అయ్యారు. పొత్తు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై చర్చించారు. ఏపీలో 10 అసెంబ్లీ, ఆరు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల జాబితాను హైకమాండ్‌కు అందించినట్టు తెలిసింది. తిరుపతి, అనకాపల్లి, అరకు, రాజమండ్రి, నరసాపురం, విజయనగరం లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయాలని బీజేపీ భావిస్తున్నట్టు తెలిసింది. బీజేపీ ప్రకటించే ఐదో జాబితాలో ఏపీ నుంచి ఆరుగురు లోక్‌సభ అభ్యర్థుల పేర్లు ఉండే అవకాశముంది.

వ్యయ పరిమితి దాటితే

వేటు పడాల్సిందే!

▸▸ ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా మార్చేశారు
▸▸ సీఈసీ ఎన్నికల వ్యయాల పూర్వ డీజీ పీకే దాష్ ధ్వజం
▸▸ వలంటీర్లను పెన్షన్, రేషన్‌కు దూరంగా ఉంచాలి: నిమ్మగడ్డ
▸▸ లోపభూయిష్టంగా ఓటర్ల జాబితా: వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి


రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్

విజయవాడ(గవర్నర్‌పేట), మార్చి 23: ఎన్నికల కమిషన్ నిర్దేశించిన వ్యయ పరిమితికి మించి అభ్యర్థులు ఎన్నికల్లో ఖర్చు చేస్తే వారిపై వేటు పడేలా కేంద్ర ఎన్నికల కమిషన్ సత్వర చర్యలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల వ్యయాల పూర్వ డైరెక్టర్ జనరల్ పీకే డాష్ పేర్కొన్నారు. 'స్వేచ్ఛాయుత ఎన్నికలు-అవినీతికి అడ్డుకట్ట'అనే అంశంపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఆధ్వర్యాన శనివారం విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి పీకే డాష్ మాట్లాడుతూ గతంలో కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన వ్యయ పరిమితి కన్నా అధికంగా ఖర్చు చేసినట్లు రుజువు కావడంతో ఎన్నికల్లో గెలిచిన మధుకోడా(జార్ఖండ్), అశోక్ చౌహాన్(మహారాష్ట్ర), నరోత్తం మిశ్రా(మధ్యప్రదేశ్), ఉర్మిళ జాదెబ్‌ల సభ్యత్వాలను రద్దు చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ పేర్కొన్న వ్యయానికి 100 రెట్లు ఖర్చు పెడుతున్నా ఏ ఒక్కరినీ తొలగించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల వ్యయాలపై సీలింగ్ లేకపోవడంతో ఎన్నికల బాండ్ల రూపంలో వేలాది కోట్ల రూపాయలు పొంది ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా మారుస్తున్నారన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఏపీలో దాదాపు 3 లక్షల మంది వలంటీర్లు అధికార పార్టీకి లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారని, వీరిపై కఠిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు వలంటీర్లను పెన్షన్, రేషన్ బియ్యం లాంటి పథకాలకు దూరంగా ఉంచాలన్నారు. ప్రధాని సభలో పోలీసుల వైఫల్యం కనిపించిందని, రాజకీయ ప్రత్యర్థుల హత్యలను పోలీసు యంత్రాంగం నివారించలేకపోయిందని ఆక్షేపించారు. వీటిని కేంద్ర ఎన్నికల కమిషన్ పరిశీలించాలని కోరారు. మండల, జిల్లా స్థాయి ఎన్నికల అధికారులు ప్రవర్తనా నియమావళిని సక్రమంగా అమలు చేయాలన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు, బూత్ లెవెల్ అధికారుల అక్రమాల ఫలితంగా ఓటర్ల జాబితా లోపభూయిష్టంగా మారిందన్నారు. అర్హత కలిగి ఓటు పొందని వారు ఏప్రిల్ 15 వరకు ఓటర్లుగా నమోదు అయ్యే అవకాశం ఉందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, పూర్వ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్, ఆదాయపు పన్ను పూర్వ కమిషనర్ పి.రఘు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారు

▸▸ డీజీపీకి వర్ల రామయ్య లేఖ

అమరావతి(ఆంధ్రజ్యోతి)విజయవాడ, మార్చి 23: 'టీడీపీ నాయకుల ఫోన్లు ట్యాప్ చేసి వారిని వేధించేందుకు ఇంటెలిజెన్స్ విభాగం అడిషనల్ డీజీ పీఎస్‌ఆర్ ఆంజనేయులు సిబ్బందిని నియమించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ట్యాప్ చేస్తున్న ఆయనపై చర్యలు తీసుకోవాలి' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య డీజీపీకి లేఖ రాశారు. శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి సమావేశంలో ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ విశ్వేశ్వరరావు తచ్చాడుతూ ఫేక్ ఐడీ కార్డుతో పట్టుబడ్డారని తెలిపారు. ఇంటెలిజెన్స్ విభాగం నుంచి వచ్చానని, టీడీపీ నిర్వహించే మీటింగ్ ఫీడ్‌బ్యాక్ ఇంటెలిజెన్స్‌కు అందించేందుకు వచ్చానని తెలిపారన్నారు. కానిస్టేబుల్ ఫోన్‌ను పరిశీలించగా విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని ఫోన్ ట్యాప్ చేసినట్లు తెలిసిందన్నారు. పీఎస్‌ఆర్ ఆంజనేయులు టీడీపీ నేతలఫోన్లు ట్యాప్ చేసేందుకు పెగాసెస్ సాఫ్ట్‌వేర్ వాడుతున్నారని అనుమానంగా ఉందన్నారు. ఆంజనేయులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీపీ, బీజేపీ నేతల ఫోన్ల ట్యాపింగ్: పట్టాభి

రాష్ట్రంలో కొందరు పోలీస్ ఉన్నతాధికారులు టీడీపీ, బీజేపీ నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొమ్మారెడ్డి పట్టాభి ఆరోపించారు. శనివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్, టీడీపీ విజయవాడ పార్లమెంట్ కార్యాలయంలో టీడీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. 'టీడీపీ, బీజేపీ, జనసేన నేతలపై నిఘా పెట్టే బదులు డ్రగ్స్ ఎవరు తెచ్చారో పీఎస్‌ఆర్ ఆంజనేయులు దృష్టి పెట్టాలి. జగన్ సింగిల్ కాదు. ఆయన వెంట ఓ మాఫియా ఉంది. అందులో కొందరు పోలీస్ ఉన్నతాధికారులు ఐపీఎస్‌ల్లా కాకుండా జేపీఎస్‌ఎలా (జగన్ పోలీస్ సర్వీసెస్) వ్యవహరిస్తున్నారు' అని పట్టాభి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఎంపీ కేశినేని నాని పాత్ర కూడా ఉందన్నారు. కేశినేని చిన్ని మాట్లాడుతూ... 'నా ఫోన్‌నూ ట్యాపింగ్ చేస్తున్నారు. పీఎస్‌ఆర్ ఆంజనేయులుతో సహా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినవారందరినీ విధుల నుంచి తప్పించాలి' అని డిమాండ్ చేశారు. ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ జీ విశ్వేశ్వరరావు ఫొటో, ఐడీ కార్డులను మీడియాకు ప్రదర్శించారు.

సీబీఎస్‌ఈలో 3-6 తరగతులకు సిలబస్ మార్పు

న్యూఢిల్లీ, మార్చి 23: సీబీఎస్‌ఈ విద్యార్థులకు 3 నుంచి 6 తరగతుల సిలబస్‌తోపాటు పాఠ్య పుస్తకాల్లో మార్పులు చేయనున్నారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచే ఇది అమల్లోకి రానుంది. అయితే ఇతర తరగతుల సిలబస్‌లో మార్పులు ఉండవని సీబీఎస్‌ఈ అధికారులు వెల్లడించారు. 3 నుంచి 6 తరగతులకు నూతన సిలబస్, పాఠ్య పుస్తకాలు సిద్ధం చేస్తున్నట్లు ఎన్‌సీఈఆర్‌టీ సమాచారం ఇచ్చిందని సీబీఎస్‌ఈ అధికారులు తెలిపారు. 2020లో తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా పాఠశాల విద్యార్థులకు నూతన పుస్తకాలను ఎన్‌సీఈఆర్‌టీ రూపొందిస్తోంది.

అసోంలో భూముల అమ్మకాలపై ఆంక్షలు

డిస్పూర్, మార్చి 23: భిన్న మతాల వారి మధ్య భూముల క్రయవిక్రయాలు జరగకుండా తాత్కాలిక నిషేధం విధిస్తూ అస్సాం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ నిర్ణయం మూడు నెలల పాటు అమల్లో ఉండనుంది. ఈ సమయంలో నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ల (ఎన్‌ఓసీ) జారీని నిలిపివేయనుంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి మత ఘర్షణలు జరగకుండా నివారించడం కోసం ఈ చర్య తీసుకొంది. అత్యవసర పరిస్థితులు, శాంతి భద్రతలకు భంగం కలగదని భావించే సందర్భాల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ అనుమతి తీసుకొని జిల్లా కలెక్టర్లు ఎన్‌ఓసీలు జారీ చేయవచ్చంటూ మినహాయింపులు ఇచ్చింది.

డ్రగ్స్ దిగుమతి వెనుక జగన్

▸▸ సంధ్య ఆక్వా అధినేత 'కూనం' ప్రాణానికి హాని!
▸▸ కృష్ణదేవరాయలుపై బురదజల్లే ప్రయత్నం సిగ్గుచేటు: రఘురామరాజు



న్యూఢిల్లీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టులో దిగుమతైన మాదకద్రవ్యాల వెనుక సీఎం జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని ఎంపీ రఘురామకృష్ణరాజు ఆరోపించారు. జగన్ మాత్రమే అంత సాహసం చేయగలడని అన్నారు. శనివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ తీరు దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్టు ఉంది. టీడీపీ అధినేత చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిపై అసత్య ఆరోపణలు మానుకోవాలి. జగన్మోహన్‌రెడ్డి అతని లిక్కర్ గ్యాంగ్ మద్యం ఉత్పత్తిలో ఉపయోగించే ఈస్ట్ అంత ఖరీదైంది కాదు. మద్యం ఉత్పత్తిలో ఓపీఎం, కొకైన్, గంజాయి, ఈస్ట్ వంటి పదార్థాలను కొద్ది మోతాదులో కలిపి తయారు చేస్తున్నారు. ఆ కల్తీ మద్యం తాగి ప్రజలు మందుకు బానిసైపోతున్నారు. డాగ్ స్క్వాడ్ కావాలని అడిగితేనే సంఘటనా స్థలానికి వెళ్లినట్లు ఐజీ స్థాయి అధికారి పేర్కొనడం సందేహాలను కలిగిస్తోంది. సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్ కంపెనీ యజమాని కూనం వీరభద్రరావు ప్రాణానికి ప్రమాదం పొంచి ఉంది. వీరభద్రరావుకు సీబీఐ అధికారులు తాత్కాలిక రక్షణ కల్పించాలి.' అని కోరారు.

ఎలుగుబంటి దాడిలో ఇద్దరు జీడి రైతులు మృతి

▸▸ మహిళకు తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం

వజ్రపుకొత్తూరు, మార్చి 23: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలో ముగ్గురిపై ఎలుగుబంటి దాడి చేసింది. ఈ ఘటనలో ఇద్దరు రైతులు మృతి చెందగా, ఓ మహిళ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం ఉదయం అనకాపల్లి గ్రామానికి చెందిన చీడిపల్లి లోకనాథం, అతని భార్య సావిత్రి జీడితోటలో పనులు చేసుకుంటున్నారు. ఇంతలో అక్కడ పొదల్లో ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా సావిత్రిపై దాడి చేసింది. లోకనాథం ఆమెను రక్షించేందుకు వెళ్లగా ఎలుగుబంటి అతనిపై కూడా దాడి చేసింది. సావిత్రి గట్టిగా కేకలు వేయగా పక్కతోటలో ఉన్న అప్పికొండ కూర్మారావు అక్కడికి వచ్చి లోకనాథాన్ని రక్షించేందుకు యత్నించగా ఎలుగుబంటి అతనిపైనా దాడి చేసింది. సమీప తోటల్లో ఉన్న వారు గట్టిగా కేకలు వేయడంతో అది పారిపోయింది. ఈ దాడిలో లోకనాథం (47), కూర్మారావు (49) అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రగాయాలతో ఉన్న సావిత్రిని గ్రామస్థులు పలాస ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

ఎల్ఏసీ వెంట స్వదేశీ యాంటీ డ్రోన్ వ్యవస్థ

న్యూఢిల్లీ, మార్చి 23: చైనా సరిహద్దు వెంట భారత సైన్యం అధునాతన యాంటీ డ్రోన్ రక్షణ వ్యవస్థను మోహరించింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఏడు ఇంటెగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్, ఇంటర్‌డిక్షన్ వ్యవస్థల (ఐడీడీ, ఐఎస్)ను చైనాతో ఉత్తర సరిహద్దుల్లో ప్రవేశపెట్టింది. డీఆర్‌డీవో, భారత్ ఎలక్ట్రానిక్స్ ఈ వ్యవస్థలను అభివృద్ధి చేశాయి. వాహన ఆధారిత ఈ వ్యవస్థలను మార్క్-1 వేరియంట్లుగా పిలుస్తారు. 5 నుంచి 8 కిలో మీటర్ల పరిధి లోపు శత్రు డ్రోన్లను గుర్తించగలవు. తక్కువ రాడార్ క్రాస్-సెక్షన్ డ్రోన్లు లేదా మానవ రహిత వైమానిక వాహనాలను ఈ వ్యవస్థల ద్వారా గుర్తించవచ్చని భారత సైన్యానికి చెందిన అధికారి వెల్లడించారు. సాఫ్ట్, హార్డ్ కిల్స్ ఇంటెగ్రేటెడ్ అప్లికేషన్ ద్వారా శత్రు డ్రోన్లను విధ్వంసం చేయడానికి ఉపయోగపడతాయని తెలిపారు.

ఇండియాకు గ్యాంగ్‌స్టర్ ప్రసాద్ పూజారీ

▸▸ చైనాలో గతేడాది అరెస్టు.. భారత్‌కు రప్పించిన సీబీఐ

ముంబై, న్యూఢిల్లీ, మార్చి 23: కాల్పులు, హత్యలు, దోపిడీలు, కిడ్నాప్‌లు వంటి తీవ్రమైన నేరాలు భారత్‌లో చేసి చైనాలో దాక్కున్న గ్యాంగ్‌స్టర్ ప్రసాద్ పూజారీని ముంబై పోలీసులు ఎట్టకేలకు అరెస్టుచేసి స్వదేశానికి తీసుకువచ్చారు. సుభాష్ విఠల్ పూజారీ, సిద్ధార్థ శెట్టి, సిద్ధూ, సిద్, జానీ తదితర మారుపేర్లతో పూజారీ భారత్‌లో హత్యలు, దోపిడీలకు పాల్పడ్డాడు. ముంబైలో మాఫియా డాన్ల హవా బలంగా ఉన్నప్పుడు కుమార్ పిళ్లై, చోటా రాజన్ గ్యాంగ్‌ల కోసం అతడు పనిచేశాడు. అనంతర కాలంలో తన మకాం చైనాకు మార్చాడు. ఇంటర్‌పోల్ రెడ్ నోటీసు జారీచేసిన నేపథ్యంలో గత ఏడాది చైనాలో పూజారీని అరెస్టు చేశారు. అతడిని స్వదేశం తీసుకురావడానికి అప్పటినుంచి చైనా అధికారులతో ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సంప్రదింపులు జరుపుతున్నారు. ముంబై పోలీసులకు సాయంగా సీబీఐ అధికారులు ఈ ఆపరేషన్‌లో పాలుపంచుకున్నారు.

మహిళా చిత్రాలకు మళ్లీ మంచి రోజులు

గ్లామర్ పాత్రలకే పరిమితమవకుండా నటనకు అవకాశమున్న సినిమాలను ఎంచుకుంటున్నారు మన కథానాయికలు. మహిళా ప్రాధాన్యం ఉన్న కథాంశాలతో తెరకెక్కుతున్న చిత్రాల్లో నటిస్తూ, తమకంటూ సొంత మార్కెట్‌ను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. యాక్షన్ రోల్స్ కు సైతం సై అంటూ అభిమానులను అలరించేందుకు వస్తున్నారు.









నవ్వులు పంచే నాయిక

జయాపజయాలతో సంబంధం లేకుండా వరుస చిత్రాలతో అభిమానులను అలరిస్తున్నారు కీర్తిసురేశ్. అగ్ర హీరోలతో నటిస్తూనే అడపా దడపా కథానాయిక ప్రాధాన్య చిత్రాలు చేయడం మొదట్నుంచి కీర్తి కొనసాగిస్తున్నారు. 'మహానటి' లాంటి ఘన విజయం ఆమె సొంతమైంది. అయితే ఆ తర్వాత ఆమె నటించిన హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాలు ఏవీ ఆ స్థాయి విజయాన్ని అందుకోలేదు. తాజాగా మరోసారి ఈ తరహా చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు కీర్తిసురేశ్. 'రఘుతాత' చిత్రంలో ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రేక్షకులను ఆద్యంతం నవ్వుల్లో ముంచే వినోదాత్మక చిత్రమిదని కీర్తిసురేశ్ తెలిపారు. సుమన్ కుమార్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, హోంబలే సంస్థ నిర్మిస్తోంది. అలాగే ఆమె టైటిల్ రోల్ పోషిస్తున్న మరో చిత్రం 'రివాల్వర్ రీటా'. ఇందులో కీర్తిసురేశ్ పాత్ర వినూత్నంగా ఉండబోతోంది, యాక్షన్ హీరోయిన్‌గా ఆమెకు సరికొత్త ఇమేజ్‌ను తెస్తుందని చిత్రబృందం తెలిపింది. కే చంద్రు దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్ సీక్వెన్స్ కోసం కీర్తి ఫిట్‌నెస్ పైన దృష్టి పెట్టారు. వీటితో పాటు ఆమె హిందీలో 'బేబీ జాన్' అనే చిత్రం చేస్తున్నారు. ఇందులో వరుణ్ ధావన్ కథానాయకుడు.




గర్ల్‌ఫ్రెండ్‌గా రష్మిక

కథానాయికగా బుడి బుడి అడుగులతో మొదలైన రష్మిక మందన్న ప్రస్థానం నేడు పాన్ ఇండియా స్థాయికి చేరింది. వరుస సినిమాలతో సక్సెస్‌ను కూడా ఎంజాయ్ చేసే తీరిక లేకుండా ఉన్నారు ఆమె. 'యానిమల్' చిత్రంతో సూపర్‌హిట్ అందుకున్నారు. ప్రస్తుతం హిందీలో 'చావా' అనే చిత్రం చేస్తున్నారు. తెలుగులో అల్లు అర్జున్ సరసన 'పుష్ప 2' చిత్రం చేస్తున్నారు. దీంతో పాటు రెండు హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాల్లో ఆమె నటిస్తున్నారు.

శాంతా రూబన్ దర్శకత్వం వహిస్తున్న 'రెయిన్‌బో' చిత్రం షూటింగ్ పూర్తయింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకొనే కథాంశంతో రూపొందుతోంది. నటుడు దేవ్‌మోహన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఓ చిలిపి అమ్మాయితో ప్రేక్షకుల ప్రయాణం క్రేజీ రైడ్‌గా ఉండబోతోందని రష్మిక పేర్కొన్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. 'ది గర్ల్‌ఫ్రెండ్' టైటిల్‌తో తెరకెక్కుతోన్న విభిన్న ప్రేమకథా చిత్రంలోనూ రష్మిక లీడ్‌రోల్‌లో నటిస్తున్నారు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. విద్య కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు.

డిటెక్టివ్ అను

ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు శ్రుతీహాసన్. ఇప్పుడు ఆమె అడివిశేష్‌తో 'డెకాయిట్' చిత్రం చేస్తున్నారు. ఇందులో ఆమె యాక్షన్ రోల్ చేస్తున్నారు. ఇక తను లీడ్‌రోల్‌లో నటిస్తున్న 'చెన్నై స్టోరీస్' అనే ప్రాజెక్ట్‌ను ఆమె ఇటీవలే ప్రకటించారు. 'ది అరేంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్' అనే నవల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. దీని గురించి శ్రుతీ మాట్లాడుతూ 'ఇందులో ఇప్పటిదాకా నేను చేసిన పాత్రలకు పూర్తి భిన్నంగా ఉండడమే కాదు, నా మనసుకు బాగా నచ్చింది. ఇందులో నేను డిటెక్టివ్ అనే పాత్రను పోషిస్తున్నాను' అని చెప్పారు. తొలుత ఈ చిత్రంలో నటించేందుకు అంగీకరించిన సమంత తప్పుకోవడంతో ఈ ప్రాజెక్ట్ శ్రుతి చేతికి వచ్చింది. ఫిలిప్ జాన్ దర్శకత్వంలో సునీత తాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



రెండు చిత్రాలతో జేజమ్మ

ఇటీవలే 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో అభిమానులను అలరించారు అనుష్క శెట్టి. దీని తర్వాత ఆమె నటిస్తున్న రెండు చిత్రాలూ కథానాయిక ప్రాధాన్యమున్నవే. ఇటీవలే క్రిష్ దర్శకత్వంలో 'ఘాటీ' చిత్రాన్ని ప్రకటించారు. దీంతో కథానాయికగా ఆమె 50వ మైలురాయిని చేరుకుంటున్నారు. ఇప్పటికే కొంత భాగం చిత్రీకరణ పూర్తయింది. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మిస్తున్నాయి. వ్యాపార రంగంలో రాణిస్తున్న ఓ యువతి కొంతమంది కుట్రల వల్ల నష్టపోయి వారి మీద ఎలా పగ తీర్చుకున్నారు అనే నేపథ్యంలో సాగుతుంది. అలాగే 'కథనార్' అనే చిత్రంతో జేజమ్మ మలయాళ చిత్రపరిశ్రమలోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోంది. రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. రెండు భాగాలుగా ఈ చిత్రం విడుదలవుతోంది. 14 భాషల్లో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

కెరీర్ ఆరంభం నుంచీ ఎక్కువగా కథానాయిక ప్రాధాన్య చిత్రాలు చేస్తూ వస్తున్నారు ఐశ్వర్యా రాజేశ్. 'కౌసల్యా కృష్ణమూర్తి, ఫర్హానా, ది గ్రేట్ ఇండియన్ కిచెన్' లాంటి చిత్రాలు నటిగా ఆమె అభిరుచికి అద్దం పడతాయి. ఇప్పుడు ఆమె మరో లేడీ ఓరియంటెడ్ చిత్రానికి పచ్చజెండా ఊపారు. సవరి ముత్తు దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రానికి 'సిస్టర్' అనే టైటిల్ ఖరారుచేశారు. ఒక ఆస్పత్రిలో రాత్రి జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో కథ సాగుతుంది. వేదిక కథానాయికగా తెరకెక్కుతోన్న లేడీ ఓరియంటెడ్ చిత్రం 'ఫియర్'. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌కు హరిత గోగినేని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో నటిగా సవాల్‌గా నిలిచే పాత్ర పోషించాను అని ఆమె చెప్పారు.

ప్రస్తుతం బాలీవుడ్ చిత్రాలకు పరిమితయ్యారు పూజా హెగ్డే. 'దేవా'లో షాహిద్‌కు జోడీగా ఆమె నటిస్తున్నారు. 'కోబ్రా' దర్శకుడు అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో ఆమె ఓ చిత్రం చేయబోతున్నారని కోలీవుడ్ టాక్. హీరోయిన్ ఓరియంటెడ్‌గా ఈ చిత్రం ఉండబోతోందని తెలుస్తోంది.

అందం అభినయంతో కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన కాజల్ అగర్వాల్ పెళ్లి తర్వాత రూట్ మార్చారు. హీరోయిన్ పాత్రలను పక్కనపెట్టి ప్రాధాన్యమున్న పాత్రలను ఎంపిక చేసుకుంటున్నారు. పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా తన సత్తా చూపించబోతున్నారు కాజల్. ఏసీపీ సత్యభామగా భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో తన పోరాట పటిమను ప్రదర్శించబోతున్నారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. సుమన్ చిక్కాల దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పణలో బాబీ తిక్క, శ్రీనివాసరావు టీ నిర్మిస్తున్నారు. అలాగే హిందీలో మహిళా ప్రాధాన్యం చిత్రంగా రూపొందుతున్న 'ఉమ'లోనూ ఆమె నటిస్తున్నారు. తథాగత సింహ దర్శకుడు. అవిషేక్ ఘోష్, మంత్రరాజ్ పలివాల్ నిర్మిస్తున్నారు.



ఇకపై నన్ను కలవాలంటే డబ్బు ఇవ్వాల్సిందే!


గ్యాంగ్స్ ఆఫ్ వసీపూర్, నో స్మోకింగ్, దేవ్ డి, బ్లాక్ ఫ్రైడే వంటి సంచలన సినిమాలు తీశారు డైరెక్టర్ అనురాగ్ కశ్యప్. ఆయన తీసే సినిమాలు విమర్శకుల ప్రశంసలు అందుకుంటూనే ఇండస్ట్రీలోకి వచ్చే కొత్త దర్శకులకు దిక్సూచిలా ఉంటాయి. ఎందరో ఔత్సాహిక దర్శకుల్ని, నటుల్ని ఆయన ఇండస్ట్రీకి పరిచయం చేసి వారిని ఓ స్థాయిలో నిలబెట్టారు. డైరెక్టర్ విక్రమాదిత్య మొత్వానే, విలక్షణ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి ఎంతో మంది ఈ రోజు బాలీవుడ్‌లో దూసుకుపోవడానికి కారణం అనురాగ్ వారికి అందించిన ప్రోత్సాహమే. తాజాగా ఈ దర్శకుడు పెట్టిన ఓ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. "ఫిల్మ్ మేకింగ్ పరంగా సలహాలు, సూచనలు అడిగే ఔత్సాహికుల్ని చూసి విసిగిపోయా. వారు ప్రతిభను నమ్ముకోకుండా కేవలం విజయానికి షార్ట్‌కట్ కోసమే నా దగ్గరకు రావడం నాకు ఎంతో అసహనం తెప్పించింది. ఇకపైన అలాంటివారిని ఉచితంగా కలవను. నా సమయాన్ని వృథా చేసుకోను. ఇకపై నన్నెవరైనా కలవాలంటే ముందుగానే డబ్బులు చెల్లించాలి. పదిహేను నిమిషాలకు లక్ష, 30 నిమిషాలకు రెండు లక్షలు, గంటకు ఐదు లక్షలు చార్జ్ చేస్తాను. మేము డబ్బులివ్వలేం.. కేవలం టెక్స్ట్ మెసేజ్ చేస్తాం అనే వారు దూరంగా ఉండొచ్చు" అని తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన అనురాగ్ కూతురు ఆలియా కశ్యప్ "నన్ను కూడా ఎంతో మంది వారి స్క్రిప్ట్‌ను మీకు పంపమని నాకు మెసేజ్ చేస్తుంటారు. వారందరికీ ఇదే విషయాన్ని రిప్లైగా పంపిస్తాను" అని కామెంట్ చేశారు

వెయ్యి మంది డాన్సర్లతో హీరో ఇంట్రడక్షన్ సాంగ్



ఒక పాట చిత్రీకరణలో వెయ్యి మంది డాన్సర్లు పాల్గొనడం అంటే మామూలు విషయం కాదు. అప్పుడెప్పుడో 1948 లో 'చంద్రలేఖ' చిత్రం కోసం జెమినీ వాసన్ దాదాపు ఐదు వందల మందితో డ్రమ్ డాన్స్ చిత్రీకరించి సంచలనం సృష్టించారు. ఆ తర్వాత మళ్లీ అంత భారీ స్థాయిలో డాన్సర్లపై పాట చిత్రీకరించిన సందర్భాలు లేవనే చెప్పాలి. 'భూల్ భూలయ్యా 3' హిందీ చిత్రంలో హీరో ఇంట్రడక్షన్ సాంగ్ కోసం ఇప్పుడు వెయ్యి మంది డాన్సర్లతో పాట చిత్రీకరించనున్నారనే వార్త బీ టౌన్‌లో వైరల్ అవుతోంది. హారర్, కామెడీ కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్నారు. ముంబైలోని ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్‌లో ఈ పాటను చిత్రీకరించనున్నారు. నృత్య దర్శకుడు గణేశ్ ఆర్యన్ ఆధ్వర్యంలో వెయ్యి మంది డాన్సర్లు ప్రస్తుతం పాట చిత్రీకరణలో పాల్గొంటున్నారు. కార్తీక్ కూడా రెండు వారాలుగా ఈ పాట కోసం తయారువుతున్నారు. 'బాలీవుడ్ చరిత్రలోనే భారీ స్థాయిలో పాటలను చిత్రీకరించిన చిత్రాలు కొన్ని ఉన్నాయి. వాటిలో 'భూల్ భూలయ్యా 3' పాట కూడా ఒకటిగా నిలుస్తుంది. ఈ సినిమా ఒక విజువల్ ఫీస్ట్ అని చెప్పవచ్చు. హీరో కార్తీక్ కెరీర్‌లోనే ఇదొక అద్భుత చిత్రంగా నిలిచిపోతుంది' అని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. అనీస్ బజ్మీ దర్శకత్వంలో భూషణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం దీపావళి సందర్భంగా విడుదలవుతుంది.


పట్నా శుక్లా




ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
టెస్టామెంట్	వెబ్‌సిరీస్	మార్చి 27
హార్ట్ ఆఫ్ ది హంటర్	హాలీవుడ్ మూవీ	మార్చి 29
లాల్‌సలామ్	తెలుగు డబ్బింగ్	మార్చి 29
ది బ్యూటిఫుల్ గేమ్	హాలీవుడ్ మూవీ	మార్చి 29
ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో	హిందీ టీవీ షో	మార్చి 30
అమెజాన్ ప్రైమ్		
టిగ్ నొటారో	వెబ్‌సిరీస్	మార్చి 26
ది బాక్స్‌టర్స్	వెబ్‌సిరీస్	మార్చి 28
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
లవర్	తమిళ చిత్రం	మార్చి 27
పట్నా శుక్లా	హిందీ చిత్రం	మార్చి 29
ప్రేమలు	తెలుగు డబ్బింగ్	మార్చి 29
రెనెగడె నెల్ల్	వెబ్‌సిరీస్	మార్చి 29
బుక్ మై షో		
ది హోల్డోవర్స్	హాలీవుడ్ మూవీ	మార్చి 29
జియో సినిమా		
ఎ జెంటిల్‌మాన్ ఇన్ మాస్కో	వెబ్‌సిరీస్	మార్చి 29
ఈటీవి విన్		
ఏం చేస్తున్నావ్?	తెలుగు చిత్రం	మార్చి 28


తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం దర్శకుడు కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం.

ఆ గొంతులో మత్తు, గమ్మత్తు

కంఠంలో మెత్తని శృంగారాన్ని రంగరించి, మత్తు గొలిపే స్వరంతో పాటలు పాడే అరుదైన గాయని ఎల్.ఆర్.ఈశ్వరి. 'టీస్కో కోకో కోలా' (రౌడీలకు రౌడీలు), 'మాయదారి సిన్నోడు మనసే లాగేసిండు'(అమ్మమాట), 'గుడియెనక నా సామి గుర్రమెక్కి కూకున్నాడు (ఇదా లోకం), 'మసక మసక చీకటిలో మల్లెతోట ఎనకాల(దేవుడు చేసిన మనుషులు), 'సన్నాజాజూలోయ్ కన్నె మోజులోయ్(సింహబలుడు) 'మాయజేసి పోతివిరో నాగులు' (జీవితం), 'లే లే నా రాజా' (ప్రేమనగర్) వంటి ఎన్నో శృంగార గీతాలు ఎల్.ఆర్.ఈశ్వరి స్వరంతో జీవం పోసుకుని ప్రేక్షకులను అలరించాయి. ఆ రోజుల్లో క్రైమ్ చిత్రాలకు ఎల్.ఆర్.ఈశ్వరి పాట, సత్యం సంగీతం, జ్యోతిలక్ష్మి డాన్స్ ఉండాల్సిందే. కేవలం శృంగార తారలకే కాకుండా 'భార్యాబిడ్డలు' చిత్రంలో 'ఆకులు పోకలు ఇవ్వద్దు.. నా నోరు ఎర్రగ చేయద్దు' అంటూ హీరోయిన్ జయలలితకు కూడా తన స్వరాన్ని అందించారు ఈశ్వరి.

ఒకటా, రెండా.. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ, సింహళ భాషల్లో వేలాది పాటలు పాడిన ఈశ్వరి పూర్తి పేరు ఎల్.రాజేశ్వరి. అప్పట్లో ఎమ్మెస్ రాజేశ్వరి పేరుతో మరో గాయని ఉండడంతో ఈమె పేరుని ఎల్.ఆర్.ఈశ్వరిగా మార్చారు నిర్మాత ఎ.పి.నాగరాజన్. ఆయనే 1959లో నిర్మించిన 'నల్ల ఇడత్తు సంబంధం' చిత్రంతో ఈశ్వరిని గాయనిగా పరిచయం చేస్తూ అందులో నాలుగు పాటలు ఆమెతో పాడించారు. 1964లో వచ్చిన 'జగన్నాటకం' చిత్రంలో ఈశ్వరి తొలి తెలుగు పాట పాడారు. నారాయణరెడ్డి రాసిన 'నాణ్యమైన పిల్లదాన్ని..అందాల చిన్నదాన్ని' అంటూ రాసిన పాట అది. దీన్ని నృత్యతార ఇ.వి. సరోజపై చిత్రీకరించారు. ఇక అప్పటి నుంచి ఈశ్వరి పాట ఒక చరిత్ర అయింది.



ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● ఆదివారం 24 మార్చి 2024

ఏపీ పీజీ ఈసెట్ నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ పీజీ ఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్వీయూ) నిర్వహిస్తోంది. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంటెక్/ఎం ఫార్మసీ/ఫార్మాడీ (పీబీ)ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఇంజనీరింగ్/ఫార్మసీ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. సీట్ల భర్తీలో గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. తరవాతనే ఏపీపీజీఈసెట్ 2024 స్కోర్ సాధించిన అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



విభాగాలు: కెమికల్, అగ్రికల్చరల్, ఏరోనాటికల్, అప్లయిడ్ పెట్రోలియం, ఆర్కిటెక్చరల్, ఏరోస్పేస్, ఆటోమొబైల్, బయో కెమికల్, బయోఇన్ఫర్మాటిక్స్, బయోటెక్నాలజీ, బయోమెడికల్, సివిల్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ, సివిల్ ఎన్విరాన్‌మెంటల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్, డెయిరీ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీమాటిక్స్, ఫుడ్ సైన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ, జియో ఇన్ఫర్మాటిక్స్, జియో సైన్స్, ఇండస్ట్రియల్ బయోటెక్నాలజీ, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇండస్ట్రియల్ ప్రొడక్షన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇంజనీరింగ్, మెకట్రానిక్స్, మెకానికల్, మెటలర్జీ, మైనింగ్, మెకానికల్ మెరైన్, నేవల్ ఆర్కిటెక్చర్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, ఫార్మసీ, వెటర్నరి సైన్స్, డెంటల్, అప్లయిడ్ కెమిస్ట్రీ, అప్లయిడ్ ఫిజిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, టెలీ కమ్యూనికేషన్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పవర్ ఇంజనీరింగ్, మైక్రో బయాలజీ, లైఫ్ సైన్సెస్ తదితరాలు.

ఏపీ పీజీ ఈసెట్ 2024 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. విభాగానికి నిర్దేశించిన ప్రకారం సంబంధిత స్పెషలైజేషన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. మొత్తం మార్కులు 120. ప్రశ్న పత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే కనీసం 30 మార్కులు(25 శాతం) రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.

అర్హతల వివరాలు: ఏఐసీటీఈ/యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్/ఫార్మసీ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి.

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/బీఆర్క్/ఏఎంఐఈ+డిప్లొమా/ఎమ్మెస్సీ/ఎంసీఏ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.
- ఎంఫార్మసీ/ఫార్మాడీ(పీబీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి బీఫార్మసీ/బీడీఎస్/ఎమ్మెస్సీ/ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.
- పీజీ ఈసెట్ రాయడానికి నిర్దేశించిన ఇతర అర్హత కోర్సుల వివరాలు, విభాగానికి ప్రత్యేకించిన ఏపీ పీజీ ఈసెట్ టెస్ట్ పేపర్‌ల వివరాలు, సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; బీసీ అభ్యర్థులకు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.700
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **కరెక్షన్ ఆఫ్ ఆన్‌లైన్ అప్లికేషన్:** మే 8 నుంచి 14 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 22 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, అనంతపురం, చిత్తూరు, తిరుపతి, గూడూరు, రాజమండ్రి, కాకినాడ, గుంటూరు, నర్సరావుపేట, విజయవాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, భీమవరం, కడప
- **ఏపీ పీజీ ఈసెట్ 2024 తేదీలు:** మే 29 నుంచి 31 వరకు
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

కాకినాడ ఐఐఎఫ్‌టీలో బీబీఏ-ఎంబీఏ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - కాకినాడ క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం)ను అందిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఇందులో బీబీఏ(బిజినెస్ అనలిటిక్స్), ఎంబీఏ (ఇంటర్నేషనల్ బిజినెస్) కోర్సులు ఉంటాయి. ఇండోర్ ఐఐఎం నిర్వహించే ఐపీమ్యాట్ 2024 స్కోర్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 60 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: మొదటి మూడేళ్లు బీబీఏ(బిజినెస్ అనలిటిక్స్) కోర్సు చదవాల్సి ఉంటుంది. ఇందులో సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. దీనికి 150 క్రెడిట్స్ నిర్దేశించారు. ఈ కోర్సు పూర్తిచేసి బీబీఏ డిగ్రీతో ప్రోగ్రామ్‌నుంచి వైదొలగవచ్చు. తరవాత రెండేళ్లపాటు ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) చదవాలి. ఇందులో ట్రైమెస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. దీనికి 120 క్రెడిట్స్ నిర్దేశించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా థియరీ సెషన్స్, ప్రాక్టికల్ సెషన్స్, కేస్ స్టడీస్, ప్రాజెక్ట్స్, ప్రజంటేషన్స్, సిమ్యులేషన్స్, గేమ్స్, రోల్ ప్లేస్, ఫీల్డ్ విజిట్స్, ఇండస్ట్రీ సెషన్స్ ఉంటాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూప్‌లతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్/ బిజినెస్ మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. పదోతరగతి, ఇంటర్ స్థాయుల్లో ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి. 2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు, 2024లో చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు 2004 ఆగస్టు 1న/ఆ తరవాత జన్మించి ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల మినహాయింపు వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

ఐఐఎం ఇండోర్-ఐపీమ్యాట్ 2024

- **ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.4130; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2065
- **ఐపీమ్యాట్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **ఐపీమ్యాట్ 2024 తేదీ:** మే 23
- **వెబ్‌సైట్:** www.iimidr.ac.in

ఐఐఎఫ్‌టీ-ఐపీఎం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 23
- **వెబ్‌సైట్:** www.iift.ac.in



లిటిల్స్



పారని నక్క జిత్తు

ఒక అడవిలో ఓ నక్క ఉండేది. దానికి ఆహారం సులువుగా రావాలన్న ఆలోచన ఉండేది. దీంతో సోమరిగా ఉండేది. కష్టపడకుండా ఆహారం సంపాదించేది. ఒక రోజు ఉదయాన్నే వేటకు బయలుదేరింది. అడవిలో ఓ కుందేళ్ల గుంపు కనపడింది. హాయిగా ఉన్నాయవి. నేలమీద దుంపలను, క్యారెట్లును తింటున్నాయి. ఎంత రుచిగా ఉంటుందో వీటి మాంసం అనుకున్నది నక్క. పొదలమాటున దాక్కుంది.





రెండో రోజు మళ్లీ అదే ప్రాంతానికి వచ్చింది. కుందేళ్ల గుంపు అలానే ఉంది. అంటే ఉదయం పూట రోజు ఇలా ఆహారానికి వస్తాయన్నమాట అనుకుంది నక్క. పొదలచాటున నుంచి దూకింది. కుందేలు అప్రమత్తమై వేగంగా పరిగెత్తాయి. నక్కను తికమక పెడుతూ దొరికి నట్లే దొరికి.. తప్పించుకుపోయాయి. ఒక్క కుందేలు కూడా దొరక్క పోవటంతో నక్క బాధతో వెళ్లి పోయింది. కుందేళ్లు జాగ్రత్తపడ్డాయి.

నక్క ఈసారి ఆలోచన మార్చాలనుకుంది. దానికి ఆహారం పెద్దగా దొరకలేదు. ఆకలితో మాడిపోతున్నప్పుడు ఓ ఆలోచన వచ్చింది. రెండు రోజుల తర్వాత అటువైపు వెళ్లింది. ఈ సారి పొదలచాటున గంటలపాటు నిలబడి అట్లానే ఉంది. దాని నీడను గ్రహిచాయి కుందేళ్లు. అలా సహనంతో కొన్ని గంటలపాటు నిలబడుకుంది. సాయంత్రం పూట నక్క ఇలా అనుకుంది మనసులో. 'ఈ కుందేళ్లకు ఈ సంతోషం ఉన్నదా? ఎంత హాయి జీవులు. ఇన్ని గంటలపాటు ఆడుకుంటే ఏవైనా నీరసపడిపోతాయి. అందుకే పరిగెత్తలేవు' అనుకుంది. కుందేళ్ల మీద దాడి చేయబోయింది. మళ్లీ కుందేళ్లు అదే వ్యూహాన్ని అనుసరించాయి. రెండు కుందేళ్లు దొరికినట్లే దొరికి తప్పించుకున్నాయి. క్షణాల్లో కుందేళ్లన్నీ వాటి కాలనీల్లోకి వెళ్లిపోయాయి. నీరసంతో నక్క ఇంటికి వెళ్లిపోయింది.


ఈసారి ఎలాగయినా కుందేళ్లను పట్టుకోవాలని అనుకున్నది. చూస్తుండగానే చలికాలం వచ్చింది. నక్క కోపంతో ఊగిపోకుండా వ్యూహం పన్నది. ఒక రోజు ఉదయాన్నే .. కుందేళ్ల రాకకు ముందే వెళ్లి చెట్టు ఎక్కి కూర్చుంది. ఆకుల మధ్యన నక్కి ఉంది. కుందేళ్లకు నక్క పైన ఉన్నది అనే విషయం నీడ వల్ల తెలుసుకున్నాయి. జాగ్రత్తగా ఉండాలని వాటి అరుపులతో చెప్పుకున్నాయి. నక్క చెట్టు పైనుంచి కిందకి కుందేళ్ల మీదకు దూకపోయింది. క్షణాల్లో పారిపోయాయవి. ఓ కుందేలు నాయకుడు దూరంగా ఆగి నిలబడ్డాడు. 'నాతో మీరు స్నేహం చేయవచ్చు' కదా అన్నది నక్క. 'నీ మోసం భరించలేం. మాకు స్నేహితులు వద్దు. మా చావు కోరికొనేవారితో మేమెందుకు స్నేహం చేయాలి' అన్నది కుందేలు. నక్క ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోయింది.

ఎన్ని ఉన్నాయి?





దారి కనుక్కోండి



మహిళలకు 'జనరేషన్ గూగుల్ స్కాలర్‌షిప్'



ప్రముఖ ఎంఎన్‌సీ 'గూగుల్'- మహిళలకు 'జనరేషన్ గూగుల్ స్కాలర్‌షిప్' పేరిట ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే మహిళలు అర్హులు. భారత విద్యార్థినులు 'ఆసియా పసిఫిక్' కేటగిరీ కింద దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 1250 దరఖాస్తులను అనుమతిస్తారు. ఎంపికైనవారికి 2500 యూఎస్ డాలర్ల స్కాలర్‌షిప్ లభిస్తుంది.

అర్హత: ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఏదేని ఆసియా పసిఫిక్ దేశంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీలో బ్యాచిలర్స్ డిగ్రీ ప్రవేశం పొందాలనుకునే వారు అప్లయ్ చేసుకోవచ్చు. కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్/తత్సమాన సాంకేతిక విభాగాలకు సంబంధించిన డిగ్రీ కోర్సులు ఎంచుకోవాలి. స్కూల్ స్థాయి నుంచి మంచి అకడమిక్ రికార్డ్ తప్పనిసరి. నాయకత్వ లక్షణాలు ఉండాలి. కంప్యూటర్లపై ప్రాథమిక అవగాహన కూడా లేనివారికి అవసరమైన పరిజ్ఞానాన్ని అందించడంలో ఆసక్తి ఉండాలి. టెక్నికల్ ప్రాజెక్ట్‌లకు సంబంధించిన నైపుణ్యాలు ఉండాలి. దరఖాస్తుతోపాటు ఇచ్చిన రెండు షార్ట్ ఆన్సర్ ఎస్సే క్వశ్చన్స్‌కు కనీసం 500 పదాలకు తగ్గకుండా సమాధానాలు రాసి అప్‌లోడ్ చేయాలి. 2023-2024 విద్యా సంవత్సరంలో డిగ్రీ రెండో ఏడాది/మూడో ఏడాది కోర్సు రిజిస్టర్ చేసుకున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం తదితరాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 23
- వెబ్‌సైట్: https://buildyourfuture.withgoogle.com/

జాబ్ కార్నర్

ఫోరెన్సిక్ సైన్స్ వర్సిటీలో ఖాళీలు

గాంధీనగర్‌లోని కేంద్ర హోం మంత్రిత్వశాఖకు చెందిన నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. డిప్యూటీ డైరెక్టర్: **2 పోస్టులు**
2. సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్: **5 పోస్టులు**
3. జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్: **10 పోస్టులు**
4. సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్: **8 పోస్టులు**

విభాగాలు: ఫోరెన్సిక్ నార్కోటిక్స్/ఎన్‌డీపీఎస్, బాలిస్టిక్స్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్స్, డీఎన్‌ఏ ఫోరెన్సిక్స్, ఫోరెన్సిక్ సైకాలజీ, న్యూట్రిషన్ సప్లిమెంట్స్ టెస్టింగ్/ఫుడ్ ఫోరెన్సిక్స్, ఫోరెన్సిక్ అకౌంటింగ్, మల్టీమీడియా ఫోరెన్సిక్స్

ఖాళీలు: 25

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.1000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 14

వెబ్‌సైట్: https://www.nfsu.ac.in/



విదేశాల్లో చదువులకు ఎంట్రెన్స్ టెస్టులు

విదేశాల్లో చదవాలనే కల చాలా మందికి ఉంటుంది. అయితే ఈ మధ్య కాలంలో విదేశాల్లో చదువులపై మరింత ఆసక్తి పెరిగింది. ఇంగ్లీష్ సహా కోర్సును బట్టి ఇంకొన్ని టెస్టులు ఇందుకు రాయాల్సి ఉంటుంది. కొన్ని యూనివర్సిటీలు ఆ పరీక్షలు అవసరం లేదనిచెబుతుంటాయి. అయినప్పటికీ ఆ టెస్టులను క్లియర్ చేస్తే విదేశీ వర్సిటీలు, కాలేజీలకు పెట్టిన దరఖాస్తు మరింత పటిష్ఠంగా ఉంటుంది. అంతేకాదు, కాలేజీ క్రెడిట్స్ నుంచి స్కాలర్‌షిప్స్ పొందేందుకు అర్హతను సాధించి పెడతాయి. అసలా టెస్టులు ఏవో చూద్దాం.



విదేశాల్లో చదవాలనుకునే వారు సాధారణంగా ఇంగ్లీష్ టెస్ట్ రాయాలి. ఈ పరీక్షల్లో నాలుగు మాడ్యూల్స్ - లిజనింగ్, రైటింగ్, రీడింగ్, స్పీకింగ్ స్కిల్స్ ఉంటాయి. ఇంగ్లీష్ మాట్లాడే దేశాల్లో ప్రధానంగా ఆ భాషపై అభ్యర్థికి ఉన్న పట్టును తెలిపేవి ఈ టెస్టులు. తాము ఆఫర్ చేసే కోర్సులను అర్థం చేసుకోగలరా లేదా అని తెల్సుకునేందుకు ఈ ఇంగ్లీష్ టెస్టుల్లో సాధించిన స్కోర్‌ను అడుగుతాయి. మినిమమ్ స్కోర్‌ను ఆశిస్తాయి. ఒక దేశం, చదవాలని భావిస్తున్న కాలేజీ లేదా విశ్వవిద్యాలయాన్ని బట్టి ఈ మినిమమ్ స్కోర్ కొద్దిగా అటూ ఇటూగా ఉంటుంది.

ఐఈఎల్‌టీసీ అకడమిక్ (www.ielts.org), ఐఈఎల్‌టీఎస్ యూకెవీఐ, టోఫెల్ ఐబీటీ (www.ets.org), డుయోలింగో(www.englishtest.duolingo.com), పియర్సన్(www.pearsonpte.com)- ఇంగ్లీష్ టెస్టుల్లో ముఖ్యమైనవి. యూకే విశ్వవిద్యాలయాలు ఎక్కువగా ఐఈఎల్‌టీఎస్‌కు ప్రాధాన్యం ఇస్తాయి.

యూజీ ప్రోగ్రామ్‌లకు

విదేశాల్లో యూజీ ప్రోగ్రామ్‌లకు ఇంగ్లీష్ టెస్టుకు తోడు కోర్సును అనుసరించి మరొక టెస్టును కూడా పాసవ్వాలి.

ఎల్ఎన్ఏటీ: యూకేలో (www.lnat.ac.uk)లా చదివేందుకు ఉద్దేశించిన టెస్ట్ ఇది. యూకే యూనివర్సిటీల కన్సార్టియం ఈ టెస్టుని డెవలప్ చేసింది. లా కోర్సు చేసేందుకు అవసరమైన ఆప్టిట్యూడ్, వెర్బల్ రీజనింగ్, కాంప్రహెన్షన్, ఇంట్రప్రెటేషన్, అనాలిసిస్, సింథసిస్, ఇండక్షన్, డిడక్షన్‌ను ఈ టెస్ట్‌లో పరిశీలిస్తారు.

ఎల్‌శాట్: అమెరికా, కెనడాలో లా చదివేందుకు(www.Lsac.org/lsat) అవసరమైన టెస్ట్‌గా దీన్ని నిర్దేశించారు. అభ్యర్థికి ఉన్న లాజికల్, వెర్బల్ రీజనింగ్ నైపుణ్యాలను పరీక్షించేందుకు అనువుగా దీన్ని రూపొందించారు.

ఎస్ఏటీ: స్కాలస్టిక్ అసెస్‌మెంట్ టెస్ట్ (www.collegeboard.com)దీని పూర్తి రూపం. అమెరికా, సింగపూర్, కెనడాలో చదువుకోవాలంటే ఈ టెస్ట్ రాయాలి. వెర్బల్, మేథమెటికల్, రైటింగ్ స్కిల్స్‌ను పరీక్షిస్తారు. ఆ మూడూ జనరల్ కాగా, సబ్జెక్ట్ టెస్ట్‌లో ప్రత్యేకించి చదవాలని భావిస్తున్న సబ్జెక్టులో అభ్యర్థికి ఉన్న పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు.

అమెరికాలో చదువులకు ఏపీ టెస్టులు(www.collegeboard.com): అడ్వాన్స్‌డ్ ప్లేస్‌మెంట్స్ ఎగ్జామ్స్ ఇవి. చదవాలని అనుకుంటున్న కాలేజీ క్రెడిట్స్ సాధించేందుకు ఈ టెస్టులను ప్రత్యేకించారు.

ఇవి కాకుండా ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్(www.admissiontesting.org) ఉన్నాయి. యూకే మెడిసిన్‌లో చేరేందుకు యూక్యాట్ రాయాలి. బయోమెడికల్ సైన్సెస్ కోసం బీమ్యాట్, మేథమెటిక్స్ అలాగే ఎకనమిక్స్ కోసం టీఎంఏఎ రాయాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఈ టెస్టుల నుంచి మినహాయింపు ఇవ్వవచ్చని భావిస్తున్నారు.

గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్ కోసం

జీఆర్ఈ: యూఎస్, కెనడా, యూరప్, సింగపూర్‌లో ఇంజనీరింగ్, సైన్స్ ప్రోగ్రామ్స్ చేరేందుకు ఈ టెస్ట్ (www.gre.org) రాయాలి. ఈ గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్‌లో రీజనింగ్, క్రిటికల్ థింకింగ్, అనలిటికల్, క్వాంటిటేటివ్, వెర్బల్ స్కిల్స్‌ను పరీక్షిస్తారు.

జీమ్యాట్: గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (www.mba.com) ఇది. ప్రపంచవ్యాప్తంగా ఎంబీఏలో చేరేందుకు ఇందులో సాధించిన మార్కులు ప్రాతిపదిక. ఈ కంప్యూటర్ అడాప్టివ్ టెస్టులో ప్రధానంగా రీజనింగ్, క్రిటికల్ థింకింగ్ అనలిటికల్, క్వాంటిటేటివ్, వెర్బల్ స్కిల్స్‌ను పరీక్షిస్తారు. ఎంబీఏ ఆఫర్ చేసే బిజినెస్ స్కూల్స్ మాత్రం ఈ టెస్టును ఒక సెలక్షన్ ప్రాతిపదికగా మాత్రమే పరిశీలిస్తాయి.

జీఏఎంఎస్ఏటీ: యూకే, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, సింగపూర్, ఐర్లాండ్‌లో గ్రాడ్యుయేట్ మెడికల్ ప్రోగ్రామ్‌ల్లో చేరేందుకు ఈ గ్రాడ్యుయేట్ మెడికల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్(www.gamsat.acer.org)ని రాయాలి. మెడిసిన్, డెంటిస్ట్రీ, ఆప్టోమెట్రీ, ఫార్మసీ, వెటర్నరీ సైన్స్ కోర్సుల్లో చేరేందుకు దీన్ని రాయాలి.

ఎంక్యాట్: అమెరికా, కెనడాలో మెడికల్ ప్రోగ్రామ్‌ల్లో చేరేందుకు దీన్ని(www.aamc.com) రాయాలి. ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ప్రాబ్లెమ్ సాల్వింగ్, క్రిటికల్ థింకింగ్, రిటన్ అనాలిసిస్, సైంటిఫిక్ కాన్సెప్ట్స్, ప్రిన్సిపల్స్‌పై విద్యార్థికి ఉన్న పరిజ్ఞానాన్ని ఇందులో పరీక్షిస్తారు.

పరీక్షపై అవగాహనకు తోడు సదరు పోర్టల్స్ ఉండే ప్రాక్టీస్ పేపర్స్‌ను సాల్వ్ చేస్తే ఈ పరీక్షల్లో గట్టెక్కవచ్చు.

డైలీ సుడోకు - 263

2		6	3		4			
		7					3	
	4				2			6
	8	3	1			9		5
1		9			5	6	7	
4			9				8	
	9					3		
			7		6	4		9

సుడోకు - 262 సమాధానం

3	5	8	4	7	2	9	1	6
9	6	2	5	8	1	7	4	3
4	7	1	3	6	9	8	5	2
5	9	7	8	4	3	6	2	1
1	2	4	7	9	6	3	8	5
6	8	3	2	1	5	4	7	9
7	1	9	6	5	8	2	3	4
2	4	6	1	3	7	5	9	8
8	3	5	9	2	4	1	6	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.